Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

సంపుటి:56 • సంచిక:262 • మంగళవారం 2 జనవరి 2018 • హైదరాబాద్ ❋ పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంతఋతువు, పుష్య మాసం, తిథి: పౌర్ణమి ఉ. 9.00 వరకు, అనంతరం బహుళ పాడ్యమి; నక్షత్రం: ఆరుద్ర మ. 1.33 వరకు, అనంతరం పునర్వసు; అమృతకాలం: లేదు; వర్జ్యం: రా. 12.43 నుండి 2.12 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, రా. 10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ. 3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ. 9.00 నుండి 10.30 వరకు

కేసీఆర్ పథకాలకు ఫిదా!

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాల్లో పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టిన జనసేన అధ్యక్షుడు కొణిదల పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావును కలిశారు. కొత్త ఏడాదిని పురస్కరించుకుని సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు చెప్పేందుకు పవన్ సోమవారం సాయంత్రం బేగంపేటలోని ప్రగతి భవన్‌కు చేరుకున్నారు. ఈ సమయంలో కేసీఆర్ గవర్నర్ నరసింహన్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు రాజ్‌భవన్ వెళ్ళడంతో పవన్ సీఎంను కలిసేందుకు ఆయన వచ్చేదాకా వేచిచూశారు. గవర్నర్, హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తిని కలిసి తన అధికార నివాసానికి తిరిగి వచ్చిన వెనువెంటనే కేసీఆర్ పవన్ కళ్యాణ్‌ను వెంటపెట్టుకుని తన కార్యాలయంలోకి తోడ్కొని వెళ్ళారు. గంట పాటు ఇరువురి మధ్య సుదీర్ఘంగా జాతీయ రాజకీయాలు, ప్రధాని నరేంద్రమోడీ పాలన, తెలుగు రాష్ట్రాల్లో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై చర్చ జరిగినట్టు

➪ 3వ పేజీలో...



ఫుల్ పవర్ అద్భుతం!

- కేసీఆర్‌తో జనసేన చీఫ్ భేటీ
- అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు
- ఇది ఒక్క కేసీఆర్‌కే చెల్లింది
- నా రాజకీయ బలం నాకుంది: పవన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఘనుడు సీఎం కేసీఆర్ అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అభివర్ణించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రగతి భవన్‌లో కేసీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఆయన అక్కడున్న మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత అస్తవ్యస్త పరిస్థితులను సరిదిద్ది రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న ఘనత

➪ 3వ పేజీలో...

విద్యుత్ ఉద్యోగులకు స్పెషల్ ఇంక్రిమెంట్

నేటి నుంచే అమలులోకి

- నిరంతర విద్యుత్ అమలు అద్భుత విజయం
- రాష్ట్ర ప్రజల్లో ఆనందోత్సాహాలు
- ప్రగతి భవన్‌లో విద్యుత్ శాఖ అధికారులతో సీఎం కేసీఆర్

> 24గంటలపాటు ఉచితంగా వ్యవసాయానికి కరెంట్ ఇచ్చే రాష్ట్రం తెలంగాణ తప్ప దేశంలో మరేదీ లేదు. ఇది తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం మాత్రమే కాదు, తెలంగాణ రైతులకు అత్యంత ఆవశ్యకమైన విషయం. నాకు ఉదయం చాలా రాష్ట్రాల నుంచి శుభాకాంక్షలు అందుతున్నాయి. రైతుల సంక్షేమం కోసం తీసుకున్న గొప్ప నిర్ణయమని అభినందనలు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులంతా ఎంతో సంతోషంగా ఉన్నారు.
>
> - ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రజల కల, ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చిన సందర్భంలో విద్యుత్ శాఖ ఉద్యోగుల కృషిని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కొనియాడారు. శక్తివంచన లేకుండా కృషి చేసినందుకు అభినందిస్తూ స్పెషల్ ఇంక్రిమెంట్‌ను ప్రకటించారు. రైతులకు 24 గంటలపాటు ఉచితంగా నాణ్యమైన విద్యుత్ అందించడం మూడున్నరేళ్ళ వయస్సున్న సరికొత్త రాష్ట్రమైన తెలంగాణ సాధించిన అద్భుత విజయమని ఆయన అభివర్ణించారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న విద్యుత్ రంగాన్ని నేడు అన్ని రంగాలకు 24 గంటలు నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేవిధంగా తీర్చిదిద్దిన ఘనత రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల ఉద్యోగులకే దక్కుతుందని సీఎం కితాబునిచ్చారు. దేశమంతా తెలంగాణవైపు చూసేవిధంగా విద్యుత్ రంగంలో విప్లవాత్మక విజయాలు సాధించారని అభినందించారు. తెలంగాణ రాష్ట్రానికి ఇంతగొప్ప ఖ్యాతిని సముపార్జించి పెట్టిన విద్యుత్ ఉద్యోగులకు అభినందన పూర్వకంగా జనవరి 2018 నుంచి వర్తించేలా ప్రత్యేక ఇంక్రిమెంటు ఇస్తున్నట్లు సీఎం ప్రకటించారు. తెలంగాణ ప్రజానీకమంతా విద్యుత్‌శాఖ పనితీరుపట్ల తృప్తిగా, ఆనందంగా ఉన్నారని చెప్పారు.

జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్న నేపథ్యంలో సోమవారం ప్రగతి భవన్‌లో జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండి ప్రభాకర్ రావుతో ఎస్‌పిడిసిఎల్, ఎన్‌పిడిసిఎల్ అధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ప్రభాకరరావును ఆలింగనం చేసుకుని అభినందించారు. విద్యుత్ సంస్థల డైరెక్టర్లు, సీనియర్ ఉద్యోగులను పేరుపేరునా పలకరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. విద్యుత్‌శాఖ ఉద్యోగులు రాష్ట్రంలోని రైతులతోపాటు అన్ని వర్గాల నూతన సంవత్సర ఆనందాన్ని రెట్టింపు చేశారని, అందుకోసం విద్యుత్ ఉద్యోగులకు నూతన సంవత్సర కానుకగా ఒక ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇస్తున్నట్లు విద్యుత్ అధికారుల హర్షధ్వానాల మధ్య సీఎం ప్రకటించారు. ''వ్యవసాయానికి

➪ 2వ పేజీలో...



ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకరరావు, ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి

లోటుకు స్వస్తి

2 లో

- విద్యుత్ రంగంలో రికార్డుల బ్రేక్
- ఆధునిక పరిజ్ఞానంతో సబ్‌స్టేషన్లు

తప్పుడు లెక్కలతో పాక్ చీటింగ్



సాయం కట్!

- మమ్మల్ని ఫూల్స్‌ని చేసింది
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిప్పులు

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

పాకిస్థాన్ పాపం పండడం మొదలైంది. 26/11 ముంబై దాడుల ప్రధాన సూత్రధారి హాఫీజ్ సయీద్‌ను వెనకేసుకొచ్చిన ఫలిత ప్రభావం ప్రారంభమైంది. పాక్‌ను ఉగ్రవాదుల స్వర్గధామంగా అమెరికా గుర్తించింది. అంతేకాదు.. ఉగ్రవాద నిరోధక పోరాటానికంటూ 15 ఏళ్ళుగా పాక్‌కు అమెరికా చేసిన ఆర్థికసాయం 33బిలియన్ల డాలర్లను చేజేతులా ఆ దేశం దుర్వినియోగం చేసిందంటూ అమెరికా మండిపడింది. దీన్ని పాక్ మోసపూరిత చర్యగా సోమవారం తన ట్విట్టర్ వేదికగా ట్రంప్ మండిపడ్డారు. ఇంతకాలం పాక్ తమను తెలివితక్కువగా అంచనాలేసిందన్నారు. అమెరికాను ప్రతినిత్యం మోసం చేసిందన్నారు. అమెరికా పాలకుల్ని ఫూల్స్‌గా పరిగణించిందన్నారు. ఇక ముందు ఇలాంటి ఆటలు సాగనిచ్చేది లేదంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక అమెరికా నుంచి పాక్‌కు ఆర్థిక సాయం అందే అవకాశాల్లేవని తేల్చిచెప్పేశారు. అంతేకాదు.. ఇటీవలె మంజూరు చేసిన 255మిలియన్ డాలర్ల సాయాన్ని నిలిపేస్తున్నట్లు ప్రకటించారు.

ఇంతకాలం ఏ అమెరికా అండదండలు చూసుకుని పాక్ రెచ్చిపోయిందో ఇప్పుడదే అమెరికా దృష్టిలో ఆ దేశం అతిపెద్ద మోసకారిగా ముద్రపడిపోయింది. 2018 తొలిరోజే పాక్‌కు ట్రంప్ ఇచ్చిన షాక్‌తో పాక్ రాజకీయ పరిపాలనా వర్గాల్లో ప్రకంపనలు మొదలయ్యాయి. పాక్‌కు అందుతున్న విదేశీ సాయంలో దాదాపు 62శాతం ఒక్క అమెరికా నుంచే వస్తోంది. మూడు దశాబ్దాలుగా పాకిస్థాన్‌ను అమెరికా విశ్వసిస్తోంది. జంట భవనాలపై అల్‌ఖైదా దాడుల అనంతరం ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద నిరోధక చర్యలకు ఆర్థికసాయాన్ని అమెరికా అనూహ్యంగా పెంచింది. ఇందులో భాగంగా పాక్‌కు మరింత ఆర్థిక సాయం చేస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకుని పాక్ ఏదో సాకుతో అమెరికా నుంచి తరచూ నిధులు గుంజింది. జంట భవనాలపై దాడుల మూలసూత్రధారి బిన్‌లాడెన్‌కు పాక్ ఆశ్రమిచ్చిన విషయం వెలుగు చూసినప్పటికీ అప్పటి అమెరికా పాలకులు పాక్ చెప్పిన కథనాన్ని విశ్వసించారు. ట్రంప్ తీరే వేరు. హాఫీజ్ సయీద్ విషయంలో ఆయన ఆదినుంచి పాక్‌ను తీవ్రంగా తప్పుబడుతూనే ఉన్నారు. పాక్ చెప్పే ఏ కథనాన్ని ఆయన విశ్వసించలేదు. ట్రంప్ అనుమానించినట్లుగానే

➪ 3వ పేజీలో...



హాఫీజ్ ఆస్తులు జప్తు..?

3

SBI

కొత్త సంవత్సర కానుక

రుణాలపై వడ్డీ తగ్గింపు

80 లక్షల మంది ఖాతాదారులకు లబ్ధి

6

యూపీయే సారథిగా రాహుల్ గాంధీ!



- కూటమిని బలోపేతం చేయడమే లక్ష్యం
- మళ్లీ తెరపైకి ప్రతిపక్ష నేత బాధ్యతలు
- సభలో మైలేజీ కోసం సరికొత్త వ్యూహాలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి బాధ్యతలకు అదనంగా రాహుల్ గాంధీ మరిన్ని బరువు బాధ్యతలు చేపట్టేందుకు నడుం బిగించారు. అటు పార్టీలోనూ, ఇటు పార్లమెంటులోనూ తాను మరింతగా ప్రత్యక్షపాత్ర పోషించాలని రాహుల్ కృతనిశ్చయానికి వచ్చినట్లు కాంగ్రెస్‌లోని విశ్వసనీయ వర్గాల సమాచారం. త్వరలో మిత్రపక్షాల కూటమి యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యూపీఏ) సారథిగానూ బాధ్యతలు చేపట్టబోతున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తద్వారా 2019 ఎన్నికల కోసం పార్టీతో పాటు కూటమిని కూడా బలోపేతం చేయడానికి ఆస్కారం ఉంటుందని రాహుల్ గాంధీ భావిస్తున్నారు. అంతేకాకుండా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుని పాత్రను కూడా పోషిస్తేనే తన ఆకాంక్షలకు న్యాయం చేసినట్టు అవుతుందని ఆయన

➪ 9వ పేజీలో...



స్విచ్ నొక్కానో... అమెరికా మటాష్

- అంతా రెడీ అయింది
- మీట నొక్కడమే తరువాయి
- ట్రంప్‌కు కిమ్ తాజా హెచ్చరిక

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

కొత్త ఏడాది ప్రారంభంలోనే ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ తన నోటి దుడుకుతనాన్ని చూపించాడు. అమెరికా ఆయువు తన టేబుల్‌పైనున్న చిన్న మీటలో ఉందంటూ పేర్కొన్నాడు. ఏ సమయంలోనైనా అమెరికాపై తాము అణ్వాయుధ ప్రయోగం జరపొచ్చంటూ స్పష్టం చేశారు. ఇందుకవసరమైన సరంజామ, ఇతర ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాకెట్ లాంచర్లకు అణువార్‌హెడ్స్ తగిలించి సిద్ధంగా ఉంచామన్నారు. అమెరికాలోని ప్రధాన నగరాల్ని వాటికి లక్ష్యంగా నిర్దేశించామన్నారు. వీటి ఆపరేషన్‌కు సంబంధించిన మొత్తం సిగ్నంట్ తన అదుపులోనే ఉందన్నారు. తన ముందున్న మీట నొక్కితే అమెరికా ఆయువు తీరిపోతుందన్నారు. ఇంతఘాటుగా హెచ్చరించడం ద్వారా కిమ్ కొత్త ఏడాది అమెరికాతో యుద్ధానికి కాలుదివ్వారు. దీర్ఘకాలంగా కిమ్ వైఖరిపై అమెరికా ఆగ్రహంతో ఉంది. అయితే అంతర్జాతీయ ఒత్తిళ్ళకు లొంగి సైనిక చర్యకు వెనుకాడుతోంది. పైగా చైనా, రష్యాలు పరోక్షంగా ఉత్తర కొరియాకు మద్దతుగా నిలుస్తున్నాయి. ఈ దశలో ముందడుగు వేయడం వల్ల అపకీర్తి మూటగట్టుకోవాల్సి వస్తుందన్న భయం అమెరికాలో నెలకొంది. దీంతో కాస్తోకూస్తో ఆ దేశం సంయమనం పాటిస్తోంది. కానీ కిమ్ ఏ మాత్రం తగ్గడంలేదు. పైగా అమెరికాతో సమానంగా అణుశక్తిని సముపార్జించుకోవడమే తమ లక్ష్యంగా ఉత్తరకొరియా ప్రకటించింది. అణుసామర్థ్యాన్ని

➪ 3వ పేజీలో...

డ్రంక్ అండ్ డ్రైవ్...



యాంకర్ ప్రదీప్‌కు బ్రీత్ అనలైజర్ టెస్టింగ్

సెలబ్రిటీలు పట్టుబడ్డారు

- న్యూఇయర్ జోష్‌లో 2,499 కేసులు నమోదు
- వందలాది వాహనాలు స్వాధీనం
- పట్టుబడ్డ వారిలో అత్యధికులు ప్రముఖులే
- ప్రదీప్‌కు నేడు కౌన్సెలింగ్

3 లో

ఔరా..!



10వేల గ్రామాలకు భగీరథ ఉదయ సముద్రం ఉరకలు

10 లో

లోటుకు స్వస్తి

- విద్యుత్ రంగంలో జాతీయ రికార్డులు బ్రేక్
- అత్యాధునిక పరిజ్ఞానంతో సబ్‌స్టేషన్లు
- అనతికాలంలోనే ఘనత సాధించిన తెలంగాణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన అనతి కాలంలోనే 'తెలంగాణ' దేశంలోని రికార్డులను బద్దలు కొట్టింది. అత్యంత ప్రాధాన్యత గల ఈ రంగంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు విద్యుత్ కొరత లేని రాష్ట్రాన్ని ఆవిష్కరించారు. ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ ఘనత సాధించారు. వ్యవసాయ రంగానికి ఇకనుంచి 24గంటల పాటు నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తూ అరుదైన రికార్డు సృష్టించారు. అలాగే కరెంటు సరఫరా వ్యవస్థలో లోటుపాట్లు లేకుటండా ఉండేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సబ్‌స్టేషన్లు నెలకొల్పారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ప్రజలకిచ్చిన వాగ్దానాలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్న కేసీఆర్, అత్యంత ప్రతిష్టాత్మకమైన 24 గంటల విద్యుత్ సరఫరా లక్ష్యాన్ని చేరుకున్నారు. గత ఏడాది నవంబర్‌లోనే పూర్వపు మెదక్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో వ్యవసాయ రంగానికి ప్రయోగాత్మకంగా 24 గంటల ఉచిత విద్యుత్‌ను ఇచ్చిన ప్రభుత్వం 2018 జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు శ్రీకారం చుట్టింది.

కేవలం వ్యవసాయ రంగానికే కాదు, పరిశ్రమలు, గృహ వినియోగం, ఎత్తిపోతల పథకాలు, మిషన్ భగీరథకు కూడా 24 గంటల విద్యుత్‌ను సరఫరాకు సరఫరా చేస్తోంది. రూ.12వేల కోట్ల అంచనా వ్యంతో ఏడాది క్రితం రాష్ట వ్యాప్తంగా మొదలుపెట్టిన సబ్‌స్టేషన్ల నిర్మాణం పనులు ఇటీవలే పూర్తయ్యాయి. అందులో భాగంగా రూ.1600 కోట్ల వ్యయంతో నిర్మించిన 400 కె.వి. సబ్ స్టేషన్‌కు సూర్యాపేట జిల్లా గత ఏడాది డిసెంబర్‌లో ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. అన్ని జిల్లాల్లోనూ కేవలం నెలల్లోనే ఇలాంటి అనేక సబ్‌స్టేషన్లను ప్రారంభించారు. లక్ష్య సాధనకు ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావుతో నిరంతరం స్వయంగా పర్యవేక్షించి లక్ష్యాన్ని చేరుకున్నారు. రూ.12,610 కోట్ల వ్యయంతో 24 గంటల నిరంతరాయ విద్యుత్ అందించేందుకు విద్యుత్ సంస్థలు పురోగతిని సాధించాయి.

రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనే కార్యాచరణ షురూ..

తెలంగాణ ఆవిర్భవించిన ఐదో నెల నుంచే రాష్ట్రంలో గృహ, వాణిజ్య, పరిశ్రమల అవసరాల కోసం నిరంతర విద్యుత్‌ను సరఫరా చేశారు. రైతులకు పగటి పూటే 9గంటల విద్యుత్‌ను అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు వ్యవసాయ రంగానికి 24 గంటల పాటు నిరంతర ఉచిత విద్యుత్ అందించాలని సీఎం కేసీఆర్ గతేడాది విద్యుత్ శాఖను ఆదేశించారు. దీంతో సిఎండి ప్రభాకర్‌రావు నేతృ త్వంలో జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎన్‌పిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ సంస్థలు సంయుక్త భాగస్వామ్యంతో లక్ష్య సాధన వైపు ముం దుకు సాగాయి. వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇవ్వ డంతో పాటు, గృహ, వాణిజ్య, పారిశ్రామిక అవసరాల కోసం కూడా 24 గంటల నాణ్యమైన కరెంటు అందివ్వడానికి ఉన్న సాంకేతిక అవకాశాలను, ఇబ్బందులను క్షుణ్ణంగా అధ్య యనం చేశారు. గ్రిడ్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఎక్కడికక్కడ పకడ్బందీగా అదనపు ఏర్పాట్లు చేశారు.

రాష్ట్రంలో సబ్ స్టేషన్ల వివరాలు

తెలంగాణ వచ్చే నాటికి	2,397
కొత్త సబ్‌స్టేషన్లు	514
మొత్తం సబ్‌స్టేషన్లు	2,942
పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	
తెలంగాణ వచ్చే నాటికి	3,748
కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	1,724
మొత్తం పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	5,472
విద్యుత్ లైన్లు	
తెలంగాణ వచ్చే నాటికి	1,56,807 కి.మీ
కొత్తగా వేసినవి	19,154 కి.మీ
మొత్తం లైన్లు	1,75,961 కి.మీ

ఉమ్మడి రాష్ట్రంలో వనరుల కొరత

2014 జూన్ 2కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో 5,240 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన ఆరు 400 కెవి సబ్‌స్టేషన్లు మాత్రమే ఉండేవి. వ్యవసాయంతో పాటు అన్ని రంగాలకు 24 గంటల కరెంటు ఇవ్వడానికి దాదాపు 13 వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేయగల సామర్థ్యం కలిగిన 400 కెవి సబ్ స్టేషన్‌లు అవసరమని బావించిన విద్యుత్ శాఖ కొత్తగా 9 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి పూనుకుంది. సూర్యాపేట, నర్సాపూర్, అసుపాక, డిండి, మహేశ్వరంలో 3,980 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు 400 కెవి సబ్ స్టేషన్ల నిర్మాణం పూర్తి చేసింది. జూలూరుపాడు, నిర్మల్, కేతిరెడ్డిపల్లి, జనగామలల్లో 3705 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మరో నాలుగు 400 కెవి సబ్‌స్టేషన్ల నిర్మాణం గత ఏడాది ఆఖరులో పూర్తయింది.

సమస్య పరిష్కారానికి అదనపు సబ్ స్టేషన్లు

మొత్తం పదిహేను 400 కెవి సబ్‌స్టేషన్ల నిర్మాణం ద్వారా తెలంగాణలో భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకొని పంపిణీ వ్యవస్థను విద్యుత్ సంస్థలు సిద్ధం చేసుకున్నాయి. 400 కెవి సబ్‌స్టేషన్‌లతో పాటు 19 కొత్త 220 కెవి సబ్‌స్టేషన్లు నిర్మించింది. 35 కొత్త 132 కెవి సబ్ స్టేషన్లు కూడా నిర్మించారు. దీంతో తెలంగాణ రాకముందు 233 ఇహెచ్‌టి లైన్ల సామర్థ్యం కలిగిన సబ్‌స్టేషన్లు ఉంటే, ఇప్పుడు 292 సబ్ స్టేషన్లు అందుబాటులోకి వచ్చాయి. 33/11 కెవి సబ్ స్టేషన్లు కూడా వందల సంఖ్యలో నిర్మించారు. సబ్ స్టేషన్లతో పాటు 2695.25 కిలో మీటర్ల మేర 400 కెవి లైన్లు, 6,900 కిలో మీటర్ల 220 కెవి లైన్లు, 10,321 కిలో మీటర్ల మేర 132 కెవి లైన్లు కొత్తగా వేశారు. తెలంగాణ రాకముందు 16,379 కిలో మీటర్ల లైను ఉంటే ఇప్పుడు 19,916 కిలో మీటర్ల లైన్లు సిద్ధంగా ఉన్నాయి. ఇవి కాకుండా 33/11 కెవి లైన్లు కూడా దాదాపు 15 వేల కిలో మీటర్లకు పైగా కొత్తగా వేశారు. తెలంగాణ వచ్చే నాటికి 3,748 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లుంటే, కొత్తగా 1,724 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి, వాటి సంఖ్యను 5,472కు పెంచారు. లో ఓల్టేజీ సమస్యను అధిగమించడానికి వేల సంఖ్యలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.



జెన్‌కో-ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావుతో సీఎం కేసీఆర్ ఆలింగనం

విద్యుత్ ఉద్యోగులకు స్పెషల్ ఇంక్రిమెంట్

(మొదటిపేజీ తరువాయి)

24 గంటల విద్యుత్ సరఫరా చేయడంతో ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలకు నాణ్యమైన నిరంతరాయ విద్యుత్ అందిస్తున్న రాష్ట్రంగా చరిత్రలో నిలిచిపోతుంది. దశాబ్దాలపాటు రైతులు అనుభవించిన విద్యుత్ కష్టాలకు శాశ్వత విముక్తి కలిగించాలనే లక్ష్యంతో వ్యయ, ప్రయాసలకోడ్చి వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందించాలని నిర్ణయించామని అన్నారు. తెరాస ఎన్నికల మేనిఫెస్టోలో కూడా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇవ్వలేదు. మేనిఫెస్టోలో చెప్పకపోయినా రైతులకు అత్యంత అవసరమని భావించి వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించామని అన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి లేదా మార్చి నుంచి 24 గంటల సరఫరా చేయాలని మొదట భావించాం. కానీ అంతకన్నా ముందుగానే జనవరి 1 నుంచే యాసంగి పంటలు చేసుకునే విధంగా 24 గంటల సరఫరా ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. దేశంలో కొన్ని రాష్ట్రాలు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తున్న ప్పటికీ, పరిమిత గంటల్లో మాత్రమే ఇస్తున్నారు. కొన్ని రాష్ట్రాల్లో 24 గంటల వ్యవసాయానికి ఇస్తున్నప్పటికీ ఛార్జీలు వసూలు చేస్తున్నారు. 24 గంటలపాటు ఉచితంగా వ్యవసాయానికి కరెంట్ ఇచ్చే రాష్ట్రం తెలంగాణ తప్ప దేశంలో మరేదీ లేదన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం మాత్రమే కాదు, తెలంగాణ రైతులకు అత్యంత ఆవశ్యకమైన విషయం. నాకు ఉదయం చాలా రాష్ట్రాల నుంచి శుభాకాంక్షలు అందుతున్నాయి. రైతుల సంక్షేమం కోసం తీసుకున్న గొప్ప నిర్ణయమని అభినందనలు తెలుపుతున్నారు.రైతులంతా ఎంతో సంతోషంగా ఉన్నారు. పక్కా ప్రణాళికతో, పకడ్బందీ కార్యాచరణతో ముందుకు పోవడంవల్లే ఈ విజయం సాధ్యమైంది" సీఎం చెప్పారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో టిఎస్ ఈఆర్‌సి చైర్మన్ ఇస్మాయిల్ అలీ ఖాన్, ఎస్‌పిడిసిఎల్ సీఎండి రఘుమారెడ్డి, ట్రాన్స్‌కో జేఎండి శ్రీనివాసరావు, జెన్‌కో డైరెక్టర్లు అశోక్ కుమార్, వెంకటరాజం, లలిత్ కుమార్, టిఎస్ ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ కమాలుద్దీన్ అలీఖాన్, ట్రాన్స్‌కో డైరెక్టర్ జి.నర్సింగ్‌రావు, పీజీసీఐఎల్ ఈడీ వి.శేఖర్, జీఎం ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి సీఎండీ కృతజ్ఞతలు

విద్యుత్ శాఖ ఉద్యోగులందరికీ ప్రత్యేక ఇంక్రిమెంట్ ప్రకటించినందుకు తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల సీఎండీ డి.ప్రభాకర్‌రావు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయంతో ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యం, నిబద్ధత పెరుగుతుందని అన్నారు. ఇకనుంచి రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వర్తిస్తారని హామీ ఇచ్చారు. కేసీఆర్ దార్శనికత, మార్గదర్శకంతో విద్యుత్ సంస్థలు మెరుగుపడ్డాయని ప్రభాకర్‌రావు ఆకాంక్షించారు.

ఇదే స్ఫూర్తితో ముందుకు సాగండి

- విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి



మంత్రి జగదీష్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ట్రాన్స్ కో,జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, చిత్రంలో ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి.

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రమంతటా వ్యవసాయ రంగానికి 24గంటల విద్యుత్ సరఫరాను ప్రారంభించటం ద్వారా టీఆర్ఎస్ ప్రభుత్వం జాతీయ స్థాయిలో తన శక్తి సామర్థ్యాలను నిరూపించుకుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. సోమవారం సచివాయలంలో మంత్రి జగదీశ్వర్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర జన్కో , ట్రాన్స్‌కో సంస్థల సీఎండీ డి.ప్రభాకర్ రావు, ఎస్పీడీసీఎస్ సీఎండి జి.రఘుమారెడ్డిలను అభినందించారు. వ్యవసా యానికి నిరంతర విద్యుత్ ద్వారా ముఖ్యమంత్రి కేసీఆర్ కలనెరవేర్చి తెలంగాణ విద్యుత్ శాఖ ప్రతిష్టను మరింత పెంచారని మంత్రి పేర్కొన్నారు. ఇక ముందుకూడా ఇదే విధమైన స్ఫూర్తితో ముందుకు సాగి మరిన్ని విజయాలు సాదించాలన్నారు. సమర్థతను ప్రోత్సహిస్తూ విద్యుత్ సంస్థల పటిష్టతకు ప్రభుత్వం ఎల్ల వేళలా సహకారం అందిస్తుందని మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. ఇదే సందర్భంగా సింగరేణి సీఎండీ శ్రీధర్‌ను కూడా మంత్రి అభినందించారు.



మంత్రి జగదీష్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సింగరేణి సీఎండీ శ్రీధర్.

19 రాష్ట్రాల్లో మిగులు విద్యుత్

- ఒక్క తెలంగాణలోనే ఉన్నట్లుగా గొప్పలు చెప్పుకోవడమేంటి..?



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటోం దని, మిగులు విద్యుత్ ఘతన టీఆర్ఎస్ ప్రభుత్వానికి కాదని టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ అన్నారు. మిగులు విద్యు త్ ఒక తెలంగాణాలోనే లేదని దేశంలోని అనేక రాష్ట్రాల్లో మిగులు విద్యుత్ ఉన్నదని, విక్రయించాలను అనుకున్న కొనుగోలు చేసే రాష్ట్రాలు లేవని సోమ వారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. గతంలో మొదలుపెట్టిన విద్యుత్ ప్రాజెక్టులు ఇప్పుడు పూర్తయి నాయని, అందులో టీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పతనమేమి లేదన్నారు. చండీఘర్, ఢిల్లీ, పంజాబ్, హర్యానా, గుజరాత్, గోవా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీష్‌ఘడ్, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి, కేరళ, సిక్కిం, ఒడిశా, పశ్చిమ బెంగాళ్, జార్ఖండ్, మేఘాలయ రాష్ట్రాల్లో మిగులు విద్యుత్ ఉందన్నారు. కేంద్రపాలిత ప్రాంతాలైన విద్యుత్ కోతలు అసలే లేవన్నారు. రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, మిజోరాం, నాగాలాండ్, త్రిపుర, బీహార్ రాష్ట్రాల్లో కేవలం 1 నుంచి 2 శాతమే లోటు ఉన్నదని కోదండరామ్ తెలిపారు. భాగర్భ జలాలు పెరిగితేనే 24 గంటల కరెంటు ఇవ్వడం సముచితమన్నారు. ప్రస్తుతం 24 గంటల సరఫరా వల్ల విద్యుత్ సంస్థలపై దాదాపు రూ. వెయ్యి కోట్ల భారం పడనుందని ఆయన వివరించారు. ప్రభుత్వం మాత్రం రూ. 5500 కోట్లు మాత్రమే భరిస్తామని అంటుందన్నారు.

మారుతున్న వ్యవసాయ ముఖచిత్రం

- మూడు పంటలపై పెరిగిన ధీమా
- 9500 మెగావాట్లకు పెరిగిన డిమాండ్
- అందుబాటులో 11240 మెగావాట్ల విద్యుత్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నిరంతర విద్యుత్ సరఫరా రాష్ట్రంలో వ్యవసాయారంగాన్ని సుసంపన్నం చేసుకునేందుకు మార్గం సుగమం చేసింది. ఈ రంగంలో కృష్ణా,గోదావరి ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టు రైతులతో సమానంగా బోర్లఆధాకిత రైతులు పంటలు పండించుకునేందుకు అవకాశాలు కల్పించింది. జూరాల , నాగార్జున సాగర్ , నిజాంసాగర్ ,శ్రీరాం సాగర్ తదితర ప్రాజెక్టుల కింద ఆయకట్టు రైతులు కాలువల ద్వారా లభించే నీటితో పంటలు పండించి వ్యవసాయంలో స్థిరత్వం సాధించేవారు. అదే మెట్టప్రాంత రైతులు భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ విద్యుత్ కోతలు కొరతలతో వర్షాలనే నమ్ముకుని పంటలసాగుతో కుస్తీలు పట్టాల్సివచ్చేది. వర్షాభావ దుర్భిక్షంతో ఒక్కోసారి పంటలు ఎండిపోయి గిద్దేడు గింజలు కూడా దక్కేవి కావు. మెట్ట ప్రాంత రైతుల కష్టాలను అతిసమీపంనుంచి ప్రత్యక్షంగా చూసిన ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయరంగానికి 24గంటల విద్యుత్ సరఫరా కలను నెరవేర్చటం ద్వారా రాష్ట్రంలో రైతాంగం జీవితంలో కొత్త వెలుగులు ప్రసరిస్తున్నాయి. నిన్నటిదాక వ్యవసాయ మోటర్లకు కేవలం తొమ్మిదిగంటలు మాత్రమే విద్యుత్ సరఫరా జరిగేది. సోమవారం నుంచి రాష్ట్రమంతటా 24గంటల విద్యుత్ సరఫరా ప్రారంభం కావటంతో రైతులు ఇది కలా నిజమా.. అని పరీక్షించుకునేందుకు తెల్లవారు జామునే పొలం బాట పట్టారు. మెదక్ , సంగారెడ్డి, జగిత్యాల, సిరిసిల్ల , నల్లగొండ , సూర్యాపేట తదితర జిల్లాల్లో రైతులు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషే కాలు చేసి సంబరాలు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 24గంటల విద్యుత్ సరఫరా వ్యవసాయ రంగం ముఖచిత్రాన్ని మార్చి వేయ నుంది. జనవరి నుంచిపెరిగే విద్యుత్ కోతలకారణంగా రైతులు ఒక్కపంటకు మాత్రమే అధికంగా ప్రాధాన్యత ఇచ్చేవారు. అయితే టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక నమ్మకంగా వ్యవసాయరంగానికి తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా వల్ల గత రెండేళ్లుగా యాసంగి పంటలు కూడా సాగు చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సర్కారు తీసుకున్న నిర్ణయం ద్వారా సోమవారం నుంచి 24గంటల విద్యుత్ సరఫరా ప్రారంభం కావటంతో ఇక రెండు పంటలసాగుకు ఢోకాలేదని రైతులు చెబుతున్నారు. నీటి లభ్యతను బట్టి పలు చోట్ల రైతులు మూడవ పంటసాగుకు కూడా ఆసక్తి కనబరుస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ సీఎండి జి.రఘుమారెడ్డి ఆంధ్రప్రభ ప్రతినిధితో పేర్కొన్నారు. ఆదివారం అర్ధ రాత్రి నుంచి శాశ్విత ప్రాతిపదికన 24గంటల విద్యుత్ సరఫరాను ప్రారంబించటం ద్వారా ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తలేదని రఘురెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయరంగానికి 24గంటల విద్యుత్ సరఫరా ద్వారా సోమవారం విద్యుత్ సరఫరా పీక్ డిమాండ్ 9500 మెగావాట్లకు పెరిగింది. ఆదివారం వరకు రాష్ట్రంలో విద్యుత్ సరఫరా గరిష్ట డిమాండ్ 8200మెగావాట్లు ఉండగా కేవలం ఒక్కరోజులోనే 1300మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరిగిపోయింది. ఇది క్రమేపి పెరుగుతూ మార్చి నాటికి 11500 మెగా వాట్లకు చేరుకునే అవకాశం ఉందని డిస్కంలు అంచనా వేశాయి. జన్కోద్వారా 2800మెగావాట్లు, సింగరేణి ద్వారా 1200 మెగావాట్లు, చత్తిష్‌గడ్ నుంచి 1000 మెగావాట్లు, థర్మల్ పవర్‌టెక్ ద్వారా 840 మెగా వాట్లు , సీజీఎస్ ద్వారా 2400మెగావాట్లు, సోలార్ ప్లాంట్ల ద్వారా 3000మెగావాట్ల విద్యుత్ అందుబాటులో ఉంది.

విద్యుత్‌లో ఇతర రాష్ట్రాలకు ఆదర్శం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయరంగానికి 24గంటలు విద్యుత్ సరఫరా ఒక చారిత్రాత్మక ఘట్ట మని దేశ చరిత్రలోనే తెలంగాణ రాష్ట్రం ఆఘనత సాధించిందని గృహ నిర్మాణ, దేవాదాయ శాఖల మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. దేశంలోనే వ్యవసాయానికి వ్యవసాయానికి 24గంటల పాటు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందిస్తూ తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక ఆరునెలల్లోనే కోతలు లేని కరెంట్ అందించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇపుడు నిరంతర విద్యుత్ సరఫరాతో వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహిస్తున్నారన్నారు. వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్ ఇస్తున్న రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టించబోతున్నదని తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి, ట్రాన్స్‌కో, జన్కో సీఎండీ ప్రభాకర్ రావుతోపాటు ఇతర అధికారులకు మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అభినందనలు తెలిపారు.

ఇక రియల్‌టైమ్ పోలీసింగ్!

- టెక్నాలజీతో నేరగాళ్లకు చెక్
- ఇక ప్రతి పోలీస్ అధికారి స్మార్ట్ పోలీస్
- టీఎస్ కాప్ మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించిన డీజీపీ మహేందర్‌రెడ్డి
- అంతిమ లక్ష్యం..శాంతిభద్రతల పరిరక్షణ
- రాష్ట్రాన్ని పెట్టుబడుల స్వర్గధామంగా నిలపడం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర పోలీసుల చేతికి సరికొత్త సాంకేతిక అస్త్రం వచ్చింది. ప్రతిష్టాత్మక టీఎస్ కాప్ మొబైల్ యాప్ ను డీజీపీ మహేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన సంవత్సరం 2018ని రాష్ట్ర పోలీసులకు ఇయర్ ఆఫ్ టెక్నా లజీగా డిక్లేర్ చేసిన రోజునే టీఎస్ కాప్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. భారతదేశంలోనే ఏ పోలీస్ వ్యవస్థలో లేని విధంగా అన్ని పోలీసు సర్వీసులు ఓ మొబైల్ యాప్ కిందకు తీసుకువచ్చామన్నారు. 54 సర్వీసులను అనుసం ధానం చేస్తూ స్మార్ట్ పోలీస్ దిశగా ఈ టీఎస్ కాప్‌ను డిజైన్ చేశామన్నారు. ఈ మొబైల్ అప్లికేషన్ లో పోలీస్‌లకు అవసరమైన పూర్తి సమాచారం తెలుసుకోవచ్చని తెలిపారు. గతంలో ప్రారంభించిన హైదరా బాద్ కాప్ యాప్ తో నేరం జరిగిన వెంటనే స్పాట్‌కు రియల్‌టైముకు చేరుకోవడంతో పాటు అందుకు సంబం ధించిన వివరాలను సైతం తెలుసుకోగలిగామన్నారు. నేరస్తులు తెలివిగా నేరాలు చేస్తారని, ఆ నేరాలను అంతేస్థాయిలో అధిగమించేందుకు అనువుగా సమగ్రసమాచారంతో ఈ టీఎస్ కాప్ అప్లికేషన్ అందుబాటులోకి వచ్చిందన్నారు.

యాప్ ఫీచర్స్ : పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీక్రెట్ ప్రాంతాలు, కీలక ప్రదేశాలకు గస్తీ సిబ్బంది కచ్చితంగా వెళ్లి రావడం కోసం ఆయా చోట్ల బీట్ పుస్తకాలు ఏర్పాటు చేస్తారు. ఈ యాప్ ద్వారా ఈ-బీట్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. జీపీఎస్ పరిజ్ఞానం ఆధారంగా పనిచేసే ఈ యాప్ అక్షాంశ, రేఖాంశాలను సంగ్రహించడం ద్వారా పక్కాగా, కచ్చితంగా ఆయా ప్రాంతాలకు వెళ్లేలా చేస్తుంది.

క్రైమ్ స్పాట్స్ : గడిచిన నాలుగేళ్ల గణాంకాల ఆధారంగా పోలీస్‌స్టేషన్ వారీగా క్రైమ్ ప్రోన్ ఏరియాలను గుర్తించి, జీపీఎస్ మ్యాపింగ్ రూపంలో అందుబాటులోకి తెచ్చారు. గస్తీ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్న వెంటనే అప్రమత్తం చేసి ప్రత్యేక వ్యవస్త ఈ యాప్‌లో ఉంది.

వెహికల్ డేటాబేస్ : ఓ వాహన చోదకుడు వాహనానికి చెందిన పత్రాలను పోలీసులకు తనిఖీ సమయంలో చూపినప్పుడు ఆ జిరాక్సు ప్రతులు అసలువో కాదో యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మరోవైపు చోరీ వాహనాల జాబితా కూడా ఈ యాప్‌కు అనుసంధానిస్తున్నారు.

ఎంవో క్రిమినల్స్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాత నేరగాళ్లు నివసిస్తున్న తాజా చిరునామాలను జీపీఎస్ ఆధారంగా ట్యాగింగ్ చేశారు. దీం తో పాటు జైలు నుంచి విడుదలవుతున్న వారి వివరాలను పొందుపర్చారు. ఫలితంగా క్షేత్రస్థాయి సిబ్బంది కచ్చితంగా వారి ఇళ్లకు వెళ్లి తనిఖీ చేయడంతో పాటు ఏదైన నేరం జరిగిన వెంటనే అలాంటి నేరాలు చేసేవాళ్లు ఎవరున్నారు? అనేవి తక్షణం తెలుసుకునే అవకాశం ఉంటుంది.

మిస్సింగ్యు చెక్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిత్యం తప్పిపోయిన, గుర్తు తెలియని శవాల కేసులు నమోదవుతుంటాయి. ఈ యాప్ సర్వర్‌లో ఎప్పటికప్పుడు మిస్సింగ్ కేసులు, లభించిన గుర్తు తెలియని మృతదేహాల పూర్తి వివరాలను అప్‌లోడ్ చేస్తారు. ఇవి అన్నీ స్థాయిల్లో అధికారులకు అందుబాటులో ఉండటంతో ఫిర్యాదు వచ్చిన మరుక్షణమే సరిచూడటానికి అవకాశం ఏర్పడుతుంది.

పరిరక్షణ విధి విధానాలు : నేరస్థలాల్లో లభించే ఆధారాలు దర్యాప్తునకు కీలకం. అధికారులు, సిబ్బందికి వీరిని ఎలా పరిరక్షించాలి? తదితర అంశాల్లో పట్టుబడట్లేదు. దీని కోసం క్రైం సీన్ మేనేజ్‌మెంట్‌ను యాప్‌లో అందించారు. దీని ద్వారా ఆధారాల సేకరణ, దర్యాప్తు విధి విధానాలు, నిబంధనలు అన్ని స్థాయిల సిబ్బందికి అందుబాటులోకి వస్తున్నాయి.

క్షణాల్లో చిరునామాలు

వివిధ కేసుల దర్యాప్తులో వాహనాలు, సెల్‌ఫోన్, పాస్‌పోర్ట్ నెంబర్లు తదితరాల ఆధారంగా ఆయా వ్యక్తుల చిరునమాలు కీలకంగా మారతాయి.

ఇవి ఎంత త్వరగా తెలుసుకోగలిగితే దర్యాప్తు అంత వేగవంతం అవుతుంది. ఈ డేటాబేస్‌ను యాప్ సర్వర్‌కు అనుసంధానించారు. దీంతో కొన్ని రకాలైన ఫిర్యాదుల విచారణ, కేసుల దర్యాప్తులో జాప్యాన్ని నివారించడానికి ఆస్కారం ఏర్పడుతోంది. టీఎస్ కాప్ అప్లికేషన్ అమలులోకి రానుండటంతో నేరగా ళ్లను పట్టుకోవడం కూడా ఈజీ అవుతుండటంతో ఇతర రాష్ట్రాల నుంచి నేరగాళ్లు వచ్చి ఇక్కడ నేరాలను చేసేందుకు సంశయిస్తారని.. ఒకవేళ నేరం చేసినా దొరికిపోతామన్న భయం వారిలో కలుగుతుందని డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు.

ఠాణాలన్నింటికీ సోషల్ మీడియా ఖాతాలు!

ప్రతి రోజూ ప్రజలకు ఆన్‌లైన్‌లో అందు బాటులో ఉండేందుకు తెలంగాణలోని అన్ని పోలీస్‌స్టేషన్లకి ప్రత్యేకంగా ఒక ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాను ప్రారంభించబోతున్నట్లు డీజీపీ మహేందర్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో రక్షణ, భద్రతలను ప్రజలందరికి చేరువ చేసే యోచనలో భాగంగా సాంకేతిక పరిజ్ఞాన సహకారం తీసుకుం టున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 800 పోలీస్‌స్టేషన్లకు ప్రత్యేక సోషల్ మీడియా ఖాతాలను సృష్టించామన్నారు. మొదట హైదరాబాద్లోని స్టేషన్లకి, తర్వాత ఇతర జిల్లాల్లోని స్టేషన్లకి ఈ విధానాన్ని అమలు చేయనున్నామని, ఈ ఖాతాల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకోవడమే కాకుండా వారి నుంచి ఫీడ్‌బ్యాక్‌ను తీసుకుంటామని డీజీపీ మహేందర్‌రెడ్డి చెప్పారు.

తప్పుడు లెక్కలతో పాక్ చీటింగ్

సాయం కట్!



(మొదటిపేజీ తరువాయి)

తగిన ఆధారాల్ని దర్యాప్తు సంస్థలు న్యాయస్థానానికి అందించలేక పోయాయం టూ హాఫీజ్ సయీద్‌ను పాక్ సభ్యసమాజంలోకి వది లేసింది. సయీద్ విడుదలపై అమెరికా అప్పుడే ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇతర నేరాల్లో హాఫీజ్‌ను ఆదుపులోకి తీసు కోని పక్షంలో పాక్‌పై దౌత్యపర నిబంధనలు విధించక తప్పదని హెచ్చరించింది. ముంబైతో పాటు పలు ప్రాంతా ల్లో మారణహోమం సృష్టించిన లష్కర్ ఎ తోయిబాను అంతర్జాతీయంగా ఉగ్రవాద సంస్థగా గతంలోనే అమె రికా ప్రకటించింది. ఈ సంస్థ అధిపతి సయీద్ అక్రమ విడుదల పాక్, అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని కూడా ట్రంప్ అప్పుడే పేర్కొన్నారు. ఇదొక్క అమెరికా నిర్ణయం కాదని, అంతర్జాతీయ సమాజం కూడా ఇక ముందు పాక్‌తో ఎలా వ్యవహరించాలో తేల్చుకోనుందని కూడా స్పష్టంచేశారు. సయీద్‌ను ఆధారాల పేరిట విడుదల చేయడం ద్వారా తన భూభాగంలో వేళ్ళూనుకున్న ఉగ్రవాద సంస్థల పట్ల పాక్ ఉదాశీనంగా వ్యవహరించడంతో పాటు పరోక్షంగా వాటిని ప్రోత్సహిస్తోందన్న అనుమానం ప్రపంచ దేశాల్లో బలపడిందని కూడా ఆయన స్పష్టంచేశారు. 2008లోనే సయీద్‌ను భయంకరమైన తీవ్రవాదిగా ఐక్యరాజ్య సమితి భద్రతామండలి ఓ ప్రత్యేక తీర్మానం ద్వారా ప్రకటించినప్పటికీ ఎలా విడుదల చేశారంటూ ప్రశ్నించారు. ఇంతటి భయంకర ఉగ్రవాదిని విడుదల చేసినప్పటికీ పాకిస్థాన్‌ను నాన్-నాటో మిత్రదేశంగా ఎలా పరిగణిస్తున్నారో అర్థం కావడం లేదని కూడా అమెరికా చేసిన వ్యాఖ్యలతో పాక్ సంకటస్థితిని ఎదుర్కొంది. అప్పటికప్పుడు మరోసారి సయీద్‌ను చిన్నచిన్న నేరాలపై అదుపులోకి తీసుకుంది. సయీద్‌పై నేరాల్ని విచారిస్తామంటూ అమెరికాకు హామీనిచ్చింది. అయినప్పటికీ పాక్ కపట నాటకాల్ని ట్రంప్ విశ్వసించలేదు.

సయీద్ 1987లో లష్కర్ ఎ తోయిబాను ప్రారంభించాడు. దీనిపై అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థగా ముద్రపడ్డంతో జేయూడీ, ఎఫ్ఐఎఫ్‌లను దీని అనుబంధ సంస్థలుగా మొదలెట్టాడు. 2008లో ముంబై పేలుళ్ళకు పాల్పడ్డ ఉగ్రవాదులు ఈ సంస్థ సభ్యులే. అయితే పేలుళ్ళతో తనకెలాంటి సంబంధం లేదంటూ అతను ఇంతకాలం బుకాయించాడు. అంతర్జాతీయ సమాజ ఒత్తిడికి లొంగి అతన్ని అదుపులోకి తీసుకున్నప్పటికీ తగిన ఆధారాల్లేవంటూ పాకిస్థాన్ కోర్టు సయీద్‌ను నిర్దోషిగా ప్రకటించింది. అప్పటి నుంచే పాక్ వైఖరిపై అంతర్జాతీయ సమాజంలో మరింత ఆగ్రహం పెల్లుబికుతోంది. సయీద్ సంస్థలకు చెందిన ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవాలంటూ ఐక్యరాజ్య సమితి కూడా పాకిస్థాన్‌ను ఆదేశించింది. డిసెంబర్ 28లోగా ఈ కార్యక్రమం పూర్తిచేయాలని సూచించింది. దీనిపై పాక్ నుంచి సానుకూల స్పందన రాలేదు.

దీంతో పాక్ అనుసరిస్తున్న చర్యలు ఉగ్రవాదానికి ఊతమిచ్చేలా ఉన్నాయంటూ అమెరికా మండిపడింది. అలాగే ఆఫ్ఘనిస్థాన్‌లో ఉగ్రవాదాన్ని పెంచుతున్న హకాని నెట్ వర్క్ కేంద్ర కార్యాలయం కూడా పాకిస్థాన్‌లోనే ఉంది. దీనిపై కూడా నిషేధం ఉంది. దీన్ని అదుపు చేయాలంటూ చేసిన విజ్ఞప్తుల్ని కూడా పాక్ లక్ష్యపెట్టడం లేదు. సయీద్ విడుదల తరహాలోనే హకానీ నెట్‌వర్క్ పట్ల కూడా ఉదాశీనంగా వ్యవహరిస్తోంది. ఉగ్రవాద వ్యతిరేక పోరులో తాము కలిసొస్తామంటూ పలుమార్లు పాక్ ప్రపంచ దేశాలకు హామీనిచ్చింది. అయితే అనుసరిస్తున్న చర్యలు మాత్రం అందుకు సానుకూలంగా లేవు. ఈ దశలో ఇప్పటికైనా పాక్‌ను కట్టడి చేయలేని పక్షంలో ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం మరింత పెట్రేగే ప్రమాదముందని ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ పేర్కొంది. ఆ దేశ విదేశీ వ్యవహారాల కౌన్సిల్ అధ్యక్షుడు రిచర్డ్‌హాస్ ఇక ముందు పాక్‌ను మిత్రదేశంగా పరిగణించాల్సిన అవసరం లేదంటూ ట్రంప్‌కు సలహా ఇచ్చారు. ఈ మేరకు పాక్‌కు తామిస్తున్న ఆర్థికసాయాన్ని పూర్తిగా నిలిపేయాలని అమెరికా నిర్ణయించింది. ఉగ్రవాద నిర్మూలనలో ఇది ఖచ్చితంగా మైలు రాయివంటి నిర్ణయమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

హాఫీజ్ ఆస్తులు జప్తు..?



- హాఫీజ్ సయీద్ ఆర్థిక మూలాలపై చర్యలు షురూ
- రెండు చారిటీలు సీజ్‌కు రంగం సిద్ధం
- జేయూడీ, ఎఫ్ఐఎఫ్‌ల కార్యకలాపాలపై ప్రభుత్వం నజర్
- మనీలాండరింగ్, ఉగ్రసంస్థలకు నిధులపై విచారణ

ఇస్లామాబాద్: ఉగ్రవాది హాఫీజ్ సయీద్ చుట్టూ ఉచ్చుబిగుస్తోంది. సయీద్ ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు పాక్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలతో రహస్యంగా సయీద్ ఛారిటీలు, ఆస్తులపై అధికారులు నివేదికలను తయారుచేశారు. గత నెల 19న భేటీ అయిన ఉన్నతస్థాయి సమావేశంలో హాఫీజ్ కు సంబంధించిన కీలక అంశాలపై చర్చించినట్లు సమాచారం. డిసెంబర్ 19న ఆర్థిక శాఖ రూపొందించిన ఓ పత్రంపై సీక్రెట్ అని మార్క్ చేయడంతో హాఫీజ్ సయీద్ ఆర్థిక మూలాలపై రహస్య విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. సయీద్ ఛారిటీలపై పాకిస్తాన్‌లోని ఐదు ప్రావిన్స్‌లు గత నెల 28న నివేదికలు సమర్పించి యాక్షన్ ప్లాన్ సిద్ధంచేసినట్లు సమాచారం. హాఫీజ్ సయీద్ కు చెందిన జమాత్ ఉద్దౌలా(జేయూడీ), ఫలా- ఈ - ఇన్సానియత్ ఫౌండేషన్ లను సీజ్ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆర్థిక చర్యల టాస్క్ ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) సయీద్‌కు చెందిన రెండు ఛారిటీలను సీజ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

అంతర్జాతీయ సంస్థ అయిన ఎఫ్ఏటీఎఫ్ హాఫీజ్ సయీద్ మనీ లాండరింగ్, ఉగ్ర కార్యకలాపాలకు నిధులు వంటి వాటిపై దృష్టిపెట్టింది. జేయూడీ, ఎఫ్ఐఎఫ్ ల ఆటలు కట్టించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని విచారణ టీంను ఆదేశించినట్లు పాక్ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి అహ్‌సన్ ఇక్బాల్ తెలిపారు. అయితే అమెరికా ఒత్తిడితో పాకిస్తాన్ సయీద్ సంస్థలపై చర్యలు తీసుకోవడం లేదని రాయిటర్స్ కు రాతపూర్వక సమాధానం ఇచ్చారు.

అయితే తన ఆస్తుల సీజ్‌పై సయీద్ ఇంతవరకు స్పందించలేదు. మిలిటెంట్లతో సంబంధాలు లేవంటూ పదేపదే చెప్పుకునే సయీద్ తన ఛారిటీలతో ఉగ్రవాదానికి సంబంధాలు లేవని చెప్పారు.

ఈ రెండింటిని ఉగ్రవాద సంస్థలుగా అమెరికా గుర్తించింది. 1987లో ఉగ్రవాద సంస్థ లష్కరీ తోయిబాను స్థాపించిన హాఫీజ్ సయీద్ 2008 ముంబై ఉగ్రదాడి సూత్రదారి. 166 మంది ప్రాణాలు తీసిన టెర్రరిస్ట్. భారత్- అమెరికా సయీద్‌ను పేరుమోసిన ఉగ్రవాదిగా పేర్కొంటుండగా..అతడు మాత్రం తనకు ముంబై పేలుళ్లతో తనకు సంబంధం లేదంటూ పదేపదే చెప్పుకొస్తున్నాడు. సయీద్ ను దోషి అని చెప్పేందుకు సరైన సాక్షాధారాలు లేవని పాకిస్తాన్ న్యాయస్థానం కూడా ఇదివరకే స్పష్టం చేసింది.కాగా జమాత్ ఉద్ దవా, ఫలాహ్ ఇ ఇన్సానియత్, ఫౌండేషన్‌ల విరాళాల సేకరణపై నిషేధం విధిస్తూ పాక్ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సయీద్‌పై మొదటి చర్య

ఉగ్రవాది హాఫీజ్ సయీద్ చారిటీల సీజ్ చేస్తే పాకిస్తాన్ ప్రభుత్వం అతడిపై తీసుకునే మొదటి, భారీ చర్య ఇదే అవుతుంది. సయీద్ నెట్ వర్క్ కు వ్యతిరేకంగా ప్రభుత్వం చర్యలు ప్రారంభిస్తే 300 బడులు, పాఠశాలలు,ఆస్పత్రులు, ప్రచురణ కేంద్రాలు,అంబులెన్స్ సర్వీసులు నిలిచిపోవడం ఖాయం.

జేయూడీ, ఎఫ్ఐఎఫ్ లకు ఉన్న 50 వేల మంది వాలంటీర్లు, వందలాది మంది చెల్లింపుదారులకు కూడా పెద్ద ఎదురుదెబ్బే. ఉగ్రవాదంపై ఐక్యరాజ్యసమితి ఆదేశాలను పాకిస్తాన్ పాటించకుంటే ఆదేశంపై యూఎన్ నుంచి మద్దతు కొరవడే అవకాశం ఉంటుంది. ఈ నెలలో పాకిస్తాన్ లో పర్యటించనున్న ఐక్యరాజ్య సమితి భద్రతామండలి ప్రతినిధులు ఆదేశం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పరిశీలిస్తుంది. పాకిస్తాన్ ప్రభుత్వం సయీద్ పై కఠిన చర్యలకు దిగితే ఎన్‌ఫోర్స్ మెంట్ ఏజెన్సీలు, పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ తో సమన్వయం చేసుకుంటాయి. దీంతో ఏళ్లుగా ఉగ్రవాదానికి స్వర్గధామాలుగా సాగుతున్న సయీద్ ఛారిటీలకు చరమగీతం పాడేఅవకాశాలు ఏర్పడతాయి. రెండు ఛారిటీల ద్వారా సయీద్ మనీలాండరింగ్ కు పాల్పడిన తీరు, ఉగ్రవాద సంస్థలకు నిధుల సేకరణ వంటి అంశాలను పరిశీలిస్తాయి.ఇక లాహోర్ లో 200 ఎకరాల్లో ఉన్న జేయూడీ కేంద్ర కార్యాలయం మర్కజ్ ఈ తైబా కార్యకలాపాలపై క కూడా విచారణ అధికారులు ఆరా తీస్తారు. ప్రస్తుతం పాక్ లోని పంజాబ్ ప్రభుత్వం జేయూడీకార్యకలాపాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో త్వరలో అన్ని విషయాలు బయటకురానున్నాయి.

విదేశాంగశాఖ కార్యదర్శిగా గోఖలే

- డోక్లాం వివాదపరిష్కార కర్తగా గుర్తింపు
- చైనాలో భారత దౌత్యవేత్తగా విశేష సేవలు



న్యూఢిల్లీ: సీనియర్ దౌత్యవేత్త విజయ్ కేశవ్ గోఖలే (58) విదేశాంగ శాఖ కార్య దర్శిగా నియమితుల య్యారు. ప్రస్తుత విదేశాంగ శాఖ కార్యదర్శి ఎస్. జయశంకర్ పదవి కాలం ఈనెల 28తో ముగుస్తుండటంతో ప్రధాని మోడీ నేతృత్వంలోని అపా యింట్ మెంట్స్ కమిటీ తదు పరి విదేశాంగ శాఖ కార్యదర్శి పదవికి గోఖలే పేరును ఖరారుచేసింది. 1981 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన కేశవ్ గోఖలే..జనవరి 20,2016 నుంచి అక్టోబర్ 21,2017 వరకు చైనాలో భారత రాయభారిగా పనిచేశారు.భారత్-చైనా మధ్య 73 రోజుల పాటు సాగిన డొక్లాం ప్రతిష్టంభనకు తెరతీయడంతో గోఖలే దౌత్యం ఫలించింది. ప్రస్తుతం విదేశాంగ శాఖలో ఆర్థిక వ్యవహారాలు చూస్తున్న గోఖలే... జయశంకర్ తర్వాత విదేశాంగ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టనున్నారు.ఈ మేరకు డీవోపిటీ ఉత్తర్వులు జారీ చేసింది. విదేశాంగ శాఖ కార్యదర్శిగా గోఖలే రెండేళ్లపాటు కొనసాగుతారు. గోఖలే జర్మనీలో భారత రాయభారిగా అక్టోబర్ 2013 నుంచి జనవరి 2016 వరకు సేవలందించారు. హాంకాంగ్ , హనోయ్, బీజింగ్,న్యూయార్క్ లలోని ఇండియన్ మిషన్స్ లో కూడా గోఖలే పనిచేశారు.

భారత విదేశాంగ శాఖ చైనా- తూర్పు ఆసియా దేశాలడైరెక్టర్‌గా తూర్పు ఆసియా దేశ జాయింట్ సెక్రటరీగా కూడా గోఖలే సేవలందించారు... విదేశాంగ,రక్షణ, హోంశాఖకార్యదర్శులు, సీబీఐ, ఐబీ చీఫ్‌ల పదవికాలంరెండేళ్లే. ప్రస్తుతవిదేశాంగ శాఖ కార్యదర్శి జయశంకర్ 2015 జనవరిలో ఆపదవికి నియామితులయ్యారు. రెండేళ్లపాటు ఆయన సేవలు ఈనెల28తో ముగుస్తుండ టంతో గోఖలేను విదేశాంగ శాఖ కార్యదర్శిగా నియమించారు.

స్విచ్ నొక్కానో... అమెరికా మటాష్

(మొదటిపేజీ తరువాయి)



కొత్త సంవత్సరంలో మరింతగా పెంచుకుంటామంటూ కిమ్ ప్రకటించారు. ఈ ఏడాది మరిన్ని అణు పరీక్షలు నిర్వహిస్తామని కూడా తేల్చిచెప్పారు. కిమ్ వ్యవహారశైలి అమెరికాతో పాటు మరిన్ని దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. యుద్ధమంటూ వస్తే అది కేవలం ఉత్తరకొరియా, అమెరికాలకే పరిమితమయ్యే అవకాశాల్లేవు. అది మూడో ప్రపంచ యుద్ధంగా పరిణమించే పరిస్తితులు ఉన్నాయి. పైగా అణ్వాయుధ, జీవా యుధ ప్రయోగాలు జరిగే ప్రమాదాన్ని గతంలోనే శంకించారు. కిమ్ అయితే ఏకంగా అణుదాడితోనే యుద్ధం ప్రారంభిస్తామంటూ ప్రకటించేశారు. దీంతో అమెరికా కూడా అడుగు ముందుకేస్తోంది. ఆ దేశ జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మాజీ చైర్మన్ మైక్‌ముల్లెన్ అమెరికా యుద్ధానికి సిద్ధమౌతోందంటూ ప్రకటించారు. అణుదాడి పేరిట ప్రపంచ దేశాల్ని భయాందోళనలకు గురిచేస్తున్న ఉత్తరకొరియాను అదుపు చేయాల్సిన పరిస్థితులు తప్పడం లేదంటూ ఆయన పేర్కొన్నారు. కావాలనే కిమ్ తమను రెచ్చగొడుతున్నాడని అభిప్రాయపడ్డారు. ఏదేమైనా ప్రపంచానికి కిమ్‌బెడతను తప్పించక తప్పదని కూడా స్పష్టం చేశారు.

దక్షిణకొరియాతో మిత్రత్వానికి ప్రాకులాట

కొరియన్ల ఐక్యత పట్ల ఇప్పుడు కిమ్ కొత్త మాటలు పలుకుతున్నారు. సియోల్‌లో జరిగే వింటర్ ఒలింపిక్స్‌కు తమ క్రీడాకారుల్ని పంపిస్తామంటూ పేర్కొన్నారు. పైగా కొరియా ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్ష అయిన ఐక్యతను చాటేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. దీనిపై ఇరుదేశాల అధికార బృందాల స్థాయిలో వీలైనంత త్వరగా చర్చలు మొదలెట్టాలని కూడా సూచించారు. తద్వారా అమెరికాపై యుద్ధానికి కాలు దువ్వుతూనే దాయాది దేశం దక్షిణకొరియాతో మిత్రత్వం నెరపాలన్న ఆకాంక్ష బయటపెట్టారు. కొరియన్ల ఐక్యతంటూ కొత్త నినాదాన్ని తెరపైకి తెచ్చారు. తద్వారా అమెరికాతో యుద్ధమొచ్చినా దక్షిణ కొరియా అటువైపు మొగ్గుచూపకుండా కొరియన్ సెంటిమెంట్‌ను అడ్డేసే ప్రణాళికలు అమల్లో పెడుతున్నారు.

వాస్తవానికి ఇప్పుడు ఉత్తరకొరియాకు ప్రపంచదేశాలతో పెద్దగా సానుకూల సంబంధాల్లేవు. 1948లో కొరియా రెండుగా విడి వడింది. తొలిదశలో మెజారిటీ దేశాలు ఉత్తరకొరియాతో దౌత్య సంబంధాలు కొనసాగిం చాయి. అయితే ఏకబిగిన ఉత్తరకొరియా సైనిక పాలనలో కొనసాగడంతో పలు ప్రజాస్వామ్య దేశాలు అంచెలవారీగా సంబంధాల్ని ఉపసంహరించుకున్నాయి.

ఇప్పుడు కేవలం 25 దేశాలు మాత్రమే ఉత్తరకొరియాలో తమ దౌత్య కార్యాలయాల్ని కొనసాగిస్తున్నాయి. ఇందులో భారత్ ఒకటి. స్వీడన్, జర్మనీ, యుకెలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. కేవలం 48దేశాల్లోని 55నగరాల్లో మాత్రమే ఉత్తరకొరియా కాన్సులేట్లు నిర్వహిస్తోంది. గతేడాది డిసెంబర్‌లో ఇటలీ, మెక్సికో, మయన్మార్, స్పెయిన్, కువైట్, పెరు, ఉగాండ, సింగపూర్, పోర్చుగల్, యుఎఇలు తమ దేశంలోని ఉత్తరకొరియా రాయబారులు, ఇతర దౌత్యాధికారుల్ని వెనక్కిపంపేశారు. ఉత్తరకొరియాలో పెద్ద ఎత్తున జరుగుతున్న నిర్మాణ రంగంలో అవకాశాల్ని పెంచుకునేందుకు గతేడాది ఆస్ట్రేలియాతో సహా టర్కీ, హంగేరి వంటి దేశాలు కొత్తగా ఉత్తరకొరియాతో దౌత్యసంబంధాల్ని ఏర్పాటు చేసుకున్నాయి. ఇవేవీ యుద్ధమంటూ వస్తే ఉత్తరకొరియాకు అనుకూలంగా, అమెరికాకు వ్యతిరేకంగా వ్యవహరించే పరిస్థితులు ఉండవని అంతర్జాతీయ నిపుణులు తేల్చిచెబుతున్నారు.

సీప్లేన్ ప్రమాదంలో కంపాస్ సీఈవో మృతి

మెల్‌బోర్న్: బ్రిటన్‌కు చెందిన ప్రపంచ దిగ్గజ క్యాటరింగ్ సంస్థ కంపాస్ గ్రూప్ కంపెనీ సీఈవో రిచర్డ్ కజిన్స్ సీప్లేన్ ప్రమాదంలో మరణించారు. నూతన సంవత్సర వేడుకల కోసం వెళ్లిన సమయంలో సిడ్నీ నదిలో దుర్ఘటన చోటుచేసుకుంది. సీప్లేన్ కుప్పకూలిన ఘటనలో 58 ఏళ్ల రిచర్డ్ కజిన్స్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు నలుగురు మరణించారు. ఎమ్మా బౌడెన్(48), హీతర్ బౌడెన్(11), ఎడ్వర్డ్ కజిన్స్(23), విలియమ్ కజిన్స్(25) మరణించిన వారిలో ఉన్నారు. పైలట్ గ్యారత్ మోర్గన్ కూడా విమాన ప్రమాదంలో మృతిచెందాడు. రిచర్డ్ కజిన్స్ మార్చి 31న పదవీ విరమణ పొందాల్సి ఉంది. బ్రిటన్ అధికారులకు ప్రమాదం పట్ల సమాచారం అందజేస్తున్నట్లు ఆస్ట్రేలియా పోలీసులు తెలిపారు.



కంపాస్ సంస్థ బ్రిటన్‌లో అతిపెద్ద సంస్థ. రిచర్డ్ ఓ మానవతా మూర్తి. గడిచిన 11 ఏళ్లలో ఆయన కంపాస్ కంపెనీని ఉన్నత శిఖరాలకు చేర్చారు. హార్వర్డ్ బిజినెస్ సర్వేలో బెస్ట్ పెర్ఫార్మింగ్ సీఈవోగా కజిన్స్ గుర్తింపు తెచ్చుకున్నాడు. సిడ్నీకి ఉత్తర దిశలో ఉన్న కోవాన్ ప్రాంతంలో సుమారు 13 మీటర్ల లోతులో విమాన శకలాలు ఉన్నట్లు గుర్తించారు. కాగా, సీఈవోగా ఏప్రిల్‌లో బాధ్యతలు చేపట్టాల్సిన డొమినిక్ బ్లాక్‌మోర్ కొత్త సీఈవోగా వ్యవహరిస్తారని కంపాస్ సంస్థ తెలిపింది.

కేసీఆర్ పథకాలకు ఫిదా!



(మొదటిపేజీ తరువాయి)

తెలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా కార్యక్రమాన్ని పవన్‌కళ్యాణ్ అభినందించినట్టు తెలుస్తోంది. దీనివల్ల రైతు వర్షాలపై ఆధార పడకుండా పంటలు వేసుకోవడంతో పాటు ఏడాదిలో మూడు పంటలు పండించే అవకాశం ఉంటుందని, దీనివల్ల వ్యవసాయం లాభసాటిగా కూడా అవుతుందన్న అభిప్రాయాన్ని పవన్ వ్యక్తంచేసినట్టు చెబుతున్నారు.

ఇటీవల ముగిసిన ప్రపంచ తెలుగు మహాసభలను అత్యంత వైభోవోపేతంగా నిర్వహించినందుకు పవన్‌కళ్యాణ్ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సినీ ప్రముఖుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి కార్యక్రమానికి తాను రాలేకపోయానని, ఆ రోజున సినిమా షూటింగ్ ఉండడంతో వచ్చే అవకాశం లేకుండా పోయిందని పవన్ చెప్పినట్టు సమాచారం. ఈ తరహా మహాసభలు నిర్వహించడం ద్వారా తెలుగు భాషను మరిచిపోకుండా చూసే అవకాశం ఉంటుందని ఇంటర్మీడియట్ వరకు తెలుగును తప్పనిసరిగా చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని చర్చల సందర్భంగా సీఎంను అభినందించినట్టు సమాచారం.

నాలుగేళ్ళ క్రితం జనసేన పార్టీని ప్రకటించిన పవన్ కళ్యాణ్ దశల వారీగా పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. కొత్త ఏడాది సందర్భంగా ఆదివారం తన కార్యాలయంలో ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. తొలుత ఆయనే పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించిన సంగతి తెలిసిందే. అంతకు ముందు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, సమస్యలపై ఆయా ప్రాంతాలకు వెళ్ళి వారితో నేరుగా సమావేశమై మంతనాలు జరిపిన సంగతి తెలిసిందే. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ ఇరు రాష్ట్రాల్లో అభ్యర్థులను నిలబెడుతుందని ఇందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని చర్చల సందర్భంగా పవన్ సీఎం కేసీఆర్‌కు చెప్పినట్టు తెలుస్తోంది. ఇకనుంచి సినిమాలకు గుడ్‌బై చెప్పి ఈ ఏడాదిన్నరంతా తన పూర్తి సమయాన్ని రాజకీయాల కోసమే వెచ్చిస్తానని ఈ సమయంలో తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటిస్తానని చెప్పినట్టు సమాచారం.

ఆంధ్రప్రదేశ్‌లో పాలన ఎలా ఉందని, వచ్చే ఎన్నికల్లో అక్కడ పరిస్థితి ఎలా ఉంటుందని సీఎం కేసీఆర్ పవన్‌తో ఆరా తీసినట్టు ప్రచారం జరుగుతోంది. నియోజక వర్గాల పెంపు అంశం కూడా ఇరువురి మధ్య ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. జిల్లాల వారీగా జనసేన పార్టీ శిక్షణా కార్యక్రమాలను పూర్తి చేశామని, మంచి స్పందన వచ్చిందని పవన్ పేర్కొన్నట్టు చెబుతున్నారు.

తెలుగు రాష్ట్రాల్లోని సాగునీటి ప్రాజెక్టులు, కొత్త పరిశ్రమల ఏర్పాటు, విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, రైతులకు గిట్టుబాటు ధరలు, చేనేత కార్మికుల సమస్యలు, విద్యార్థుల సమస్యలు, వాటి పరిష్కారానికి చేపడుతున్న కార్యక్రమాలు వంటి అంశాలు ఇరువురి మధ్య చర్చకు వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది.

జాతీయ స్థాయిలో ప్రధాని నరేంద్రమోడీ పాలన, తెలుగు రాష్ట్రాలకు కేంద్రం నుంచి అందాల్సిన సాయం, కేంద్ర ప్రభుత్వ పథకాలు ఇత్యాది అంశాలు కూడా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల్లో తెదేపా, భాజపా తరపున తాను ఎన్నికల ప్రచారం నిర్వహించానని, అయితే కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తెలుగు రాష్ట్రాలను ఆశించిన స్థాయిలో ఆదుకోవడం లేదని పవన్ అసంతృప్తిని వ్యక్తంచేసినట్టు సమాచారం. ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చే విషయంలోనూ తెలుగు రాష్ట్రాల్లోని నీటి పారుదల ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించడంలోనూ, కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని పవన్ వ్యాఖ్యానించినట్టు సమాచారం. నూతన సంవత్సరం సందర్భంగా సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగానే కలిసినట్టు జనసేన పార్టీ నేతలు చెబుతున్నా ఇరువురి మధ్య అనేక ప్రధానమైన అంశాలు చర్చకు వచ్చాయని తెలుస్తోంది.

ఫుల్ పవర్ అద్భుతం!

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ఉద్యమ స్ఫూర్తితో ముందడుగు వేస్తున్న తెలంగాణ రాష్ట్ర సమితిని అభినందిస్తుందన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ భావితరాల అభివృద్ధికి బాట వేయడం, అంకితభావంతో పనిచేయడంపట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు, కార్యక్రమాలు పొరుగు రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు కరెంట్‌పై అనేక అనుమానాలు ఉండేవని, ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక అవన్నీ నివృత్తి అయ్యా యని తెలిపారు. రికార్డు స్థాయిలో 2018 మొదలుకొని 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అవుతుండడం శుభపరిణామమని చెప్పారు. రాజకీయ పార్టీని పెట్టినపుడు తాను అన్ని పార్టీలతోనూ కలవాల్సిన అవసరం ఉందని పవన్ కళ్యాణ్ ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. హైదరాబాద్‌లో జనసేన ఆవిర్భావ సభలో తాను చేసిన ప్రసంగంలోనూ తెరాసపై ఉన్న గౌరవాన్ని ప్రకటించానన్నారు. ప్రజల వాగ్దానాలన్నీ నెరవేర్చుకుంటూ ముందుకు పోతుంటే అలాంటి వ్యక్తిని అభినం దించకుండా ఇంకెవరిని అభినందిస్తామని మీడియా ప్రతినిధులను ప్రశ్నించారు. నాకుండే అభిమానులు, రాజకీయ బలం నాకు ఉన్నదని స్పష్టంచేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో

సెలబ్రిటీలు పట్టుబడ్డారు

- న్యూఇయర్ జోష్‌లో 2,499 కేసులు నమోదు
- వందలాది వాహనాలు స్వాధీనం
- పట్టుబడ్డ వారిలో అత్యధికులు ప్రముఖులే
- ప్రదీప్‌కు నేడు కౌన్సెలింగ్



హైదరాబాద్, ఆంధ్ర ప్రభ: కొత్త ఏడాది 2018 సందర్భంగా హైదరాబాద్ పోలీసులు పెద్ద ఎత్తున డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. న్యూఇయర్ పేరుతో కొందరు యువకులు మద్యం మత్తులో జోగుతారనే విషయం తెలిసిందే. కొత్త ఏడాది అసలు మందు, పబ్ కోసమే అన్నట్లుగా ఉంది. అందుకే ఇలాంటి న్యూఇయర్‌ను కొందరు వ్యతిరేకిస్తు న్నారు. ఆనందంగా చేసుకుంటేనే పండగ.. కానీ పూటుగా తాగి, ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే సరికాదనేది చాలా మంది అభిప్రాయం. న్యూఇయర్ 2018 సందర్భంగా కూడా చాలా మంది యువత పబ్‌లు, క్లబ్‌లలో ఎంజాయ్ చేశారు. హైదరాబాద్ పోలీసులు పెద్ద ఎత్తున డ్రంకెన్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. పలువురిపై కేసు నమోదు చేశారు. వాహనాలను సీజ్ చేశారు. ఆదివారం (డిసెంబర్ 31) అర్ధరాత్రి ఒక్కరోజే హైదరాబాద్‌లో 55,540 వాహనాలను తనిఖీ చేశారు. 1682 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు.

మూడు కమిషనరేట్ల పరిధిలో...

మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో మొత్తంగా 2,499 డ్రండ్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1683 కేసులు, సైబరాబాద్ పరిధిలో 582, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 234 కేసులు నమోదు అయినట్లు పోలీసులు వెల్లడించారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల నిండా ఖరీదైన కార్లే..

న్యూఇయర్ పేరుతో పోలీసులకు పట్టుబడిన కార్లలో ఎక్కువగా ఖరీదైనవే ఉండటం గమనార్హం. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల నిండా ఖరీదైన కార్లు ఉన్నాయి. మోతాదుకి మించి మద్యం తాగితే నింది తులకు జైలు శిక్ష పడే అవకాశవుంది. జూబ్లీహిల్స్, బంజారా హిల్స్ వంటి ఖరీదైన ప్రాంతాల్లోనే పబ్బులు ఎక్కువగా ఉండటంతో అక్కడ ఎక్కువగా దొరికారు. మోతాదుకు మించి మూడింతలు తాగారు. కాగా, నటుడు ప్రదీప్ మద్యం తాగి పోలీసులకు పట్టుబడిన విషయం విదితమే. బ్రీత్ అనలైజర్ టెస్టులో ప్రదీప్‌ది 178 పాయింట్ల రీడింగ్ నమోదయింది. ప్రదీప్ మోతాదుకు మించి మూడింతలు మద్యం తాగారు.

డ్రైవర్ లేకుండా ప్రదీప్

జూబ్లీహిల్స్‌లోని రోడ్ నెంబర్ 45లో జరిగిన తనిఖీల్లో ప్రదీప్ దొరికిపోయారు. టీఎస్ 07 ఈయూ 6666 స్కోడా కారులో డ్రైవింగ్ చేస్తూ బయలుదేరాడు. జూబ్లీహిల్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించారు. ఏం పేరు అని పోలీసులు అడగగా.. ప్రదీప్ అన్న సమాధానం చెప్పారు. ఈ లోగా అక్కడున్న మీడియా అటువైపు వచ్చింది. తనను వదిలేయాలని ప్రదీప్ అడిగినా పోలీసులు నోచెప్పారు. కారు పక్కన బ్రీత్ అన్‌లైజర్ టెస్ట్ చేశారు. పోలీసులకు దొరకడంతో ప్రదీప్ తన కారును పోలీసులకు అప్పగించి మరో వాహనంలో అక్కడ్నించి వెళ్లిపోయారు. ప్రదీప్‌కు పోలీసులు నేడు కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు.

అనంతరం కోర్టులో హాజరుపరుస్తారని, వారంరోజుల కంటే ఎక్కువగానే అతడికి శిక్షపడే అవకాశముందని తెలుస్తోంది. అలాగే, ప్రదీప్ తన కారుకు ఉన్న బ్లాక్ ఫిల్మ్‌లు తొలగించకపోవడంపై కూడా మరో కేసు నమోదైనట్లు తెలుస్తోంది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
మంగళవారం 2 జనవరి 2018

కొత్త వెలుగులు!

కొత్త సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వాధినేతలు తమ సందేశాల్లో ఆకాంక్షిస్తుంటారు. వెలుగంటే విద్యుత్తే. తెలంగాణ ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కొత్త సంవత్సరం ఆరం భం రోజు నుంచి వ్యవసాయానికి ఇరవై నాలుగు గంటల విద్యుత్ సరఫరాను సాకారం చేసి నిజంగానే వెలుగులు నింపారు. ఎత్తిపోతల పథకాలపై ఆధారపడే సేద్యం కరెంట్ లేనిదే సాగదు. ఒకవంక రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల రీడిజైనింగ్ కార్యక్రమాన్ని ఆగమేఘాలపై అమలు జరి పిస్తూ, మరోవంక ఆ పథకాలు పూర్తి అయ్యేనాటికి పుష్కలంగా విద్యుత్ లభించేట్టు చూడటానికి కేసీఆర్ దూరదృష్టితో చర్యలు తీసుకున్నారు.

విద్యుత్ పారిశ్రామికాభివృద్ధికి ఎంత అవసరమో, వ్యవ సాయానికీ అంతే. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పర చాలంటే విద్యుత్, నీరు, భూములు వంటి మౌలిక సదుపా యాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలమీద ఉంది. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశం అంతటా విద్యుత్ కొరత అనేది సర్వసాధారణం అయింది. విద్యుత్ సరఫరా సక్ర మంగా లేకపోవడం, పైర్లు ఎండి పోవడం కూడా సర్వసాధా రణం కావడంతో అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఇంకా మన స్మృతిపథంలోనే ఉన్నాయి. అటువంటి పరిస్థితుల నుంచి రైతులకు విముక్తి కలిగించడా నికి ఇరవై నాలుగుగంటల విద్యుత్ పథకం ఎంతో ఉపయోగ పడుతుంది. తెలంగాణాలో ఎత్తి పోతల పథకాలకు 12 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. దీర్ఘకాలిక, స్వల్ప కాలికమైన ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. సౌరవిద్యుత్ ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్‌గా నిలిచిందంటే అది ప్రభుత్వం తీసుకున్న శ్రద్ధ ఫలితమే.

విద్యుత్ రంగంలో సమస్యలు ఒక రాష్ట్రానికీ, లేదా దేశానికి పరిమితమైనవి కావు. అన్ని చోట్లా ఉన్నవే. జల విద్యుత్ పథకాలు అందుబాటులో లేని రాష్ట్రాలు బొగ్గు ఆధారిత విద్యుత్‌పైన ఆధారపడుతుంటాయి. థర్మల్ కేంద్రా లవల్ల కాలుష్యం పెరిగిపోతున్న కారణంగా సౌర విద్యుత్ ఉత్పత్తిపైన రాష్ట్రాలు దృష్టిని కేంద్రీకరించాయి. సౌర విద్యుత్ ఉత్పత్తి కోసం తెలుగు రాష్ట్రాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. విద్యుత్ కొరత అనేది గతకాలపు మాటగా మిగిలిపోవాలన్న పట్టుదలతో కృషి చేస్తున్నాయి. విద్యుత్ కొరత ఎంత తీవ్రంగా ఉండేదో మనందరికీ అనుభవైకమే. వేసవి వచ్చిందంటే కరెంట్‌కు కటకట ఏర్పడి కోతలు అనివార్యమయ్యేవి.వాన రాకడ, ప్రాణం పోకడ అనే సామెతకు పేరడీగా కరెంట్ రాకడ, ప్రాణం పోకడగా జనం జోక్‌లు వేసుకునేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి దీర్ఘకాలిక,స్వల్పకాలిక ప్రణా ళికలను అమలు జరపడం ద్వారా గడిచిన నాల్గేళ్ళ నుంచి కొరత అనే మాట వినిపించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మరో వంక వ్యవసాయ రంగాన్ని ఏమాత్రం విస్మరించకుండా, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలను శరవేగంగా అమలు జరిపిస్తున్నారు

దేశంలో చాలా రాష్ట్రాల్లో కన్నా తెలంగాణాలో పరిస్థితి ఇప్పుడు ఎంతో దేదీప్యమానంగాఉంది.తెలంగాణ చొరవ తోనే ఉత్తర, దక్షిణ విద్యుత్ గ్రిడ్‌లు అనుసంధానమ య్యాయి. 12.316 కోట్ల రూపాయిల పెట్టుబడులతో విద్యుత్ పంపిణీ, సరఫరా వ్యవస్థలను పటిష్టపరిచారు. విద్యుత్ కొరత అనే మాట ఎక్కడా వినిపించడం లేదు. ఉత్తరాదిన ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రంలోనే విద్యుత్ కొరత వల్ల మంచినీటి సరఫరా స్థంభించిన ఘటనలు అనేకం. విద్యుత్ ఉత్పత్తి ఎంత ఎక్కువ పెరిగితే అంత అభివృద్ధి సాధించినట్టు. నిరంతర విద్యుత్ సరఫరా పథకం సక్రమంగా అమలు జరిగేట్టు అధికారులు, ఇంజనీర్లు ఎప్పటికప్పుడు సమన్వ యంతో పనిచేస్తుండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం చారు. ఆయన పేర్కొన్నట్టు నిరంతర విద్యుత్ పథకాన్ని అమలు జేయడంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఈ పథకం తెలంగాణ రైతుల్లో అక్షరాలా వెలుగులు నింపుతుంది.

ఈ ఏడాది ఎలా ఉంటుంది?

'శంక'రాజీయం

-శంకర్ రాజ్, సీనియర్ పాత్రికేయులు

2017 సంవత్సరానికి వీడ్కోలు పలికేశాం. రాజకీయంగా గానీ, ఇతరత్రా గానీ భారత దేశానికి ఇది కచ్చితంగా చారిత్రాత్మకంగా నిలిచిపోయే ఏడాదే. దీని ప్రభావం రానున్న 2018పై ఎలా ఉంటుంది? ఆసక్తికరమైన అంశంపై ఓ విశ్లేషణ.

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ 2019లో నిర్వహించబోయే సాధారణ ఎన్నికల గురించి మాట్లాడుకుంటున్నారు. 2018 ఆ ఎన్నికలకు సిద్ధం కావడానికి సెమీ ఫైనల్ లాంటిది. రాజకీయ పవనాలు ఎటువీస్తాయో ఊహించలేం. ఒక వేళ అవి భారతీయ జనతా పార్టీకి అనుకూలంగా ఉన్నాయనిపిస్తే..2018 సంవత్సరాంతంలోనే సాధారణ ఎన్నికలు నిర్వహించే సాహసానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఒడిగట్టినా గట్టవచ్చు. అందులో ఎటువంటి ఆశ్చర్యమూ కూడా కనిపించదు. 2019లోనే ఎన్నికలైతే.. అందుకు ఆరునెలల ముందు ఎలాంటి ప్రధానమైన పథకాలను ప్రకటించకుండా మోడీ చేతులను కట్టేసినట్టే. రానున్న నాలుగు రాష్ట్రా ల ఎన్నికలు బీజేపీకి అనుకూలంగా ఉంటే 2018 చివరికి సాధారణ ఎన్నికలకు మోడీ వెళ్ళినా వెళ్ళవచ్చు. అప్పుడు రాజకీయ పరిస్థితులు అత్యంత క్రియాశీలంగా మారిపోతాయి.

భారత్ శక్తిమంతమైన దేశమని చాటి చెప్పడానికి రానున్న రిపబ్లిక్ దినోత్సవానికి పది ఆసియాన్ దేశాల అధినేతలను ముఖ్య అతిథులుగా ఆహ్వానిస్తున్నారు. ఆసియాన్‌లో సభ్యులు కానీ చైనా, పాకిస్థాన్‌లకు తద్వారా ఒక స్పష్టమైన సందేశాన్ని పంపుతున్నారు. ఈ ఆహ్వానం భారత్ తన యాక్ట్ ఇండియా విధాన ప్రాధాన్యతను చాటిచెబుతుంది. ఆసియాన్‌లోని దేశాలన్నీ చైనా వైఖరిపై గుర్రుగా ఉన్నాయి. అసౌకర్యంగానూ ఉన్నాయి. పాకిస్తన్ అంటే వాటికి ప్రత్యేకమైన అభిమానమూ లేదు. బ్రూనై, కాంబోడియా, ఇండోనేసియా, లావోస్, మలేసియా, మయన్మార్, ఫిలిప్పైన్స్, సింగపూర్, థాయ్‌ల్యాండ్, వియత్నాంలతో అసోసియేషన్ ఆఫ్ సౌత్‌ఈస్ట్ ఏసియన్ నేషన్స్(ఆసియాన్) ఏర్పడింది. అంటే 2018 సంవత్సరం ఒక కుదుపుతో ప్రారంభమవుతుంది. రిపబ్లిక్ డేకు ఇంతమంది నేతలు ఒకేసారి హాజరవుతుండడం ఇదే ప్రథమం. భారత సైనిక సామర్థ్యాన్ని ప్రదర్శించే పరేడ్‌కు పది దేశాల నేతలు హాజరవుతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆసియాన్ దేశాలతోనే కాక, ఆసియా పసిఫిక్, జపాన్ దేశాలతో సైతం భారత్ సత్సంబంధాలను నెలకొల్పుకుంటోంది. 2014లో తూర్పు వైపు చూడండి(లుక్ ఈస్ట్) అనే పేరును యాక్ట్ ఈస్ట్‌గా మార్చి, మోడీ ప్రభుత్వం ఆయా దేశాలతో కార్యాచరణతో కూడిన వైఖరిని అనుసరిస్తోంది. యాక్ట్ ఈస్ట్ విధానం ఆసియాన్‌కు మూలస్థంభంలా నిలుస్తోంది. వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించే ప్రత్యేక సమావేశం దీన్ని మరింత పటిష్టపరచనుంది. 2018 ఆసియాన్‌కు రజతోత్సవ సంవత్సరం కూడానూ. 15 ఏళ్ళ సమావేశస్థాయి చర్చలు చేప ట్టి, ఐదేళ్ళపాటు వ్యూహాత్మక భాగస్వామ్యాలను నెలకొల్పుకున్నారు. అనేక కార్యక్రమాలను చేపట్టారు. సింగపూర్, వియత్నాం దేశాలు ఈ ప్రాంతంలో భారత్ స్థాయిని పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయి. చైనాలో పెరుగుతున్న కార్యాచరణలు(కొంతమంది దీనిని యుద్ధోన్మాదం అనికూడా అంటున్నారు) పెరుగుతున్నాయి. సముద్ర, భూ సంబంధమైన వ్యవహారాలలో ఆ దేశం వ్యవహరించిన తీరు ఈ ప్రాంతంలో భయాన్నీ, అభద్రతనూ పెంచింది. వియత్నాం, ది ఫిలిప్పైన్స్, మలేసియా, బ్రూనై దేశాలకు దక్షిణ చైనా సముద్రంలో బీజింగ్‌తో నేరుగా వివాదాలున్నాయి. సింగపూర్ ప్రధాని లీ హీన్ లూంగ్ కూడా వచ్చే ఏడాది భారత రిపబ్లిక్ వేడుకలలో పాల్గొనే అవకాశాలున్నాయి. 2014లో పాకిస్థాన్ సహా సార్క్ దేశాల అధినేతలను నరేంద్ర మోడీ ఆహ్వానించారు. ఈ ఏడాది చివరినాటికి పాకిస్థాన్‌ను భారత్ దాదాపు బహిష్కరించినట్లే చూస్తోంది. డోక్లామ్ వివాద పరిష్కారంలో చైనాపై పైచేయి సాధించిన అంశం బీజింగ్‌ను ఆశ్చర్యపరిచింది, ఇంకేం చేస్తారోననే ఆతృత ప్రస్తుతం దానిలో కనిపిస్తోంది. పాకిస్థాన్‌తో మరింత కఠినంగా వ్యవహరించగలమని డోక్లామ్‌తో భారత్ చెప్పకనే చెప్పింది. ప్రజలు కోరుకుంటున్నట్లుగా సరిహద్దుల నుంచి చొరబాటు, తీవ్రవాదం అంశాలను ఎన్డీఏ ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచేస్తుందనీ, మోడీ ప్రభుత్వానికి అచ్చొచ్చేది అదేననీ అందరికీ తెలుసు.

రిపబ్లిక్ దినోత్సవాలలో భారత సైనిక పాటవాన్నీ, విదేశాంగ విధానాన్ని చాటిన తరవాత మోడీ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే సాధారణ బడ్జెట్‌పై దృష్టిని సారించవచ్చు. అనేక విషయాలను పరిగణనలోకి తీసుకుంటే రాబోయేది చారిత్రాత్మక బడ్జెట్‌గా భావించవచ్చు. జిఎస్టీ ప్రవేశ పెట్టిన తరవాత ఇదే మొదటి బడ్జెట్. మోడీ ప్రభుత్వానికి ఎన్నికలకు ముందు ఇదే పూర్తిస్థాయి బడ్జెట్ కూడా. 2019లో ఎన్నికల దృష్ట్యా కేవలం ఓట్ ఆన్ అకౌంట్ మాత్రమే సాధ్యమవుతుంది. ఓటర్లను దృష్టిలో ఉంచుకుని అందర్నీ సంతృప్తిపరిచేలా 2018 బడ్జెట్ ఉండవచ్చు. వ్యవసాయరంగంలో సంక్షోభంపై మోడీ ప్రభుత్వం దృష్టి సారించలేదనేది ప్రధాన అభియోగం. అలాగే, గ్రామీణ ప్రాంత సమస్యలు, సాధారణ ప్రజల కష్టాలు పట్టించుకోలేదనే ఆరోపణలూ ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని అరుణ్ జైట్లీ సహృదయంతో బడ్జెట్‌ను రూపొందిస్తారని భావిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాలు ఎదుర్కొంటున్న సమస్యలు కూడా చెప్పుకోతగినదే. గడిచిన నాలుగేళ్ళలో మోడీ ప్రభుత్వం ప ట్టణ ప్రాంతాలపైనే దృష్టి పెట్టింది. గ్రామీణ రంగానికి సంబంధించి ఎన్నో పథకాలను ప్రారంభించినప్పటికీ,



మరెంతో చేయాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న సమస్యల కారణంగానే బీజేపీ గుజరాత్ ఎన్నికలలో దెబ్బతింది. కుటుంబ వ్యయం నానాటికీ తరిగిపోతుండడం సాధారణ పౌరుణ్ణీ, ముఖ్యంగా గృహిణుల్ని కుంగదీస్తోంది. ఎల్పీజీ సిలిండర్ల ధరలను ప్రతి నెలా పెంచే అంశాన్ని నిలుపుదల చేసి, గృహిణుల ఇక్కట్లను తీర్చేందుకు ప్రణాళిక రచిస్తున్నట్లు కేంద్ర సంకేతాలు పంపింది. దీన్ని దృష్టిలో పెట్టుకుంటే రైతులు, గ్రామీతణ రంగం, సాధార పౌరులకు బడ్జెట్లో అధికంగా రాయితీలు అందే అవకాశం కనిపిస్తోంది. స్థూలంగా చెప్పాలంటే బడ్జెట్ మొత్తం ప్రలోభాలతో నిండి ఉంటుంది. నిత్యం వాడే సరకుల ధరలు తగ్గుతాయి. పెట్రోలియం ధరలను తగ్గించవచ్చు. జిఎస్టీపై వెల్లువెత్తుతున్న ఆగ్రహావేశాలను అదుపు చేసేందుకు అరుణ్ జైట్లీ ఆ విధానాన్ని సరళతరం చేయవచ్చు. ఉపాధి సృష్టిపై బడ్జెట్ దృష్టిపెట్టచ్చు. ఈ రంగంలో మోడీ ప్రభుత్వం

బడ్జెట్‌పై చర్చలు ముగియకముందే, అందరి దృష్టీ రామజన్మభూమి అంశంపైకి మళ్ళుతుంది. ఫిబ్రవరి 8న ఈ కేసు విచారణకు రానుంది. ఈ కేసులో కాంగ్రెస్ ఇప్పటికే సెల్ఫ్ గోల్ వేసుకుంది. ఆ పార్టీ సీనియర్ నేత కపిల్ సిబల్ ఈ కేసులో వాదిస్తున్నారు. 2.77 ఎకరాల బాబ్రీ మసీదు, రామ జన్మభూమి వివాదాస్పద స్థలంపై విచారణను 2019 జూలైకి వాయిదా వేయాలని కోరి తంటాలు తెచ్చుకున్నారు. అప్పటికి ఎన్నికలు పూర్తయిపోతాయి. ఈ కోరిక విని ముగ్గురు సభ్యుల ధర్మాసనం దిగ్భ్రాంతికి గురైంది. అలా వాయిదా వేయడం కుదరదని స్పష్టంచేసింది. ఈ ధర్మాసనానికి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వం వహిస్తున్నారు. విచారణ పునః ప్రారంభమైతే, బీజేపీకి ఉత్సాహమే, ఎందుకంటే సున్నీ వక్ఫ్ బోర్డు కేసును తొందరగా ముగించాలని కోరుకుంటోంది. కానీ సిబల్ కేసు వాయిదాను కోరుకుంటున్నారు.

వైఫల్యాన్ని ఎదుర్కొంటోంది. ఉపాధిపై హామీలు గుప్పించినప్పటికీ అవి అలాగే ఉంటాయి. ఎందుకంటే ఒక్క ఏడాదిలో తీర్చే హామీలు కావవి. కాంగ్రెస్ సరిగ్గా ఈ బలహీనతనే 2018 నుంచి 2019వరకూ ఉపయోగించుకుంటుంది. లబ్ధిపొందాలని చూస్తుంది.

బడ్జెట్‌పై చర్చలు ముగియకముందే, అందరి దృష్టీ రామజన్మభూమి అంశంపైకి మళ్ళుతుంది. ఫిబ్రవరి 8న ఈ కేసు విచారణకు రానుంది. ఈ కేసులో కాంగ్రెస్ ఇప్పటికే సెల్ఫ్ గోల్ వేసుకుంది. ఆ పార్టీ సీనియర్ నేత కపిల్ సిబల్ ఈ కేసులో వాదిస్తున్నారు. 2.77 ఎకరాల బాబ్రీ మసీదు, రామ జన్మభూమి వివాదాస్పద స్థలంపై విచారణను 2019 జూలైకి వాయిదా వేయాలని కోరి తంటాలు తెచ్చుకున్నారు. అప్పటికి ఎన్నికలు పూర్తయిపోతాయి. ఈ కోరిక విని ముగ్గురు సభ్యుల ధర్మాసనం దిగ్భ్రాంతికి గురైంది. అలా వాయిదా వేయడం క ుదరదని స్పష్టంచేసింది. ఈ ధర్మాసనానికి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వం వహిస్తున్నారు. విచారణ పునః ప్రారంభమైతే, బీజేపీకి ఉత్సాహమే, ఎందుకంటే సున్నీ వక్ఫ్ బోర్డు కేసును తొందరగా ముగించాలని కోరుకుంటోంది. కానీ సిబల్ కేసు వాయిదాను కోరుకుంటున్నారు. 2014 బీజేపీ ఎన్నికల ప్రణాళికలో అయోధ్యలో రామాలయాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చింది కాబట్టి, విచారణను వాయిదా వేయాలనీ, అప్పటికి 2019 ఎన్నికలు పూర్తవుతాయనీ సిబల్ పేర్కొన్నారు. 2018 ప్రథమార్థంలో దీనిపై తీర్పు వచ్చే అవకాశం లేదు. తీర్పు ఏరకంగా వచ్చినా అది బీజేపీకి 2019 ఎన్నికలలో మేలు చేకూరుస్తుందనేది సిబల్ వాదన. కోర్టు వెలుపల పరిష్కారానికి కూడా తెరవెనుక చర్చలు సాగుతున్నాయని తెలుస్తోంది. ఈ అంశంపై కొట్లాడుకుంటున్న వర్గాలను ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ చర్చలకు అంగీకరింపజేశారు. సున్నీ వక్ఫ్ బోర్డు సైతం ఈ అంశంపై విసుగు చెందింది. కోర్టు వెలుపల పరిష్కారం కుదిరితే, బీజేపీ అది తన విజయమని చెప్పుకుంటుంది. మసీదు విధ్వంసం తరవాత నిద్రబోయిన కాంగ్రెస్ ఇప్పుడు నిద్ర లేచింది. ప్రస్తుత పరిస్థితుల్లో తమది పైచేయి కాదని ముస్లిములు కూడా గుర్తించారు. రామాలయాన్ని నిర్మించడానికి హిందువులుకు వీలు చిక్కింది. వివాదాస్పద స్థలంలో ఆలయాన్ని నిర్మించిన తరవాత, మిగిలిన స్థలంలో పెద్ద మసీదును నిర్మించుకునేలా రాజీ కుదుర్చుకునే అవకాశముంది.

హద్దు దాటే వరకూ రామాలయ సమస్యను తీసుకెళ్ళకుండా బీజేపీ చకచకా పావులు కదిపింది. ఎందుకంటే, ప్రస్తుత తరం విజ్ఞానం, ఆహారం, దుస్తులు, నివాసం గురించే ఎక్కువగా ఆలోచిస్తున్నారు. 2002లో గోధ్రాలో సబర్మతి ఎక్స్‌ప్రెస్ ఘటనలో మరణాలకు ప్రతీకారంగా రామాలయాన్ని నిర్మించి తీరాల్సిందేనని అనేక ఆలయాల పూజారులు డిమాండ్ చేస్తున్నారు. వచ్చే ఏడాది బాబ్రీ మసీదు విధ్వంసం తేదీ నాటికి రామాలయాన్ని నిర్మించాల్సిందేనని పట్టుపడుతున్నారు. ఇది 2019 లోక్‌సభ ఎన్నికలకు 5 నెలల ముందుగా అన్నమాట.

మేఘాలయా, త్రిపుర, నాగాల్యాండ్ రాష్ట్రా ల ఎన్నికల రూపంలో అంతకుముందే బీజేపీకి మొదటి పరీక్ష ఎదురవుతుంది. భారత రాజకీయాలలో దేశవ్యాప్తంగా ఎలాంటి పవనాలు వీస్తున్నాయనే అంశంపై ఈ ఎన్నికలు ఒక స్పష్టమైన సంకేతాన్నివివి ఇవ్వలేవు. ఏప్రిల్‌లో జరిగే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు కచ్చితంగా బీజేపీకి సంకేతాలిస్తాయి. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్-బీజేపీ ముఖాముఖి భీషణ సంగ్రామంలో తలపడతాయి. కాంగ్రెస్ అధ్యక్షునిగా రాహుల్ గాంధీకి ఈ ఎన్నికలు అత్యంత కీలకమైనవి. కర్ణాటక ఎన్నికల తేదీని ముందుకు జరిపే అవకాశం కూడా ఉందని ఎన్నికల కమిషన్ నుంచి సంకేతాలందుతున్నాయి. సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి 2018 మే వరకూ గడువుంది. నిర్ణీత గడువుకు ఆర్నెల్ల ముందే ఎన్నికల నోటిఫికేషన్‌ను కమిషన్ విడుదల చేయవచ్చు. మేఘాలయ, త్రిపుర, నాగాల్యాండ్ అసెంబ్లీల గడువు మార్చిలో ముగుస్తుంది. కాబట్టి, ఈ నాలుగు రాష్ట్రా లకూ ఒకేసారి ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి.

ఇప్పటికే కర్ణాటకలో ఎన్నికల ప్రచారం సాగుతోంది. సిద్దరామయ్య నేతృత్వంలో మరోసారి అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పోరాడుతోంది. అవినీతి ఆరోపణలపై జైలుకు వెళ్లొచ్చిన బిఎస్ ఎడ్డియూరప్పకు అసలు సవాలు ఎదురవుతోంది. మాజీ ముఖ్యమంత్రి అయిన ఎడ్డియూరప్పను తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బీజేపీ ఇప్పటికే ప్రకటించింది. దక్షిణాదిన తిరిగి పాదం మోపేందుకు కర్నాటకలో గెలవడం బీజేపీకి చాలా అవసరం. కాంగ్రెస్ చేతిలోఉన్న నాలుగు రాష్ట్రాల్లో బలమైనది కర్నాటక. దానిని కాపాడుకోవడం కాంగ్రెస్‌కు అంతే అనివార్యమైన అవసరం.ఇరు పార్టీల మధ్య సమఉజ్జీ.అయితే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు,ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్యవైపు కొద్దిగా మొగ్గు ఉంది.ఆయన స్థానిక అమరీందర్ సింగ్‌గా తయారయ్యాడు.పార్టీ అధిష్ఠానం జోక్యం లేకుండా, స్వయంగా ప్రచారం జరిపి గెలవాలన్నది ఆయన అభిమతం.ఆయన మంచి వక్త.సాంఘికంగా, ఆర్థికంగా బాగా వెనకబడిన వర్గమైన కురుబా (పశువుల కాపరి) సామాజిక వర్గానికి చెందిన వారు. ఆయన కాలేజీలో నాయకుడు కాదు. మేధావీ కాదు. అవినీతి అసలు సమస్య కాదన్నది ఆయన అభిప్రాయం.

కర్నాటక రాజకీయాలు కులాల సంకీర్ణాలపై ఎప్పుడూ ఆధారపడి ఉంటాయి. గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ కొందరు ఒక్కలిగ, కొందరు లింగాయత్ సామాజిక వర్గాల నాయకులతో ఏర్పడిన కూటమికి దళితుల మద్దతుతో అధికారంలోకి వచ్చింది. ఈసారి దళిత ఓట్లను సొంతం చేసుకోవడానికి మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు బిఎస్ యెద్యూరప్ప తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన ఇప్పటికే రెండుసార్లు రాష్ట్రమంతటా పర్యటించి దళిత వాడల్లో ఇంటింటికీ తిరిగి వాళ్ళతో సమావేశమయ్యారు. వాళ్ళను తనవైపు తిప్పుకునేందుకు తీవ్రంగా కృషిచేశారు. తన పార్టీలో ప్రత్యర్థులు ఎవరో ఆయన గుర్తించారు. ఎడ్డియూరప్ప జోరుకు బ్రేకు వేయడానికి ప్రత్యర్థులు సిద్ధంగా ఉన్నారన్నది రహస్యమేమీ కాదు.అంతర్గతంగా వెన్నుపోట్లే బీజేపీ ఎదుర్కొంటున్న పెద్ద ప్రమాదం.ప్రజలకు కూడా ఎడ్డియూరప్పపైన మంచి అభిప్రాయం లేదు.ఆయన వ్యవహరణ తీరూ నచ్చదు. విశేషమేమంటే, బీజేపీ నెగ్గినా, ఓడినా అందుకు ఎడ్డియూరప్పే బాధ్యుడు. గుజరాత్‌లో మాదిరిగా కర్నాటకలో కూడా కాంగ్రెస్ కులం కార్డును ప్రయోగించేందుకు ప్రయత్నిస్తోంది. లింగాయత్‌లకు మైనారిటీల ప్రతిపత్తిని కల్పిస్తామని వాగ్దానం చేసింది. సంప్రదాయకంగా లింగాయత్‌లు బీజేపీకి మద్దతిస్తారు. ఈ సామాజికవర్గంలో ఎడ్డియూరప్ప శిఖరప్రాయుడైన నాయకుడు. లింగాయత్‌లు, వీర శైవుల మధ్య చీలిక సృష్టించే ప్రయత్నాలూ సాగుతున్నాయి. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో లింగాయత్‌లకు మైనారిటీ ప్రతిపత్తి అనేది ప్రధానాంశం కావచ్చు. వాస్తవానికి లింగాయత్‌ల ఉద్యమం కర్నాటక సరిహద్దులు దాటి తెలంగాణ, మహారాష్ట్రలకు విస్తరించింది.

గుజరాత్‌లో పతిదార్ ఉద్యమం సౌరాష్ట్రంలో కాంగ్రెస్ చొచ్చుకునిపోవడానికి ఉపయోగపడినట్టుగానే ఈ ఉద్యమాన్ని పరిగణిస్తున్నారు. ఎడ్డియూరప్ప తన సన్నిహితులవద్ద లింగాయత్‌ల ఉద్యమాన్ని పార్టీ సీరియస్‌గా తీసుకోవడం లేదని వాపోయారట. ఓటు బ్యాంకును యథాతథంగా ఉంచుకోవడంలో పార్టీ విఫలమైందని వ్యాఖ్యానించినట్టు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఇక కాంగ్రెస్ లింగాయత్‌లకు మైనారిటీ ప్రతిపత్తిని కల్పిస్తామని వాగ్దానం చేసి వారిని తమ వైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఆ సామాజిక వర్గంలో చీలిక రాకుండా బీజేపీ జాగ్రత్త పడే సమయం వచ్చింది.ఆ సామాజిక వర్గమే బీజేపీకి ఎప్పుడూ అండగా నిలుస్తోంది. ప్రభుత్వ వ్యతిరేకత సిద్దరామయ్యకు పెద్ద సవాల్. దీనిని బీజేపీ ఎలా ఉపయోగించుకుంటుందనేదానిపై ఫలితం ఉంటుంది. ఎన్నికలు జరగనున్న నాలుగు రాష్ట్రాల్లో బీజేపీ రెండో, మూడో రాష్ట్రాలను కైవసం చేసుకుంటే కాంగ్రెస్ ఖాళీ అవుతుంది. త్రిపుర మినహా ఈశాన్య రాష్ట్రాలన్నీ బీజేపీ వశమవుతాయి. అందువల్ల 2018 మొదటి ఆరు మాసాల్లో రాజకీయ గాలి ఎటు ఉందో తెలుసుకోవడానికి అవగాహనకు వచ్చేందుకు వీలుంది. బహుశా డిసెంబర్‌లో మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఎన్నికలు జరగవచ్చు. ఈ రెండు రాష్ట్రాల్లో పరిస్థితి బీజేపీకి అనుకూలంగా ఉన్నట్టు కనిపిస్తే, సాధారణ ఎన్నికలతో పాటుఈరెండు రాష్ట్రాల ఎన్నికలను జోడించవచ్చు.ఎందుకంటే, ఈరెండు రాష్ట్రా ల్లో బీజేపీకి సరైన ఫలితాలు రాకపోతే పరిస్థితి ఇబ్బందికరంగా పరిణమించవచ్చు. ఒకేసారి ఎన్నికలైతే ఒక వేళ ఫలితాలు ఎలా ఉన్నా అంత ఇబ్బందిఉండదు.

ఏమైనా 2018 సంవత్సరం మోడీకి నల్లేరు నడక కాదు. రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ 2018లో మోడీని పరుగులెత్తించవచ్చు. కొత్త సంవత్సరంలో మోడీకి సునాయాస విజయం ఎంత మాత్రం సాధ్యంకాదు. 2014 ఫలితాలు పునరావృతం కావు. బీజేపీని సైద్ధాంతికంగా వ్యతిరేకించే పార్టీలన్నీ కులాల వారీగా సంకీర్ణాలకు సిద్ధమయ్యే అవకాశం ఉంది. అందువల్ల 2018 బీజేపీకీ, కాంగ్రెస్‌కీ అలాగే, మోడీకీ, రాహుల్‌కీ ముఖ్యమైనదే.

ఉద్యోగాల కోసం మరో ఉద్యమం!

ఉద్యమ గడ్డ, పోరాటాలకు నిలయం అయినటువంటి తెలంగాణకు తలమానికంగా వున్న ఉస్మానియా గడ్డపై అడుగుపెట్టిన సందర్భం మేము మర్చిపోలేదు. ఇక్కడ విద్యాభ్యాసంచేసిన వారు వివిధ రంగాల్లో ప్రముఖ స్థానాల్లో ఉన్నమాట నిజమే. ఉస్మానియాలో చదువుకుంటే పెద్దఉద్యోగాలు వస్తాయన్న ఆశతో ఎంతో మంది వచ్చిచేరేవారు. చదువు పూర్తి అయిన తర్వాత ఉద్యోగాల అన్వేషణలో ఉన్న ఉద్యోగార్థులు తెలంగాణ రాష్ట్ర సమితి వ్యవస్థాపకుడు కె.చంద్రశేఖరరావు (కేసీఆర్) ప్రత్యేక రాష్ట్రం కోసందీక్ష చేయడంతో ఉద్యోగార్థులు,విద్యార్థులు ఆయనకు మద్దతుగానిలిచారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన ఎన్నికల్లో టిఆర్ఎస్ తన మ్యానిఫెస్టోలో ఇంటికో ఉద్యోగం అని ప్రచారం చేసిన కెసిఆర్‌కు మళ్ళీ విద్యార్థులు అండగా ఉన్నారు టిఆర్ఎస్‌ను గెలిపించారు.తెలంగాణ ఉద్యమానికి 1969 నుంచి విద్యార్థులే అండగా ఉన్నారన్న వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు.ఆనాటి ఉద్యమంలో 300 మంది, మలిదశ ఉద్యమంలో 1200 మంది అమరులయ్యారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ తెలంగాణ అంతచరిత్ర లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు 40 నెలలు గడుస్తున్నా నియామకాల విషయంలో ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోవడం బాధాకరం.లక్ష ఉద్యోగాల వాగ్దానం నాల్గేళ్ళయినా అమలు కాలేదు.

ఇప్పటివరకు వేసిన నోటిఫికేషన్‌లలో కోర్టుకు వెళ్ళకుండా సాఫీగా పూర్తి అయిన నోటిఫికేషన్ లేదు . దాదాపు 80 వేల ఉద్యోగాలు తెలంగాణ రాష్ట్రంలో నీవు చెప్పిన దాని ప్రకారమే ఖాళీగా ఉన్నాయి. ఈ ఉద్యోగాల నియామకంలో శ్వేతపత్రం విడుదల చెయ్యాలి. 4 సంవత్సరాలు నిరుద్యోగ యువత అసహనంతో చేసేది ఏమీ లేక నేడు మురళి మరియు బుమేష్ లాంటి యువకులు మనోవేదన చెంది ఆత్మార్పణ చేసుకోవడం జరిగింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1,12,536 ఉద్యోగాలు తక్షణమే భర్తీ చెయ్యాలి.

ఇప్పటికి టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ మరియు కొత్త సభ్యులు నియమించి 3 సంవత్సరాలు పూర్తి అయింది. చైర్మన్ సమర్థుడే అయినా తగిన సిబ్బంది లేక సతమతమౌతున్నారు. ఎందుకంటే ఉద్యోగ నోటిఫికేషన్‌లు వేసే సమయం లేదు 2019 ఎలక్షన్స్ రాబోతున్నాయి. దాదాపు 4 సంవత్సరాలు గడువు ముగిసింది. ఒక సంవత్సరం మాత్రమే మిగిలి ఉంది.

ఇప్పటికే ఖాళీగా ఉన్న ఉద్యోగాలు శాఖల వారీగా చూస్తే పోలీస్ శాఖలో 37,820 విద్యుత్ శాఖలో 12,961 మరియు ముఖ్యమైన శాఖ ఉన్నత విద్యలో 12,006, గురుకులంలో 12,436, వైద్య ఆరోగ్య శాఖలో 48,347, సింగరేణిలో 7,485, ఆర్‌టిసిలో 3950, రెవెన్యూలో 2536, వ్యవసాయ ఉద్యమ వానలో 2035, పురపాలక మరియు పట్టణాభివృద్ధిలో 1952 మరియు నీటిపారుదల శాఖలో 1058, ఆర్థిక శాఖలో 720 మరియు మహిళా స్త్రీ శిశుసంక్షేమ శాఖలో 587 మరియు రోడ్లు భవనాలలో 513, ఆబ్కారి శాఖలో 340, రవాణా శాఖలో 182, పంచాయతీరాజ్‌లో 3528 ఖాళీగా వున్నాయి. మూకుమ్మడిగా నోటిఫికేషన్స్ వేసి ప్రభుత్వం తన హామీలను నిలబెట్టుకోవాలి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని స్పెషల్ డ్రైవ్ ద్వారా ఉద్యోగ నియామకాలు అన్ని శాఖలలో నిర్వహించాలి .తెలంగాణలో 30 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. వీటన్నింటికి తక్షణమే క్యాలెండర్ ఇయర్‌గా ప్రకటించి నిరుద్యోగులకు బాసటగా నిలవాలి.

భారతదేశంలో 29 రాష్ట్రా లలో కొత్త తెలంగాణ రాష్ట్రం నిరుద్యోగంలో 18.59 శాతం తో జాతీయస్థాయిలో మూడవ స్థానంలో వుంది. మొదటి స్థానంలో జమ్ము కాశ్మీర్ 26.28 శాతంగా ఉంది మరియు రెండవ స్థానంలో అస్సాం 23.55 శాతం ఉంది అదే విధంగా నిరుద్యోగం తక్కువగా ఉన్న రాష్ట్రా లు చూస్తే మొదటి స్థానంలో మధ్యప్రదేశ్ 3.25 శాతం కాగా రెండవ స్థానంలో కర్ణాటక 4.19 శాతం కాగా మూడవ స్థానంలో గుజరాత్ 5.6 శాతంగా 2017 మే మరియు ఆగస్టు వరకు భారత ప్రభుత్వ కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రకారం పై విధంగా ఉంది.

2018 మార్చి నాటికి అన్ని నోటిఫికేషన్స్ వేసి 6 నెలల గడువులో ఉద్యోగ నియామకాలు జరగాలి లేదంటే 2019 ఎలక్షన్స్ కోడ్ వచ్చే ప్రమాదం ఉంటుంది. అలా జరగకపోకతే ప్రతి నిరుద్యోగి తన సర్టిఫికెట్స్ అసహనంతో, ఆవేదనతో, మనోవేదన చెంది అమ్ముకోవలసిన పరిస్థితి వస్తుంది, ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ ఉద్యోగాలు కూడా ప్రభుత్వం చొరవ తీసుకొని బహుళ జాతీయ కంపెనీలలో కూడా నియమించవచ్చు. తెలంగాణలో వివిధ ప్రభుత్వాల అలసత్వంతో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతూనే ఉంది. 1956 నుండి ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా ప్రత్యేక చొరవ తీసుకోలేదు.

ప్రపంచ దేశాలతో పోల్చితే భారతదేశంలో ఎక్కువమంది 60 శాతం యువత ఉంటుంది, ఇందులో హైదరాబాద్‌కు, తెలంగాణకు గొప్ప ప్రత్యేకత ఉంటుంది ప్రపంచ దేశాలు మొత్తం హైదరాబాద్‌వైపు చూస్తున్నాయి. పెట్టుబడుల విషయం కావచ్చు వర్తక వాణిజ్య సంబంధించిన విషయంలో కావచ్చు కాబట్టి ప్రపంచ దేశాలకు తొందరగా నిరుద్యోగ సమస్యలు తెలిసే అవకాశం లేకపోలేదు.

ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడా కూడా నిరుద్యోగ యువకులు ఉద్యమాలు చేసిన దాఖలాలు లేవు తెలంగాణలోనే ఈ యొక్క ఉద్యమం నడుస్తోంది అంటే ప్రభుత్వం గొప్పలకు పోకుండా మరిన్ని ఆత్మహత్యలు జరగముందే స్పందించి ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చెయ్యకపోతే 2019 రాబోవు సార్వత్రిక ఎన్నికలలో ప్రభుత్వాన్ని గద్దె దింపే ప్రమాదం ఉంది.

❑ ఎన్.రాజేంద్రప్రసాద్, పరిశోధక విద్యార్థి ఉస్మానియా విశ్వవిద్యాలయం.

పారకీయం

తమిళ రాజకీయ రంగంలో

రజనీకాంత్ రాణించేనా!

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయ రంగ ప్రవేశంపై రెండు దశాబ్దాలుగా నెలకొని ఉన్న సందిగ్ధతకు ఎట్టకేలకు తెరపడింది. ఆంగ్ల నూతన సంవత్సర కానుకగా అభిమానులకు నేను రాజకీయాలలోకి వచ్చేస్తున్నా అని ప్రకటించారు. తమిళనాడు రజనీకాంత్‌కి కోట్లాది మంది అభిమానులున్నారు. మన తెలుగు రాష్ట్రా లలోను సినీ హీరోలతో పోల్చితే తమిళ సినీతారలకు అభిమానులు ఎక్కువే. భ్రష్టుపట్టిన తమిళనాడు రాజకీయాలను చక్కదిద్దడానికి రజనీకాంత్ అసెంబ్లీ ఎన్నికలలోగా పార్టీని స్థాపించి 234 అసెంబ్లీ నియోజకవర్గాలలో తమ అభ్యర్థులను నిలబెడతానని సాక్షాత్తూ తనే ప్రకటించడం. అభినందనీయం. గతంలో తమిళ సినీ హీరోలు శరత్‌కుమార్, విజయ్‌కాంత్‌లు పార్టీలను ఏర్పాటు చేసి, దెబ్బతిన్న ఉదంతాలు ఉన్నాయి. అవినీతి, స్వార్థ రాజకీయాలు, కుట్రలు, కుతంత్రాలు గల తమిళనాడు రాష్ట్ర రాజకీయాలను రజనీకాంత్ మార్చగలడా! అనే సందేహం ప్రతి ఒక్కరిలో ఉంది, సినీ హీరోగా రజనీకాంత్‌ను అభిమానించేవారు రాజకీయ రంగప్రవేశం తర్వాత రాజకీయపార్టీల నేతగా అభిమానిస్తారా? సినీ గ్లామర్ వేరు! రాజకీయ గ్లామరు వేరు! ముఖ్యమంత్రి జయలలిత మరణం తర్వాత పార్టీలో చీలికలు వచ్చి గ్రూపులుగా విడిపోయాయి. ప్రజలు చీదరించుకునే స్థాయికి వచ్చినాయి. తెలుగు రాష్ట్రా లలో మెగాస్టార్‌గా కోట్లాది మంది అభిమానం చూరగొన్న చిరంజీవి తిరుపతి వేదికగా ప్రజారాజ్యం పార్టీ పెట్టి నామరూపాలు లేకుండా పార్టీ ఓడిపోయి, తర్వాత కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు. మొదటి నుండి ఆధ్యాత్మిక చింతన గల రజనీకాంత్ దైవాన్ని బాగా నమ్ముతారు. అభిమానులందరి అభిప్రాయాలు సేకరించిన తర్వాతనే పార్టీ ఏర్పాటుపై స్పష్టత ఇవ్వడం జరిగిందనిపిస్తుంది. రాజకీయాలలో నిజాయితీ కావాలని, సుపరిపాలన అవసరమని కుల, మత ఛాయలు లేని పారదర్శక పాలన చేపట్టాల్సి ఉందని, ఇదేనా నినాదం, కోరికగా ప్రకటించడం అందరిలో నూతనోత్సాహాన్ని నింపింది సత్యం, కార్యం, అభివృద్ధి, తమ పార్టీ మూలసూత్రాలుగా ఉంటాయని చెప్పడం, మార్పుగా భావించవచ్చు. తమిళనాడు రాజకీయాలలో రజనీకాంత్ ఓ నరసింహగా, బాషాగా, పెదరాయుడిగా, దళపతిగా రాణిస్తాడని ఆశిద్దాం. తమిళ రాజకీయాలను గాడిలో పెట్టి నిస్వార్థంగా రజనీ మార్క్ రాజకీయాలలో చూపెట్టాలని తెలుగు రాష్ట్రా ల నుండి మనందరం కోరుకుందాం.

❑ కామిడి సతీష్ రెడ్డి, పరకాల, వరంగల్ రూరల్ జిల్లా

రైతు సాయానికి దిక్సూచి

● భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి ● 26 నుంచి కొత్త పాస్ పుస్తకాలు

● రెవెన్యూలో కీలక సంస్కరణలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నిర్ణీత గడువులో భూ రికార్డుల ప్రక్షాళన ప్రక్రియ పూర్తయింది. సెప్టెంబర్ 15న ఆరంభమైన రికార్డుల ప్రక్షాళన 568 మండలాలు, 30 జిల్లాలు, 10,806 గ్రామాల్లో సమగ్రంగా పూర్తయింది. 1507 బృందాలు ఈ కసరత్తులో పాల్గొన్నాయి. మొత్తంగా 2కోట్ల 30 లక్షల ఎకరాల భూ విస్తీర్ణానికి చెందిన రికార్డుల పరిశీలన పూర్తితో దాదాపు 98 శాతానికి చేరింది. ఈ మొత్తం రికార్డుల కంప్యూటరీకరణ, పహాణీల అప్‌డేషన్ కార్యక్రమాలు చురుకుగా సాగేందుకు వీలుగా వచ్చే ఏడాది కార్యచరణ చేపట్టనున్నారు. మొత్తం 62,58,026 ఖాతాల పరిశీలన చేయగా ఇందులో 90శాతం క్లీయర్‌గా ఉన్నాయని తేలింది. ఈ సర్వేలో కోటి 53 లక్షల ఎకరాలకుపైగా భూమి రైతుల చేతుల్లో ఉందని తేల్చారు. ఇక వ్యవసాయేతర భూములు 13లక్షల 57వేల ఎకరాలుగా గుర్తించారు. ప్రభుత్వ అవసరాలకు వినియోగించిన భూమి 15 శాతంగా తేల్చారు. ఇది 29,61,780ఎకరాలుగా ఉంది. మొత్తంగా 92 శాతం అంటే కోటీ 97లక్షల 10వేల 172 ఎకరాల భూమి వివాదరహితంగా ఉన్నట్లు నిర్ధారించారు.

ఈ సర్వేలో భాగంగా అధికారులు పండగలు, సెలవులు లేకుండా నిరంతరం శ్రమించారు. తమ వద్ద ఉన్న ఖాస్రా పహాణీ, సేత్వార్, పాత పహాణీ, ఆర్ఓఆర్ పహాణీ, మాన్యువల్, వెబ్‌ల్యాండ్, 1బీ, గ్రామ పటంతో గ్రామాలకు తరలి వెళ్లారు. గిర్దావర్, వీఆర్వోతో కూడిన బృందం ఇంటింటికీ తిరిగి పహాణీ, 1బీ రికార్డును చూపి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలు లేనివారి నుంచి సంతకాలను తీసుకుని అక్కడికక్కడే క్లియెరెన్స్‌లు ఇచ్చారు. సమస్యలున్న భూముల వివరాలను రికార్డు చేసి రైతుల సమక్షంలో సర్వే జరిపాలని నిర్ణయించారు. తర్వాతే అనుభవదారుల రికార్డులు రూపొందించే దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో భూమికి, రికార్డుకు మధ్య తేడాలున్న అనుభవదారుల పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునేలా కార్యాచరణ ఆరంభించారు. వీఆర్వో వద్ద ఉన్న పహాణీ విస్తీర్ణాన్ని ఖాస్రా, సేత్వార్ విస్తీర్ణంతో సరిపోల్చి చూశారు. మొదటిరోజు గ్రామ సభలతో ప్రారంభమైన బృందాల రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం ఒక్కో గ్రామంలో 9 రోజులపాటు కొనసాగింది. చివరిరోజు 1బీ దస్త్రాన్ని నవీకరించి పట్టాదారులకు అందజేసేంతవరకు ఈ బృందమే బాధ్యత తీసుకుంది. ఈ సర్వేలో భాగంగా విరాసత్ భూముల తప్పొప్పులు, విస్తీర్ణం నమోదులో వ్యత్యాసాలు, ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న వారి వివరాలు పహాణీలో లేని తీరు, మాతృదస్త్రాల్లో ఒకరి పేరు కబ్జాలో మరొకరు, పాస్ పుస్తకాలు మరొకరి దగ్గర ఉండే సమస్యలను తర్వాత దశలో పరిశీలించనున్నారు.

54 అంశాలతో...

తొలి దశ రికార్డుల ప్రక్షాళన, నవీకరణ, సవరణలో భాగంగా భూముల సమగ్ర సమాచారాన్ని ఈ బృందాలు 54 అంశాల ఆధారంగా సేకరించాయి. క్రమ సంఖ్య మొదలుకొని భౌగోళిక విస్తీర్ణం, ప్రభుత్వ భూముల్లో రకరకాల రహదారుల విస్తీర్ణాలు, మంజూరీ చేసిన ప్రభుత్వ పనులు, భూ సేకరణ, ప్రభుత్వ భూముల్లో, పట్టా భూముల్లో ఉన్నవాటిని తేల్చి నివేదిక రూపొందించారు. గ్రామ సభ నిర్వహించి గ్రామ పరిధిలో ఉన్న వ్యవసాయ, వ్యవసాయేతర, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు చెందిన భూములు, ఆస్తుల వివరాలను చదివి వినిపించారు. ఆ తర్వాత సవరించిన 1బి రిజిస్టర్‌ను చదివి వినిపించి వివాద రహిత గ్రామాలను ప్రకటిస్తూ వచ్చారు.

రికార్డుల ప్రక్షాళనలో భాగంగా మొదట గ్రామాల్లోని వ్యవసాయ భూములను, అసైన్డ్ ప్రభుత్వ, అటవీ, చెరువులు, కుంటలు, వ్యవసాయేతర భూముల లెక్కలు సేకరించారు. అన్ని ప్రభుత్వ భూములను ఎర్ర సిరాతో రాస్తారు. లావణి పట్టా భూములను వయోలెట్(ఉదా రంగు)తో గుర్తించారు. ఎలాంటి వివాదాలు లేని అటవీ భూములను పార్ట్-ఏ కింద గుర్తించి హద్దులు నిర్ధారించారు.

కొత్త పాస్ పుస్తకాలు...టైటిల్‌డీడ్‌లు రద్దు

రికార్డుల ప్రక్షాళన పూర్తికావడంతో ఈనెల 26నుంచి కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని నిర్ణయించారు. టైటిల్ డీడ్‌ల అవసరం లేకుండా అన్ని వివరాలు ఈ పాస్‌బుక్ కంటైటిల్ డీడ్‌లోనే నిక్షిప్తం చేస్తారు. తడవకుండా, పాడవకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించనున్నారు.

76 రకాల భూ సమస్యలు...

తొలుత రికార్డుల ప్రక్షాళనకు పూనుకోవడం వెనుక అనేక కారణాలున్నాయి. 1932-36లో నిజాం హయాంలో జరిగిన భూ సర్వే తర్వాత మళ్లీ సర్వే జరగలేదు. అప్పటికీ ఇప్పటికీ రెవెన్యూ వ్యవహారాలు, క్షేత్రస్థాయిల్లో అనేక మార్పులు సంతరించుకున్నాయి. 81 ఏళ్లలో 76 రకాల భూ సమస్యలు పేరుకుపోయాయని గుర్తించారు. దీంతో రికార్డుల ప్రక్షాళనతోపాటు భూ సర్వే జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి దశలో రికార్డుల ప్రక్షాళన జరిపి ఆ తర్వాత భూ సర్వే చేపట్టనున్నారు. భూ సర్వేకు సాంకేతిక ఏర్పాట్లకు మూడు నెలల సమయం పట్టనుంది. వర్షాకాలంలో శాటిలైట్ చిత్రాలు సరిగా రావనే అభిప్రాయంతో వాయిదా వేశారు.

రికార్డులివే...

-గతంలో గ్రామాల్లో ముఖ్యంగా 23 రకాల రికార్డులు నిర్వహించేవారు. అవి ఇప్పుడు 11కు చేరాయి.

-భూముల రకాలు... పట్టా భూములు, ప్రభుత్వ భూములు. వ్యక్తిగత పట్టా, జిరాయితీ భూములు, ఇనాం భూములు, దేవాలయ భూములు, అటవీ భూములు, భూదాన్ భూములు, సీలింగ్ భూములు, కోఆపరేటివ్ జాయింట్ ఫార్మింగ్ సొసైటీ భూములు

రికార్డుల రకాలు...

-పట్టాదార్ పాస్‌బుక్

-డీ ఫారం పట్టా, లావణి పట్టా, టికెటి పట్టా, అసైన్‌మెంట్ సర్టిఫికెట్

-రిజిస్టర్ దస్తావేజు

-సాదాబైనామా లేదా 13బి

-38ఇ(రక్షిత కౌలుదారు పత్రం)

-ఇనాం భూమిపై ఆక్యుపెన్సీ రైట్స్ సర్టిఫికెట్

-దేవాదాయ భూమిపై కౌలు తీసుకుని ఉంటే రశీదులు

-అటవీ భూమిలో అనుభవమున్న గిరిజనులకిచ్చిన పట్టా

-దాన పత్రం

-పార్టీషన్ డీడ్

1932-36 మధ్య నిజాం రాజ్యంలో భూ సర్వే జరిగింది. అప్పటినుంచీ మళ్లీ జరగలేదు. ఈ ఎనిమిది దశాబ్దాల కాలంలో అనేక మార్పులు సంభవించాయి. కానీ అవన్నీ సరిగ్గా నమోదు కాలేదు. అందుకే రికార్డుల నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. వివాదా లకు ఇదే కారణంగా మారింది. వ్యవ సాయ, రెవెన్యూ శాఖల వద్ద ఉన్న వివరాలకు పొంతన లేకుండా పోతోంది. దీంతో ప్రభుత్వం అందించాలనుకునే పెట్టుబడి ఏ ప్రాతిపదికన అందించాలో తెలియని పరిస్థితి నెలకొంది. పొరపాట్లు జరిగితే వేల కోట్ల కుంభకోణం అయ్యే అవకాశముంది. మంచి చేయబోతే చెడు అయ్యేలా ఉంది. అందుకే ఏ భూమి ఎవరిదో...పెట్టుబడి ఎవరికి అందాలో ఖచ్చితంగా తెలియాలి. అందుకే భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం తీసుకున్నాం' అని ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ కార్యక్రమ అవసరాన్ని స్పష్టం చేశారు.

ఇలా జరిగింది...

10875 రెవెన్యూ గ్రామాల్లో 1193 బృందాలు భూ రికార్డుల ప్రక్షాళనలో పాలుపంచుకున్నాయి. ఒక్కో బృందం 9గ్రామాల్లో, ఒక్కో గ్రామంలో 10 రోజులపాటు ఈ కార్యక్రమంలో నిమగ్నమైపని చేశాయి. జనవరి 1కి నూతన ఏడాది కానుకగా సవరించిన, సరళీకరించిన, ఆధునిక రికార్డులు అందుబాటులోకి రానున్నాయి.

-సెప్టెంబర్ 1నుంచి 9 వరకు రైతు సమన్వయ సమితిల ఏర్పాటు

-10నుంచి 15 వరకు మండలాల వారీగా రైతు సమన్వయ సమితి సదస్సులు

-సెప్టెంబర్ 15నుంచి డిసెంబర్ 31 వరకు రెవెన్యూ గ్రామాల వారీగా భూ రికార్డుల ప్రక్షాళనా కార్యక్రమ నిర్వహణ

నేడు ఢిల్లీకి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

● జాతీయ పండుగగా మేడారం జాతర గుర్తింపునకు వినతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర గృహనిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మంగళవారం ఢిల్లీ వెళ్ళనున్నారు. రాష్ట్ర ఎంపీలతో కలిసి ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్‌ను కలవనున్నారు. గిరిజన కుంభమేళాగా పిలిచే మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని అసెంబ్లీలో కూడా తీర్మానం చేశామని వివరించనున్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం సమ్మక్క-సారలమ్మల జాతరకు జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్, మహారాష్ట్రల నుండి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు.

ప్రార్థనా దినోత్సవానికి ఏర్పాట్లు

● హాజరుకానున్న మంత్రులు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: ఈ నెల 5 న పరేడ్‌గ్రౌండ్స్‌లో జరగనున్న జాతీయ ప్రార్థనా దినోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత క్రైస్తవ ఆధ్యాత్మికవేత్త బిల్లీ గ్రహం కుమార్తె అనీ గ్రహం లోజ్ ఈ ప్రేయర్‌డే కార్యక్రమంలో పాల్గొంటున్నందున ఈ ప్రార్థనా దినోత్సవానికి ప్రాముఖ్యత ఏర్పడింది. బిల్లీ గ్రహంను ప్రపంచంలోనే అగ్రశ్రేణి ఆధ్యాత్మిక వేత్తగా క్రైస్తవులు భావిస్తారు. అమెరికా అధ్యక్షుడితో పాటు ప్రపంచంలోని క్రైస్తవ దేశాల అధినేతలు సైతం ఆయన ఆశీస్సులు పొందేందుకు ముందుగానే అపాయింట్‌మెంట్ తీసుకుంటారు. సామాన్యులు, అసామాన్యులను సైతం బిల్లీగ్రహం సమానంగా చూస్తారు. ఆయన కూతురు స్వయంగా హాజరుకానున్న దృష్ట్యా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు చెందిన క్రైస్తవ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు అంచనావేస్తున్నారు.క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం ఏర్పాట్లను టీఆర్ఎస్ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అనీ గ్రహం ఈ నెల 4 న హైదరాబాద్ చేరుకుని మరుసటి రోజు 5 వ తేది మధ్యాహ్నం 3 గంటలకు పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ప్రార్థనా దినోత్సవంలో పాల్గొంటారు. రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కె తారకరామారావు ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా పాల్గొంటారు. తర్వాత 7 వ తేది ఉదయం 10.30 గంటలకు గాజులరామారంలో ఉన్న మహారాజా గార్డెన్ ఫంక్షన్ హాలులో జరిగే మహిళాకాన్ఫరెన్స్‌లో అనీ గ్రహం పాల్గొంటారు. 9 న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సదస్సులో కీలకోపన్యాసం చేస్తారు. ఈ కార్యక్రమాలకు రైల్వే రిటైర్డ్ పీఆర్ఓ ఎఫ్ఆర్ మైకెల్ మీడియా కన్వీనర్. కేథలిక్ అసోసియేషన్ , సీఎస్ఐ, మెథడిస్ట్, బాప్టిస్ట్, మెన్నోనైట్‌తో పాటు ఇతర సంఘాలు, ఫెలోషిప్‌లు కూడా ప్రేయర్ డేకు మద్దతు తెలిపాయి.

వేసవిలో పదోన్నతులు, బదలీలు:కడియం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు సంబంధించిన పదోన్నతులు, బదిలీలను పూర్తి చేస్తామని ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి పిఆర్‌టియు నేతలకు హామి ఇచ్చినట్టు ఆ సంఘం నేతలు తెలిపారు. సోమవారం పిఆర్‌టియు రూపొందించిన 2018 డైరీని కడియం శ్రీహరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎం అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం చెన్నయ్య శాసనమండలి సభ్యులు పాతూరి సుధాకర్‌రెడ్డి, సంఘం నేతలు చేవెళ్ల స్వామి, పి వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య లేమితో మార్కెటింగ్ ఉద్యోగాలకు

అభ్యర్థుల కొరత

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యాపార, వాణిజ్య రంగాల విస్తరణతో మార్కెటింగ్ నెట్‌వర్క్ పెంచుకునేందుకు మరిన్ని అవకాశాలు ఏర్పడుతున్నాయి. వాణిజ్య రంగంలో రోజురోజుకు కొత్త ఉత్పత్తుల మార్కెటింగ్, ప్రచార కార్యక్రమాలకు ప్రోత్సాహం పెరగడంతో వాటిని ఆచరణలో పెట్టేందుకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌ల అవసరం కూడా పెరుగుతోంది. కంపెనీలు, బ్యాంకులు, బీమా, ఆర్థిక, వాణిజ్య సంస్థలు తమ కొత్త ఉత్పత్తులను వినియోగదారుడికి అందించేందుకు మార్కెటింగ్ నెట్‌వర్క్ మరింత విస్తృతమవుతోంది. ప్రతి ప్రాడక్టు గురించి వినియోగదారుడికి తెలియజేయడంతో పాటు ఆ ఉత్పత్తులకు డిమాండ్ కల్పించడంలో మార్కెటింగ్, సేల్స్ నిపుణులు కీలకమవుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ సంస్థల ఉత్పత్తుల గురించి వినియోగదారులకు చేరవేసే మార్కెటింగ్ ఉద్యోగాలకు ఎన్నో అవకాశాలు ఉన్నప్పటికీ నైపుణ్యం కలిగిన వారు అందుబాటులో లేకపోవడంతో ఈ ఉద్యోగాలను భర్తీ చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. వస్తువుల మార్కెటింగ్‌తో పాటు సేల్స్, మేనేజ్‌మెంట్, సాఫ్ట్‌వేర్, హెచ్‌ఆర్, యాజమాన్యం తదితర రంగాల్లో నైపుణ్యం కలిగిన అభ్యర్థులు దొరకకపోవడంతో ఈ రంగాల్లో ఉద్యోగ నియామకాలను భర్తీ చేయడం కష్టసాధ్యంగా ఉంటుందని ఇండీడ్ అధ్యయన సంస్థ వెల్లడించింది. ఉద్యోగాలకు సంబంధించిన వెబ్‌సైట్లలో ప్రపంచంలోనే పేరుగాంచిన ఈ సంస్థ దేశంలోని ప్రధాన నగరాల్లో అధ్యయనం నిర్వహించింది. ఏ నగరంలోనైనా మార్కెటింగ్‌లో నైపుణ్యం, మెళకువలు, ప్రతిభ, వాక్చాతుర్యం లేనందున అనేక మంది అభ్యర్థులు ఉద్యోగాలు పొందలేకపోతున్నారు.

కొన్ని ఉత్పత్తులను ఇంటింటి ప్రచారం ద్వారా వినియోగదారులకు పరిచయం చేస్తుండగా, మరికొన్నింటిని ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తేవలసి ఉంటుంది. వీటికి తగిన అర్హతలు ఉన్న అభ్యర్థులను వెతుక్కోవడం ఆయా సంస్థలకు ఇబ్బందికర పరిణామంగా ఉన్నది. అయితే కొన్ని సంస్థలు యువకులను నియమించుకుని తమ ప్రాడక్టుల గురించి శిక్షణ ఇస్తున్నాయి. వారిలోని నైపుణ్యాన్ని గుర్తించి అందుకు తగిన రీతిలో శిక్షణ ఇస్తూ మార్కెట్‌ను విస్తరించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అయితే సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి ఉన్నత శ్రేణిలో నైపుణ్యం అవసరం ఉన్నందున ఈ రంగంలో నియామకాలకు కొంత ఇబ్బంది ఏర్పడుతుందని ఆ సంస్థ వెల్లడించింది.

ఇటీవల కాలంలో డిజిటల్ మార్కెటింగ్, అనుసంధానిత అమ్మకాల విధానం పెరుగుతుండడంతో ఈ రంగంలోని పలు విభాగాల్లో నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు డిమాండ్ పెరుగుతోంది. ఉద్యోగ సైట్ల ద్వారా వీటిపై ఆసక్తి కనబరుస్తున్న వారు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకుంటున్నప్పటికీ వారికి తగిన అర్హతలు, ప్రతిభ, నైపుణ్యతలు ప్రదర్శించలేకపోతున్నారు. మరీ ముఖ్యంగా ఆయా ఉద్యోగాలకు సంబంధించిన బాధ్యతలు నిర్వర్తించేందుకు తగిన అర్హతలు పొందలేకపోతున్నారు. దీంతో అనేక రంగాల్లో మార్కెటింగ్ ఉద్యోగాలకు అవకాశాలు ఉన్నప్పటికీ నైపుణ్యాల లేమీతో నియామకాలు ఆశించిన మేరకు జరగడం లేదని ఆ అధ్యయనం వెల్లడించింది.

హైదరాబాద్‌లో ఏ రంగంలోనైనా 40 శాతానికి మించి నైపుణ్యం, అర్హతలు కలిగిన అభ్యర్థులతో ఉద్యోగాలు ఇవ్వడం కష్టసాధ్యమవుతోంది. మార్కెటింగ్‌లో 38.54 శాతం, సేల్స్‌లో 38 శాతం, మేనేజ్‌మెంట్‌లో 35.15 శాతం, సాఫ్ట్‌వేర్‌లో 33.98 శాతం, నిర్వహణలో 31.8 శాతం, హెచ్‌ఆర్‌లో 30.58 శాతం మేరకే నైపుణ్యంతో అర్హత కలిగిన అభ్యర్థులు ఉన్నట్లు ఆ అధ్యయనం వెల్లడించింది. హైదరాబాద్ మార్కెటింగ్ విస్తృతమవుతున్న తరుణంలో ఇతర నగరాల నుంచి వస్తున్న అభ్యర్థులతో నింపుకోవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా హిందీ, ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం, మార్కెటింగ్‌లో వ్యూహాత్మక నైపుణ్యం లేకపోవడంతో స్థానిక యువతకు ఎగ్జిక్యూటివ్ స్థాయి ఉద్యోగాలు లభించడం కష్టంగా మారింది. దీంతో ఉద్యోగ నియామకాలకు సంబంధించి శిక్షణ ఇచ్చే కేంద్రాలకు డిమాండ్ పెరుగుతోంది. సాఫ్ట్‌వేర్, డిజిటల్ టెక్నాలజీ ఇతర సంబంధిత రంగాల్లో యువతకు శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా టాస్క్‌ను ఏర్పాటుచేసి అవకాశాలు కల్పిస్తున్న విషయం తెలిసిందే.

ట్రేడ్ హైదరాబాద్ డాట్ కాం ద్వారా

ఉచిత డిజిటల్ మార్కెటింగ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వ్యాపార, వాణిజ్య రంగాల అభివృద్ధిలో డిజిటల్ మార్కెటింగ్ కీలకపాత్ర పోషించడంతో చిరు వ్యాపారులకు ఇది అందుబాటులో ఉండడంలేదు. సోషల్ మీడియా, డిజిటల్ ప్రమోషన్, ఇ-మెయిల్ మార్కెటింగ్, నెట్‌వర్కింగ్, సోషల్ క్లౌడ్, గూగుల్, క్లిక్, కీ వరల్డ్ మార్కెటింగ్‌లో డిజిటల్ మార్కెటింగ్ ఇప్పటికీ చిరు వ్యాపారులు చేరుకోవడం కష్టసాధ్యంగా ఉంది. డిజిటల్ మార్కెట్ రంగంలోకి వెళ్ళలేని అనేక చిరు వ్యాపార సంస్థల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ట్రేడ్ హైదరాబాద్ డాట్ కాం తన సేవలను అందించేందుకు ముందుకు వచ్చింది. చిరు వ్యాపారులు, స్వయం సహాయక గ్రూపులు, స్వయం ఉపాధి వ్యాపారస్తులకు డిజిటల్ మార్కెటింగ్ రంగంలో ఉచితంగా సేవలు అందించనున్నట్లు ట్రేడ్ హైదరాబాద్ డాట్ కాం సీఈవో బులెమోని వెంకట్ తెలిపారు.

హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ బిజినెస్ టు బిజినెస్ పోర్టల్ ట్రేడ్ హైదరాబాద్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారులకు ఉచితంగా డిజిటల్ మార్కెటింగ్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనుంది. రిటైల్, టెక్స్‌టైల్, బ్యూటీ - ఫ్యాషన్, టూరిజం, హెల్త్‌కేర్, హాస్పిటాలిటీ, రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్, సర్వీస్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ప్రాథమిక విద్య, ట్యూషన్ మేనేజ్‌మెంట్, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, చిన్నతరహా పరిశ్రమల కోసం ఉచితంగా డిజిటల్ మార్కెటింగ్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెంకట్ తెలిపారు.

ఈ ఉచిత వ్యాపార ప్రచారంలో భాగంగా ఆయా వ్యాపారాల ప్రాథమిక సమాచారాన్ని ట్రేడ్ హైదరాబాద్‌లో ఉచితంగా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ప్రాడక్టు డిస్ప్లే, క్లాసిఫైడ్, యాడ్స్ సర్వీసెస్, ఇ-మెయిల్ మార్కెటింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్, నెట్‌వర్కింగ్ సహాయాన్ని ట్రేడ్ హైదరాబాద్ ఉచితంగా అందించనుందని వెంకట్ చెప్పారు.

ఏదైనా చిరు వ్యాపారాలు నిర్వహించే వ్యాపారస్తులు జనవరి 10లోగా ఉచిత డిజిటల్ మార్కెటింగ్ సేవల కోసం తమ వ్యాపారాలను ట్రేడ్ హైదరాబాద్‌లో నమోదు చేసుకోవచ్చునని ఆయన సూచించారు.

కోర్సు పూర్తయ్యేలోగా బోధనా ఫీజు

● 3. 25 లక్షల మంది విద్యార్థులకు మేలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బోధనా ఫీజుల చెల్లింపుల్లో జాప్యం నివారించాలని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఇక మీదట విద్యార్థులకు అసౌకర్యం కలగని విధంగా బోధనా ఫీజులను సంబంధిత కళాశాలలకు సకాలంలో చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. 2017-18లో 13.05 లక్షల మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంటు చెల్లించవలసి ఉంటుందని పేర్కొంది. కోర్స్ ముగిసిన వెంటనే సంబంధిత కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు అందించే విధంగా ఫైనల్ ఇయర్ విద్యార్థులకు సకాలంలో బోధనా ఫీజులు చెల్లించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు బోధనాఫీజులుగా చెల్లించడానికి రూ. 650 కోట్ల మేరకు అవసరమని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ సంచాలకులు కరుణాకర్ తెలిపారు. ఈ నిధులు విడుదల చేయడంతో సుమారు 3.25 లక్షల మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. కొంత కాలంగా ఫీజుల చెల్లింపుల్లో తీవ్రమైన జాప్యం జరుగుతుంది. కళాశాలల యాజమాన్యాలు కోర్సు పూర్తయిన విద్యార్థుల సర్టిఫికెట్లను అందచేయడానికి బోధనా ఫీజులను ముడిపెడుతున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ సాంకేతిక కారణాలతో కళాశాలల యాజమాన్యాలకు సకాలంలో చేరడంలేదు. దీంతో అనేక మంది విద్యార్థులు కోర్సు ముగిసిన వెంటనే సంబంధిత విద్యాసంస్థ నుండి సర్టిఫికెట్లను పొందలేక పోతున్నారు.

ఇంజనీర్ల పదోన్నతులకు బ్రేక్

● పదవీ విరమణ చేసిన వారికే సూపర్ న్యూమరీ పోస్టులు ● ఆరు కేటగిరీల్లో ఆగిన ప్రమోషన్లు ● డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు ఆటంకం ● ప్రమోషన్లు రాకుండానే రిటైరవుతున్న ఇంజనీర్లు ● పదవుల్లో రెండు వేల మందికి పైగా రిటైర్డ్ ఇంజనీర్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని వివిధ శాఖల్లో కొనసాగుతున్న ఇంజనీర్లకు పదోన్నతులు లభించక ఇబ్బందులు పడుతున్నారు. ఇంజనీర్ ఇన్ ఛీఫ్‌గా ఉన్న వారు పదవీ విరమణ చేయగానే ఆ స్థానంలో తనకు పదోన్నతి లభిస్తుందని ఆశపడుతున్న వారికి నిరాశ ఎదురవుతోంది. గత మూడేళ్లుగా చాలా శాఖల్లోని ఈఎన్‌సీలను పదవీ విరమణ అనంతరం కూడా కొనసాగిస్తుండటంతో పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న దిగువస్థాయి ఇంజనీర్లు ప్రమోషన్లు రాక ఆందోళన చెందుతున్నారు. ఒక ఈఎన్‌సి పదవీ విరమణ అనంతరం కూడా కొనసాగితే పదోన్నతులు పొందాల్సిన ఆరు కేటగిరిల ఇంజనీర్లు ప్రమోషన్లు రాక ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి వారు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల్లో కలిపి సుమారు 2000 మందికి పైగా ఉంటారని ప్రభుత్వ అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తోంది. ఈ సమస్య ఏ ఒక్క ఇరిగేషన్ శాఖలోనో, పంచాయితీరాజ్ శాఖలోనో, ఆర్ అండ్ బి శాఖలోనో కాదు దాదాపు ఇంజనీరింగ్ విభాగం ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ కొనసాగుతోంది.

ఆగిన ప్రమోషన్లు...

ఒకశాఖలో ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా కొనసాగుతున్న వ్యక్తి పదవీ విరమణ చేస్తే అతని కింద ఉన్న చీఫ్ ఇంజనీర్ ఈఎన్‌సీగా పదోన్నతి లభిస్తుంది. ఎస్ఈకి సీఈగా, ఈఈకి ఎస్ఈగా, డిఈకి ఈఈగా, అసిస్టెంట్ ఇంజనీర్‌కు డివిజనల్ ఇంజనీర్‌గా పదోన్నతి లభిస్తుంది. అదే ఈఎన్‌సీ పదోన్నతి లభించకపోతే మిగిలిన వారందరికీ ప్రమోషన్లు ఆగిపోతాయి. గత రెండున్నరేళ్లుగా వివిధ శాఖల్లో ఈఎన్‌సీలుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన వారిని తిరిగి ఈఎన్‌సీలుగా కొనసాగిస్తున్నారు. కొన్ని శాఖల్లో సీఈ, ఎస్ఈలు రిటైర్ అయినప్పటికీ వారిని తిరిగి అదే పదవుల్లో కొనసాగిస్తున్నారు. దీంతో కిందిస్థాయి వారికి పదోన్నతులు లభించడం లేదు. కొన్ని శాఖల్లోని కొందరు ఎస్ఈలు సీఈగా పదోన్నతి పొందకుండానే పదవీ విరమణ చేస్తున్నారు. కొందరు ఈఈలు ఎస్ఈగా కాకుండానే పదవీ విరమణ అవుతున్నారు.

నిలిచిన రిక్రూట్‌మెంట్....

పదోన్నతులు రాకపోవడంతో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కూడా ఆగిపోతోంది. పదవీ విరమణ పొంది తిరిగి పదవుల్లో కొనసాగతున్న వారు అన్ని శాఖల్లో కలిపి సుమారు 2000 మందికి పైగా ఉన్నారు. దీంతో నేరుగా అసిస్టెంట్ ఇంజనీర్లుగా ఉద్యోగాలు పొందాల్సిన వారు పొందలేకపోతున్నారు. పదవీ విరమణ పొందిన తరువాత వారిని అదే పదవుల్లో కొనసాగించడం కోసం వారికి సూపర్ న్యూమరరీ పోస్టులుగా కొనసాగిస్తున్నారు. దీంతో పదోన్నతులు రావల్సిన వారి పదోన్నతులు ఆగిపోవడంతోపాటు.. నేరుగా ఏఈలుగా ఉద్యోగాలు పొందాల్సిన వారికి ఉద్యోగాలు రాకపోవడంతో నిరుద్యోగులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెక్‌పవర్ కూడా కొసాగిస్తున్నారు...

సూపర్ న్యూమరీ పోస్టుల్లో కొనసాగే వారికి వాస్తవంగా చెక్‌పవర్‌తోపాటు అడ్మినిస్ట్రేషన్‌లో నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండదు. కానీ ప్రస్తుతం పదవీ విరమణ పొంది తిరిగి అదే పదవిలో కొనసాగుతూ చెక్‌పవర్‌ను, అడ్మినిస్ట్రేషన్‌లో నిర్ణయాలను తీసుకుంటూ తమ హోదాతోపాటు, అధికారాలను కొనసాగించుకుంటున్నారు. దీంతో పదోన్నతులు పొందాల్సిన వారు, ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పదవీ విరమణ చేసిన తరువాత వారు తిరిగి అదే పదవుల్లో కొనసాగుతుండటంతో తమకు పదోన్నతులు రావడం లేదని, వీటిని ఆపేలా చూడాలని కోరుతూ కొందరు ఇంజనీర్లు ఉమ్మడి హైకోర్టును సైతం ఆశ్రయించారు. ప్రస్తుతం కేసు కోర్టులో కొనసాగుతోంది.

పదవీ విరమణ చేసిన వారిని కొనసాగించొద్దు: శ్యాం సుందర్

పదవీ విరమణ చేసిన వారు తిరిగి అదే పదవుల్లో కొనసాగుతుండటంతో పదోన్నతులు రావడం లేదని, వారిని తిరిగి అదే పదవుల్లో కొనసాగించవద్దని తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్ సివిల్ ఇంజనీర్స్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు శ్యాం సుందర్ కోదాటి డిమాండ్ చేశారు. రిటైర్ అయిన వారిని తిరిగి అదే పదవిలో కొనసాగిస్తుండటంతో ఫీడర్ క్యాడర్‌కు పదోన్నతులు రాకుండా అన్యాయం జరుగోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కొనసాగింపును రద్దు చేసేలా చూడాలని కోర్టులో ప్రజా ప్రయోజనవ్యాజ్యం వేశామన్నారు. ఇరిగేషన్ శాఖలోని ఈన్‌సీ గత 7 సంవత్సరాలుగా కొనసాగుతున్నారని, పంచాయితీరాజ్ శాఖలో ఈఎన్‌సిగా ఉన్నవారు, ఆర్‌డబ్ల్యూఎస్‌లో ఈఎన్‌సి కూడా తిరిగి కొనసాగుతున్నారని అన్నారు. ఆర్ అండ్ బి ఇలా దాదాపు అన్ని శాఖల్లోనూ వీరు కొనసాగుతున్నారని అన్నారు. కొనసాగింపు కూడా అందరినీ కాకుండా ఒకటి, రెండు సామాజిక వర్గాలకు చెందిన వారినే కొనసాగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం వారిని కొనసాగించాలి అనుకుంటే అందరినీ కొనసాగించేలా చూడాలన్నారు. అదే విధంగా పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు పొడిగించాలని డిమాండ్ చేశారు.



ఎస్‌బీఐ గృహ రుణాలపై వడ్డీ రేటు తగ్గింపు

● బేస్ రేటు 0.3 శాతం తగ్గింపు ● ప్రాసెసింగ్ రుసుము ఎత్తివేత బేస్ రేటు తగ్గింపుతో 80 లక్షల కస్టమర్లకు లబ్ది



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగానికి చెందిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కొత్త సంవత్సరం కానుకగా కొత్తగా గృహాలు కొనుగోలు చేసే వారికి ప్రాసెసింగ్ రుసుమును మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది మరో మూడు నెలల పాటు పొడిగిస్తున్నట్లు తెలిపింది. దీంతో పాటు బెంచ్‌మార్కు ప్రైమ్ లెండింగ్ (బీపీఎల్ఆర్)ను 30 బేసిస్ పాయింట్లు తగ్గించినట్లు ప్రకటించింది. దీని వల్ల సుమారు 80 లక్షల మంది కస్టమర్లకు లబ్ది చేకూరుతుందని .. జనవరి 1, 2018 నుంచి అమల్లోకి వచ్చిందని ఎస్‌బీఐ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇదిలా ఉండగా ఎస్‌బీఐ గృహ, ఆటో రుణాలపై వడ్డీరేట్లను నవంబర్ 2017లో కూడా ఒకసారి తగ్గించింది.

ఎస్‌బీఐ సోమవారం నాడు విడుదల చేసిన ప్రకటనలో కొత్తగా గృహాలు కొనుగోలు చేసే వారికి ప్రాసెసింగ్ రుసుమును మార్చి 31, 2018 వరకు ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో పాటు ఇతర కస్టమర్లు తమ రుణాలను ఎస్‌బీఐకి మార్చుకోవాలనుకునే వారికి కూడా ఇది వర్తిస్తుందని.. గతంలో దీనికి డిసెంబర్ 31, 2017 వరకు డెడ్‌లైన్ విధించింది. దీన్ని మార్చి 31, 2018 వరకు పొడిగించింది.

దీర్ఘకాలంగా తమపై నమ్మకంగా ఉన్న కస్టమర్లకు కొత్త సంవత్సరం కానుకగా బేస్ రేటు ఆధారిత రుణం ద్వారా ప్రస్తుతం బేస్‌రేటును 30 బేసిస్ పాయింట్లు తగ్గించినందు వల్ల సుమారు 80 లక్షల మంది కస్టమర్లు లబ్ది పొందుతారని ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్ పీకె గుప్తా చెప్పారు. ఇంతకు ముందు ఎస్‌బీఐ గృహ రుణాలపై వడ్డీరేటును 8.30 శాతం ప్రకటించింది. రూ.30 లక్షల వరకు వేతన కస్టమర్లు అర్హులని ప్రకటించింది.

ఈ ఏడాదీ వృద్ధిరేటు జోరు!

ముడి చమురు, ద్రవ్యోల్బణమే విలన్‌లు

న్యూఢిల్లీ : కొత్త సంవత్సరం 2018లో ఇప్పటికే అడుగు పెట్టేసాం... ఈ ఏడాది మొత్తానికి చూస్తే స్థూల దేశీయోత్పత్తి లేదా జీడీపీ పుంజుకుంటుంది. ఎందుకంటే పెద్దనోట్ల రద్దు ప్రభావంతో పాటు వస్తుసేవల పన్ను (జీఎస్టీ) నుంచి క్రమంగా బయటపడ్డాం. అయితే ముడి చమురు ధరలు, రిటైల్ ద్రవ్యోల్బణం రెండు వృద్ధిరేటు జోరుకు అడ్డంకిగా మారనున్నాయి.

2017 సంవత్సరంలో వృద్ధిరేటుకు పెద్దనోట్ల రద్దు, జీఎస్టి రెండు అడ్డంకిగా మారాయని ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు. ఈ రెండు అంశాలు కలిసి జీడీపీపై రెండు శాతం వరకు ప్రభావం చూపించాయి. పక్కాగా చెప్పాలంటే 2015-16 ఆర్థికసంవత్సరం జీడీపీ రూ.152.51 లక్షల కోట్లతో పోల్చుకుంటే సుమారు రూ.3.05 లక్షల కోట్ల వరకు ప్రభావం చూపించింది. ఇప్పటికి గడ్డు పరిస్థితుల నుంచి గట్టెక్కాం.. క్రమంగా ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతోంది. 2015-16 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు 9 శాతంగా నమోదైతే అదే 2017-18 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో అత్యల్పంగా 5.7 శాతంగా నమోదైంది.



అటు తర్వాత జులై - సెప్టెంబర్ త్రైమాసికంలో 6.3 శాతంగా నమోదై కాస్తా కోలుకుంది. జీడీపీ వృద్ధిరేటు పెరగాలంటే.. ఎగుమతులు సానుకూలంగా ఉండాలి.. అదే సమయంలో దిగుమతులు అతి తక్కువగా ఉంటేనే జీడీపీ వృద్ధిరేటు పెరుగుతుంది.

ప్రధానమంత్రి నవంబర్ 8, 2016న పెద్దనోట్ల రద్దు చేయడంతో పాటు జులై 1 నుంచి వస్తు సేవల బిల్లును అమల్లోకి తెచ్చారు. దీంతో పాటు ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ కోడ్ (ఐబీసీ)ని తీసుకొచ్చారు. అదే సమయంలో పీఎస్‌యు బ్యాంకుల్లో పేరుకుపోయిన మొండిబకాయిలతో సతమత మవుతున్నాయి. వాటి బ్యాలెన్స్‌షీట్లను బలోపేతం చేయడానికి కొత్తగా మూలధనం సమకూరుస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కాగా ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల వల్ల స్వల్ప కాలికానికి ఆర్థిక వ్యవస్థ కాస్తా వ్యతిరేక ప్రభావం చూపించినా.. దీర్ఘకాలంలో దాని ఫలాలు కనిపిస్తాయి.

కాగా రేటింగ్ ఏజెన్సీ మూడీస్ సావరిన్ రేటింగ్‌ను స్వల్పంగా బీఏఏ2కు పెంచింది. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా మెరుగుపడుతుందని గత ఏడాది నవంబర్‌లో పేర్కొంది. ప్రపంచబ్యాంకు కూడా ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో 30 స్థానాలు ముందుకు జరిపి 100వ స్థానికి తీసుకొచ్చింది. భారత ఆర్థిక వ్యవస్థకు గడ్డు కాలం ముగిసిపోయిందని, వచ్చే నాలుగు నుంచి ఆరు త్రైమాసికాల్లో వృద్ధిరేటు క్రమంగా పుంజుకుని సాధారణ స్థితికి చేరుతుందని స్టాండర్డ్ చార్టర్డ్ ఎకనమిక్ ఔట్‌లుక్ 2018 నివేదికలో పేర్కొంది. అయితే భారత ఆర్థిక వ్యవస్థ ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 13 త్రైమాసికాలకనిష్ఠానికి 5.7 శాతానికి దిగిరాగా.. సెప్టెంబర్ త్రైమాసికంలో కాస్తా పుంజుకుంది. రాబోయే త్రైమాసికాల్లో వృద్ధిరేటు 7 శాతానికి ఎగబాకవచ్చు.

నోమురా నివేదిక ప్రకారం చూస్తే జనవరి - మార్చి త్రైమాసికంలో వృద్ధిరేటు క్రమంగా పుంజుకుంటుందని, 2018లో జీడీపీ వృద్ధిరేటు 7.5 శాతంగా నమోదవుతుందని పేర్కొంది.

ఒకభారత్ వృద్ధిరేటు విషయానికి వస్తే ప్రపంచదేశాలతో పోటీ పడి వృద్ధిరేటులో దూసుకుపోతోంది. అయితే 2017లో మాత్రం ఆ రోజు కొనసాగించలేకపోయింది. దీనికి ప్రధాన కారణం పెద్దనోట్ల రద్దుతో పాటు జీఎస్టి రెండు వృద్ధిరేటుకు అడ్డంకిగా మారాయి. ప్రస్తుతం ఇవి తొలగిపోయాయి కాబట్టి వృద్ధిరేటు జోరందుకుంటుంది. జీడీపీ వృద్ధిరేటు 7.5 శాతానికి చేరాలంటే కొన్ని సంవత్సరాల పాటు వేచి చూడాల్సి ఉంటుంది. కాగా మార్చి 2016తో ముగిసిన కాలానికి భారత్ వృద్ధిరేటు 7.9 శాతంగా మారిపోయింది. దీనికి ప్రధాన కారణం ప్రైవేటు పెట్టుబడులు పెరగడం.. ప్రస్తుతం వృద్ధిరేటు పెరగకపోవడానికి ప్రధాన కారణం ప్రైవేటు పెట్టుబడులు మందగించడమే.

ముడి చమురు ధరలతో ఇబ్బందులు : గత మూడు నెలల నుంచి ముడి చమురు ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ఆగస్టు నుంచి చూస్తే 28 శాతం పెరిగాయి. పీపా 52.3 డాలర్ల నుంచి ప్రస్తుతం 67 డాలర్లు పెరిగింది. ఇటీవల కాలంలో చూస్తే ద్రవ్యోల్బణం క్రమంగా పెరుగుతూపోతోంది. ముడి చమురు ధరలు పెరగడంతో కరెంటు ఖాతాలోటు పెరిగిపోతుంది. భారత్ లాంటి దేశం ఎక్కువగా ముడిచమురు దిగుమతులపైనే ఆధారపడుతున్న విషయం తెలిసిందే.

ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీన బడ్జెట్‌ను ఆర్థికమంత్రి పార్లమెంటులో సమర్పిస్తారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్‌లో పెద్దెత్తున కసరత్తు చేయాల్సి వస్తుంది. ముఖ్యంగా ఉద్యోగాలు సృష్టించడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ద్రవ్యలోటు విపరీతంగా పెరవగిపోవడంతో అదనంగా నిధులు సమకూర్చుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వానికి జీఎస్టి ద్వారా వచ్చే వసూళ్లు బాగా తగ్గిపోతున్నాయి.

ఇదిలా ఉండగా వచ్చే ఏడాది జాతీయ ఎన్నకలు రాబోతున్నాయి. మోడీ సర్కార్ తిరిగి ప్రజాకర్షక బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందా అనేది అందరు అడుగున్న ప్రశ్న. పెద్దమొత్తంలో సబ్సిడీలు ఇస్తారా అనేది చూడాల్సి ఉంటుంది. ప్రభుత్వం వృద్ధిరేటును పెంచుకుంటూనే ఆర్థిక వ్యవస్థను ఎలా సుస్థిరంత చేస్తుందో వేచి చూడాల్సిందే. ప్రస్తుతం ప్రభుత్వం జీఎస్టికి సంబంధించిన సమస్యలు పరిష్కరించడంతో తలమునకలవుతోంది. జీఎస్టి రేట్లు సంక్లిష్టంగా ఉండటంతో వాటిని సరళతరం చేస్తోంది. దీంతో ప్రభుత్వానికి ఆదాయం గండిపడుతోంది. మరో వైపుబ్యాంకుల్లో పేరుకుపోయిన మొండిబకాయిల వసూళ్లు ఐబీసీ కోడ్‌ను వినియోగించి బకాయిలను రాబట్టే కార్యక్రమంలో ఉంది. దీంతో పాటు బ్యాంకులకు మూలధనం సమకూరుస్తామని ప్రకటించింది. ఇవన్నీ దాటుకుంటూ ప్రభుత్వం ఈ ఏడాది వృద్ధిరేటును ఏ స్థాయిలో తీసుకుపోతుందో వేచి చూడాల్సిందేనని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

బంధన్ బ్యాంకు ఐపీవో ఆఫర్ 11.9కోట్ల షేర్ల అమ్మకానికి

కోలకతా : కోలకతా ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న బంధన్ బ్యాంకు సోమవారం నాడు సెబికి రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ముసాయిదాను ఐపీవోకోసం అందజేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం ఐపీవో ద్వారా మొత్తం 11.9 కోట్ల షేర్లను విక్రయిస్తుంది. బ్యాంకు ఒక ప్రకటనలో రూ.10 ముఖ విలువ కలిగిన మొత్తం 119,280,494 షేర్లను విక్రయానికి పెడుతున్నట్లు ప్రకటించింది. ఈ ఐపీవోలు 97,663,910 ఈక్విటి షేర్లను ఐపీవో ద్వారా, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 14,050,780 ఈక్విటి షేర్లను 7,565,804 ఈక్విటీ షేర్లు ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ విక్రయి స్తున్నట్లు బంధన్ బ్యాంకు ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ షేర్లు బీఎస్ఈతో పాటు ఎన్ఎస్ఈలో లిస్ట్ అవుతాయి.

మార్కెట్ల నుంచి గతేడాది రూ.1.6 లక్షల కోట్లు సేకరణ

న్యూఢిల్లీ: గతేడాది కంపెనీలు స్టాక్ మార్కెట్ల నుంచి ఐపీవో, క్యూఐపీల ద్వారా మొత్తం రూ.1,61,116 కోట్లు సేకరించాయి. గతంలో ఏ కేలండర్ సంవత్స రంలో ఇంత పెద్దమొత్తంలో కంపెనీలు నిధులు సేకరించలేదని ప్రైమ్ డేటాబేస్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. 2010లో అత్యధికంగా రూ.97,743 కోట్లు సేకరించిన తర్వాత ఇంత పెద్దమొత్తంలో 2017లో కంపెనీలు సేకరించాయని ప్రైమ్ డేటాబేస్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రణవ్ హల్దియా చెప్పారు.

నిధులు సేకరించడానికి 2018 కూడా ఆశాజనకంగా ఉంటుందని, ఈఏడాది మొత్తం 15 కంపెనీలు ఐపీవోకు రానున్నాయి. సెబి నుంచి అనుమతులు రావాల్సి ఉందని ఈ కంపెనీలు మొత్తం రూ.12వేల కోట్ల వరకు సేకరిస్తాయి. వీటితోపాటు మరో పది కంపెనీలు సుమారు రూ.19వేల కోట్ల వరకు నిధులు సేకరిస్తాయని హల్దియా తెలియజేశారు. ఐపీవోకు గతేడాది బాగా కలిసొచ్చిందని మొత్తం రూ.68,826 కోట్లు సేకరిస్తే 2010లో రూ.37,535 కోట్లు కంపెనీలు సేకరించాయి. 36 ప్రధానకంపెనీలు ఐపీవోకు వచ్చి మొత్తం రూ.67, 147 కోట్లు సేకరించాయి. వాటిలో అత్యధికంగా రూ.11,257 కోట్లుసేకరిం చాయి. మొత్తానికి ఐపీవో లకు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని నివేదికలో పేర్కొంది. కోచిన్ షిప్‌యార్డుకు 19.42 లక్షల దరఖాస్తులు వస్తే, హడ్కోకు 18.74 లక్షల దరఖాస్తులు వచ్చాయి. కాగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ఎన్‌టీపీసీలో రూ.9,192 కోట్లు సేకరించింది. బీఈఎల్ రూ.1687 కోట్లు సేకరించింది. అలాగే క్యూఐపీ రూట్‌లో 44 కంపెనీలు రూ.61,118కోట్ల వరకు సేకరించాయి. గతేడాది ఎస్‌బీఐ రూ.15,000కోట్లు క్యూఐపీ ద్వారా సేకరించింది. మొత్తం క్యూఐపీ ద్వారా సేకరించిన మొత్తంలో ఇది 25 శాతం వరకు ఉంటుది. రెండు కంపెనీలు ఐపీపీ రూట్‌లో రూ.4,668 కోట్లు సేకరించాయి. గతేడాది ప్రభుత్వరంగానికి చెందిన కంపెనీలు రూ.73,282 కోట్లు సేకరించాయని నివేదికలో వివరించాయి.ప్రభుత్వరంగానికి చెందిన కంపెనీలు ఐపీవోకు వచ్చినవి ఇలా ఉన్నాయి. హడ్కో, కోచిన్ షిప్‌యార్డు, జీఐసీ, న్యూ ఇండియా ఎష్యూరెన్స్‌లు కాగా ఓఎఫ్ఎస్ ద్వారా ఎంఓఐఎల్, బీఈఎల్, నాల్కో, ఆర్‌సీఎఫ్ఎల్, ఎన్ఎఫ్ఎల్, హెచ్‌సీఎల్, ఎన్‌టీపీసీ, ఎన్ఎల్‌సీలు మొత్తం రూ.33,418 కోట్లు సేకరించాయి. దీంతో పాటు ఈటీఎఫ్ ద్వారా రూ.23వేల కోట్లు సేకరించాయి. (ఎస్‌యూ యూటీఐ) ద్వారా ఎల్అండ్‌టి, ఐటీసీల్లో వాటాల అమ్మకాలు ద్వారా రూ.10,844 కోట్లు సేకరించాయి. బైబ్యాక్‌ల ద్వారా ఎన్‌హెచ్‌పీసీ, ఎన్ఎల్‌సీ, ఓఐఎల్, భారత్ డైనమిక్స్‌ల ద్వారారూ.5,627 కోట్లు సేకరించాయి. ఉద్యోగులకు వాటాలు విక్రయించి రూ.394 కోట్లు సేకరించాయని ప్రైమ్‌డేటా బేస్ నివేదికలో పేర్కొంది.



ఆన్‌లైన్‌లో విక్రయించే వస్తువులపై నేటి నుంచి ఎంఆర్‌పీ వివరాలు

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ వినియోగదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కేంద్రప్రభుత్వం సోమవారం నుంచి ఈ- కామర్స్ కంపెనీలు విక్రయించే వస్తువులపై గరిష్ఠ ధర (ఎంఆర్‌పీ)ని ముద్రించి విక్రయించాలని, దీంతో పాటు ఎక్స్‌పైరీ తేదీతో పాటు కస్టమర్ కేర్ వివరాలు ముద్రించాలని ఆదేశాలు జారీ చేసింది. వినియోగదారుల మంత్రిత్వశాఖ గత ఏడాది జూన్‌లో తూనికలు కొలతలు (ప్యాకేజ్డ్ కమాడిటీస్) చట్టాన్ని సవరించింది. కంపెనీలకు ఆరు నెలల గడువు ఇచ్చింది. కాబట్టి కొత్త నిబంధనలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయి. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు తూనికలు కొలతల చట్టం 2011లో సవరణలు చేయడం జరిగిం ది. జనవరి 1,2018 నుంచి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమల్లోకి వచ్చిందని వినియోగదారుల మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. కొత్త నిబంధనల ప్రకారం ఈ-కామర్స్ ఫ్లాట్‌ఫాంపై వస్తువులు విక్రయించే కంపెనీలు కొత్త నిబంధలన ప్రకారం వస్తువుల పూర్తి వివరాలు ఇవ్వాల్సి ఉంటుం ది. వాటిలో ఎంఆర్‌పీ, తయారీతేదీ, ఎక్స్‌పైరీ తేదీ, నికరంగా క్వాంటిటి, (బరువు) ఏ దేశంలో ఉత్పత్తి అయ్యింది. లేబుల్‌పై కస్టమర్ కేర్ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. వస్తువుపై ముద్రించే లేబుల్ వినియోగదా రుడు తేలికగా చదువుకొనేలా ఉండాలని మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. దీంతో పాటు వస్తువుపై బార్‌కోడ్ / క్యూఆర్ కోడింగ్‌ను స్వచ్ఛంగా ప్రకటించు కోవాలనుకుంటే ఇవ్వవచ్చు నని తెలిపింది. వైద్య పరిక రాలను ఔషధాల క్రిందికి తీసుకొచ్చింది, ఈ నిబంధనలు ఔషధానికి వర్తిస్తాయని ప్రకటనలోపేర్కొంది. ప్రస్తుతం ఆన్‌లైన్ విక్రయించే వస్తువులపై ఎంఆర్‌పీ మాత్రమే ముద్రిస్తున్నారు. ఆన్‌లైన్ విక్రయించే వస్తువులపై పూర్తి సమాచారం ఇవ్వడం లేదని వినియోగదారుల నుంచి పెద్దెత్తున ఫిర్యాదులో రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ ఇండియా, స్నాప్‌డీల్, గ్రోఫెర్స్, బిగ్‌బాస్కెట్ లాంటి దేశంలో ఈ -కామర్స్ కంపెనీలు నిర్వహిస్తున్నాయి.

మొదటి రోజే నీరసం!

● 244 పాయింట్లు పతనం ● లాభాలు స్వీకరించిన మదుపరులు


ముంబై: స్టాక్ మార్కెట్లకు మొదటి ట్రేడింగ్ రోజు పెద్దగా కలిసిరాలేదు. చివరి గంటలో మదుపరులు ఆటో, బ్యాంకింగ్, ఐటి రంగానికి చెందిన షేర్లు విక్రయించడంతో సెన్సెక్స్ 244 పాయింట్ల వరకు పతనం అయ్యింది. సూచి ఒక నెలలో ఈ స్థాయిలో పడిపోవడం ఇదే మొదటిసారి. సూచిలు రికార్డుస్థాయికి చేరడంతో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. క్రమంగా ముడిచమురు ధరలు పెరగడంతో ద్రవ్యలోటు విపరీతంగా పెరిగిపోవడం, గ్లోబల్ మార్కెట్ల నుంచి అనుకూలమైన సంకేతాలు వెలువడక పోవడం.. గ్లోబల్ మార్కెట్లో కొత్త సంవత్సరం సెలవులు ఇంకా కొనసాగుతు న్నాయి. ఇక దేశీయ స్టాక్ మార్కెట్ల విషయానికి వస్తే సెన్సెక్స్ అత్యల్పంగా 33,766.15 పాయింట్లకు దిగివచ్చి మార్కెట్ ముగిసే నాటికి సూచి 244.08 పాయింట్లు లేదా 0.72 శాతం నష్టపోయి 33,812.75 వద్ద ముగి సింది. డిసెంబర్ 1 తర్వాత ఈ స్థాయిలో సూచి క్షీణించడం ఇదే మొదటి సారి. గత శుక్రవారం నాడు సూచి ఆల్‌టైం రికార్డు స్థాయికి 34,056.83 వద్ద ముగిసింది, నిఫ్టీ విషయానికి వస్తే 10,500 మార్కుకంటే కిందికి దిగివచ్చింది. 95.15 పాయింట్లు క్షీణించి 10,423.10 మార్కుకు దిగి చివరకు 10,435.55 వద్ద స్థిరపడింది. స్టాక్ మార్కెట్లు సోమవారం ఉదయం నుంచే ట్రేడింగ్ బలహీనంగా మొదలైంది. పరిమిత స్థాయిలో ట్రేడింగ్ కొనసాగింది. అయితే చివరి గంటలో అమ్మకాల ఒత్తిడి విపరీతంగా పెరిగిపోయిందని బ్రోకర్లు చెబుతున్నారు. మదుపరులు ఎక్కువగా క్యాపిటల్ గూడ్స్, రియల్టీ, హెల్త్‌కేర్, కన్స్యూమర్ డ్యూరబుల్ రంగానికి చెందిన షేర్లు కొనుగోలు చేయడంతో సూచి మరింత పతనం కాకుండా కాపాడా యని వారు చెబుతున్నారు. సెన్సెక్స్ లో అత్యధికంగా టీసీఎస్ 1.69 శాతం నష్టపోయింది. తర్వాత స్థానం ఇండస్‌ఇండ్ బ్యాంకు 1.45 శాతం, హిందుస్తాన్ యూనీలీవర్ 1.40 శాతం వరకు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. వీటితో పాటు నష్టపోయిన షేర్లు ఇలా ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, టాటాస్టీల్, ఓఎన్‌జీసీ, అదానీపోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ, కొటక్ బ్యాంకు, ఎస్ బ్యాంకులు 1.35 శాతం వరకు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. ఆటో రంగానికి చెందిన టాటామోటార్స్, బజాజ్ఆటో, ఎంఅండ్ఎం, మారుతి సుజుకి, హీరోమోటోకార్ప్ షేర్లు కూడా అమ్మకాల ఒత్తిడికి గురై.. 1.35 శాతం వరకు నష్టపోయాయి. డిసెంబర్ అమ్మకాలు ఇన్వెస్టర్లను పెద్దగా మెప్పించలేకపోయాయి. అమెరికా చమురు ధరలు పీపా మొట్ట మొదటిసారి 60 డాలర్లు పెరిగింది. బ్రెంట్ నార్త్ సీ క్రూడ్ మార్చి డెలివరీ శుక్రవారం నాడు 66.87 డాలర్ల వద్ద ముగిసింది. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే ఆసియాతో పాటు యూరోప్ మార్కెట్లకు కొత్త సంవత్సరం సందర్భంగా అక్కడి మార్కెట్లకు సెలవు.

రూపాయి స్ట్రాంగ్ : కొత్త సంవత్సరంలో డాలర్ మారకంతో రూపాయి బలపడింది. ఫారెక్స్ మార్కెట్లో సోమవారం నాడు 19 పైసలు లాభపడి 63.63 వద్ద ముగిసింది.



కెనెరాబ్యాంకు ఎంజె మార్కెట్లో శాఖలో పని చేస్తున్న వై అరుణారెడ్డి, గ్రూపు 1 కేటగిరిలో ఎంపీడీఓగా ఎంపికయ్యారు. ఆమెకు ప్రభు త్వం ఘట్కేసర్ ఎంపీడీఓ బాధ్యతలు అప్పగించింది. బ్యాంకు సోమవారం నాడు బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా సీనియర్ మేనేజర్ ఈ నాగేంద్రకుమార్‌తో పాటు బ్యాంకు సిబ్బంది ఇసాక్, కెవీ ప్రసాద్, కాంతాకుమారి, పద్మావతి, జా ఇందిర, శేఖర్, నారాయణ, నిహారికా, సునీల్, క్రాంతి తదితరులు ఆమెను ఎంజే బ్యాంకు బ్రాంచీలో సన్మానించారు.

మారుతి, హోండాలు కార్ల అమ్మకాలు భేష్



న్యూఢిల్లీ : ఆటో దిగ్గజాలు మారుతి సుజుకి ఇండియా, హోండాకార్స్ ఇండియాలు గత నెలలో అమ్మకాలు భారీగా పెంచుకున్నాయి. డిసెంబర్ అమ్మకాలు రెండంకెలకు చేరాయి. దీనికి వ్యతిరేకంగా హ్యుందాయ్ అమ్మకాలు స్వల్పంగా పెరిగాయి. మహీంద్రా అండ్ మహీంద్రా అమ్మకాలు మాత్రం 7 శాతం క్షీణించాయి. వివరాల్లోకి వెళితే మారుతి సుజుకి దేశీయ మార్కెట్లో 1,19,2866 యూనిట్లు విక్రయించింది. క్రితం ఏడాది డిసెంబర్ 1,06,414 యూనిట్లతో పోల్చుకుంటే 12.1 శాతం పెరిగింది. స్విఫ్ట్, డిజైర్, బలేరో అమ్మకాలు 23.2 శాతం పెరిగాయి. ఇక హోండా కార్స్ లిమిటెడ్ డిసెంబర్ అమ్మకాల్లో 26 శాతం పుంజుకున్నా యి. 12,642 యూని ట్లు విక్రయి స్తే.. క్రితం ఏడాది ఇదే నెలలో 10,071 యూనిట్లు విక్రయించింది. హ్యుందాయ్ మో టార్ ఇండియా అమ్మకాలు మాత్రం స్వల్పంగా పెరిగాయి. డిసెంబర్‌లో 40,158 యూనిట్లు విక్రయిస్తే క్రితం ఏడాది 40,057 యూనిట్లు విక్రయించింది. ఎంఅండ్ఎం ప్యాసిజర్ కార్ల విషయానికి వస్తే 7 శాతం క్షీణించి 15,543 యూనిట్లు విక్రయిస్తే.. క్రితం ఏడాది 16,799 యూనిట్లు విక్రయించింది. ద్విచక్ర వాహనాల విషయాని కొస్తే టీవీఎస్‌మోటార్ కంపెనీ డిసెంబర్ అమ్మకాల్లో 39 శాతం వృద్ధితో 2,56,909 యూనిట్లు విక్రయిస్తే క్రితం ఏడాది ఇదే నెలలో 1,89,944 యూ నిట్లు విక్రయించింది.

మౌలికం జోరు..

నవంబర్‌లో 6.8 శాతం


న్యూఢిల్లీ : కీలకమైన ఎనిమది మౌలికరంగాలు నవంబర్‌లో ఏకంగా 13 నెలల గరిష్ఠానికి ఎగబాకాయి. ముఖ్యంగా ఉక్కు, సిమెంట్, రిఫైనరీ ఉత్పత్తులు జోరందుకోవడంతో నవంబర్ నెలలో మౌలికరంగం 6.8 శాతం వృద్ధిరేటును సాధించింది. చివరగా ఈ స్థాయిలో అక్టోబర్ 2016లో 7.1 శాతం వృద్ధి నమోదైంది. ఉక్కు, సిమెంట్ ఉత్పత్తి రెండంకెలకు చేరుకోవడంతో దాని ప్రభావం మొత్తం ఎనిమిది కీలరంగాలపై కనిపించింది. బొగ్గు, ముడి చమురు, సహజవాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, విద్యుత్, ఉక్కు, సిమెంట్ రంగాల గణాంకాలను సోమవారం నాడు ప్రభుత్వం విడుదల చేసింది. సిమెంట్ రంగం 17.3 శాతం వృద్ధిని సాధిస్తే అంతకు ముందు అక్టోబర్‌లో 1.3 శాతం క్షీణించింది. ఉక్కురంగం నవంబర్‌లో 16.6 శాతం వృద్ధి సాధిస్తే.. అక్టోబర్‌లో 8.4 శాతమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది. దీని బట్టి చూస్తే ఉక్కు, సిమెంట్ రంగాలు ఆటో, క్యాపిటల్‌గూడ్స్‌తో పాటు నిర్మాణరంగం పుంజుకోవడానికి ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వం పెద్దమొత్తంలో ఈ రంగాలపై వ్యయం చేయడమే కారణమని కేర్ రేటింగ్‌కు చెందిన ప్రధాన ఆర్థికవేత్త మదన్ సబ్‌నావీస్ చెప్పారు. దీన్ని బట్టి చూస్తే నవంబర్ పారిశ్రామికోత్పత్తి గణాంకాలు అనుకూలంగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయి. 2017 నవంబర్‌లో ఐఐపీ 5-6 శాతం మధ్యలో నమోదు అయ్యే అవకాశాలున్నాయి. పెద్దనోట్ల రద్దు ప్రభావం పూర్తిగా సమసిపోయినట్లేనని భావించాల్సి వస్తుందని, ఈ ఆర్థికసంవత్సరం మిగిలిన నెలల్లో వివిధ రంగాల్లో వృద్ధిరేటు పుంజుకుంటుందని ఇక్రా ప్రిన్సిపల్ ఆర్థికవేత్త, ఆదితి నయ్యర్ చెప్పారు. మొత్తానికి క్యూ3లో తయారీరంగం పుంజు కుంటుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బొగ్గు ఉత్పత్తి నవంబర్‌లో -0.2 శాతంగా నమోదైంది. ఇదే రంగం ఆగస్టులో 15.4 శాతం వృద్ధి కనిపిస్తే.. సెప్టెంబర్‌లో 10.4 శాతం, అక్టోబర్‌లో 3.9 శాతంగా నమోద య్యాయి. విద్యుత్ రంగం నవంబర్‌లో 1.9 శాతానికి దిగిరాగా.. అక్టోబర్‌లో 3.2 శాతం, ఎరువుల రంగం మరింత తగ్గి 0.3 శాతానికి దిగిరాగా.. క్రితం ఏడాది 3 శాతంగా నమోదైంది. రిఫైనరీ ఉత్పత్తులు 8.2 శాతంగా కాగా.. అక్టోబర్‌లో 7.5 శాతం, సహజవాయువు రంగం కూడా కాస్తా నెమ్మదించి 2.4 శాతానికి దిగి రాగా క్రితం ఏడాది 2.8 శాతం, ముడి చమురు ఉత్పత్తి 0.2 శాతం పెరగ్గా.. క్రితం ఏడాది 0.4 శాతం క్షీణించిం ది. ప్రభుత్వం వృద్ధిరేటుకు పెద్దపీట వేస్తున్నందున కన్స్యూమర్ గూడ్స్ డిమాండ్ పెరిగితే.. పారిశ్రామి కోత్పత్తి రంగం మరింత పుంజుకుంటుదని సబ్‌నావీస్ చెప్పారు.

S & D

మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం

రామచంద్రాపురం, ప్రభ న్యూస్ : మూడు సంవత్సరాల చిన్నారిని ఇంటి నుంచి ఎత్తుకెళ్లి అత్యాచారానికి పాల్పడిన దారుణ సంఘటన రామచంద్రాపురంలో జరిగింది. రామచంద్రాపురం సీఐ భాస్కర్ వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం రామచంద్రాపురంలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో నివాసముంటున్నారు. తండ్రి పటాన్‌చెరు పారిశ్రామిక వాడలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం తల్లి కూరగాయల కోసం కుమార్తెను ఇంటివద్దనే వదిలి వెళ్ళింది. తల్లి ఇంటికి వచ్చి కూతురు కోసం వెతికినా ఆచూకి తెలియకపోవడంతో రామచంద్రాపురం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో భెల్ ఆర్టీసీ డిపో సమీపంలోని పొదల్లోంచి చిన్నారి అరుపులు వినిపించాయి. ఈ విషయాన్ని ఒక ఆర్టీసీ డ్రైవర్ పోలీసులకు సమాచారమందించాడు. పోలీసులు అక్కడికి చేరుకొని పాపను తీసుకువస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, చిన్నారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి ఆ వ్యక్తిని విచారించారు. పోలీసుల విచారణలో అతనే ఆ చిన్నారిపై అత్యాచారం చేసినట్లు తేలింది. నిందితుడు అమీన్‌పూర్ పంచాయతీ పరిధిలోని ఇసుక బావి నివాసి పీ. శ్రీనివాస్ (48)గా గుర్తించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా టిక్కెట్ల ధరల నిర్ణయ కమిటీనుంచి నిర్మాతలను తొలగించాలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సినిమా టిక్కెట్ల ధరల నిర్ణయ కమిటీ నుంచి నిర్మాతలు, ఫిలిం ఛాంబర్ సభ్యులు దగ్గుపాటి సురేష్‌బాబు, సి.కళ్యాణ్‌లను తొలగించాలని అభ్యర్థిస్తూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. ఈ వ్యాజ్యాన్ని అఖిల భారత సినీ ప్రేక్షక వినియోగదారుల సంఘం అధ్యక్షుడు జి.ఎల్.నర్సింహారావు దాఖలు చేశారు. 2016 అక్టోబర్‌లో హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ప్రభుత్వం ఒక కమిటీని వేస్తూ జీవో 44ను మార్చి24, 2017న జారీ చేసిందని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ జీవోలో సినీ నిర్మాతలు ఫిలిం ఛాంబర్ సభ్యులుగా ఉన్న దగ్గుపాటి సురేష్, సి.కళ్యాణ్‌లను సభ్యులుగా చేర్చడం అక్రమమన్నారు. ప్రేక్షకుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోర్టు చెప్పినా దానికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. కొత్త సినిమా రిలీజైన రెండు వారాల వరకు టిక్కెట్ల ధరలను భారీగా పెంచి ప్రేక్షకులను నిలువు దోపిడీ చేస్తున్నారని, ధరల నిర్ణయ కమిటీలో నిర్మాతలే సభ్యులు కావడం వల్ల నిందితుడు తీర్పును తానే రాసుకున్నట్లు ఉంటుందన్నారు. గత కేసుల వివరాలు కోర్టుకు చెప్పకుండా తప్పుదారి పట్టించి తమకు అనుకూలంగా ఉత్తర్వులు పొందుతున్నారన్నారు. కమిటీలో సురేష్‌బాబు, కళ్యాణ్‌ను తొలగించి హోంశాఖ, సినిమాటోగ్రఫీ శాఖ ముఖ్య కార్యదర్శిని సభ్యునిగా చేర్చాలని ఆదేశించాలని పిటిషనర్ అభ్యర్థించారు. ఈ వ్యాజ్యంలో ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోంశాఖ, సినిమాటోగ్రఫీ ముఖ్యకార్యదర్శి, న్యాయశాఖ ముఖ్యకార్యదర్శి తెలంగాణ హోంశాఖ, సినిమాటోగ్రఫీ ముఖ్యకార్యదర్శి, సురేశ్ కళ్యాణ్‌లను చేర్చారు.

ఆస్పత్రుల్లో సంస్కరణలకు శ్రీకారం

- రాష్ట్రవ్యాప్తంగా పారిశుద్ధ్య పర్యవేక్షణకు ఆదేశాలు
- రోగుల పరామర్శకు ఉదయం, సాయంత్రం రెండు గంటలు కేటాయింపు



హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలోని ఓ వార్డు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సర్కారు దవాఖానల్లో ఎప్పుడపడితే అప్పుడు రోగులను చూడడానికి ఇకనుంచి అనుమతి లేదు. ఆస్పత్రుల్లో చెత్తా, చెదారం కనిపించదు. గంటల తరబడి క్యూలైన్లో నిలబడాల్సిన అవసరం ఉండదు. అవును మీరు వింటున్నది నిజమే. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పలు మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కార్పొరేట్ స్థాయిలో సేవలను అందించాలంటే దానికి తగ్గట్టుగానే సంస్కరణలు ఉండేలా చూడాలన్నదే అధికారుల ఆలోచన. దానికి అనుగుణంగానే పాత సంస్కరణలకు దుమ్ముదులిపి వాటి అమలుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కార్పొరేట్ స్థాయిలో సేవలందించడం ప్రభుత్వం ముందున్న కర్తవ్యం. అందులో భాగంగానే పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు పోవాలని అధికారుల ఆలోచన. అనుకున్న దానికన్నా ఎక్కువ సంఖ్యలో రోగులు వైద్య సేవలు పొందడానికి ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్నారు. రోగులకు వైద్యం చేయాలంటే కొన్నిసార్లు వారి వెంట వచ్చే వైద్యులకు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. దీంతోపాటు శానిటేషన్ నిమిత్తం ఒక్కో బెడ్డుకు నెలకు 5 వేల రూపాయల చొప్పున చెల్లిస్తారు. ఎక్కువమంది రోగుల వెంటవచ్చి ఆస్పత్రుల్లో ఉండడంతో పారిశుద్ధ సమస్య ఎక్కువ అవుతుంది. దీంతో పాటు పలు సమస్యలు ప్రభుత్వాన్ని వెంటాడుతున్నాయి.

పనిభారం తగ్గించేందుకే సూపర్‌వైజర్ల నియామకం


ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని నిర్ధేశించిన సమయంలోనే సందర్శకులను అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా కొందరు రోగుల వెంట వచ్చే వారు ఇష్టానుసారంగా ఆస్పత్రులకు లోపలికి వెళ్లడం వల్ల రోగుల సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు గుర్తించారు. దీంతోపాటు పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించడంతో పాటు రోగుల క్యూలైన్ల పెరగకుండా చూడడంతో పాటు శానిటేషన్ సిబ్బందిని ఎప్పటి కప్పుడు పర్యవేక్షించడానికి గాంధీలో రెండు నెలల క్రితం పర్యవేక్షకులను నియమించారు. వీటిని పర్యవేక్షించడం వైద్యుల వలన కావడం లేదు. రోగులను చూడడమే వారికి పెద్దబారం. దీంతోపాటు సిబ్బంది, శానిటేషన్ చూడడం వారు అదనపు బాధ్యతగా ఫీలవుతున్నారు. దీంతో వీరికి పని భారం తగ్గించాలన్న ఆలోచనతోనే సూపర్‌వైజర్లను ప్రభుత్వం నియమించింది. సూపర్‌వైజర్లు కూడా ఎంబీఏ చేసిన వారికే ప్రాధాన్యం ఇచ్చింది. వారిలో అడ్మినిస్ట్రేటివ్ పట్టు ఉన్న వారు అయితే ప్రభుత్వ ఆస్పత్రులు ప్రగతిపథంలో వెళతాయన్నది అధికారుల ఆలోచన. మొదటగా గాంధీలో ఈ తరహా విధానాన్ని ప్రవేశపెట్టారు. రెండునెలలుగా కొంతమేర అధికారులు అనుకున్నట్టుగానే పారిశుద్ధ్యం, శానిటేషన్ విషయంలో కొంత మేర మార్పు వచ్చింది. ఇంకో రెండు నెలలు చూసిన తరువాత పూర్తి స్థాయిలో లోపాలను సరిదిద్దుకొని ముందుకు వెళ్లాలన్నదే అధికారుల ఆలోచన. ఈ ఆలోచననే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు.

ఎప్పటికప్పుడు వార్డుల్లో పరిశుభ్రత పరిశీలన

పారిశుధ్యం, భద్రత, రోగుల సేవలకు సంబంధించిన ఇతర అంశాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఉన్నతాధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలు, అనుబంధ ఆస్పత్రులకు సూచనలు ఆదేశాలను జారీ చేశారు. వార్డుల్లో పరిశుభ్రత ఎప్పటి కప్పుడు పరిశీలన జరిపే బాధ్యత స్థానిక వైద్యాధికారులదే (ఆర్ఎంఓ)లదే, భద్రతా సిబ్బందిని నియమించుకోవడంలోనూ ఆర్ఎంఓలు కీలకపాత్ర పోషించాలని అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పరిశుభ్రత నిర్వహణ వార్డు స్థాయి నుంచే మొదలవ్వాలని, రోజు వారీ సేవలపై నర్సుల నివేదికలను నెలవారీగా విభాగాధిపతులకు పంపించాలని, కేటాయించిన సిబ్బంది సరిగ్గా విధులకు హాజరవుతున్నారా లేదా అని ప్రధాన నర్సే పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నది ఆ ఆదేశాల్లోని ముఖ్య సారాంశం. పారిశుధ్య భద్రత రోగుల సేవలకోసం నియమించిన సిబ్బంది బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా నమోదు చేయాలని, ఈ వివరాల ఆధారంగానే బిల్లులను చెల్లించాలని, ఆస్పత్రిలో రోగి సహాయకులకు రెండు అనుమతి కార్డులను ఆయన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆస్పత్రుల ఇన్‌చార్జీలకు సూచనలిచ్చారు. రోజు సాయంత్రం 4-6 గంటల మధ్యలో సందర్శకులకు అనుమతి ఇవ్వాలని, సిబ్బంది ఎవరైనా నిబంధనలు ఉల్లఘించినట్టయితే రోగుల నుంచి డబ్బులు తీసుకున్నట్లు తేలితే తక్షణమే వారిని విధుల్లోంచి తొలగించాలని, ఆస్పత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రోగుల రాకపోకలు, సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, దీని వల్ల ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు మెరుగుపడుతుందని అధికారులు భావించి ఈ నిర్ణయాల అమలును ఎలాంటి విఘాతం కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా స్థాయి అధికారులకు సూచనలు జారీ చేశారు. దీంతోపాటు రోగి సహాయకులు నాలుగు చక్రాల బల్లనూ మూడు చక్రాల కుర్చీని తోసుకుంటూ తీసుకెళ్లొద్దని, ఆ విధులను రోగుల సహాయక సిబ్బందే నిర్వర్తించాలన్నది అధికారుల ఆదేశాల్లో పేర్కొన్నారు.

కచ్చితంగా అమలు చేయాల్సిందే

చాలావరకు ఇవన్నీ పాత నిర్ణయాలే. కానీ చాలా ఆస్పత్రుల్లో పర్యవేక్షణ కొరవడడంతో వీటిని ఎవ్వరూ ఇంతవరకు పట్టించుకోవడం లేదు. ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలంటే ఇవన్నీ పాటించాల్సిందే. ఏ ఒక్కరితోనే ఇవన్నీ సాధ్యం కాదు. అందరూ క్రమశిక్షణతో ఎవరి పని వారు చేసుకుంటే కార్పొరేట్ కన్నా ఎక్కువ స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రులు సేవలను అందించడానికి వీలు ఉంటుంది. చాలా ఆస్పత్రుల్లో రోగుల వెంట 10-20 మంది వస్తే పారిశుద్ధ్య సమస్య ఎక్కువ అవుతుంది. దీనివల్ల మిగతా రోగులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వీటిని దృష్టిలో ఉంచుకోని కఠిన నిర్ణయాలను అమలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కచ్చితంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో వీటిని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. ప్రజలందరూ దీనికి సహకరించాలి.



\- డీఎంఈ డాక్టర్ రమేష్ రెడ్డి

పశు సంపదలో పారదర్శకత



- 'ఇనాఫ్' పథకాన్ని అమలు చేస్తున్న నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు
- అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాడి పశువుల పరిరక్షణ
- పశువులకు బార్‌కోడ్‌తో అక్రమాలకు చెక్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రకరకాల కారణాల వల్ల అంతరిస్తున్న పశు సంపదను పరిరక్షించేందుకు కేంద్రం ప్రభుత్వం సరికొత్త పథకం ద్వారా చర్యలు ప్రారంభించింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ పరిధిలోని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు ప్రవేశపెట్టిన ఇన్ఫర్మేషన్ నెట్‌వర్క్ ఫర్ ఎనిమల్ ప్రొడక్టివిటీ అండ్ హెల్త్ (ఇనాఫ్) పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంతో అమలు చేస్తున్నాయి. పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ వాటి నుంచి సంపదను సృష్టించేందుకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోంది. తద్వారా సమాజంలోని పాడి ఉత్పత్తుల డిమాండ్‌ను తీర్చేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పాడి పశువులకు ఆధార్‌కోడ్ తరహాలో ఆన్‌లైన్‌లో ఒక ప్రత్యేక బార్‌కోడ్‌ను నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా కేంద్ర కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తారు. పాడి పశువుల వివరాలను క్షేత్రస్థాయిలో కంప్యూటర్ల ద్వారా నమోదుచేసి గుజరాత్ రాష్ట్రంలోని ఆనంద్‌లో ఉన్న కేంద్రీయ సర్వర్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఆ విధానాన్ని అన్ని రాష్ట్రాల్లోనూ అమలు చేసేందుకు మార్గదర్శకాలు వెలువడ్డాయి.

ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు వాటి అమలులో అక్రమాలకు, అవినీతికి చెక్‌పెట్టే వీలు కలిగింది. కోట్లాది రూపాయల ఖర్చుతో ఏటా ప్రభుత్వం స్వయం ఉపాధి కింద లబ్ధిదారులకు, ఆవులు, గేదెలు కొనుగోలుచేసి ఇస్తున్నా వాటిని కొద్ది నెలల్లోపే విక్రయించుకుని సొమ్ము చేసుకున్న సంఘటనలు తరచూ చోటు చేసుకునేవి. ఇనాఫ్ అమలుతో అక్రమాలకు ఇనాఫ్ నమోదు ప్రక్రియ జిల్లాలోని పశువుల గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ఇందులో భాగంగా పాడి పశువుల చెవుకు బార్‌కోడ్ ఉన్న 12 అంకెల ట్యాగ్‌ను అమరుస్తారు. అందులో పశువుతో పాటు దాని యజమాని వివరాలు, సెల్‌ఫోన్ నెంబరు నమోదు చేస్తారు. పశువు పట్టిన తేదీ, తదితర 18 అంశాలను, యజమానికి సంబంధించి 21 అంశాల సమాచారాన్ని నమోదు చేయగనే బార్‌కోడ్ రావడంతో పాటు సెంట్రల్ సర్వర్‌లో వివరాలు పొందుపరుస్తారు. పశువుకు రోగ నిరోధక టీకాలు ఇవ్వాల్సిన సమయం. గర్భస్థస్థితి, పాలు ఇస్తున్న వివరాలు, పోషకాహారం అందించాల్సిన వివరాలు రైతుల సెల్‌ఫోన్‌కు సమాచారం వస్తుంది. వాటి ఆధారంగా రైతులు చర్యలు చేపట్టే పశువుల ఆరోగ్యంతో పాటు అందించాల్సిన మేత, చూడి స్థితిగతులు, గర్భస్థస్థితిపై వైద్యులను సంప్రదించి పశువుల నిర్వహణను చేపట్టవచ్చు.

ఆన్‌లైన్‌లో పశువుల వివరాలు..

ఆన్‌లైన్‌లో ఇనాఫ్‌కు సంబంధించి వెబ్‌సైట్‌లోకి వెళ్ళి ట్యాగ్ నెంబర్ నమోదు చేస్తే పశువు, దాని యజమాని వివరాలు తెలుసుకోవచ్చు. జిల్లా రిసోర్స్ పర్సన్స్‌కు ఇనాఫ్‌పై శిక్షణ పూర్తిస్థాయిలో జరిగింది. త్వరలో కిందిస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఇనాఫ్ కింద నమోదు చేసేందుకు జిల్లా పశు సంవర్ధక శాఖ కసరత్తు మొదలుపెట్టింది. ఇనాఫ్ కింద నమోదైన పశువు విక్రయించిన పక్షంలో కొనుగోలుదారుడి పేరిట బదలాయించేందుకు అవకాశం కల్పించారు. తిరిగి అన్ని వివరాలు నమోదు చేయడం ద్వారా మొదటి రైతుకు అందే ఫోన్ సేవలు కొనుగోలు చేసిన రైతులకు బదలీ అవుతాయి. బదిలీ ప్రక్రియ ద్వారా పశువు ఎవరివద్ద ఉందో తెలుసుకొనే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వ పథకాల ద్వారా పొందే పశువులను అక్రమంగా విక్రయించే ప్రక్రియకు కళ్ళెం పడనుంది. ఒకసారి ఇనాఫ్ కింద నమోదైన పశువు చనిపోయే వరకు దాని వివరాలు ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు.

మండల స్థాయిలో త్వరలో శిక్షణ..

డిస్ట్రిక్ట్ రిసోర్స్‌పర్సన్స్‌కు శిక్షణ మార్చి 17న పూర్తయింది. వీరి ద్వారా మండల స్థాయిలోని అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఇనాఫ్‌ను ప్రారంభిస్తాం. డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్‌గా జిల్లా నుంచి పెగడపల్లి పశువైద్యాధికారి విక్రమ్ శిక్షణ పొందారు. వీరిద్వారా జిల్లాలోని సిబ్బందికి శిక్షణ ఇచ్చి మొబైల్ యాప్‌లో ఏ విధంగా వివరాలు ఫీడ్ చేయాలో నేర్పుతారు. దీనిద్వారా మేలుజాతి పశువులను ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. దేశవ్యాప్తంగా ఆవులు, గేదెలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకునే అవకాశం ఉంది. గేదె ఒక రోజుకు ఎన్ని లీటర్ల పాలు ఇస్తుంది. ఆ గేదె ఆడ పిల్లలను ఎక్కువగా పెడుతుందా, మగ పిల్లలను ఎక్కువగా పెడుతుందా అని కూడా తెలుసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ పథకాల ద్వారా రైతులకు అందించిన గేదెలను అక్రమంగా అమ్ముకునే అవకాశం ఉండదు. వాహనాల తరహాలోనే పశువులకు రిజిస్ట్రేషన్ 12 అంకెల నంబర్ ఇచ్చి ఆన్‌లైన్‌లో బార్‌కోడ్ నమోదు చేస్తాం. దీంతో గేదె, యజమాని పూర్తిస్థాయి వివరాలు తెలుసుకునేందుకు అవకాశం ఉంది అన్నారు.

సామర్థ్య విస్తరణకు రూ. 1. 5లక్షల కోట్లు

- విస్తరణలో ద.మ. రైల్వేకు ప్రాధాన్యం




సేఫ్టీ క్యాలెండర్, డైరీని విడుదల చేసిన ద.మ. రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సామర్థ్య విస్తరణ పై రూ.1.5 లక్షల కోట్లు వ్యయం చేయబోతున్నామని భారతీయ రైల్వే ప్రకటించింది. అందుకు గాను పెద్ద ఎత్తున వనరుల సేకరణపై దృష్టికేంద్రీకరించింది. సామర్థ్య విస్తరణలో దక్షిణ మధ్య రైల్వే అత్యధికంగా ప్రయోజనం పొందే అవకాశాలున్నాయి. ఇప్పటికే అధికారులు విస్తరణ ప్రణాళికలను భారతీయ రైల్వేకు నివేదించారు. భారతీయ రైల్వేకు 30,000ల కిలోమీటర్ల మేరకు విద్యుత్ పంపిణీ లైన్లు ఉన్నాయి. ఈ విద్యుత్ లైన్లల్లో కొంత మేరకు వాటాలను విక్రయించడంతో పాటుగా ఢిల్లీ, ముంబాయిలోని మూడు ప్రధానమపైన ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములను విక్రయించడం ద్వారా రూ. 2000ల కోట్లు ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇతర జోన్లలోని నిరుపయోగంగా ఉన్న విలువైన భూములను విక్రయించడం, అభివృద్ధి పర్చడం ద్వారా వనరులు సమీకరించాలని భావిస్తున్నారు. విద్యుత్ లైన్లలో వాటాల కొనుగోలుకు రెండు సంస్థలు ఇప్పటికే ఆసక్తి కనబరిచాయి. అధికారులు ఆ సంస్థలతో చర్చలు జరుపుతున్నారు. భారత ప్రభుత్వం రైల్వేను భారీ స్థాయిలో విస్తరించాలని ఇప్పటికే రైల్వే మంత్రిత్వ శాఖకు సూచించింది. సామర్థ్యం పెంచుకోవాలని, సదుపాయాలు మెరుగుపర్చాలని కోరింది. డిమాండ్ మేరకు రైల్వేలను విస్తరించడం, అభివృద్ధిపర్చడం, సామర్థ్యం పెంచుకోవడం అత్యంత ప్రధానం అని ద.మ. రైల్వేలోని ఉన్నతాధికారి తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో సామర్థ్యం పెంపు ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతుందన్నారు. కొత్త లైన్లు వేయడం జరుగుతుందని తెలిపారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రైలు రవాణాను మెరుగుపర్చడానికి డివిజన్ల వారిగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్టేషన్లలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చామని రైళ్లలో అత్యాధునిక సేవలను అందుబాటులోకి తేవడం జరుగుతుందని వివరించారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గత సంవత్సరం టికెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న సుమారు 25.86 లక్షల మందికి జరిమానా విధించడం జరిగిందన్నారు. దేశ వ్యాప్తంగా సుమారు రెండు కోట్ల మందికి పైగా టికెట్ లేకుండా ప్రయాణం చేసే వారిని గుర్తించారు. వారి నుండి రూ. 935.64 కోట్లు మేరకు జరిమానా విధించారు. దక్షిణ మధ్య రైల్వేలో ఈ విధంగా వసూలైన జరిమానా మొత్తం సుమారు రూ. 26 కోట్ల మేరకు వసూలు చేశామన్నారు. టికెట్ లేకుండా ప్రయాణం చేసే వారిని అరికట్టడానికి నిర్దిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వే విస్తరణకు సంబంధించి తెలంగాణలో అనేక ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయన్నారు. ఘన్‌పూర్ - సూర్యాపేట, నల్లగొండ - మాచర్ల, గద్వాల - తిరుపతి, హైదరాబాద్ - దేవరకొండ మధ్య కొత్త లైన్ల ఏర్పాటు, హైదరాబాద్ - అమరావతి మధ్య నల్లగొండ మీదుగా సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌ను నడపడం, గద్వాల - మాచర్ల మధ్య కొత్త లైను, కాజీపేటను డివిజన్‌గా మార్చడం లాంటి అంశాలు పరిశీలనలో ఉన్నాయన్నారు. ప్రజా ప్రతినిధుల నుండి వచ్చిన ప్రతిపాదనలను భారతీయ రైల్వే దృష్టికి తేవడం జరిగిందన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్‌ను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి పర్చడం జరుగుతుందన్నారు. నడికూడ - శ్రీకాలహస్తి కొత్త రైల్వ లైన్‌ను రెండుమూడేళ్లలో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

భాషా పరిరక్షణ అందరి బాధ్యత

తెలుగు భాషా పరిరక్షణ సంవత్సరం 2018: ఏపీ సీఎం చంద్రబాబు




అమరావతి, ఆంధ్రప్రభ: భాషా ప్రయుక్త రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్‌తోనే నాంది పలికామని, తెలుగు భాషను కాపాడుకోవడం మనందరి బాధ్యతని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 29వ విజయవాడ పుస్తక మహోత్సవాన్ని ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడుతో కలిసి ముఖ్యమంత్రి సోమవారం ప్రారంభించారు. ముఖ్య మంత్రి మాట్లాడుతూ 2018ని తెలుగు భాషా పరిరక్షణ సంవత్సరంగా ప్రకటిస్తున్నామన్నారు. ఈ మధ్యకాలంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బాగా అభివృద్ధి చెందడం వల్ల రాయడం బాగా తగ్గిపోయిందన్నారు. భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలన్నారు. ఇంటర్నెట్ వల్ల రాతకు అవకాశం లేకుండా పోయింద న్నారు. భాష పరిరక్షణలో పుస్తకాలదే ప్రముఖపాత్రన్నారు. ఉపాధి కోసం ఆంగ్లం నేర్చుకున్నప్పటికీ భాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునే క్రమంలో భాష ఎంతో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రపంచంలో ఐటీకి సంబంధించి ప్రతి నలుగురిలో ఒకరు తెలుగువారు ఉన్నత స్థానంలో ఉన్నారని, అదే దేశ స్థాయిలో అయితే ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందన్నారు. తెలుగు వారంతా మద్రాసులో కలిసి ఉన్న సందర్భంలో ఎన్నో ఒడిదుదుకులకు గురయ్యారని, చివరికి పొట్టి శ్రీరాములు త్యాగం వల్ల ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందన్నారు. మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రం ఏపీనే అన్నారు. ఆ తర్వాత మళ్లీ ఏపీ రెండు రాష్ట్రాలుగా విడిపోయి అనేక కష్టాల నడుమ మూడేళ్లు పూర్తి చేసుకున్నామని, అయినా మొక్కవోని ధైర్యంతో అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతున్నామన్నారు. తెలుగు భాషను పరిరక్షణలో ఎన్టీఆర్ విశేషమైన కృషి చేశారని అన్నారు.

అమరావతి నగరాన్ని ప్రపంచ ప్రఖ్యాత నగరంగా తీర్చి దిద్దుతామని ప్రకటించారు. ఇప్పుడిప్పుడే ఏపీ అన్ని విధాలా నిలదొక్కుకుంటూ ముందుకు పోతుందన్నారు. భాషను మనం కాపాడుకుంటే భాష మనల్ని కాపాడి, మన గౌరవాన్ని, ఔనత్యాన్ని పెంచుతుందన్నారు. పుస్తకాలు మరింత ప్రముఖ పాత్ర పోషిస్తాయని చెప్పారు. పుస్తకాలు లేకపోతే భాష లేదని, భాష అభివృద్ధి చేయకపోతే మన ఉనికే కనుమరుగవుతుందన్నారు. ఐటీ, ట్విట్టర్, సోషల్ మీడియా పరంగా మంచి అభివృద్ధిని సాధించడంతో నేడు రాతకు ప్రాధాన్యత తగ్గించారన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ భాష కోసం ప్రత్యేకించి నిర్వహించే కార్యక్రమాలకు ప్రభుత్వపరంగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఇందుకోసం ఇతర ఏ ఆర్గనైజేషన్ ముందుకొచ్చినా ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా అన్ని రంగాల్లో తెలుగు భాషకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 2017 అన్ని విధాలా కలిసి వచ్చిందని, ఎన్నో సమస్యలను అధిగమించామన్నారు. 2018 కూడా బ్రహ్మాండమైన సంవత్సరంగా ఉండాలని భావిస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడుతో పాటు మంత్రులు దేవినేని ఉమా మహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, ఎంపీ కేశినేని నాని, సీపీఐ నేత నారాయణ, శాసనమండలి విప్ బుద్దా వెంకన్న, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనురాధ, జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు విజయభాస్కర్, విజయవాడ పుస్తక మహోత్సవ అధ్యక్షుడు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ రెస్టారెంట్లు!

- నిల్వ చేసిన మాంసంతోనే బిర్యానీలు
- విషాన్ని చిమ్ముతున్న ఆహార పదార్థాలు
- పలు హోటళ్లలో శుచి, శుభ్రత కరవు
- మేల్కోని మున్సిపల్ అధికారులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ....కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలుకుతూ డిసెంబర్ 31వ తేదీన నగరంలో పెద్దఎత్తున విందులు, వినోదాలు జరిగాయి. స్టార్ హోటళ్ళ నుంచి మొదలుకుని గల్లీ హోటళ్ళు వరకు రద్దీతో కిటకిటలాడాయి. బిర్యానీ సెంటర్లు, రెస్టారెంట్లు, ఫాస్టుఫుడ్ సెంటర్లు, దాబాలు.... ఇలా ఒకటేమిటీ ప్రతిహోటల్లోనూ అర్ధరాత్రి వరకు పార్టీలు జరిగాయి. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న జరిగే పార్టీలు ప్రజల్లో క్రేజీగా మారుతున్నాయి. మహిళలు, పురుషులు, వృద్ధులు అన్న తేడాలేకుండా స్థాయిని బట్టి హోటళ్ళను ఎంపిక చేసుకుంటున్నారు. ముఖ్యంగా యువత అయితే రెండు, మూడు రోజుల ముందు నుంచి ప్రత్యేకంగా ప్రణాళికలను రూపొందించుకుంటున్న విషయం తెలిసిందే.

దీనిని ఆసరాగా చేసుకుని పలు రెస్టారెట్లు, హోటళ్ళ నిర్వాహకులు రెండు, మూడు రోజుల ముందు నుంచే పెద్దఎత్తున మాంసం, చికెన్, చేపలను నిల్వ చేసుకుంటున్నారు. సాధారంగా రోజుల్లో అయితే రెండు, మూడు రోజుల్లో జరిగే విక్రయాలు డిసెంబర్ 31న జరుగుతున్నాయంటే.... ప్రజలు ఏ స్థాయిలో రెస్టారెంట్లపై విశ్వాసం పెట్టుకున్నారో తెలుస్తోంది. మరోవైపు మందు నిషాలో ఎలాంటివి వడ్డించినా సరే.... వాటిని తృప్తిగా, కడుపునిండా ఆరగిస్తున్నారు. కానీ ఆ భోజనమే పలు రోగాలకు కారణభూతమవుతోంది. ఈ విషయం మున్సిపల్ శాఖ అధికారులకు తెలిసినప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోలేకపోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం డిసెంబర్ 31వంటి ముఖ్యమైన రోజుల్లో కూడా సంబంధిత అధికారులు హోటళ్ళు, రెస్టారెంట్లపై దృష్టిసారిస్తున్న దాఖలాలు మచ్చుకైనా కనిపించడం లేదు. ఏదైనా ఊహించని సంఘటనలు జరిగినప్పుడు మాత్రమే అధికారులు ఒకటి, రెండు రోజుల పాటు తనిఖీలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

గలీజ్....హోటళ్ళు

ఇకసరదా కోసమో, స్నేహితులు ఇచ్చే పార్టీల కోసమో లేదా రుచి కోసమని లొట్టలు వేసుకుని హోటళ్ళకు వెళ్ళినా కూడా అంతే... ఏరికోరి ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకున్నట్లే లెక్క. తాగే నీటి నుంచి మొదలుకుని ఆహార పదార్థాలన్నీ నాసిరకమే. రోజల తరబడి నిల్వ చేసిన కూరగాయలు, మాంసంతోనే వినియోగదారులకు వడ్డిస్తున్నారు. నగర ప్రజలు తమ బిజీ షెడ్యూల్ కారణంగా ఇంట్లో వంటకాలను చేసుకోవడం కంటే హోటళ్ళపై ఎక్కువగా ఆధారపడుతుంటారు. పైగా భార్య, భర్తలు ఇద్దరూ ఉద్యోగం చేసే కుటుంబాల్లో అయితే ఇది మరింత ఎక్కువగా ఉంటుంది. చాలామంది హోటళ్ళు, మెస్‌లు, ఫుడ్‌కోర్టులు, రెస్టారెంట్లతో పాటు రోడ్డుసైడ్ నెలకొల్పే చిన్న చిన్న తోపుడు బండ్లపై వారి స్థాయి బట్టి ఆధారపడుతున్నారు. ఇక ఛాయ్ ప్రియులు కోసం ఇరానీ హోటళ్ళు, కాఫీ సెంటర్లు సైతం లెక్కకు మించి ఉన్నాయి. వ్యాపార ధోరణీలో పడిపోయి ప్రజల ఆరోగ్యంపై ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పైగా ప్రజలను పెద్దఎత్తున ఆకట్టుకునేందుకు లక్షలాది రూపాయతో ప్రచారాలు చేస్తున్నారు.

ఇదిలా ఉండగా మరికొందరు అధికారులు హోటల్ నిర్వాహకులు ఇచ్చే ముడుపులకు ఆశపడి దాడులు చేసే విషయాన్ని పూర్తిగా విస్మరించారు. ఈ పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నగరాలు, పట్టణ ప్రాంతాల్లో నెలకొంది. ముఖ్యంగా హైదరాబాద్ వంటి పట్టణాల్లోని హోటళ్ళలోనే అపరిశుభ్రత, నాసిరకం వంటకాలు రాజ్యమేలుతున్నాయంటే ఇక నగర శివారు ప్రాంతాలు, జిల్లాలోని ముఖ్య పట్టణాల్లో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో

ఊహించవచ్చు. ఇదిలా ఉండగా జీహెచ్ఎంసీ అధికారులు గ్రేటర్ పరిధిలోని పలు హోటళ్ళపై కొద్ది రోజుల క్రింత నిర్వహించిన మెరుపుదాడుల్లో మరోసారి హోటళ్ళలో నెలకొన్న పరిస్థితి బయటబడిన విషయం తెలిసిందే. ఇందులో పేరున్న హోటళ్ళలోనూ నాణ్యతలేని ఆహారాన్నే అందిస్తున్నారని వెలుగు చూశాయి. ఇలాంటి పరిస్థితులు తరుచూ బయటపడుతుండడం పలువురిని విస్మయానికి గురి చేస్తోంది. వీటిలో బంజారాహిల్స్‌లోని ఓహిరీస్, షాపుర్‌నగర్‌లోని సాగర్ రెస్టారెంట్, నల్గొండ్ క్రాస్‌రోడ్డులోని సోహెల్ హోటల్,ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని అస్టోరియా, సికింద్రాబాద్‌లోని మినర్వా గ్రాండ్, ఐఎస్ సదన్‌లోని ప్యారడైజ్, గచ్చిబౌలిలోని అల్‌షబా హోటల్, గచ్చిబౌలిలోని డ్రంకయార్డు శివానీ రెస్టారెంట్ కూడా ఉన్నాయి. ఆయా హోటళ్ళలో అపరిశుభ్రతతో పాటు కబేళా నుంచి స్టాంపు లేని మాంసాన్ని వినియోగిస్తున్నందుకు సంబంధిత అధికారులు భారీగా జరిమానాలను విధించారు. పలు హోటళ్ళలో నెలకొన్న పరిస్థితులను గమనించి ఇప్పటికైనా మున్సిపల్ శాఖఉన్నతాధికారులు ప్రజల ఆరోగ్యంపై పూర్తిస్థాయిలో దృష్టిసారించి నిరంతరం దాడులు చేస్తే తప్ప పరిస్థితిలో మార్పులు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. మరి ఆ దిశగా చర్యలు తీసుకుంటారా? లేదా? అన్నది వేచిచూడాల్సిందే.

ఫీజులు తేల్చకుండానే అడ్మిషన్లా..!

● నేడు స్కూళ్లవారీగా నోటిఫికేషన్ల జారీ

● 3 నుంచి 8 వరకు అడ్మిషన్లు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల పెంపు విషయం ఇంకా తేలకముందే ప్రవేశాలు చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతిస్తూ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. నేటి నుంచి స్కూల్స్ వారీగా అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టడం కోసం నోటిఫికేషన్లను జారీ చేయనున్నాయి. 3 నుంచి 8 వరకు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి కానుంది. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో వారి స్కూల్‌లో వసూలు చేసే ఫీజులను ఎలా అప్‌లోడ్ చేస్తారు. పాత ఫీజులను పెడతారా? లేకపోతే గత ఏడాది కంటే 10 శాతం పెంచి ఫీజులను అప్‌లోడ్ చేస్తారా? అనేదానిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ప్రైవేటు స్కూల్స్ ఫీజులను ఎక్కువ వసూలు చేస్తున్నాయని, వాటి నియంత్రణ కోసం గత ఏడాది మార్చిలో ప్రభుత్వం కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. ఆ కమిటీ కాస్త 9 నెలల అనంతరం డిసెంబర్ 30న ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. అయితే నివేదికలో ప్రతి ఏడాది 10 శాతం ఫీజులను పెంచుకోవచ్చని ప్రతిపాదించింది. దీంతో ప్రైవేటు స్కూల్స్ వసూలు చేస్తున్న ఫీజులు తగ్గకపోగా మరింత పెరిగే అవకాశం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నివేదికపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వ ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజులపై నిర్ణయం తీసుకోకుండానే నోటిఫికేషన్‌కు ఉత్తర్వులు జారీ చేసిందంటే వాటిని నియంత్రించాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదనేది



స్పష్టం అవుతోందని విద్యార్థి సంఘాలు, హెచ్ఎస్‌పిఏ, తెలంగాణ తల్లిదండ్రుల సంఘాలు విమర్శిస్తున్నాయి.

ప్రస్తుతం ఎల్‌కేజీ, యుకేజీ, 1వ తరగతిలో అడ్మిషన్లను తీసుకుంటారు. సాధారణంగా అడ్మిషన్ల సమయంలోనే ఫీజుల విషయంలో యాజమాన్యం ఇచ్చే రాయితీలను ముందుగానే తల్లిదండ్రులు మాట్లాడుకుంటారు. అదే పద్ధతిలో ప్రతి ఏడాది తల్లిదండ్రులు ఫీజులను చెల్లిస్తారు. అయితే ఇప్పుడు ఏటా 10 శాతం పెంచుకోవచ్చనే కమిటీ ప్రతిపాదనల నేపథ్యంలో యాజమాన్యాలు ఎలా వ్యవహరిస్తాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రతి ఏటా పెంచుతారా? లేకపోతే ముందుగా మాట్లాడుకున్నట్టుగా రాయితీని కొనసాగిస్తారా? అనేది తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా ఫీజులను పెంచితే ప్రతి సంవత్సరం స్కూల్‌కి వెళ్లి రాయితీ గురించి యాజమాన్యంతో తల్లిదండ్రులు మాట్లాడాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

అడ్మిషన్లపై సందిగ్ధంలో తల్లిదండ్రులు

ప్రైవేటు స్కూల్స్‌లో అడ్మిషన్లు తీసుకోవడంపై తల్లిదండ్రులు సందిగ్ధంలో పడుతున్నారు. ఫీజుల విషయం తేలకపోవడంతో అడ్మిషన్లు తీసుకోకుండా ఉండాలా? ఫీజుల విషయం తేలాకా తీసుకుందామంటే అప్పటి వరకు అడ్మిషన్ల నోటిఫికేషన్ ఉండదు. ఇది కాకుండా ముందే అడ్మిషన్లు తీసుకుంటే ఇప్పుడు వెబ్‌సైట్‌లో పెట్టిన ఫీజులనే చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ప్రభుత్వం కమిటీ ప్రతిపాదనలను కాదని ఫీజుల విషయంలో పెంపు లేదని నిర్ణయం తీసుకుంటే ఎలా అనే విషయాలపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

వివరాలు ఇచ్చింది 4వేల పాఠశాలలే

ఫీజులు, ఆదాయ, వ్యయాలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి సమర్పించింది కేవలం 4 వేల స్కూళ్లే. రాష్ట్రంలో 12వేలకు పైగా ప్రైవేటు స్కూల్స్ ఉన్నాయి. వాటిలో కేవలం 4 వేల స్కూల్స్ వివరాలను అందించిన నేపథ్యంలో వాటికే ఫీజుల పెంపుకు అవకాశం ఉంటుందా? అదీ కాకుండా ఆదాయ, వ్యయాలు సమర్పించని స్కూల్స్‌లో కూడా అడ్మిషన్లకు అనుమతులు ఇస్తారా? అనేది కూడా ప్రశ్నార్థకంగానే ఉంది.

పీసీసీ పగ్గాలిస్తే పార్టీని గెలిపిస్తా

ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



భువనగిరి, ప్రభ న్యూస్ : యాదాద్రి భువనగిరి జిల్లాలో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించవద్దని ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో విలేకరుతో మాట్లాడారు. అధిష్ఠానం తనకు పీసీసీ పగ్గాలు అప్పగిస్తే, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తామని చెప్పారు. పాదయాత్రతో పార్టీని గెలిపించి, రాహుల్‌కు కానుకగా ఇస్తామని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీస్తున్నాయని చెప్పారు. భువనగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్‌ను తాము గుర్తించమని అన్నారు. ఇక్కడ బీసీ సామాజిక అభ్యర్థిని పోటీలో ఉంచుతానని చెప్పారు. త్వరలోనే భువనగిరి పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటిస్తామని పేర్కొన్నారు. తమకు పీసీసీ అధ్యక్షుడితో విభేదాలు లేవన్నారు. సమావేశంలో నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పీసీసీ మాజీ కార్యదర్శి తంగళపల్లి రవికుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, పంజాల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

24 గంటలొద్దు..12 గంటలు చాలు

సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్గొండ (టౌన్), ప్రభన్యూస్ : రైతాంగానికి 24 గంటల కరెంటు ఇవ్వడం వల్ల నష్టమే జరుగుతుందని, ఈ ప్రయత్నాన్ని విరమించుకుని 12 గంటల కరెంట్ ఇవ్వాలని సీఎల్పి ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 24 గంటల కరెంట్ ఇస్తే బోర్లు ఎండిపోయి సన్నకారు రైతులు ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త సంవత్సరంలో కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 2లక్షల రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. ఇరవై ఏళ్ళుగా ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశానని, ఇంతవరకు ఎవరినీ దూషించలేదన్నారు. కొంత మంది సానుభూతి కోసం దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సమా వేశంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డుపల్లి శ్రీని వాస్, మహిళా అధ్యక్షురాలు సంకు ధనలక్ష్మీ, ఇబ్రహీం, జూలకంటి శ్రీనివాస్, మందడి శ్రీనివాస్‌రెడ్డి జూకూరి రమేష్, వంగూరి లక్ష్మయ్య, కిన్నెర అంజి ఉన్నారు.

భూగర్భ జలాలు పెంచేలా చర్యలుండాలి

టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మూడున్నరేళ్లుగా వ్యవసాయ సమస్యలను పరిష్కరించడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని టీ పీసీసీ కిసాన్‌సెల్ చైర్మన్ కోదండరెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్ది వ్యవసాయానికి 24 గంటల కరెంటు అంటూ ఓట్ల కోసం మరో జిమ్మిక్కుకు తెరలేపిందని విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. 24 గంటల కరెంటుకు తాము వ్యతిరేకం కాదని, భారీ ప్రచారాన్నే వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సీఎం సొంత జిల్లాసహా 9 జిల్లాలలో భూగర్భ జలాలు అంతంత మాత్రమే ఉన్నాయని, ముందుగా భూగర్భజాలలు పెంచే ప్రయత్నం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమృద్ధిగా నీళ్లు లేనప్పుడు ఎన్ని గంటల కరెంటు ఇచ్చినా ప్రయోజనం ఉండదన్నారు.

నేడు టీ కాంగ్రెస్ నేతల భేటీ

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై చర్చించేందుకు మంగళవారం టీ పీసీసీ ముఖ్యనేతలు సమావేశం కానున్నారు. మూడు విడతలుగా జరిగే ఈ సమాశానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రాంచంద్ర కుంతియా హాజరు కానున్నారు. మొదటి విడతగా జరిగే సమావేశంలో టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, సీఎల్పీ నేత జానారెడ్డి, మండలిలో విపక్షనేత షబ్బీర్‌అలీతో కుంతియా ప్రత్యేకంగా సమావేశం అవుతారు. ఆ తర్వాత టీ పీసీసీ మాజీ అధ్యక్షులు, కేంద్ర మాజీ మంత్రులతో పాటు రాష్ట్రానికి చెందిన పార్టీ ముఖ్యనేతలతోనూ చర్చలు నిర్వహిస్తారు. మూడో విడతగా టీ పీసీసీ కార్యవర్గం సమావేశం నిర్వహిస్తారు. కాగా ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి తీసుకునే అంశాల్లో భాగంగా సోషల్ మీడియా నిర్వహణకు గాను కో ఆర్డినేటర్ల నియామకం, పార్టీ అనుబంధ సంఘాలను క్షేత్రస్థాయిలో బలోపేతంతో ఎన్నికల పోలింగ్ బూత్ ఇన్‌చార్జీలపైన చర్చించే అవకాశం ఉంది.

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల నియామకం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టీ పీసీసీ మహిళా విభాగానికి సంబంధించి వివిధ జిల్లాల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాళ్లను నియమించినట్లు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు నేరెళ్లశారద తెలిపారు. ఇప్పటి వరకు 21 జిల్లాలకు కమిటిలవేవేశామని మిగిలిన 10 జిల్లాలకు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాళ్లను పార్టీ అనుమతితో నియమించినట్లు తెలిపారు. జగిత్యాల- జె సునీత, జనగాం - చిమ్ముల స్వాతి, మెడ్చల్- దుర్గారాణి, వరంగల్ రూరల్ - బండారి కళ్యాణి, భూపాలపల్లి - డి పూలమ్మ, సిద్దిపేట - ఎం లక్ష్మీ, హైదరాబాద్ - అచ్యుత, సూర్యపేట- గట్ల జ్యోతి, యాదాద్రి - తడక కల్పన, వికారాబాద్ - మేఘమాల, అదిలాబాద్ - డి జ్యోతి, కొమ్రంబీమ్ - ఇరుకుల మంగలను నియమించినట్లు తెలిపారు.

నిరంతర విద్యుత్‌కు మద్దతు

సింగరేణి చైర్మన్ ఎన్.శ్రీధర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రవ్యవసాయ రంగానికి ఊతమిచ్చే విధంగా నూతన సంవత్సరం ప్రారంభరోజు నుండి రైతాంగానికి 24గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తుండగా, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గును నిరంతరాయంగా అందించడానికి సింగరేణి సంస్థ సిద్ధంగా ఉందని.. ఇందుకు సింగరేణీయులంతా సహకరించాలని సంస్థ చైర్మన్ ఎన్.శ్రీధర్ పిలుపునిచ్చారు. ఆర్థిక సంవత్సరంలో తొమ్మిదిమాసాల ప్రగతిపై సోమవారం తన కార్యాలయంలో ఆయన సమీక్షించారు. గత ఏడాదికన్నా బొగ్గు రవాణా, ఓబి తొలగింపులో సంస్థ ప్రగతిని సాధించడంపై హర్షం ప్రకటిస్తూ బొగ్గు ఉత్పత్తిలో మరింతగా పుంజుకోవాలన్నారు.

గత 2016డిసెంబర్ నాటికి సింగరేణి సంస్థ 427లక్షల టన్నుల బొగ్గు రవాణాచేయగా, ఈ ఏడాది డిసెంబర్ నాటికి 9శాతం వృద్ధితో 467లక్షల టన్నుల బొగ్గు రవాణాచేసింది. అలాగే గత 2016 డిసెంబర్ నాటి కి 221.7మిలియన్ క్యూబిక్‌మీటర్ల ఓబి తొలగించగా, ఈ ఏడాది డిసెంబర్ నెలా ఖరుకు 28శాతం వృద్ధితో 282.9మిలియన్ క్యూబిక్‌మీటర్ల ఓబిని తొలగించింది. తొలి తొమ్మిదిమాసాలకు బొగ్గురవాణా లక్ష్యాలు సాధించామన్నారు.

13 నుంచి పండుగల పర్వం

● అంతర్జాతీయ పతంగుల పోటీకి విస్తృత ఏర్పాట్లు ● వినూత్నంగా స్వీట్ ఫెస్టివల్ ● 25 రాష్ట్రాల స్వీట్స్‌తో ప్రదర్శన



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సంక్రాంతి ముంగి ట తెలం గాణ ప్రభుత్వం మరో రెండు ప్రతిష్ఠాత్మక పండుగల నిర్వహణకు సిద్ధమైంది. హైదరాబాద్ మహానగరం రెంటికీ ఆతిథ్యమిచ్చేందుకు ముస్తాబవుతోంది. ఇటీవల జిఈఎస్, ప్రపంచ తెలుగుమహాసభలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ప్రభుత్వం సంక్రాంతి వేళ పర్యా టకులను ఆకర్షించే పండుగలకు సిద్ధమైంది. ప్రతి సంవత్సరం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే అంతర్జాతీయ పతంగుల పండుగకు తోడు వరల్డ్ స్వీట్ ఫెస్టివల్‌ను ఈ ఏడాది జోడించింది. వివిధ రాష్ట్రాలు, దేశాల ప్రజల సాంస్కృతిక అంశాలు ప్రతి బింబించే విధంగా.. అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్‌ను రూపొందిస్తున్నారు. దేశంలోని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో స్వీట్‌కు ప్రత్యేకత ఉందని, వాటన్నింటికీ ఒకే చోట ప్రదర్శించడం వల్ల ఆయా రాష్ట్రాల ప్రజల మధ్య సన్నిహితం, పరస్పర గౌరవం పెంచడం ఈ స్వీట్ ఫెస్టివల్ ప్రధాన లక్ష్యమని అధికారవర్గాలు చెబుతున్నాయి. జనవరి 13నుండి 15వతేదీవరకు సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో ఈ స్వీట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. సంక్రాంతి వేళ.. సెలవుల సమయాల్లో ఈ రెండు అంతర్జాతీయ పండుగల నిర్వహణకు పర్యాటక శాఖ శ్రీకారం చుట్టడంతో విదేశీపర్యాటకులు కూడా భారీగా హాజరవుతారని పర్యాటక శాఖ అంచనా వేస్తోంది.

25 రాష్ట్రాలకు చెందిన స్వీట్లు..

వరల్డ్ స్వీట్ ఫెస్టివల్‌లో దేశంలోని 25రాష్ట్రాలకు చెందిన స్వీట్లను ఒకేచోట అందించటం స్వీట్ ఫెస్టివల్ ప్రత్యేకత. ప్రతి రాష్ట్రం నుండి 50రకాల స్వీట్లను, మొత్తం వేయి రకాల స్వీట్లను ప్రదర్శనకు ఉంచబోతున్నారు.

పతంగుల పండుగతో పాటు స్వీట్ ఫెస్టివల్‌కు లక్షమంది హాజరయ్యే అవకాశం ఉందని, ఇందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించేందుకు స్టీరింగ్ కమిటీని నియమించారు.

66 కులసంఘాలకు స్థలాలు కేటాయించాలి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 66 ప్రధాన కుల సంఘాలకు స్థలాలను కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. 66 కుల సంఘాలకు సంఘం భవనాలను నిర్మించుకోవడం కోసం 10 ఎకరాల చొప్పున స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేస్తూ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు సోమవారం లేఖ రాశారు. బీసీ జాబితాలో 112 కులాలు ఉన్నప్పటికీ ప్రధానంగా 66 కులాలు ఉన్నాయన్నారు. మున్నూరుకాపు, ముదిరాజ్, గౌడ, పద్మశాలి, విశ్వబ్రాహ్మణ, వడ్డెర, ఉప్పర, చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి, వడ్రింగి, పెరిక, మేదర, మేర, బెస్త, పూసల, జంగం, లింగా యత్, గంగపుత్ర, వీరభద్రియ, బట్రా జ, అరికటిక, గాండ్ల, తమ్మలి, వంజ రి, వంశీరాజ్, వాల్మీకి, వారాల తదితర 66 కులాలతోపాటు మాల, మాదిగ, లంబాడీ, ఎరుకల, యానా ది, గోండు కులాల వారికి వారి సంఘాల భవనాల కోసం స్థలం కేటాయించాలన్నారు.

కొత్త జోష్‌కు మద్యం కిక్

మూడు రోజుల్లో రూ.421 కోట్ల విక్రయాలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మద్యం ఏరులై పారింది. నూతన ఏడాది వేడుకలకు స్వాగతం పలుకుతూ పల్లె పట్నం తేడా లేకుండా మందు బాబులు చిందేశారు. మూడు రోజుల్లో రూ. 421.66 కోట్ల మద్యాన్ని స్వాహాచేసి కొత్త చరిత్ర సృష్టించారు. గరిష్ట మద్యం విక్రయాలతో రాష్ట్రంలో గతేడాది చివరి మూడు రోజులు కొత్త చరిత్రను సృష్టించాయి. డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో అక్షరాల 421.66 కోట్ల మద్యం విక్రయాలతో ఆబ్కారీ శాఖ గత రికార్డులను తిరగరాసింది. 2015 డిసెంబర్‌లో ఇదే సమయంలో రెండు రోజులకు రూ. 160.85కోట్ల మద్యం విక్రయాలు రికార్డుకాగా 2016లో 166కోట్లు, 2017లో రూ.188 కోట్లుగా ఉండగా అది ఈ ఏడాది భారీ ప్రగతిని సాధ్యం చేస్తూ ఈ ఏడాది భారీగా పెరుగుదల నమోదైంది. 2017 డిసెంబర్ నెలలో మొత్తంగా రూ.1644కోట్లు మద్యం అమ్మకాలు చోటుచేసుకున్నాయి. అయితే ఇందులో మూడేఉ రోజుల్లోనే రూ.421 కోట్ల అమ్మకాలు జరగడం గమనార్హం. 2017 డిసెంబర్ 29న రూ.248కోట్లు, 30న రూ.185కోట్లు, 31న రూ.229కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఈ నెలలో 30,52,461 పెట్టెల మద్యం కాగా, 30,82,136 పెట్టెల బీర్ విక్రయించగలిగారు.

18 నుంచి పల్లెపల్లెకూ తెలుగుదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశం పార్టీ తెలంగాణ ఈనెల 18 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమానికి పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి పరిశీలకులను నియమించింది. అలాగే ప్రతి రెండు పార్లమెంట్ నియోజకవర్గాలకు ఒక సమన్వయ కర్తను నియమించి మొత్తం కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎల్.రమణ సోమవారం ఈ మేరకు జాబితాను విడుదల చేశారు.2019 శాసనసభ ఎన్నికల నాటికి కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపేందుకు పార్టీ అధిష్టానం అనేక కార్యక్రమాలను చేపట్టనుంది. ఇందులో భాగంగా పల్లెపల్లెకు తెలుగుదేశం చేపట్టి గ్రామస్థాయి కార్యకర్తల్లతో కదలిక తెచ్చే ప్రయత్నం ఆరంభించింది.పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా 17 మందిని రాష్ట్రస్థాయి నాయకులను పరిశీలకులుగా నియమించారు. ఇందులో టి.వీరేందర్ గౌడ్ (ఆదిలాబాద్), బిఎన్ రెడ్డి (పెద్దపల్లి), వంగాల స్వామిగౌడ్ (కరీంనగర్), బొల్లం మల్లయ్య యాదవ్ (నిజామాబాద్), ఎం.అమర్‌నాథ్ బాబు (జహీరాబాద్), కొత్తకోట దయాకర్‌రెడ్డి (మెదక్), ఇ.పెద్దిరెడ్డి (మల్కాజ్‌గిరి), రావుల చంద్రశేఖరరెడ్డి (సికింద్రాబాద్), అలీ మస్కతి (హైదరాబాద్, అరవింద్ కుమార్ గౌడ్ (చేవెళ్ళ), గరికపాటి మోహన్‌రావు (మహబూబ్‌నగర్), బక్కని నరసింహులు (నాగర్‌కర్నూల్), రేవూరి ప్రకాశ్ రెడ్డి (నల్లగొండ), చాడా సురేష్‌రెడ్డి (భువనగిరి), సండ్ర వెంకటవీరయ్య (వరంగల్), లక్ష్మణ్ నాయక్ రమావత్ (మహబూబాబాద్), సామా భూపాల్‌రెడ్డి (ఖమ్మం)లకు పరిశీలకులుగా నియమించారు.

దళితులపై కడియం కుట్ర

● దళితుడినంటూనే మోసగిస్తున్నారు ● డిప్యూటీ సీఎంపై మందకృష్ణ ఆగ్రహం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిపై మంద కృష్ణ మాదిగ ఫైర్ అయ్యా రు. దళితుడనని చెప్పుకునే శ్రీహరి.. దళితులకే మోసం చేస్తున్నాడని, 30 ఏళ్ల రాజకీయ జీవితంలో కనీసం ముగ్గురికి కూడా సహాయం చేయలేదని దుయ్యబట్టారు. ఎమ్మార్పీఎస్‌తో పెట్టుకుంటే కేసీ ఆరైనా కడియమైనా ఓడిపోక తప్పదని హెచ్చ రించారు. మంగళవారం నుంచి చేపట్టే దీక్షకు ప్రభు త్వం అను మతివ్వాలన్నారు. సోమవారం ఎమ్మా ర్పీఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో దీక్షలు చేయాలన్న టీఆర్ఎస్ సవాల్‌ను తాము స్వీకరించామని, తమ దీక్షకు మద్దతిస్తారో చెప్పాలని డిమాండ్ చేస్తే ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి స్పందన లేద న్నారు. టీఆర్ఎస్‌కు నిజాయితీ లేకనే తామిచ్చిన 13 ప్రశ్నలకు సమాధానం చెప్పలేదని, పైగా ఎమ్మార్పీఎస్‌పై సీఎం కేసీఆర్, కడియం శ్రీహరిలు కక్షకట్టారని కృష్ణమాదిగ ఆరోపించారు. డిసెంబర్ 17న శాంతియుతంగా ఎమ్మార్పీఎస్ చేపట్టిన మిలియన్ మార్చ్ సందర్భంగా మాదిగలకు జైల్లో పంపడంలో కడియం శ్రీహరిది పాత్ర ఉందన్నారు. కేబినెట్‌లో మాల, మాదిగలకు న్యాయం జరగకుండా కుట్ర చేశాడని అన్నారు. అంతే కాకుండా వరంగల్ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ నుంచి తనకూతురిని బరిలో దింపేందుకు గాను మాజీ డిప్యూటీ సీఎం రాజయ్యకు టికెట్ రాకుండా కుట్ర చేస్తున్నాడని దుయ్యబట్టారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్‌తో పాటు హరీశ్‌రావు, కేటీఆర్‌లపై 307 సెక్షన్ కింద కేసులు నమోదైనా అరెస్టు చేసి జైలుకు ఎందుకు పంపలేదో చెప్పాలని పోలీసులను ప్రశ్నించారు.ఈ విషయంపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు.

డీజీపీని కలిసిన మంద కృష్ణమాదిగ..

ఉపవాస దీక్ష అనుమతి విషయంపై డీజీపీని మంద కృష్ణమాదిగ సోమవారం సాయంత్రం కలిశారు. శాంతియుతంగా చేపట్టే దీక్షకు అనుమతివ్వాలని కోరారు. మంగళవారం ఉదయం నగర సీపీని కలవాలని డీజేపీ కృష్ణమాదిగకు సూచించారు.

నేటి నుంచి దీక్ష

ఎస్సీ రిజర్వేషన్ల సాధన కోసం ఎమ్మార్పీఎస్ మరో ఉద్యమానికి సిద్ధమవుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఉపవాస దీక్షకు సిద్ధమవుతున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించి నాలుగు రోజులు పాటు దీక్ష చేయనున్నారు. అదే సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, మండల కేంద్రాలతో పాటు గ్రామ పంచాయతీల్లో కూడా నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. ఈఉపవా స దీక్షకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు కూడా ఇప్పటికే మద్దతు ప్రకటించాయి. దీంతో గ్రామస్థాయిలో చేపట్టే నిరసనలు, ఆందోళనల్లో విపక్షాలను కలుపుకుని పోవాలని నిర్ణయించారు. ప్రధానంగా దీక్ష ద్వారా కేంద్ర రా ష్ట్ర ప్రభుత్వాల ముందు మూడు అంశాలపై డిమాండ్లు ఉంచనున్నారు.

1. వర్గీకరణపై బీజేపీ నేతలు ప్రధానిని ఒప్పించాలి.
2. ఈ అఖిల పక్షాన్ని సీఎం ఢిల్లీ తీసుకెళ్లాలి
3. పార్లమెంటులో వర్గీకరణపై తెరాస నోరు మెదపాలి, అన్ని పార్టీల ఎంపీలు ప్రైవేటు బిల్లు పెట్టేలా ఒత్తిడి చేయాలి అనే డిమాండ్లను ఎమ్మార్పీఎస్ సూచిస్తోంది.

గ్రామస్థాయిలో సచివాలయం

మదనపల్లె పాదయాత్రలో జగన్ హామీ



తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: వివిధ వర్గాలకు చెందిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి వీలుగా ప్రతి గ్రామస్థాయిలో అన్ని వర్గాల ప్రతినిధులతో గ్రామ సచివాలయం ఏర్పాటు చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్ ప్రకటించారు. చిత్తూరు జిల్లాలో కొనసాగిస్తున్న ప్రజా సంకల్ప పాదయాత్రలో నాల్గవరోజైన సోమవారం ఉదయం తంబళ్లపల్లె నియోజకవర్గం పరిధి దాటి నల్లగుట్టపల్లె గుండా మదనపల్లె నియోజకవర్గంలో అడుగుపెట్టారు. దాదాపు 13 కిలోమీటర్ల దూరం కొనసాగిన యాత్ర ముగింపు సందర్భంగా పీటీఎంలో చేనేత కార్మికులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఆ సమావేశంలో జగన్ ముందుగా మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు పూర్తి స్థాయిలో చేయూతనందించే పథకాలతో మేనిఫెస్టో తయారు చేస్తామన్నారు. పాదయాత్ర ముగిసిన తర్వాత ఏర్పాటు చేయతలపెట్టిన బీసీ గర్జన ద్వారా బడుగు, బలహీనవర్గాలకు తాను అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలను ప్రకటిస్తామన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అన్నివర్గాలతో పాటు చేనేత వర్గాలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు గతంలో చేనేత వర్గాలకు ఇచ్చిన హామీ మేరకు చేనేత పార్కులు, వడ్డీలేని రుణాలు అమలు చేశారా అని ప్రశ్నించగా సభలో పాల్గొన్న వారంతా లేదని జవాబిచ్చారు. ఇచ్చిన హామీలేమయ్యాయని ప్రశ్నిస్తారనే తెలుగుదేశం పార్టీ వెబ్‌సైట్‌లో నుంచి గత ఎన్నికల మేనిఫెస్టోను కూడా తొలగించారని జగన్ ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికలలో తమ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయగానే చేనేత కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించడానికి ప్రాధాన్యం ఇస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థాయిలో ప్ర భుత్వ పథకాల అమలు తీరును జగన్‌కు వివరించారు. అన్నీ విన్న తర్వాత జగన్ ప్రతిస్పందిస్తూ జన్మభూమి కమిటీల వంటి వేధింపులే కాకుండా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామస్థాయిలో అన్నివర్గాల ప్రతినిధులు పదిమందితో సచివాలయం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రతి ప్రభుత్వ పథకం లబ్ధితీరును ఆ కమిటీ ద్వారా పర్యవేక్షించి అర్హులకు లబ్ధి చేకూరే విధంగా జరిగేలా చూస్తామని, ఏ వర్గానికి చెందిన సమస్య అయినా 72 గంటల్లో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని జగన్ హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

ఉదయం ముదివేడులో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి దర్శించుకున్న జగన్‌కు తిరుపతి నుంచి వెళ్లిన టీటీడీ అర్చకులు వేదాశీస్సులతో శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆపై పార్టీ వర్గాల సమక్షంలో కేక్ కట్‌చేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

4 నుంచి విజయవాడలో

ఫుడ్ ప్రాసెసింగ్ సదస్సు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పరిశ్రమల మండళ్ళ సమాఖ్య (ఎఫ్‌ట్యాప్సీ) ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి మెగా ఫుడ్ ప్రాసెసింగ్ ప్రదర్శన, సదస్సు నిర్వహించనున్నారు. విజయవాడలో మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పాల్గొంటాయని ఎఫ్‌ట్యాప్సీ కన్సల్‌టెంట్ డైరెక్టర్ వెంకట్ బులెమోని తెలిపారు. వ్యవసాయ రంగంలో ఎంతో పురోగతి సాధిస్తున్న ఆంధ్రప్రదేశ్ 2029 నాటికి స్వర్ణాంధ్ర సాధన లక్ష్యంతో 2022 చివరికి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచేందుకు తగిన విధంగా వ్యూహాత్మక ప్రణాళికలు ఆ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. రాష్ట్రంలో రెండంకెల వృద్ధిరేటును సాధించేందుకు 13 జిల్లాల్లో 25వేల ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ అన్వేషణలు చేపడుతున్నారు. ఆహార పదార్థాల ప్రాసెసింగ్, పౌషక విలువలు పరిరక్షించే టెక్నాలజీ, రవాణా సదుపాయాలు, ఫుడ్ ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాలపై ఈ సదస్సులో చర్చిస్తారు. ఈ సదస్సులో తెల్గాస్ ఇండియా, సంగం డెయిరీ, విశాఖ డెయిరీ, ప్రియా ఫుడ్స్, హెరిటేజ్ డెయిరీ, క్రీమ్‌లైన్ డెయిరీ, ఏజీఐ-గ్లాస్‌ప్యాక్, అర్చన ప్యాకేజింగ్, వేగ ఆటోమేషన్ సొల్యూషన్స్‌తో పాటు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు పాల్గొంటాయి. అలాగే సిఎఫ్‌టిఆర్‌ఐ, ఎన్ఐఎన్, ఐఐఎంఆర్, ఇక్రిశాట్, ఎపెడా తదితర ప్రభుత్వరంగ సంస్థలు, నాబార్డు, సిడ్బి, ఎస్‌బిఐ, ఇండియన్ బ్యాంకు తదితర ఆర్థిక సంస్థలు ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటాయని ఆయన తెలిపారు.

చికిత్స తారుమారు

వైద్యుల నిర్లక్ష్యంతో రోగి మృతి

కర్నూలు వైద్యం, ప్రభ న్యూస్: ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఒకరికి అందించాల్సిన వైద్యం మరొకరికి అందించడం వల్ల వైద్యం వికటించి రోగి మృతి చెందాడు. ప్రభుత్వాసుపత్రి వైద్యులు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. న్యూరాలజీ విభాగం రోజూ రోగులతో కిటకిటలాడుతుంది. నిత్యం ఎంతో మంది రోగులు వైద్యసేవల కోసం వస్తుంటారు. ఆ విభాగంలోని వైద్యులతోపాటు సిబ్బంది కూడా రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో భాగంగా గత నెల 24న ఐజ మండలం రాజాపురం గ్రామానికి చెందిన భీమన్న అనే రోగి నరాల బలహీనత వల్ల కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని న్యూరాలజీ విభాగంలో చేరి చికిత్స పొందుతున్న సమయంలో అదేరోజున అనంతపురం జిల్లాకు చెందిన భీమప్ప ప్రమాదానికి గురై అదే వార్డులో చేరాడు. ఈ నేపథ్యంలో ఒకేపేరు ఉండటంతో కేసీట్లు తారుమారు కావడం వల్ల భీమప్పకు అందించాల్సిన వైద్యాన్ని మరో రోగి భీమన్నకు అందించడంతో రోగి మృతి చెందాడని రోగి బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజులలో డిశ్చార్జి కావాల్సిన భీమన్న మృతిచెందడం వల్ల కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై బాధ్యులపై చర్య తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.

యూపీయే సారథిగా రాహుల్‌గాంధీ!

(మొదటిపేజీ తరువాయి)

భావిస్తున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాల్లో పాగా వేసిన భారతీయ జనతా పార్టీని ఎదుర్కోవాలంటే ఇప్పుడున్న యూపీఏకు సాధ్యపడదని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఈ కూటమిలో కాంగ్రెస్ పార్టీ మినహాయిస్తే డీఎంకే ఒక్కటే పెద్ద పార్టీ. మిగతావన్నీ కనీసం ఒక రాష్ట్రంలోనైనా పూర్తిస్థాయి ప్రభావం చూపగలిగేవి కావు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, కేరళ కాంగ్రెస్ (ఎం), రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, కమ్యూనిస్టు మార్క్సిస్ట్ పార్టీ, కేరళ కాంగ్రెస్ (జాకబ్) పార్టీలు కేవలం కేరళకు మాత్రమే పరిమితమైనవి. అక్కడ కూడా రాష్ట్రమంతటా ప్రభావాన్ని చూపే స్థాయి పార్టీలు కాదు. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన పీస్ పార్టీ ఆఫ్ ఇండియా, రాష్ట్రీయ లోక్ దళ్, మహాన్ దళ్ పార్టీల పరిస్థితి కూడా అంతే. చెప్పుకోడానికి మొత్తం 10 పార్టీల కూటమిగా ఉన్నా, ఈ కూటమి 2019 ఎన్నికల్లో ఎన్డీయేకు ఏమాత్రం పోటీనిచ్చే పరిస్థితి లేదు. అందుకే కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలంటే అంతకంటే ముందు అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేను గద్దె దించాలి. అలాగని 2019 ఎన్నికల లోపు కేవలం సొంత బలంతో ఎన్డీయేను ఢీకొట్టే సత్తా కాంగ్రెస్ పార్టీకి లేదని ఆ పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ క్రమంలోనే సరికొత్త భాగస్వామ్య పార్టీలు, మిత్రపక్షాలను వెతుక్కునే పనిలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నిమగ్నమయ్యారు.

ద్రవిడ రాజకీయం

యూపీఏ కూటమిలో ఉన్న డీఎంకేతో దోస్తీ కోసం బీజేపీ అధినేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మధ్య ప్రధాని మోడీ తమిళనాడు పర్యటనలో డీఎంకే కురువృద్ధుడు కరుణానిధిని కలవడం చర్చనీయాంశంగా మారింది. జయ మరణం తర్వాత తమిళనాట మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో అన్నాడీఎంకే చీలికలు, విభేధాలతో రోజురోజుకీ బలహీనమవుతున్నాయి. జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసినా, అక్కడ సొంతంగా బలం పెంచుకోలేక పోతున్నాయి. సార్వత్రిక ఎన్నికల సమయానికి ద్రవిడ పార్టీలతో దోస్తీ చేయక తప్పని పరిస్థితి రెండు జాతీయ పార్టీలకు నెలకొంది. సహజంగా బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీనే మిత్రపక్షంగా ఎంచుకునేందుకు జాతీయ పార్టీలు ప్రయత్నిస్తుంటాయి. ఈ క్రమంలో ఇప్పుడు డీఎంకేవైపే రెండు పార్టీలు దృష్టి సారించాయి. ఎంతోకాలంగా ఊరిస్తూ తాజాగా రాజకీయాల్లోకి వస్తున్నానని అధికారికంగా ప్రకటించిన రజనీకాంత్ ఈసారి ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. సార్వత్రిక ఎన్నికల సమయానికి జాతీయ పార్టీలతో పొత్తు పెట్టుకుంటారా లేక ఒంటరిగానే పోటీ చేస్తారా అన్న విషయంపై రజనీ స్పష్టతనివ్వలేదు. ఏదెలా ఉన్నా ద్రవిడ రాజకీయాలు జాతీయస్థాయిలో కూటముల్లో తీవ్ర ప్రభావాన్నే చూపనున్నాయి. 2014లో అన్నాడీఎంకే ఏ కూటమిలో లేనప్పటికీ దేశవ్యాప్తంగా మోడీ హవాను ఎదుర్కొంటూ 39 స్థానాలకు ఏకంగా 37 గెలుచుకుంది. ప్రతిపక్షాల్లో కాంగ్రెస్ తర్వాత అత్యధిక స్థానాలు గెలుచుకున్న పార్టీగా అవతరించింది. తమిళనాట ప్రజలంతా దాదాపు ఒకేరకమైన తీర్పునిస్తూ ఉండడంతో జాతీయ పార్టీలు, కూటములు ద్రవిడ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి సారించాయి. తద్వారా ఇక్కడి నుంచి ఎక్కువ సీట్లు తన్నుకుపోవాలని చూస్తున్నాయి. ఈ క్రమంలో యూపీఏ రథసారథిగానూ బాధ్యతలు చేపట్టబోతున్న రాహుల్ గాంధీ, మిత్రపక్షం డీఎంకే చేజారిపోకుండా కాపాడుకోవాల్సిన తక్షణ అవసరం ఏర్పడింది.

బీహార్ ప్రయోగం స్ఫూర్తితో కొత్త మిత్రపక్షాల కోసం వేట

2014 ఎన్నికల్లో ఘన విజయం సాధించిన బీజేపీకి, ప్రధాని నరేంద్ర మోడీకి షాక్‌నిచ్చేలా బీహార్ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. బీజేపీని ఒంటరిని చేస్తూ జేడీ(యూ), ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలు కలిసికట్టుగా ఎన్నికల్లో పోటీ చేసి అద్భుత ఫలితాలు సాధించాయి. ఎన్నికల్లో చూపిన ఐక్యత, ప్రభుత్వాన్ని నడిపే విషయంలో చూపకపోవడంతో జేడీ(యూ) మళ్లీ ఎన్డీయే గూటికే చేరిపోయి మహాకూటమికి షాకిచ్చింది. ఈ సంగతెలా ఉన్నా, బీజేపీని ఒంటరిని చేస్తే గెలుపు ఖాయం అని ఈ ఫలితాలు తేటతెల్లం చేశాయి. బీజేపీని, మోడీని వ్యతిరేకించే రాజకీయ శక్తులను ఒక తాటిపైకి తీసుకొచ్చి, బలమైన మహాకూటమిని తయారు చేయాలని కాంగ్రెస్ పార్టీ చాలాకాలంగా ప్రయత్నిస్తోంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేస్తూ జాతీయస్థాయిలో పేరు తెచ్చుకుని ప్రధాని పదవి తన్నుకుపోయిన మోడీకి, అదే తరహాలో బీహార్ సీఎంగా మంచి పేరు తెచ్చుకున్న నితీష్ కుమార్‌ను ముందు పెట్టి 2019 ఎన్నికలకు వెళ్లాలని భావించింది. కానీ నితీష్ ఎన్డీయే గూటికి చేరడంతో కథ అడ్డం తిరిగింది. ఇప్పుడు నితీష్ లేకపోయినా, ఈ ఆలోచన విరమించేది లేదని రాహుల్ గాంధీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ సారథ్యంలోనే మోడీని ఎదుర్కొనే మహాకూటమిని తయారు చేయడం కోసం రాహుల్ నడుం బిగించారు. వివిధ రాష్ట్రాల్లో బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలను తమ కూటమిలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.



కలిసొచ్చిన గుజరాత్ ఫలితాల్లో పురోగతి

రాహుల్ గాంధీ చేస్తున్న ప్రయత్నాలకు తాజాగా గుజరాత్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దోహదం చేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించలేకపోయినా, బీజేపీకి మాత్రం ముచ్చెమటలు పట్టించింది. ఎన్నికల ప్రచారం విషయంలోనూ రాహుల్ గాంధీకే ఎక్కువ మార్కులు పడ్డాయి. బీజేపీ తరపున అన్నీ తానే అయ్యి రంగంలోకి దిగిన ప్రధాని మోడీ తన స్థాయికి తగ్గట్టుగా కాకుండా మరీ దిగజారి ప్రచారం చేశారని విమర్శలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ వ్యాఖ్యలపై స్పందించిన తీరు ఒక ఎత్తయితే, పాకిస్తాన్‌తో కలిసి తనను చంపేందుకు కుట్ర పన్నారని బేలతనం ప్రదర్శించడం మరో ఎత్తు. ఇవి రాజకీయంగా బీజేపీకి ఎంత ఉపయోగపడ్డాయన్నది పక్కన పెడితే, ప్రచారపర్వంలో రాహుల్ గాంధీయే ఎక్కువ మార్కులు సాధించారు. హుందాగా ప్రచారం చేశారని, వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే విమర్శలను సైతం ఎదుర్కొంటూ, వ్యక్తిగత దూషణల జోలికి వెళ్లకుండా ప్రచారం చేశారని విమర్శకుల నుంచే ప్రశంసలు అందుకున్నారు. దీంతో రాహుల్ గాంధీకి దేశవ్యాప్తంగానూ కొంత గ్రాఫ్ పెరిగిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. బీజేపీని మతతత్వ పార్టీగా చెబుతూ దూరం పెట్టే ఇతర రాజకీయ పార్టీలను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు ఈ గ్రాఫ్ ఎంతో కొంత ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. పైగా ఇన్నాళ్లూ పార్టీని బాగా నష్టపరిచిన మితిమీరిన సెక్యులరిజాన్ని కాస్త పక్కన పెట్టి, సాఫ్ట్ హిందూత్వాన్ని ప్రదర్శిస్తూ హిందూ ఓట్లు చేజారిపోకుండా కాపాడుకుంటున్న తీరుపై ఇప్పుడు చర్చ జరుగుతోంది.

పనిలో పనిగా ప్రతిపక్ష నేత బాధ్యతలు

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలన్నా, మరిన్ని రాజకీయ పార్టీలను ఆకట్టుకుని యూపీఏ కూటమిని మహాకూటమిగా తీర్చిదిద్దాలన్నా ముందు తన గ్రాఫ్ పెంచుకోవాలని రాహుల్ గాంధీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం వీలైనంతగా ప్రభుత్వంపై అంశాలవారి దాడి చేసే అవకాశాలను పెంచుకోవాలని చూస్తున్నారు. ఈ క్రమంలో లోక్‌సభలో అధికార కూటమిని ధీటుగా ఎదుర్కోవాలంటే, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ మాట్లాడే అవకాశాన్ని కూడా పెంచుకోవాలని, ఇందుకోసం ప్రతిపక్ష నేత బాధ్యతలు చేపట్టాలని రాహుల్ గాంధీ భావిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం పార్టీ సీనియర్ నేత మల్లికార్జున్ ఖర్గే ఈ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఖర్గే బాధ్యతలను గత ఏడాది మే లోనే రాహుల్ గాంధీ చేపడుతున్నారని ప్రచారం జరిగింది. ఆ సమయంలో ఖర్గేకు కర్ణాటక ఎన్నికల బాధ్యతలు అప్పగిస్తారని కూడా కథనాలు వెలువడ్డాయి. ఇప్పుడు తాజాగా పార్టీ పగ్గాలు చేపట్టిన రాహుల్ గాంధీ, లోక్‌సభలోనూ పార్టీ నేతగా ఉంటే మరింత అదనపు మైలేజీ లభిస్తుందని భావిస్తున్నారు. ప్రతిపక్ష నేతగా సభలో మాట్లాడేందుకు ఎక్కువ సమయం పొందే అవకాశం ఉంది. అందుకే ఖర్గే నుంచి ఈ బాధ్యతలు తీసుకుంటూ, ఆయన హోదాకు ఇబ్బంది లేకుండా పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్‌గా కొనసాగించాలని రాహుల్ గాంధీ భావిస్తున్నారని సమాచారం. బడ్జెట్ సమావేశాల లోపే ఈ కొత్త బాధ్యతల స్వీకరణ ఉంటుందని ఏఐసీసీ నేతల్లో చర్చ జరుగుతోంది. పార్టీలో ఏఐసీసీ నుంచి అన్ని రాష్ట్రాల పీసీసీల వరకు సమూలంగా ప్రక్షాళన చేసేందుకు నడుం బిగించిన రాహుల్ గాంధీ, పనిలో పనిగా ఈ రెండు కొత్త బాధ్యతల్ని కూడా చేపడతారని తెలుస్తోంది.

గుడిలో విషాదం

- ప్రదక్షిణ చేస్తున్న బాలుడిపై విరిగిపడ్డ కొబ్బరి చెట్టు
- అక్కడికక్కడే బాలుడి మృతి

కమ్మర్‌పల్లి, ప్రభ న్యూస్ : నిజామాబాద్ జిల్లా, ఉప్లూర్ గ్రామంలో గల బాల రాజ రాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం కొబ్బరిచెట్టు విరిగి బాలుడి తలపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ మురళీ చెప్పిన వివరాల ప్రకారం కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన పోతంకర్ రాణి ఇద్దరు కుమారులు రాహుల్, మణికంఠతో కలిసి ఉప్లూర్ గ్రామంలోని బాలరాజరాజేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. సంవత్సరం మొదటి రోజు కావడంతో దైవదర్శనానికై వెళ్లిన వారు ఆలయంలో ప్రదక్షిణలు చేస్తుండగా ఆలయ ప్రాంగణంలో కొబ్బరిచెట్టు విరిగి రాణి చిన్న కొడుకు అయిన మణికంఠ (13) తలపై పడడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మణికంఠ హైదరాబాద్‌లోని కెకెఆర్ గౌతమి స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు.

వాట్సాప్..హ్యాండ్సప్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వాట్సాప్.. న్యూ ఇయర్ ప్రారంభంలోనే చేతులెత్తేసింది. ప్రపంచవ్యాప్తంగా కొత్తేడాది శుభాకాంక్షలు చెప్పేందుకు ఎంతో ఉత్సాహంగా ఉన్న వారిని నిరుత్సాహపరిచింది. జనవరి 1వ తేదీ ప్రారంభం అయిన తర్వాత కొన్నిగంటల్లోనే పలుమార్లు మొరాయించింది. మెసేజ్ వెళ్ళకపోవడం, సమాచారం రాకపోవడంతో నెటిజన్లు కొద్దిసేపు ఇబ్బందిపడ్డారు. ఆస్ట్రేలియా, యుకెతో సహా చాలా దేశాల్లో ఇదే పరిస్థితి ఏర్పడింది. ఇండియాలో సరిగ్గా అర్ధరాత్రి 12గంటల నుండి ఒంటిగంట వరకు వాట్సాప్ పనిచేయలేదు. అపుడపుడూ వస్తూ పోతూ ఉంది. ఒంటిగంట తర్వాత పూర్తిస్థాయిలో పనిచేయడం ప్రారంభమైంది. గంటపాటు నెటిజన్ల సహనాన్ని పరీక్షించింది. లక్షల మంది ఒకేసారి.. ఒకే సమయంలో ఉపయోగించడం వల్ల సర్వర్ సమస్యలు వచ్చాయని వాట్సాప్ ప్రకటించింది. కొత్తేడాదిలో కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని.. క్షమాపణలు చెప్పింది.

'ట్రాక్'తో రహదారుల రూపురేఖలు మార్పు

- 5,107 కి.మీ.ల కొత్త రోడ్ల నిర్మాణం
- ఆర్అండ్‌బీశాఖ మాస్టర్ ప్లాన్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండల కేంద్రాలను కలిపి తెలంగాణ రహదారుల అభివృద్ధి పథకం (ట్రాక్) రహదారులు,భవనాల శాఖ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ఆమోదం తర్వాత ఈ పథకాన్ని చేపట్టాలని ఈ శాఖ నిర్ణయించింది.ఈ పథకం ద్వారా అదనంగా మండలాలకు రోడ్ల ఏర్పాటుతో పాటు పారిశ్రామిక మండళ్లు, పర్యాటక కేంద్రాలు, వ్యవసాయ మార్కెట్లకు కూడా అనుసంధానం చేయడం ఈ పథకం విశేషం. దీనివల్ల రైతులు,వ్యాపారులతో పాటు ప్రజలకు కూడా ప్రయోజనం కలగనుంది. మరోవైపు రాష్ట్ర మంతటా రహదారులు ఉన్న రాష్ట్రంగా హైదరాబాద్ చరిత్ర సృష్టించనుంది.గతంలో ఎన్నడూలేని విధంగా ఈ బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. అందుకు అవసరమయ్యే నిధులను బడ్జెట్‌తో నిమిత్తం లేకుండా ఆర్ అండ్‌బి శాఖ సమీకరించుకునేందుకు ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలోఆర్అండ్‌బి రోడ్ల పొడవు 25,792 కిలోమీటర్లు కాగా, ఇతర శాఖల నుంచి బదలీ అయిన రోడ్లు 42,053 ఉండాలని ఈ శాఖ మాస్టర్ ప్లాన్ సిద్ధం



చేసింది. ట్రాక్ పథకం ద్వారా 5,107 కిలోమీటర్ల కొత్త రోడ్లు నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 31 జిల్లాలు ఉండగా, వాటిలో 30 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. కొత్తగా మరో 425 మండలాలలో రహదారుల నిర్మాణం చేపడతారు. ప్రస్తుతం రాష్ట్రంలో 387 పారిశ్రామిక మండళ్లు ఉండగా వాటిలో 164 పారిశ్రామిక మండళ్లను కలుపుతూ రోడ్లు వేస్తారు. అదే విధంగా గుర్తించిన 207 పర్యాటక కేంద్రాలలో 87 కేంద్రాలకు రహదారుల సౌకర్యం ఏర్పడుతుంది.

అంతేగాక 192 వ్యవసాయ మార్కెట్లలో 91 మార్కెట్లకు రహదారులను ఏర్పాటు చేస్తారు. ఈ పథకానికి నిధుల సేకరణకై ప్రభుత్వం ప్రత్యేకంగా స్టేట్ రోడ్ ఫండ్ (ఎస్ఆర్ఎఫ్) ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలిస్తోంది. ఈ నెలలోనే సీఎం కేసీఆర్ ఆమోదంతో ట్రాక్ పథకాన్ని చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది.

మూడింట ఒకటి తప్పే

- భూ దస్త్రాల పరిశీలనలో వివాదాస్పద భూములు 74 లక్షల ఎకరాలు
- అనేక అక్రమాలు బట్టబయలు
- పార్ట్–బీలో భారీగా వివాదాలు

హై దరాబాద్, ఆంధ్రప్రభ: ప్రతీ మూడు రికార్డుల్లో ఒకటి వివాదమేనని తేలింది. దశాబ్దాలుగా నవీకరణ, పరిశీలనకు నోచని భూముల అవకతవకలు భారీగా బైటికివచ్చాయి. సమగ్ర భూ సర్వే ప్రాధాన్యతను దస్త్రాల పరిశీలన వెలుగులోకి తెచ్చింది. తక్షణం మరింత పకడ్బంధీగా ఫీల్డ్‌లెవల్‌లో భూ సర్వే ఆవశ్యకతను ఇది నిర్ధారించింది. కొత్తగా సర్వే నెంబర్ల ప్రకటన, ఎలాంటి సర్వే నెంబర్లు లేనిభూముల వివరాలు, అసలు రికార్డుల్లోనే లేని గ్రామాలు, ఖాతా నెంబర్లు లేకుండా ఉన్న భూములు, పట్టా ఒకరిదైతే పొజిషన్‌లో మరోకరు, అమ్మినా యాజమాన్య హక్కు మారని వివరాల వంటివి దాదాపు 54 అంశాలతో కూడిన అక్రమాలై బైటడ్డాయి. అంతిమంగా షెడ్యూల్ నాటికి పూర్తయిన భూ దస్త్రాల పరిశీలన మరెన్నో అనుమానాలు, ఆవశ్యకతలను వెలిబుచ్చింది.

భూ రికార్డుల ప్రక్షాళనతో తప్పులన్నీ బైటికి వచ్చాయి. 100 రోజులపాటు నిర్విఘ్నంగా యజ్ఞంలా సాగిన భూ దస్త్రాల పరిశీలనతో రాష్ట్రంలోని మొత్తం విస్తీర్ణంలో పావు వంతు వివాదమయమేనని తేల్చారు. మొత్తం 2కోట్ల 40లక్షల 71 వేల 495 ఎకరాల భూ విస్తీర్ణంలో 74లక్షల 42వేల 910 ఎకరాల భూ విస్తీర్ణం వివాదాస్పదమేనని గుర్తించి పార్ట్-బిలో చేర్చారు. మొత్తంగా కోటి 76లక్షల81వేల 621 ఎకరాల భూమిని వివాదరహితంగా తేల్చారు. మొత్తం క్లీయర్ చేసిన భూముల వివరాల శాతం భూ రికార్డుల ప్రక్షాళన పూర్తినాటికి 85.61శాతానికే పరిమితమైంది. చిన్నపాటి వివాదాలను కూడా సరిచేయకుండా అధికారులు వాటిని వివాదాస్పద భూముల జాబితాలోకి చేర్చారని, పార్ట్-బి కింద నోటీసులు ఇచ్చి వాటిని ప్రభుత్వ ఆదేశాల తర్వాతే పరిశీలనలోకి తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. మొత్తం 10874 గ్రామాలకుగానూ సోమవారం నాటికి 10767 రెవెన్యూ గ్రామాల్లో పరిశీలన ఆరంభమైంది. అయితే పూర్తిస్థాయిలో 220 గ్రామాల్లో మాత్రమే పరిశీలన సమగ్రంగా పూర్తయినట్లు తేలింది. కోటి 78లక్షల 91వేల 342 సర్వే నెంబర్లకుగానూ 1,32,62,887 సర్వే నెంబర్లు క్లీయర్‌గా ఉన్నాయని నిర్ధారించారు.



భూ రికార్డుల పరిశీలన గ్రామసభలో దస్త్రాలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

రాబడి బాటలో రవాణాశాఖ

- వార్షిక రాబడి లక్ష్యం రూ.3,401 కోట్లు
- నవంబర్ నాటికి రాబడి రూ.2135 కోట్లు
- 93శాతం లక్ష్యం సాధించిన ఆర్టీఏ





సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్టీసీ ఎండీ రమణారావు, అధికారి కిరణ్, రవాణా మంత్రి మహేందర్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న రవాణాశాఖ అధికారులు, ఆర్టీసీ ఎండీ రమణారావు తదితరులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రవాణా శాఖ రాబడుల లక్ష్యానికి చేరు కుంటుంది. లక్ష్యానికి మించి రాబడి సాధించేందుకు చర్యలు తీసుకుం టుంది. ప్రభుత్వం 2017 -18 ఆర్థిక సంవత్సరానికి రవాణా శాఖ రాబడిని రూ. 3401 కోట్లుగా నిర్ణయించింది. నవంబర్ మాసాం తానికి రూ. 2136.60 కోట్లు వసూలు చేసిన రవాణా అధికారులు రాబోవు మూడు మాసాల కాలంలో రూ. 1265 కోట్లు జమ చేస్తే సరిపో తుంది. కాని అధికారులు అంతకు మించి రాబడి ఉంటుందని ఆశిసున్నారు. డిసెంబర్ 31 నాటికి రూ. 2436 కోట్లు ప్రభుత్వ ఖజానాలో జమ చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. అత్యధిక జిల్లాలు ఇప్పటికే 90 శాతం వరకు లక్ష్యాలను సాధించాయి. మరో పది శాతం రాబడి జమ చేయడం పెద్ద సమస్య కాబోదని అధికారులు పేర్కొన్నారు. జనవరిలో వాహనాల రిజిస్ట్రేషన్లు పెరిగే అవకాశం ఉందని, ఫిబ్రవరి, మార్చిలో కూడా వాహన కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉన్నందున ఆర్టీఏ రాబడికి ఢోకా లేదని ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2016 -17 ఆర్థిక సంవత్సరంలో నవంబర్ 30 నాటికి రూ. 1757.97 కోట్లు ఆర్జించిన రవాణా శాఖ, 2017 -18 ఆర్థిక సంవత్సరం నవంబర్ 30 నాటికి రూ. 2136.61 కోట్లు వసూలు చేయగలిగింది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 21.54 శాతం ఆదాయం

ప్రజారవాణా మెరుగుకు పటిష్ట చర్యలు: మంత్రి మహేందర్ రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో ప్రజారవాణా వ్యవస్థను మరింతగా మెరుగుపర్చడానికి చర్యలు తీసుకుం టున్నామని రవాణా శాఖ మంత్రి పి.మహేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావును కలుసుకొని నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. అంతకు ముందు రవాణా శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు, రాష్ట్ర ఎంవీఐల సంఘం అధ్యక్షులు పాపారావు. కార్యదర్శి పుప్పాల శ్రీనివాస్ తదితరులు మంత్రిని తన నివాసంలో కలుసుకొని నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో రవాణా వ్యవస్థ, రవాణాశాఖ ఆధునీకరణపైన ఈ సందర్భంగా మంత్రి చర్చించారు. . కొత్త బస్సుల కొనుగోలు, గ్రేటర్‌లో మెట్రోతో ఆర్టీసీ అనుసంధానం మరింతగా విస్తరించడం గురించి మాట్లా డారు. ప్రమాదాలను నివారించడానికి చర్యలు తీసుకోవాలని రవాణా అధికారులకు సూచించారు. ఆర్టీసీ కార్యనిర్వాహక సంచాలకులు సత్యనారాయణ, రవీందర్, పురుషోత్తం నాయక్, జేటీసీలు రమేష్, డీటీసీలు ప్రవీణ్‌రావు, ఎంవీఐలు, ఓఎస్‌డిలు సుధాకర్‌రెడ్డి, కృష్ణకాంత్ తదితరులు మంత్రి జరిపిన చర్చల్లో పాల్గొన్నారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు, సీనియర్ పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ జి.ఆర్. కిరణ్‌లు ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావును కలుసుకొని నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ వ్యవహారాలపై కొద్దిపాటి చర్చ జరిగిందని తెలిసింది. బస్సు రవాణాను మెరుగుపర్చడానికి తీసుకుంటున్న చర్యలను జి.వి.రమ ణారావు ముఖ్యమంత్రికి వివరించారు.

పెరిగిందని రవాణా శాఖ ఉన్నతాధికారులు తెలియచేశారు.

ప్రభుత్వం లెక్కల ప్రకారం వాహనాల త్రైమాసిక పన్ను రూ. 474.72 కోట్లు, రుసుములు రూ. 298.62 కోట్లు, యూజర్ ఛార్జీలు రూ. 78.36 కోట్లు, ఎన్‌ఫోర్స్‌మెంటుతో రూ. 199.34 కోట్లు వసూలు చేయవలసి ఉంది. ఈ మేరకు అధికారులు జిల్లాల వారిగా టార్గెట్లను ఖరారు చేసి చర్యలు తీసుకు న్నారు. దీంతో అధికార యంత్రాంగం కదిలి పని చేసింది. రాబడుల లక్ష్యాలను సాధించడంలో మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, సిద్దిపేట జిల్లాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నాయి. మిగతా జిల్లాలు కూడా 92 నుండి 94 శాతం లక్ష్యాలను సాధించాయి. బాగా వెనుకబడిన జిల్లాల్లో పరిస్థితిని అధికారులు సమీక్షిస్తున్నారు.

రాబడికి గండి పడేందుకు గల కారణాలపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంటును కట్టుదిట్టం చేయడంతో రాబడి పెంచే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. తమ శాఖ లక్ష్యాన్ని మించిన రాబడిని సాధించగలదే ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్ని స్థాయిల్లో అవసరాలకై ఖ మేరకు అధికారులు, సిబ్బంది లేకున్నప్పటికీ వినియో గదారుల సేవలకు ఆటంకం కలగని విధంగా చర్యలు తీసుకుంటున్నా మని, రవాణా రాబడిని లక్ష్యం మేరకు సాధించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఉన్నతాధి కారులు వెల్లడించారు. యూజర్ ఛార్జీల రాబడి ఆశాజనకంగా ఉందన్నారు. త్రైమాసిక పన్ను ఆశించిన మేరకు వసూలవుతుందని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 113.18 శాతం, జోగులాంబ గద్వాల జిల్లాలో 101 శాతం, సిద్ధిపేట జిల్లాలో 99.35 శాతం రాబడులను జమ చేయడం జరిగిందన్నారు. పెద్దపల్లి, నిజామాబాద్, సూర్యా పేట, కరీంనగర్, నల్లగొండ, కరీం నగర్, జగిత్యాల, రంగారెడ్డి, నాగర్ కర్నూలు, హైదారాబాద్, యాదా ద్రి భువనగిరి, వరంగల్ అర్బన్, వికారాబాద్ జిల్లాల్లో ఇప్పటికే 92 నుండి 98 శాతం వరకు రాబడి లక్ష్యాలను సాధించడం జరిగిం దన్నారు. మిగతా జిల్లాల్లో కొంత వరకు రాబడి ఆశించిన మేరకు లేనప్పటికీ మార్చి మాసాంతానికి లక్ష్యాలను చేరుకొనే విధంగా ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 54 రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి. కార్యాలయాల వారిగా ప్రగతి నివేదికలను తెప్పించుకొని అధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు. పనితీరులో బలహీనంగా ఉన్న విభాగాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

భవిష్యత్తులో అధికారం మనదే

- ఆత్మీయ సమ్మేళనంలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్





హుజూర్‌నగర్, ప్రభన్యూస్ : భవిష్యత్తు మనదే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు సంబంధించిన ప్రజలతో సోమవారం హుజూర్‌నగర్ బైపాస్ రోడ్డులో గల బూర నారాయణ తోటలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌ది తుగ్లక్ పరిపాలన అని సాధ్యంకాని హామీలు ఇస్తూ కాలం వెల్లబుచ్చుతున్న ఈ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దళితులకు మూడు ఎకరాలు, డబుల్ బెడ్‌రూం ఇల్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పూర్తిగా విఫలం చెందారని ఆరోపించారు. మిషన్ భగీరథ, గొర్రెలు, బర్రెల పంపిణీ పథకాల్లో భారీ కుంభకోణం దాగి ఉందని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తే విజయం తథ్యమన్నారు. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో 50 వేల మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత ఈ ప్రాంత ప్రజలపై ఉందన్నారు. ఈ రెండు నియోజకవర్గాల ప్రజలే తమ బిడ్డలుగా భావిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి ఈ ప్రభుత్వంలో జరగలేదన్నారు. పేదల సమస్యలు పట్టకుండా కార్పొరేట్ సంస్థలకు వంతపాడుతున్న ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అసమర్థ పాలనపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి, పలు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




గవర్నర్ నరసింహన్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న సీఎం కేసీఆర్, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి



సీఎంను ఆశీర్వదిస్తున్న వేద పండితులు, చిత్రంలో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న డీజీపీ మహేందర్ రెడ్డి

ఆలయాలు కిటకిట



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కొత్త సంవత్సరం దేవుళ్ళను దర్శించుకుంటే అంతా మంచి జరుగుతుందన్నది ప్రజల ప్రగాఢ విశ్వాసం. దీంతో నూతన సంవత్సరం ఆరంభమైన సోమవారంనాడు గ్రేటర్ పరిధి లోని పలు దేవాలయాలు కిటకిటలాడాయి. భక్తుల క్యూలతో నిండిపోయాయి. తెల్లవారు జాము నుంచి మొదలుకుని రాత్రి వరకు ప్రధాన దేవాలయాల్లో భక్తుల రద్దీ విపరీతంగా కనిపించింది. కొన్ని దేవాలయాల్లో అయితే దర్శనం కోసం రెండు, మూడు గంటలసమయం పట్టింది అంటే....ఆ స్థాయిలో రద్దీ ఉందో ఊహించవచ్చు. పైగా కొత్త సంవత్సరం సోమవారం రోజున రావడంతో శివాలయాల్లో భక్తుల రద్దీ మరింతగా కనిపించింది. తెల్లవారు జామునుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఈ పరిస్థితి ప్రధానంగా నగరంలోని తిరుమల, తిరుపతి దేవాస్థానంతో పాటు చిక్కడపల్లిలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం, సైఫాబాద్ పరిధిలోని బిర్లాటెంపుల్, జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మతల్లి దేవాలయం, చిలుకూరు వెంకటేశ్వరస్వామి దేవాలయం, కీసరగుట్టలోని రామలింగశ్వరస్వామి, సికింద్రాబాద్‌లోని మహంకాలి దేవాలయం, శ్రీ విజయ గణపతి వంటి దేవాలయాలు ఉన్నాయి. అలాగే పద్మారావునగర్‌లోని స్కంధగిరి టెంపుల్, దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా దేవాలయాల్లో కూడా పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

అందరూ బాగుండాలి

ప్రజలకు గవర్నర్ కొత్త సంవత్సర శుభాకాంక్షలు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : బాగున్నారా ..? ఎలా ఉన్నారు ..మీకందరికీ నూతన సంవత్సరం శుభాకాంక్షలు. నూతన సంవత్సరంలో అందరూ బాగుండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. కొత్త సంవత్సరం 2018 లో అడుగుబెట్టిన సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ సోమవారం రాజ్‌భవన్‌లోని దర్బార్ హాలులో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గవర్నర్ నరసింహన్‌తో పాటు ఆయన సతీమణి విమలా నరసింహన్ కూడా పరిచయం ఉన్న వారితో కలిసిపోయి మాట్లాడారు. ఎలా ఉన్నారు.. బాగున్నారా అని అడగడంతో పాటు బాగా పరిచయం ఉన్నవారితో పిల్లలు ఎలా ఉన్నారని అడగటంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఉదయం 11గంటలకు మొదలైన ముఖాముఖి కార్యక్రమం 12.15 నిమిషాలకు ముగిసింది. గంటా 15 నిమిషాల పాటు గవర్నర్ దంపతులు ఓపికతో హుషారుగా ప్రజలతో మాటలు పంచుకున్నారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అందరి కంటె ముందు వచ్చి గవర్నర్‌కు నూతన సంవత్సరం శుభాకాంక్షలు చెప్పారు. శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, మాజీ చైర్మన్ ఎ చక్రపాణి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ సహచర ఐఏఎస్‌లతో వచ్చి గ్రీటింగ్స్ చెప్పారు. డీజీపీ మహేందర్ రెడ్డి పోలీస్ అధికారులతో పాటు వచ్చి బోకేలు, పుష్పగుచ్ఛాలు శుభాకాంక్షలు చెప్పారు. ప్రభుత్వసలహాదారులు అనురాగ్ శర్మ, ఏకే ఖాన్, సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ రాజా సదారాం, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు,



సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్, రహదారులు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేదీ,ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్ధనరెడ్డి, హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, కలెక్టర్ యోగితా రాణా నగర పోలీస్ కమీషనర్ వివి శ్రీనివాసులు, సైబరాబాద్ పోలీస్ కమీషనర్ సందీప్ శాండిల్య, రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు. అధికారులు గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ముఖాముఖి అనంతరం గవర్నర్ మీడియాతో మాట్లాడారు. న్యూ ఇయర్ గ్రీటింగ్స్ చెప్పారు. కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

గవర్నర్, హైకోర్టు సీజేలకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సోమవారం గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌తో భేటీ అయ్యారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గవర్నర్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అక్కడి నుంచి ఉమ్మడి హైకోర్టులో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్ ఇంటికి వెళ్ళి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రగతి భవన్‌కు వచ్చిన పవన్ కళ్యాణ్‌తో సమావేశమయ్యారు.

ప్రగతి భవన్‌లో శుభాకాంక్షల వెల్లువ

శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేవీ రమణాచారి, వినోద్, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, మిషన్ భగీరథ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ లోక భూమారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, సీనియర్ ఐఏఎస్ అధికారులు, డీజీపీ మహేందర్‌రెడ్డితో పాటు ఇతర ఐపీఎస్ అధికారులు, విద్యుత్, సింగరేణి, ఆర్టీసీ అధికారులు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

కోరుట్లలో జన'ఘణ'మన

- ఇకపై రోజూ జాతీయ గీతాలాపన
- 101 మువ్వన్నెల జెండా ఆవిష్కరణ



కోరుట్ల, ప్రభ న్యూస్ : పట్టణానికి చెందిన కోరుట్ల కిరాణా వర్తక సంఘం ఆధ్వర్యంలో జరిగిన నిత్యజనగణ మన కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. దేశభక్తి జాతీ యతా భావాన్ని పెంపొందించేందుకు 101 జాతీయ జెం డాల ఆవిష్కరణతో విశిష్టమైన కార్యక్రమాన్ని చేపట్టినం దుకు కిరాణా వర్తక సంఘం సభ్యులు ప్రముఖులు అభినం దించారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి సారిగా 101 జెండాలు ఆవిష్కరించి, నిత్యజనగణమన కార్యక్రమం ప్రతిష్ఠాత్మకమైందని, తెలంగాణ రాష్ట్రంలోనే కోరుట్ల పట్టణంలో అరుదైన రికార్డు సాధించిందని, నిత్య జాతీయ గీతాలాపన జరగడం విశేషమని, నేటి నుంచి ప్రతిరోజు ఉదయం 9గంటలకు జాతీయగీతం మైకుల ద్వార ప్రసారం చేస్తారని ప్రతి ఒక్కరు విధిగా జాతీయగీ తానికి గౌరవమిస్తు ఎక్కడివారు అక్కడే ఆగిపోయి జెండా వందనం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో కులమత లాకు అతీతంగా జాతీయ భావాన్ని పెంపొందించుకోని దేశాన్ని రక్షించుకోవాలని, జనగణమన జాతీయగీతం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని కొనియాడారు.

10వేల గ్రామాలకు 'భగీరథ'

- డిసెంబర్ చివరి నాటికి నీరందించాలన్న సంకల్పం పూర్తి
- మొత్తం 25వేల ఆవాసాలకు సురక్షిత మంచినీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- సీఎం ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన మిషన్ భగీరథ పనులు
- ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టుకోవడంలో సఫలీకృతమైన యంత్రాంగం
- గూగుల్ మ్యాప్ ద్వారా మిషన్ భగీరథ పనుల పర్యవేక్షణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశ చరిత్రలోనే ఇదివరకు ఎన్నడూ లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఎంచు కున్న మిషన్ భగీరథ పథకం 2017 లక్ష్యా న్ని చేదించింది. గడువులోగా పనులు పూర్తిచేసి ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టు కోవాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నిబద్ధతను నిరూపించుకుంది. ఈ ఏడా ది డిసెంబర్ నాటికి 10వేల జనావాస ప్రాంతాలకు నీరందించే పనులు దాదాపు పూర్తయ్యాయి. లక్ష్య సాధన కోసం భగీరథ పనులను రెండు భాగాలుగా విభజించారు. పార్టు-1 పనులను 2017 డిసెంబర్ 31లోగా పూర్తిచేయాలని, 2018 జూన్ నాటికి పార్టు-2 పనులను పూర్తి చేయా లని ప్రభుత్వం నిర్దేశించింది. పైపులైన్ల ద్వారా నీరు సరఫరా చేయడం ప్రారంభించిన తర్వాత కొద్ది నెలలపాటు లీక్ కావడం, ఒత్తిడి తట్టుకోలేక పగిలిపోవడం, వాల్వ్ ల వద్ద సమస్యలు తలెత్తడం లాంటి సహజమైన సమస్యలు తలెత్తాయి. అధికార యంత్రాం గం వాటిని అధిగమించి విజ యం సాధించింది. రాష్ట్రంలో చేపట్టిన మిషన్ భగీరథ పథకం భావి తరాలు జీవితాంతం గుర్తుంచుకునేలా మిగులుతోంది. దేశానికే ఆదర్శంగా నిలిచే ఈ పథకాన్ని రికార్డు సమయంలో పూర్తి చేయడం అందరికీ గర్వకారణమని సీఎం కేసీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. 25వేల ఆవాస ప్రాంతాలకు శుద్ధిచేసిన మంచినీటిని ప్రతిరోజూ ఇంటిం టికీ అందించేగొప్ప పథకం దేశం లో మరెక్కడా లేదని సామాజిక విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ఈ పథకాన్ని నీతి ఆయోగ్‌తో పాటు అనేక రాష్ట్రాలు మెచ్చుకున్నాయి. తెలంగాణ ఆదర్శం గా పొరుగు రాష్ట్రాలు తమ రాష్ట్రంలో కూ డా అమలు చేయాలన్న దిశగా అధ్య యనం చేస్తున్నాయి. పార్టు-1లో భాగంగా ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి రాష్ట్రంలోని 10 వేల ఆవాస ప్రాంతాలకు శుద్ధి చేసిన నదీజలాలను నూతన సంవత్సర కానుకగా అందిం చాలని సీఎం సంకల్పం నెరవే రింది. పార్టు-2 కింద గ్రామా ల్లో ప్రతీ ఇంటికి మంచినీరు అందించేందుకు అవసరమైన అంతర్గత పైపులైన్ల నిర్మాణం, నల్లాల ఏర్పా టు లాంటి పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న మిషన్ భగీరథ పనులను సీఎం కేసీఆర్‌తో పాటు సంబంధిత ఉన్నతాధికారులు గూగుల్ మ్యాప్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. జిల్లాల వారీగా, సెగ్మెంట్ల వారీగా ఇంటెక్‌వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, ఓహెచ్‌బీఆర్‌ల నిర్మాణం, పైపులైన్ల నిర్మాణం, ఎలక్ట్రో మోటార్ పనులు పురోగతి దిశగా కొనసాగుతున్నాయి. మొత్తం 24,225 ఆవాస ప్రాంతాలకు మంచినీరు అందించాలనే లక్ష్యంలో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్ నాటికే 3,431 గ్రామాలకు మంచినీరు అందించారు. అక్టోబర్ చివరి నాటికి మరో 5,443 గ్రామాలకు నీరందించగలిగారు. నవంబర్ చివరి నాటికి మరో 6,006 గ్రామాలకు, డిసెంబర్ చివరి నాటికి 9,345 గ్రామాలకు మంచినీరు అందించాలన్న లక్ష్యాన్ని చేరుకున్నారు. మిగతా జనావాస ప్రాంతాలకు పైపులైన్ల నిర్మాణంతో పాటు మోటార్లు బిగించేపనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి.

పరిశ్రమలకు భగీరథ నీరు

మిషన్ భగీరథ ద్వారానే పరిశ్రమలకు కూడా శుద్ధిచేసిన మంచి నీటిని అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మంచినీరు అవసరం ఉన్న పరిశ్రమల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. వారికోసం ప్రత్యేకంగా పైపులైన్లు వేసి నిరంతరం నీటి సరఫరా చేయాలని సీఎం ఆదేశాలిచ్చారు. మిషన్ భగీరథకు కేటాయించిన దాదాపు 80 టిఎంసిల నీటిలో 10శాతం పరిశ్రమలకు అందించే వెసులుబాటు కల్పించారు. హైదరాబాద్ మహానగర మంచినీటి అవసరాల కోసం 10 టిఎంసిలు కేటాయించారు. డెడికేటెడ్ రిజర్వాయర్ కడుతున్నందున అక్కడి నుంచి పరిశ్రమలకు నీరందించడం సాధ్యమవుతుందని తెధజకారులు భావిస్తున్నారు. కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయితీలకు కూడా మిషన్ భగీరథ ద్వారానే సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ధేశించింది.

మునుగోడు, దేవరకొండకు ప్రథమ ప్రాధాన్యం

ఫ్లోరైడ్ పీడిత మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి మొదటి దశలో మంచినీరు అందించారు. ఈ రెండు నియోజకవర్గాల్లో అక్టోబర్ చివరి నాటికే పనులు పూర్తిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోని గిరిజన తండాలు, దళితవాడలు, గోండుగూడేలకు నూటికి నూరుశాతం మంచినీరు అందించాలన్న లక్ష్యంతో అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో, నిబద్ధతతో పని చేస్తోంది.

విద్యుత్ శాఖకు సీఎం అభినందన

మిషన్ భగీరథకు కావా ల్సిన విద్యుత్‌ను అందించ డానికి విద్యుత్ శాఖ చేసిన ఏర్పాట్లను సీఎం కేసీఆర్ అభినందిం చారు. మిషన్ భగీరథ కోసం చేపట్టిన పనులన్నీ అక్టోబర్ 2 నాటికే అధికారు లు పూర్తి చేశారు. 2017, డిసెంబర్ 31 లక్ష్యంగా మిష న్ భగీరథ పనులు చేపట్టగా, విద్యుత్ శాఖ మాత్రం రెండు నెలల ముందే తమకు అప్పగిం చిన బాధ్యతలను నెరవేర్చింది. రూ.300 కోట్ల అంచనా వ్యయంతో సబ్ స్టేషన్ల నిర్మాణం, విద్యుత్ లైన్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫా ర్మర్లు బిగించడం లాంటి పనులన్నీ పూర్తిచేశారు. మిషన్ భగీరథ కోసం ప్రత్యేకంగా 221 మెగావాట్ల నిరంతర విద్యుత్ అందించడం కోసం 42 సబ్‌స్టేషన్లు, 1190 కిలోమీటర్ల పైపు లైన్లు నిర్మించారు. 87 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.

పాలేరుకు డిప్యూటీ సీఎం బృందం

పాలేరు సెగ్మెంట్ పరిధిలోని పాత వరంగల్ జిల్లా మండలాలకు నీరందించే పనులు కాస్త ఆలస్యం కావడంతో డిప్యూటీ సీఎం కడియం నేతృత్వంలో ప్రత్యేక బృందం రంగంలోకి దిగి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించిం ది. పాలేరు ద్వారా పాత వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,706 ఆవాస ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్నారు.

సాగునీటి రంగానికి... బంగారు ఏడాది

- ఫలితమివ్వనున్న కలల కాళేశ్వరం ప్రాజెక్టు
- తెలంగాణలో విప్లవాత్మక మార్పులు
- లక్షల ఎకరాలకు అందనున్న సాగునీరు
- జలనామ సంవత్సరం 2018



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇది.. సాగునీటిరంగంలో నూతన విప్లవాన్ని ఆవిష్కరించేసంవత్సరం. భారతదేశ సాగునీటిరంగమే అబ్బురపడే.. విజయాన్ని తెలంగాణ సాధించబోతున్న సందర్భం. 2018 తెలంగాణ రైతాంగ సాగునీటి కష్టాలు తొలగించే సంవత్సరం కాబోతోంది. నీళ్ళకోసం నోళ్ళు తెరిచిన లక్షల ఎకరాలకు 2018లో సాగునీరందే సూచనలు కనబడుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 18లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, మరో 18లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరగనుండగా.. ఈ ఖరీఫ్‌కు కనీసం పది నుండి 15లక్షల ఎకరాలకు సాగునీరందించే సన్నాహాల్లో ప్రభుత్వం ఉంది. ఇందుకు అవసరమైన పరిశ్రమ జరుగుతోంది. ఇటీవల కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలించి వచ్చిన ముఖ్యమంత్రి కెసిఆర్ .. పనుల సమీక్ష చేస్తూ హరీష్‌పైనే రైతులు కోటి ఆశలు పెట్టుకున్నారంటూ వ్యాఖ్యానించారు. ప్రధానంగా ఉమ్మడి కరీంనగర్, వరంగల్, మెదక్ జిల్లాలు ఈ ప్రాజెక్టు ద్వారా లబ్ధిపొందనుండగా, మేడిగడ్డ నుండి కొండపోచమ్మ సాగర్ దాకా నీరిచ్చే అవకాశాలున్నాయి. మేడిగడ్డ నుండి మిడ్‌మానేరుకు నీరందిస్తే వరంగల్, కరీంనగర్‌లకు మేలు జరగనుండగా.. కొండపోచమ్మ దాకా తీసుకువస్తే సిద్దిపేట జిల్లా కూడా లబ్ధిపొందనుంది. ఖచ్చితంగా ఇది జరుగుతుందని.. మల్లన్నసాగర్‌ను పూర్తిచేస్తే మెదక్, నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల పంట పడింనట్లేనని భావిస్తున్నారు. మొత్తంగా కాళేశ్వరం ఫలాలు మాత్రం ఈ ఏడాది.. ఖచ్చితంగా అందుతుండడంతో తెలంగాణ సాగునీటిరంగంతో పాటు దిగుబడులతో మార్కెటింగ్ రంగంలోనూ గణనీయమార్పులు రాబోతున్నాయి. ముఖ్యమంత్రి కెసిఆర్ కలల ప్రాజెక్టుగా ఇది గుర్తింపుపొందింది.

శ్రీరాంసాగర్ పునరుజ్జీవం కూడా..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకానికి గత ఏడాది ముఖ్యమంత్రి కెసిఆర్ శ్రీకారం చుట్టగా.. ఈ విప్లవాత్మక ప్రాజెక్టు కూడా ఈ ఏడాదే అందుబాటులోకి రానుంది. ఇది పూర్తయి.. కాళేశ్వరం జలాలు అనుసంధానిస్తే నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల రైతాంగానికి మహర్దశే. ఈ ప్రాజెక్టు ఫలాలు కూడా 2018 లోనే అందబోతున్నాయి. నల్లగొండ జిల్లాకు సంబంధించిన పలు ప్రాజెక్టులు కూడా 2018లోనే ప్రారంభోత్సవం జరుపుకోబోతున్నాయి. ఉదయ సముద్రం ప్రాజెక్టు పనులు ఇప్పటికే చివరిదశకు రాగా, 2018లో ప్రాజెక్టు నుండి పొలాల్లోకి నీరు పారనుంది. పాలమూరు-రంగారెడ్డి పథకాన్ని పాక్షికంగానైనా అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతుండగా, తుమ్మిళ్ళ ఎత్తిపోతల పథకం మరో రికార్డు సృష్టించనుంది. జనవరిలోనే పనులు ప్రారంభమయ్యే ఈ పథకం క్యాలెండర్ తిరక్కుండానే.. పూర్తిచేసే ప్రణాళిక రూపొందించారు. భక్తరామదాసు స్ఫూర్తితో రూపొందించిన ఈ పథకం ఆర్డీఎస్ ఆయకట్టుకు రక్షగా మారనుంది. ఆదిలాబాద్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న పలు ప్రాజెక్టుల నుండి 2018లో సాగునీరందనుండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సాగునీరందించే సీతారామా ప్రాజెక్టు తొలివిడతను పూర్తిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పాలమూరు, ఆదిలాబాద్ పెండింగ్ ప్రాజెక్టులన్నీ 2018లో శుభంకార్డు వేసుకోబోతున్నాయి. భూసేకరణ చిక్కుముడులు తొలగించుకుని.. చకచకా పరుగెత్తేందుకు అవసరమైన శక్తిని ప్రోది చేసుకుంటున్నాయి. అందివచ్చిన ప్రాజెక్టులతో 2018జలనామ సంవత్సరంగా మారనుంది. ప్రభుత్వం అత్యధిక బడ్జెట్ కేటాయించి చేస్తున్న పనులు ఫలితాలనివ్వబోతున్నాయి.

ఉదయసముద్రం ఉరకలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నల్లగొండ ఫ్లోరైడ్‌పీడిత, కరువు పీడిత ప్రాంతాల తాగు,సాగునీటి కోసం ఉద్దేశించిన ఉదయసముద్రం ప్రాజెక్టు పనులు ఉరకలెత్తుతున్నాయి. ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయడానికి ఇరిగేషన్ అధికార యంత్రాంగం, ఏజెన్సీలు ప్రయత్నిస్తున్నాయి. నల్లగొండ, నకిరేకల్, నార్కెట్‌పల్లి, చిట్యాల, మునుగోడు, రామన్నపేట, శాలిగౌరారం, నకిరేకల్ మండ లాల్లోని ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు ఈ ప్రాజెక్టు ద్వారా సురక్షిత తాగునీరు అందిం చనున్నారు. ఉదయసముద్రం పూర్తయితే నల్లగొండ నియోజకవర్గంలో 24,468 ఎకరాలు, నకిరేకల్ నియోజకవర్గంలో 62,476ఎకరాలు, మునుగోడులో 10,270 ఎకరాలు, తుంగతుర్తి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 2,784ఎకరాలు సాగులోకి రానున్నా యి. ఎట్టి పరిస్థితులలోనూ ఈ ప్రాజెక్టు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని మంత్రి హరీష్‌రావు ఇటీవల ఉదయసముద్రం ప్రాజెక్టును సందర్శించి.. అధికారులు, ఏజెన్సీలను ఆదేశించారు. దీంతో పనులు వేగవంతమయ్యాయి. 3.6కిలోమీటర్ల పొడవున్న కాలు వకట్ట పనుల్లో 600మీటర్ల రివిట్‌మెంట్ పనులు మినహా మిగతావన్నీ పూర్తయ్యా యి. 6.9కిమీ అప్రోచ్‌కెనాల్ పూర్తయింది. టన్నెల్ పనులు తుదిదశలో ఉండగా, 10.6కిమీ టన్నెల్ పనుల్లో 500మీటర్లు మినహా టన్నెల్ పనులన్నీ పూర్తయ్యాయి. టన్నెల్ లైనింగ్ పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. మోటార్లు, పంపుల బిగింపు పనులు ఈ వారంలో పూర్తిచేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉదయసముద్రం ప్రాజెక్టులో 92మీ లోతున సర్జ్‌పూల్ నిర్మాణం పూర్తవుతున్నది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తాగునీటి, సాగునీటి పథకాల పురోగతిని హరీష్‌రావు ప్రతిరోజూ వాట్సాప్‌లో సమీక్షిస్తున్నారు. అధికారయంత్రాంగానికి తగిన సూచనలు చేస్తున్నారు. ఉదయసముద్రం ప్రాజెక్టు లెఫ్ట్ మెయిన్‌కెనాల్ కింద 43వేల ఎకరాలు, రైట్ మెయిన్ కెనాల్ కింద 57వేల ఎకరాలు సాగులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. లెఫ్ట్ మెయిన్‌కెనాల్ కింద మొదటి డిస్ట్రిబ్యూటరీ ద్వారా 40చెరువులను నింపడానికి ఫీడర్ ఛానళ్ళను తవ్వే పనులు ఊపందుకుంటున్నా యి.50వేల ఎకరాలకు సాగునీరందడానికి మొత్తం 1500ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉండగా, ఇందులో 450ఎకరాల సేకరణ పెండింగ్‌లో ఉంది. మంత్రి హరీష్‌రావు సూచనలమేరకు కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ పెండింగ్ భూసేకరణ ప్రక్రియను పూర్తిచేసేందుకు రెగ్యులర్‌గా పర్యవేక్షిస్తున్నారు. ఇక నల్లగొండ, కట్టంగూరు మధ్య అప్రోచ్ ఛానల్‌పై 3.16కిలోమీటర్ల మేర డబుల్‌లైన్ రోడ్డు పనులు వేగవంతం చేశారు. లక్ష ఎకరాలకు సాగునీరందించే ఈ ప్రాజెక్టు ఫిబ్రవరి నాటికి అన్ని పనులు పూర్తిచేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధం కానుంది.



ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న మంత్రి హరీష్

ఏదో ఒకటి చేయండి

- లోయలో రక్తపాతానికి తెరదించండి • మోడీని కోరిన అమర జవాన్ల కుటుంబాలు
- అశ్రునయనాల మధ్య అంతిమ యాత్ర • మూడో ఉగ్రవాది మృతదేహం స్వాధీనం
- టెర్రర్ గ్రూప్‌లో 16 ఏళ్ల బాలుడు • దాడికి ముందుకు 8 నిమిషాల స్వీయ వీడియో



జమ్మూ-కాశ్మీర్ : సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో వీర మరణం పొందిన జవాన్లకు కుటుంబ సభ్యులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఆర్మీ అధికారులు అధికారి కంగా అంత్యక్రియలు నిర్వహించి నివాళులర్పించారు. ప్రధాని మోడీ ఇప్పటికైనా కాశ్మీర్‌లోయలో ఈ రక్తపాతానికి తెరదించేలా ఏదో ఒకటి చేయాలని మృతుల కుటుంబీకులు కోరారు. పుల్వావు జిల్లాలో ముగ్గురు పాకిస్థాన్ జైషే మహ్మద్ గ్రూపునకు చెందిన ఉగ్రవాదులు సీఆర్‌పీఎఫ్ క్యాంపు కార్యాలయంపై దాడి చేశారు. ఈ ఘటనలో నలుగురు సైనికులు మృతి చెందారు. ఉగ్రవాదం అంతం కావడం లేదని, భారత సైనికులు ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారని, ఏదో ఒకటి చేయాలని కుటుంబ సభ్యులు రోదిస్తూ పీఎంను వేడుకున్నారు. ప్రపంచంలో పాకిస్థాన్‌లాంటి దేశం ఎక్కడా లేదని మృతిచెందిన తౌఫిల్ అహ్మద్ జవాన్ కుమారుడు అనీస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్ర దాడుల్లో వీరమరణం పొందిన వారి ఆశలు వృథా కానివ్వబో మని, వారి కుటుంబానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడుగా ఉంటుం దని హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భరోసా ఇచ్చారు. ఉగ్రవాదులతో పోరాడి వీర మరణం పొందడం ఎంతో గర్వంగా ఉందని అన్నా రు. తౌఫీ అహ్మద్, రాజేంద్ర నేన్, పీకే పాండ బుల్లెట్లు తగిలి మరణించగా, కుల్‌దీప్ రాయ్ అనే అధికారి షాక్‌కు గురై గుండెనొప్పితో మృతి చెందాడు. టెర్రరిస్టులు సీఆర్‌పీఎఫ్ క్యాంపును లక్ష్యంగా చేసుకుని కాల్పులకు దిగుతారని ఇంటెలిజెన్స్ శాఖ ముందే హెచ్చరించిందని సీనియర్ పోలీస్ అధికారి ఎస్‌పీ వేద్ తెలిపారు. రెండు, మూడు రోజుల ముందు నుండే ఉగ్రవాదులు దాడికి పథకం రచిస్తూ వచ్చారు. ఏ సమయంలో దాడికి పాల్పడుతారనే విషయం తెలియరాలేదని వేద్ తెలిపారు.

ఉగ్రవాదిగా 16ఏళ్ల బాలుడు

కొత్త ఏడాది ఆరంభానికి కొద్దిగంటల ముందు పుల్వాలోని సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై జరిగిన ఉగ్రదాడిలో జైషే మహ్మద్‌కు చెందిన 16 ఏళ్ల బాలుడు భారత్ భద్రతా బలగాల చేతుల్లో హతమయ్యాడు. పోలీస్ కానిస్టేబుల్ గులాం మహ్మద్ ఖాండే కుమారుడు ఫర్దీన్ అహ్మద్ ఖాండే. మూడు నెలల క్రితం ఉగ్రవాదంలో చేరినట్టు కుటుంబీకులు కాశ్మీర్ పోలీసులకు వివరించారు. బుర్హాన్‌వనీ, త్రాల్‌కు చెందిన ఫర్దీన్ పదో తరగతి వరకు చదివాడు.

దాడికి ముందు ఫర్దీన్ వీడియో

మిలటరీ క్యాంప్‌పై దాడికి ముందుకు ఫర్దీన్ ఓ వీడియోను రికార్డ్ చేశాడు. ఈ వీడియో 8 నిమిషాలు ఉంది. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నది. సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై వ్యూహం పన్నినట్టు వీడియోలోవెల్లడించాడు. వీడియో మీకు అందే లోగా నేను స్వర్గంలో దేవుడి దగ్గర అతిథిగా ఉంటానని పేర్కొన్నాడు.

మూడో ఉగ్రవాది మృతదేహం లభ్యం

ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఫర్దీన్ అహ్మద్ ఖాండేతో పాటు మంజూర్ బాబా డ్రబ్‌గామ్ (22) కూడా హతమయ్యాడు. ముగ్గురు ఉగ్రవాదులు దాడులు జరపగా ఇద్దరి మృతదేహాలు మాత్రమే ఘటన స్థలంలో పోలీసులకు లభ్యమయ్యాయి. మూడో ఉగ్రవాది కూడా మృతి చెంది ఉంటాడని భావించిన భద్రతా బలగాలు సోమవారం కూడా గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి మూడో ఉగ్రవాది మృతదేహం కూడా స్వాధీనం చేసుకున్నట్టు సీఆర్‌పీఎఫ్ అధికార ప్రతినిధి రాజేశ్ యాదవ్ తెలిపారు.

ఉగ్రవాదం ఆపే వరకు
పాక్‌తో క్రికెట్ ఆడేదిలేదు

- కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ • ఆరేళ్లుగా పాక్‌తో క్రికెట్ ఆడని భారత్ • సరిహద్దుల్లో పెరుగుతున్న ఉద్రిక్తతలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : సీమాంతర ఉగ్రవాదం, ఆపేంతవరకు పాకిస్తాన్‌తో క్రికెట్ ఆడే ప్రసక్తి లేదని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. పాక్ ఓ వైపు ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ, మరోవైపు క్రికెట్ ఆడతామనే ప్రతిపాదనను అనుమతించబోమని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ స్పష్టం చేశారు. పొరుగు దేశాలతో సంబంధాలపై జరిగిన పార్లమెంటు సలహా సంఘం సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో సుష్మాస్వరాజ్‌తో పాటు కేంద్ర విదేశాంగ కార్యదర్శి జయశంకర్, సహాయమంత్రి ఎంజె.అక్బర్ కూడా పాల్గొన్నారు. పాకిస్తాన్ సరిహద్దుల నుంచి భారత్‌లోకి ఉగ్రవాదులను పంపడం అపేంతవరకు ఆ దేశంతో క్రికెట్ ఆడేది లేదని సుష్మాస్వరాజ్ స్పష్టం చేశారు. తటస్థ వేదికపై పాకిస్తాన్ తో క్రికెట్ ఆడే అంశంపై అడిగిన ప్రశ్నపై ఆమె ఈ మేరకు సమాధానమిచ్చారు. ఇండియా - పాకిస్తాన్ మధ్య 2007 నుంచి పూర్తి స్థాయి ద్వైపాక్షిక క్రికెట్ సిరిస్ జరగలేదు. ఆఖరిగా పాకిస్తాన్తో 2012లో పరిమిత ఓవర్ల మ్యాచ్‌లో పాకిస్తాన్ ఇండియాలో ఆడింది. ఆతర్వాత రెండుదేశాల మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపేంతవరకు, సరిహద్దుల్లో కాల్పుల ఆపేంతవరకు ఆ దేశంతో క్రికెట్ ఆడలేమని కేంద్ర విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ తేల్చి చెప్పారు. ఉగ్రవాదం, క్రికెట్ ఒకేసారి కొనసాగించడం సరికాదని పాకిస్తాన్ కు స్పష్టం చేశారు. అయితే ఈ సమావేశంలో ఖైదీల అప్పగింతపై కూడా చర్చ జరిగింది.



భారత్‌లోని పాకిస్తాన్ రాయబారి ఈ అంశంపై కలిశారని సుష్మా వెల్లడించారు. 70 ఏళ్లు దాటిన ఖైదీలను, మహిళలను, మానసికస్థితి లేని ఖైదీలను రెండు దేశాలు మానవతా దృక్పథంతో విడుదల చేయాలని ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. చైనా - మాల్దీవులు ఇటీవల కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల భారత్‌పై ఎటువంటి ప్రభావం పడుతుందనే అంశంపై కూడా చర్చ జరిగింది. మాల్దీవులతో భారత్‌కు సన్నిహిత, మర్యాదపూర్వక సంబంధాలు కొనసాగుతున్నాయని, రెండు దేశాలు రక్షణ రంగంలో పరస్పరం సహకరించుకుంటున్నాయని చెప్పారు.

సీన్ రిపీట్...!

- బెంగళూరు న్యూఇయర్ వేడుకల్లో ఈవ్‌టీజింగ్

బెంగళూరు : గతేడాది న్యూఇయర్ వేడుకల్లోని ఈవ్‌టీజింగ్ పరిస్థితులే బెంగుళూరులోని బ్రిగేడ్ రోడ్డు, ఎంజీ రోడ్డులో ఈయేడు పునరావృతం అయినట్టు తెలుస్తున్నది. గతేడాది నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న సమయంలో ఓ అమ్మాయి ఏడుస్తూ వెళ్లడాన్ని చూశాం. సరిగా అదే ప్రదేశంలో తెల్లవారుజామున మళ్లీ ఓ అమ్మాయి ఈయేడు కూడా ఏడుస్తూ అక్కడి నుండి వెళ్లిపోతున్న దృశ్యాలు కనిపించాయి. ఇప్పటి వరకు వేధింపుల విషయమై ఎలాంటి ఫిర్యాదు కానీ ఎఫ్ఐఆర్ కానీ నమోదు కాలేదు. కానీ పోలీసులు మాత్రం దీన్ని ఖండిస్తున్నారు. ఈ విషయమై బ్రిగేడ్ రోడ్డుతో పాటు ఎంజీ రోడ్డులోని సీసీ టీవీ పుటేజీ పరిశీలించగా అలాంటి దృశ్యాలు కనిపించలేవని పోలీసులు వివరించారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పోలీసులు ఆ ప్రాంతంలో హైఅలర్ట్ ప్రకటించారు. గతేడాది పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని దాదాపు 15వేల మంది పురుష, మహిళా పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. ముఖ్యంగా ఎంజీరోడ్డు, బ్రిగేడ్ రోడ్డుపై గట్టి నిఘా పెట్టారు. పబ్బుల్లో, బారుల్లో, వీధుల్లో ఎవరైనా న్యూసెన్స్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు పోలీసులు హామీ ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. బ్రిగేడ్, ఎంజీ రోడ్డుతో పాటు చర్చ్ స్ట్రీట్‌లో మరిన్ని సీసీ టీవీ కెమెరాలను బిగించారు. బెంగుళూరు వ్యాప్తంగా న్యూఇయర్ వేడుకలను పురస్కరించుకుని డ్రోన్లద్వారా కూడా సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెట్టారు. గతేడాది వేధింపుల ఘటనే పునరావృతం కావడంతో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. పరిస్థితులు అదుపు చేయడానికి పోలీసులు లాఠీచార్జ్ చేయాల్సి వచ్చింది.

రుణమాఫీకి రూ.14వేల కోట్లు

- ప్రకటించిన మహారాష్ట్ర సర్కార్

ముంబై : మహారాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వ్యవసాయ రుణమాఫీ పథకానికి రూ.14,240 కోట్లను కేటాయించింది. గతేడాది జూన్ 24న ఛత్రపతి శివాజీ మహారాజ షేత్‌కారి సన్మాన్ యోజన పథకాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. నిధులు కేటాయించినట్టు రాష్ట్ర సహకార సంస్థ, మార్కెటింగ్ శాఖ సంయుక్తంగా ప్రభుత్వ తీర్మానాన్ని సోమవారం ప్రకటించింది. మొత్తం పథకానికిగాను ప్రభుత్వం రూ.34,020వేల కోట్లను కేటాయించింది. ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. బ్యాంకుల్లో రుణం తీసుకున్న అన్నదాతలకు సంబంధించిన డబ్బులను ప్రభుత్వం చెల్లిస్తుంది. గత మాన్సూన్ సెషన్‌లో రూ.20వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ఎక్కువ మొత్తంలో చెల్లింపులు జరిగాయని కార్పొరేషన్ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని, రాష్ట్రానికి కేంద్రం నుండి సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని కానీ రుణమాఫీ విషయంలో తమ జోక్యం ఉండబోదని గతేడాది కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ చెప్పారు. గత నెలలో నాగ్‌పూర్‌లో నిర్వహించిన శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో రూ.14వేల కోట్లు కేటాయిస్తున్నట్టు సీఎం ప్రకటించినట్టు కార్పొరేషన్ అధికారి గుర్తు చేశారు.

రోబోలతో ఉపగ్రహాల రిపేరింగ్

యూఎస్ : అమెరికాకు చెందిన డిఫెన్స్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ఏజెన్సీ (డీఏఆర్‌పీఏ), నాసా సంయుక్తంగా శాస్త్ర సాంకేతిక రంగంలో ఓ అడుగు ముందుకు వేసింది. ఉపగ్రహాలను రిపేరు చేసే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రోబోను ఆవిష్కరించారు. ఈ రోబోను ఇంధనం నింపే పని కూడా చేసేవిధంగా తయారు చేసి ఔరా అనిపించుకున్నారు. ఈ రోబోలు 'సర్వీస్ స్టేషన్స్ ఇన్ ఆర్బిట్' గా వ్యవహరిస్తాయి. ఉపగ్రహాల రిపేరుతో పాటు వాటి జీవితకాలం పెంచేందుకు ఈ రోబో కృషి చేస్తుంది. శాటిలైట్లలో వచ్చే చిన్నపాటి సమస్యలను పరిష్కరించడంతో పాటు వాటి జీవిత కాలాన్ని సైతం లెక్కించి అందజేస్తుంది. దీంతో పాటు అంతరిక్షంలో కాలుష్య నియంత్రణ, ఉప గ్రహాల శకలాలు తొలగించడంవంటి పనులు కూడా చేయగలదనే నమ్మకాన్ని రూపకర్తలు వ్యక్తం చేశారు. 2015లో సుమారు మానవుడి పిడికిలి పరిమాణంలో ఉన్న సుమారు 25వేల ఉపగ్రహ శకలాలు భూమిపై పడ్డాయని అంచనా వేశారు. అదేవిధంగా అంతరిక్ష యుద్ధ సమయాల్లో శత్రువుల ఉపగ్రహాలను సైతం నిర్వీర్యం చేయగల సామర్థ్యం కలిగి ఉన్నాయి.

బీజేపీలో చేరిన ఇష్రత్ జహాన్



కోల్‌కతా: ట్రిపుల్ తలాఖ్ కేసులో పిటీషనర్లలో ఒకరైన కోల్‌కతాకు చెందిన ఇష్రత్ జహాన్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. 2014లో ఇష్రత్‌కు ఆమె భర్త దుబాయ్ నుంచి ఫోన్ ద్వారా తలాఖ్ ఇచ్చాడు. ఈ తలాఖ్‌పై ఆమె 2014 ఆగస్టు 22న సుప్రీంకోర్టులో పిటీషన్ వేశారు. ఈమెతోపాటు మరో నలుగురు సుప్రీంకోర్టులో తలాఖ్‌పై పిటీషన్ దాఖలు చేశారు. కాగా ఇష్రత్ జహాన్ బీజేపీ సభ్యత్వం తీసుకున్నారని పశ్చిమబెంగాల్ బీజేపీ ప్రధాన కార్యదర్శి సాయంతన్బసు వెల్లడించారు. ఆదివారం హౌరాలోని బీజేపీ కార్యాలయంలో ఇష్రత్ లాంఛనంగా సభ్యత్వం తీసుకున్నారన్నారు. గత ఏడాది ఆగస్టు 22న సుప్రీంకోర్టు ట్రిపుల్ తలాఖ్ రాజ్యాంగ విరుద్ధమంటూ వ్యాఖ్యానించింది. ఇటీవలే కేంద్రం ట్రిపుల్ తలాఖ్‌కు వ్యతిరేకంగా బిల్లు తీసుకురాగా ఆ బిల్లు లోక్‌సభ ఆమోదం పొందిన సంగతి విదితమే.

యువతకు సైన్స్‌పట్ల.. ప్రేమను పెంచండి

- శాస్త్రవేత్తలకు ప్రధాని పిలుపు



కోల్‌కతా: ప్రధానమంత్రి నరేంద్రమోడీ శాస్త్రవేత్తలకు సైన్స్‌పై పలు సూచనలు చేశారు. యువతకు సైన్స్ ప్రేమను పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భావాలను వ్యక్తీకరణకు భాష అనేది అడ్డంకిగా మారకూడదంటే..ప్రోత్సాహకారి ఉండాలని సూచించారు. ప్రొఫెసర్ సత్యేంద్రనాథ్ బోస్ 125 జయంతిని పురస్కరించుకుని కోల్‌కతా నుంచి శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రధాని.. బోస్ సేవలను కొనియాడారు. వ్యావహారిక భాషలో (బెంగాలీ) సైన్స్ బోధన కోసం బోస్ భాషా ఉద్యమమే చేశారని గుర్తు చేశారు.ఇందుకోసం ఆయన బెంగాలీ సైన్స్ మ్యాగజైన్ ను ఆయుధంగా వాడుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ... సైన్స్ పై యువతకు ఆదరణ పెరగాలంటే ..వారికి అర్థమయ్యే భాషలోనే మాట్లాడటం కీలకం. యువతను ఆకట్టుకునేందుకు ఇదే సరైన మార్గం.భావవ్యక్తీకరణలో భాష ఎప్పుడూ అడ్డంకి కావద్దు. వ్యక్తీకరించే భాష సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలి. అని మోడీ శాస్త్రవేత్తలకు సూచించారు. ప్రజలకు సైన్స్ గురించి తెలియాలంటే వారికి ఉన్న జ్ఞానంలోనే అర్థమయ్యేలా వివరించాలన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో పేద ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై ఎన్నో ప్రయోగాలు, ఆవిష్కరణలను జరుగుతున్నాయని.. ఆ ప్రయోగాలు, ఆవిష్కరణల ఫలితాలు నిరుపేదల జీవితాలను మారుస్తున్నాయా.. మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు తొలగిపోతున్నాయా అని ప్రశ్నించారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక,సామాజిక సవాళ్లపరిష్కారానికి శాస్త్రవేత్తల పరిశోధనలు ఉండాలన్నారు. భౌతికశాస్త్రవేత్త బోస్ 1894, జనవరి1న జన్మించారు. 1920 ప్రారంభంలో ఆయన క్వాంటం మెకానిక్స్‌పై చేసిన కృషికిగానూ మంచి గుర్తింపు లభించింది. ప్రస్తుతం విశ్వవ్యాప్తమైన దైవకణాలను బోస్ పేరుతో హిగ్స్ బోసన్ కణాలని పాల్ డిరాక్ నామకరణం చేశారు.

జాగ్వార్ బలం పెరిగేదెప్పుడు..?

- మరోసారి తెరపైకి వాయుసేన విమానాల అంశం • ఇంజన్ల సామర్థ్యం పెంచాలంటున్న అధికారులు



న్యూఢిల్లీ: వైమానిక దళంలో అత్యంత శక్తివంతమైన జాగ్వార్ యుద్ధవిమానాల బలాన్ని మరింతగా పెంచుకునేందుకు భారత వాయుసేన సిద్ధమైంది. ప్రస్తుతమున్న ఇంజన్ స్థానంలో అమెరికాకు చెందిన హనీవెల్ ఇంజన్ ను అమర్చాలని భావిస్తోంది. శక్తివంతమైన ఇంజన్లను అమర్చేందుకు దాదాపు 5వేలకు పైనే ఖర్చువుతుందని అంచనా. అణ్వాయుధాలతో దాడి చేయగల సామర్థ్యం కలిగిన ఈ యుద్ధవిమానాలను మరింత పటిష్టం చేయాల్సిన అవసరముందని 2011లో వాయుసేన నాటి యూపీఏ ప్రభుత్వానికి తెలియజేసినా.. 2017 డిసెంబర్ చివరి వరకు కొనసాగించాలని స్పష్టం చేసింది. ఆదివారంతో నాటి యూపీఏ ప్రభుత్వ గడువు ముగియడంతో భారత వాయుసేన మరోసారి జాగ్వార్ విమానాల పటిష్టత అంశాన్ని తెరపైకి తీసుకువచ్చింది.

ప్రస్తుతం మూడు దశాబ్దాల నాటి ఇంజన్లు

దాదాపు మూడు దశాబ్దాల నాటి ఇంజన్లుకలిగిన జాగ్వార్ విమానాల్లో రోల్స్-రాయ్స్ అడౌర్ 804/811 మోడల్ ఇంజన్ లు కలిగి ఉన్నాయి. ఇవి అప్ గ్రేడ్ చేయాల్సిన అవసరం అవశ్యం. వాయుసేన బలంగా పుంజుకోవాలంటే వాటి ఇంజన్ సామర్థ్యాన్ని రెట్టింపు చేయాల్సిన ఆవశ్యకత ఉందని అధికారులు చెబుతున్నారు. అందుకే నాటి యూపీఏ సర్కారు విధించిన గడువు ముగియడంతో పాత ఇంజన్ల స్థానంలో శక్తివంతమైన హనీవెల్స్ ఎఫ్ -125 ఎన్ ఇంజన్లతో రిప్లేస్ చేయాలని కోరుతున్నారు. పాత ఇంజన్లను మారిస్తే జాగ్వార్ శక్తి ప్రస్తుతమున్న వాటికంటే 1.5 రెట్లు అధికమవుతుందని చెబుతున్నారు. వాయుసేన సూచనల ప్రకారం భారత వాయుసేన 42 యుద్ధవిమానాల బలాన్ని పెంచేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మిగ్ 21 యుద్ధవిమానాల ఒప్పందం ఆలస్యం కారణంగా అప్ గ్రేడ్ జరగలేదు. ఇక ప్రస్తుతం వాయుసేనలో 32 ప్రత్యేక దళ యుద్ధవిమానాలు, ఉన్నాయి. వీటితో సహా మొత్తం 100 జాగ్వార్ విమానాల్లో నూతన ఇంజన్లను మార్చాలని భావిస్తోంది. ఇవి జామ్‌నగర్, గోరఖ్ పూర్, అంబాలా లో ఉన్నాయి. ఒక వేళ జాగ్వార్ యుద్ధవిమానాల సామర్థ్యాన్ని పెంచేందుకు కొత్త ఇంజన్లను అమరుస్తే.. వాటి సేవలను వాయుసేనకు ఎంతోకాలం కొనసాగుతాయని అధికార వర్గాల సమాచారం.ఇటీవల రక్షణ శాఖ సహాయ మంత్రి సుభాష్ భామ్రే పార్లమెంట్ లో మాట్లాడుతూ.. భారత వాయుసేన లోకి 32 యుద్ధ విమానాలు, 39 హెలికాప్టర్లను 2020 నాటికి తీసుకువస్తామని తెలిపారు.

అట్టుడుకుతున్న ఇరాన్

- ఆందోళనల్లో 10 మంది మృతి

దుబాయ్: ఇరాన్ ఆర్థికస్థితిని నిరసిస్తూ చెలరేగుతున్న ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దేశవ్యాప్తంగా చెలరేగిన పలు హింసాత్మక ఘటనల్లో ఆదివారం పదిమంది మృతి చెందారు. దేశంలో 2009లో జరిగిన ఆందోళనలు తరువాత మళ్లీ ఆ స్థాయిలో నిరసన మంటలు ఎగసిపడుతున్నాయి. మాజీ అధ్యక్షుడు అహ్మదీనెజాద్ ఎన్నిక వివాదాస్పదమవటంతో చెలరేగిన ఆందోళనలు కంటే ఈ నిరసనలు మరింత ఉద్ధృతంగా జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా నిరసనలు తీవ్రమవుతుండగా అధికారులు సామాజిక మాధ్యమాలను నిలిపివేశారు. 2015 అణుఒప్పందం తర్వాత ఇరాన్ ఆర్థికంగా పుంజుకున్నా అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరకపోవడాన్ని నిరసిస్తూ మార్షద్ నగరంలో ఆందోళనలు మొదలయ్యాయి. నిరుద్యోగ సమస్య, ద్రవ్యోల్బణం 10శాతం మించిపోవడం, ఇటీవల ఆహారధాన్యాలు ధరలు విపరీతంగా పెరగడం దేశమంతా ఆందోళనలు విస్తరించేందుకు కారణమయ్యాయి. ఇరాన్ దేశవ్యాప్తంగా నిరసనకారులు, భద్రతాసిబ్బంది మధ్య ఘర్షణలతో సర్వత్రా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వందలాదిమంది ఆందోళనాకారులు పోలీసుల నిర్బంధంలో ఉన్నారు. ఆందోళనలు విస్తరించేందుకు సోషల్ మీడియా దోహదపడుతుందంటూ ఇన్‌స్టాగ్రాం తదితర సేవలను అధికారులు నిలిపివేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలతో ఇరాన్ అట్టుడుకుతోంది. నిత్యావసరాల ధరలు పెరగడంతో ఆర్థిక కష్టాలతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.ఆదివారం నైవ్ పట్టణంలో గురువారం పోలీసుల కాల్పుల్లో ఇద్దరు మరణించినట్టు వార్త వైరల్‌గా మారటంతో ఆందోళనలు మరింత తీవ్రమయ్యాయి.

ఆదివారం సైతం హింసాత్మక సంఘటనలుతో ఇరాన్ అట్టుడికిపోయింది. నిరసనకారులు దేశ అధ్యక్షుడు హసన్ రోసాని ఫొటోలను దగ్ధం చేశారు. సామాజిక మాధ్యమాలను ఇరాన్ ప్రభుత్వం నిలిపివేసింది. ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేశారు. ఇరాన్ ప్రభుత్వం ప్రజల సొమ్మును ఉగ్రవాదులకు దోచిపెడుతుందన్న నిజం ఇప్పటికైనా ప్రజలు గ్రహించారని ట్రంప్ ట్విట్టర్లో పేర్కొన్నారు.

ఇరాన్ ప్రధానంగా చమురుశక్తిపై ఆధారపడుతోంది. కానీ ప్రత్యర్థి సౌదీ అరేబియాతో యుద్ధం కారణంగా ఇరాక్, సిరియాదేశాల్లో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దేశంలో అవినీతి,ఆర్థిక ఇబ్బందులు కారణంగా యువతలో అసంతృప్తి నెలకొంది. యువతలో 28.8శాతం నిరుద్యోగంతో బాధపడుతున్నారు. అధ్యక్షుడు హసన్ రూహని ప్రజలను ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేసినా నిరసనకారులు ఆందోళన శాంతించటంలేదు.

నేడు 'సూపర్‌మూన్'

- 13% పెద్దదిగా... 30% ప్రకాశవంతంగా..

న్యూఢిల్లీ : ఎంతో ఆనందంతో 2018లో అడుగు పెట్టిన ప్రతీ ఒక్కరినీ చంద్రుడు నేడు కనువిందు చేయనున్నారు. నేడు కనిపించే చంద్రుడి పరిమాణం ఈఏడాది మొత్తంలో అధికంగా ఉండనుంది. చంద్రుడు సూపర్‌మూన్ పేరుతో ముందుకు రానున్నాడు. రోజువారీ కంటే 14 శాతం పెద్దదిగా, 30 శాతం ప్రకాశవంతంగా ఉంటుందని నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. గోవాలో దీని ప్రభావం ఉంటుందని, జనవరి 2తో పాటు 31న రాత్రి సమయాల్లో బీచులో ఎవరూ అంతగా తిరుగొద్దని గోవా టూరిజం శాఖ డైరెక్టర్ మెనీనో డిసౌజా సూచించారు. ఆటుపోట్లు అధికంగా ఉంటాయని వివరించారు. చంద్రుడి పరిమాణం పెరగదని, భూమికి అతిదగ్గరగా రావడమే దీనికి కారణమని నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. గోవా తీర ప్రాంతం నుండి వ్యాపారాలు సాగించే వారు కూడా తగు జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు. 2018లో ఇది మొదటి సూపర్‌మూన్ అని నాసా వివరించింది.

గోవాలో రాహుల్ న్యూఇయర్

గోవా : కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నూతన సంవత్సర వేడుకలను గోవాలో ఘనంగా నిర్వహించారు. ఏఐసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి నూతన సంవత్సర వేడుకలు కావడంతో తల్లితో కలిసి జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా ఉన్న సోనియా గాంధీ కాసింత ఉపశమనం పొందడానికి కొన్ని రోజులుగా గోవాలోనే గడుపుతున్నారు. దీంతో రాహుల్ కూడా గోవాకు వచ్చిన తల్లితో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. గోవాలోని ఓ ఫైవ్ స్టార్ హోటల్ ఈ వేడుకకు వేదికైంది. నూతన సంవత్సర సంబరాలు పూర్తిగా వ్యక్తిగతం కావడంతో ఎవరినీ ఆహ్వానించలేదని పార్టీ నాయకులు తెలిపారు. హంగూ, ఆర్భాటాలకు తావివ్వకుండా ముందస్తు ఆలోచనలో భాగంగానే గోవాలో నిర్వహించినట్టు తెలుస్తున్నది. డిసెంబర్ 27న సోనియా గోవా బీచ్‌లో సైకిల్ రైడింగ్ చేస్తూ కెమెరాకు చిక్కిన విషయం తెలిసిందే.

స్వచ్ఛతకు ప్రాధాన్యం

- హిమచల్ సీఎం జైరామ్ ఠాకూర్



షిమ్లా : హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి జైరామ్‌ఠాకూర్ స్వచ్ఛభారత్‌లో భాగంగా రాష్ట్ర రాజధానిలో క్లీన్‌నెస్ డ్రైవ్ చేపట్టారు. దీంతో పాటు తాగునీటి రిజర్వాయర్‌లను శుభ్రపర్చే పనిలో నిమగ్నం అయ్యారు. సంజౌలీ పట్టణంలో పర్యటించిన ఠాకూర్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంజౌలీ పట్టణంలోని నీళ్ల ట్యాంకు 90లక్షల లీటర్ల సామర్థ్యంతో కూడుకున్నది. రాష్ట్రంలో అతిపెద్ద ట్యాంకుగా దీనికి పేరుంది. రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా పరిసరాలతో పాటు నీళ్ల ట్యాంకులను శుభ్రం చేయాలని అధికారులను ఠాకూర్ ఆదేశించారు. ఇరిగేషన్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడుతూ.. రోగాలు ప్రబలకుండా ట్యాంకులను బ్లీచింగ్ చేయాలని సూచించారు. ప్రతీ సంవత్సరం రెండు సార్లు ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు నీటి వనరులు కాపాడటంలో ముందుండాలని సూచించారు. నీటి అవశ్యకతను ప్రజలకు తెలియజేయాలని, కొన్ని ప్రాంతాల్లో నీటి ఇబ్బందుల కారణంగా సుదూర ప్రాంతాల నుండి తీసుకొచ్చుకుంటున్నారని తెలిపారు. కిచెన్, బాత్రూరంలలో నీళ్ల లీకేజీని సైతం అరికట్టాలని ప్రజలకు సూచించారు. ఇందిరా గాంధీ మెడికల్ కళాశాలతో పాటు, ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే వారికి ట్యాక్సీ చార్జీల విషయమై ఊరట ఇచ్చారు. ప్రతీ వ్యక్తికి రూ.10 తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత కార్యక్రమం 15రోజుల పాటు కొనసాగుతుందని ఇరిగేషన్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి మహేందర్‌సింగ్ ప్రకటించారు. గతేడాది నీళ్ల ట్యాంకులో పడి ఓ బాలుడు మృతి చెందాడని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విద్యాశాఖ మంత్రి సురేష్ భరద్వాజ్ ప్రభుత్వాన్ని కోరారు.

వేడుకల్లో 18 మంది మృతి

కోల్‌కతా: దేశవ్యాప్తంగా జరిగిన న్యూ ఇయర్ సంబరాల్లో వేర్వేరు ఘటనల్లో 18మంది ప్రాణాలు కోల్పోయారు. పశ్చిమ బెంగాల్లోని దామోదర్ నదిలో 5 మునిగి పోవటంతో మరణించారు. వెస్ట్ బర్ద్వాన్‌లోని శ్రీపల్లి ప్రాంతంలో 21ఏళ్ల యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. హుగ్లీ జిల్లాలో కారులో ఇంటికి వెళుతున్న 5 రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదానికి కారణమైన ట్రక్ డ్రైవరును అరెస్టుచేశామని పోలీసు అధికారులు తెలిపారు. బీహార్లోని భాగల్పూర్ జిల్లాలో సోమవారం 3 బాలురు గంగానదిలో మునిగిపోయి ప్రాణాలు కోల్పోయా రు. తూర్పు భాగాల్పూర్ జిల్లాలో రాంజిదీహుపూర్ గ్రామంలో పడవ మునిగి పోవటంతో 11నుంచి 13 సంవత్సరాల బాలలు ముగ్గురు ప్రాణాలు కోల్పోయార న్నారు. భాగల్పూర్ సీనియర్ సూపరింటెండెంట్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ స్థానిక బాలురు 9మంది నదిలోకి వెళ్లగా వీరిలో ఆరుగురిని రక్షించామన్నారు. ముగ్గురు గల్లంతయ్యా రన్నారు. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్సు, స్టేట్ స్పెషల్ ఫోర్సు సిబ్బంది గల్లంతైనవారి కోసం వెతుకుతున్నారన్నారు. మద్యం ప్రభావంలో 24ఏళ్ల వ్యక్తి డ్రైవింగు చేయటంతో ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో ముగ్గురు మైనర్లతోసహా నలుగురు చనిపోయారన్నారు.

S & D

క్రీడాప్రభ

రంజీల్లో ముంబై రికార్డు

రంజీ ట్రోఫీ 1934-35 ప్రారంభం నుంచి ముంబై మొత్తం 41 సార్లు ట్రోఫీని చేజిక్కించుకుంది. చివరగా 2015-16 సంవత్సరంలో ట్రోఫీని గెలిచింది.

ముంబై 41, కర్నాటక/మైసూర్ 8, ఢిల్లీ 7

బరోడా 5, మధ్యప్రదేశ్/హోల్కర్ 4

బెంగాల్, తమిళనాడు, రాజస్తాన్,హైదరాబాద్, మహారాష్ట్ర, రైల్వేస్, సౌరాష్ట్ర తలా రెండు సార్లు విజేతగా నిలిచారు. యుపి, పంజాబ్, హర్యానా గుజరాత్ విదర్భలు తలా ఒకసారి ట్రోఫీని గెలుచుకున్నాయి.



తొలిసారి ట్రోఫీ కైవసం చేసుకున్న ఆనందంలో విదర్భ జట్టు

వసీం జాఫర్ జట్టుకు నైతిక బలం



ఇండోర్: రంజీ ఫైనల్లో విదర్భ తరపున బరిలోకి దిగిన వెటరన్ క్రికెటర్ వసీం జాఫర్ నిజానికి ముంబైకి చెందిన వాడు. 2013వరకు రంజీల్లో, ఇరానీ ట్రోఫీలో అత్యధిక స్కోరుచేసిన ఆటగాడిగా రికార్డు జాఫర్ పేరుమీదనే ఉంది. అంతేకాక ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన రికార్డు కూడా జాఫర్ పేరుమీదే ఉంది. కుడిచేతి వాటం ఆటగాడైన జాఫర్ తన కెరియర్‌ను 1996-97లో ప్రారంభించాడు. తన పదినేళ్ల ప్రాయంలో పాఠశాల స్థాయిలో జరిగిన ఈవెంట్‌లో 400 పరుగులు చేసి నాటౌట్ ఉన్నాడు. జాఫర్‌ను అజాహరుద్దీన్ పోల్చే స్థాయికి ఎదిగాడు. 2000 సంవత్సరంలో జాఫర్ దక్షిణాఫ్రికా పర్యటనకు ఎంపికయ్యాడు. 2002లో వెస్టిండీస్ పర్యటనకు, ఇంగ్లండ్ పర్యటనలకు ఎంపికయ్యాడు. కాని ఎక్కువకాలం జాతీయ జట్టులో కొనసాగలేకపోయాడు. 2007 వరకు జట్టులోకి రావడం పోవడం జరిగింది. 2008 నుంచి ప్రారంభమైన ఐపిఎల్‌లో కూడా అతని అదృష్టం భాగా లేకపోయింది. కాని 2012-13 కాలంలో భారత్‌లో పర్యటిస్తున్న ఇంగ్లంగ్ జట్టుపై టాప్ స్కొరర్‌గా నిలిచాడు. అదేకాలంలో రంజీల్లో కూడా టాపర్‌గా నిలిచి ముంబై 40వసారి ట్రోఫీని కైవసం చేసుకోవడంలో కీలక భూమిక వహించాడు. రెండు దశాబ్దాలుగా ముంబైనుంచి ప్రాతినిధ్యం వహించిన జాఫర్ 2015-16 నుంచి విదర్భకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఆయన ముంబైనుంచి విరమణ ముంబైకు గట్టిదెబ్బగా పరిణమించింది. ఆయేడు ముంబై ట్రోఫీ గెలిచినప్పటికి, 2016-17లో ముంబై రన్నర్‌గా నిలిచింది. ముంబై 38వ ,39వ రంజీ ట్రోఫీలను గెలుచుకోవడంలో జాఫర్‌దే కీలక పాత్ర. ఆయన విదర్భకు రావడం నైతికంగా ఆజట్టుకు ధైర్యాన్ని ఇచ్చింది. ఇప్పటివరకు వసీం ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 223 మ్యాచ్‌లు ఆడి 16,845 పరుగులు చేశాడు. వీటిలో 51 సెంచరీలు 81 అర్ధ శతకాలున్నాయి.

రంజీల్లో విదర్భ చరిత్ర


రన్నరప్ ట్రోఫీతో ఢిల్లీ కెప్టెన్ రిషబ్‌పంత్

ఇండోర్: విదర్భ జట్టు తొలిసారిగా రంజీ ఛాంపియన్‌గా అవతరించింది. కొత్త సంవత్సరం వేడుకలను విదర్భ క్రీడాకారులు ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక హోల్కర్ స్టేడియంలో జరిగిన రంజీ ఫైనల్ మ్యాచ్‌లో విదర్భ జట్టు ఏడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఢిల్లీపై తొమ్మిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. నాలుగోరోజు విదర్భ కేవలం ఐదు ఓవర్లలోనే విజయం సాధించింది. విదర్భ జట్టు వెటరన్ క్రీడాకారుడు వసీం జాఫర్ వరుసగా మూడు ఫోర్లు కొట్టి తమ జట్టుకు కొత్త సంవత్సరం కానుకను అందించాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఢిల్లీ జట్టు ఇచ్చిన స్వల్ప లక్ష్యం 29 పరుగులను విదర్భ జట్టు తమ ఓపెనర్, కెప్టెన్ ఫయాజ్ ఫజల్ వికెట్ కోల్పోయి సాధించింది. ఈ విజయం జట్టు సమైక్య కృషిగా నిదర్శనం అని స్కిప్పర్ ఫయాజ్ అన్నాడు. విదర్భ జట్టు తొలిరోజునుంచే నిలకడగా ఆడి తన విజయానికి బాటలు వేసుకుంది. విదర్భ బౌలర్లు ఢిల్లీ బ్యాట్స్‌మన్లను తమ బౌలింగ్‌తో

• ఫైనల్లో ఢిల్లీపై 9 వికెట్ల తేడాతో గెలుపు

ముచ్చెమటలు పట్టించారు. ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ ఫాస్ట్ బౌలర్ రజనీష్ గుర్బాని హ్యాట్రిక్ సాధించాడు. బంతిని స్వింగ్‌చేస్తూ ఢిల్లీ ఆటగాళ్ల పరుగులకు కళ్లెం వేశాడు. తొలిరోజు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న విదర్భ చక్కని వ్యూహంతో బరిలోకి దిగింది. చక్కటి బౌలింగ్, ఫీల్డింగ్ నైపుణ్యాలను ప్రదర్శించిన విదర్భ జట్టు ఢిల్లీ తొలి ఇన్నింగ్స్‌ను 295 పరుగులకే పరిమితం చేసింది. ఢిల్లీ ఆటగాడు షోరే సెంచరీ చేయడం విశేషం. రజనీష్ గుర్బాని ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీసి ఢిల్లీ జట్టు వెన్ను విరిచాడు. అనంతరం విదర్భ జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 547 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఢిల్లీ బౌలర్ నవదీప్ సైనీ ఐదు వికెట్లు తీశాడు. కాగా విదర్భ వికెట్ కీపర్ వాడ్కర్ 133 పరుగులు చేశాడు.



తొలి ఇన్నింగ్స్ ద్వారా విదర్భ జట్టు ఢిల్లీపై 252 పరుగులు ఆధిక్యం సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఢిల్లీ 280 పరుగులకు ఆలౌట్ అయింది. విదర్భ జట్టు ముందు స్వల్ప లక్ష్యం 29 పరుగులు ఉంచింది. కాగా సోమవారం ఢిల్లీ ఆటగాల్లు నితిష్ రాణా, ధ్రువ్‌షోరే తమ అర్ధసెంచరీలు పూర్తిచేసుకుని ఊపుమీదు న్నట్టే కన్పించారు. కాని టీ విరామానికి ముందే వారు ఔటయ్యారు. అనంతరం వచ్చిన ఢిల్లీ బ్యాట్స్‌మన్లలో ఎవరూ కూడా చెప్పుకోదగ్గ ఆటను ప్రదర్శించలేదు. వారు విదర్భ బౌలింగ్‌కు తలవంచారు. విదర్భ స్పిన్నర్ ఆశిష్ వాఖ్రె 4 వికెట్లు తీయగా, మరో స్పిన్నర్ ఆధిత్య సార్వతే 3 వికెట్లు, గుర్బాని 2 వికెట్లు, సిద్దేశ్ నెరెల్ ఒక వికెట్ తీశాడు. ఆటకు మరోరోజు మిగిలిఉన్నప్పటికి స్వల్ప లక్ష్యమైన 29 పరుగులను విదర్భ ఒక వికెట్‌కోల్పోయి సాధించింది.

స్కొరుబోర్డు

ఢిల్లీ తొలి ఇన్నింగ్స్: 295 ఆలౌట్ (విదర్భ బౌలింగ్: రజనీష్ గుర్బాని 24.4-8-59-6, ఆధిత్యథాక్రె 26.1-4-74-2, సిద్దేశ్‌నెరెల్19-3-57-1, అక్షయ్ వాఖ్రె 16-5-34-1), **విదర్భ తొలి ఇన్నింగ్స్:** 547 ఆలౌట్ (ఢిల్లీ బౌలింగ్: ఆకాశ్‌సుదన్ 27-3-102-2, నవదీప్‌సైనీ36.3-4-135-5, నితిష్‌రాణా 13.1-0-32-1, కుల్వంత్ కేజ్రోలియో 39-8-132-2), **ఢిల్లీ రెండో ఇన్నింగ్స్:** 280 ఆలౌట్ (విదర్భ బౌలింగ్: రజనీష్ గుర్బాని 18-2-92-2, సిద్దేశ్‌నెరెల్19-3-57-1, అక్షయ్ వాఖ్రె 28-2-95-4, అధిత్య సార్వాతె 9-1-30-3 సిద్దేశ్ నెరెల్ 9-1-39-1)

విదర్భ రెండో ఇన్నింగ్స్: ఫయాజ్ ఫజల్ ఎల్బీడబ్ల్యు కుల్వంత్ కేజ్రోలియో 2, సంజయ్ రామస్వామి నాటౌట్ 9, వసీం జాపర్ నాటౌట్ 17, (ఢిల్లీ బౌలింగ్ కుల్వంత్ కేజ్రోలియో 3-0-21-1, ఆకాశ్‌సుదన్ 2-0-7-0)

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రజనీష్ గుర్బాని

రంజీల్లో విదర్భ..

మొత్తం 28 జట్లు నాలుగు గ్రూపులుగా పాల్గొన్నాయి. విదర్భ గ్రూప్ డి లో ఉండగా, ఢిల్లీ గ్రూప్ ఎ లో ఉంది. విదర్భ క్వార్టల్ ఫైనల్స్‌లో కేరళను ఓడించి సెమీస్‌లోకిప్రవేశించింది. సెమీస్‌లో విదర్భ కర్నాటకతో తలపడి 5 పరుగుల తేడాతో ఓడించితొలిసారిగా ఫైనల్‌లోకి ప్రవేశించింది. కాగా ఢిల్లీ జట్టు క్వార్టర్స్‌లో మధ్య ప్రదేశ్‌ను ఓడించి సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో బెంగాల్‌ను ఓడించి ఫైనల్లో విదర్భ సరసన నిలిచింది. విదర్భ తొలిసారిగా ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ను 1957-58లో ఆడింది. జోన్లవారీ పోటీలు సాగినకాలం 2001-02 వరకు ఆదేవిధంగా పోటీ ఇచ్చింది. 1970-71, 1995-96లో రెండు సార్లు క్వార్టర్ ఫైనల్లకు చేరింది. 2002-03, 2011-12లో రెండు సార్లు సెమీఫైనల్లోకి ప్రవేశించింది. 2017-18లో తొలిసారిగా ఫైనల్‌కు చేరి విజయం సాధించింది. ఇప్పటివరకు విదర్భ ఆడిన ఫస్ట్‌క్లాస్ క్రికెట్ మ్యాచుల్లో 41 విజయాలు, 89 ఓటమిలు, 129 డ్రాలు ఉన్నాయి.

జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో మను, మెహులి బెస్ట్

తిరువనంతపురం: 61వ జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో మను భాకర్, మెహులి గోష్ బెస్ట్ షూటర్స్‌గా ఆవిర్భవించారు. దీనితో హర్యానా జట్టు 168 పతకాలతో అగ్ర భాగాన నిలిచింది. నిన్నటితో పూర్తయిన ఈ ఈవెంట్‌లో హర్యానాకు చెందిన మహిళా షూటర్ మను పిస్టల్ ఈవెంట్లో 15 పతకాలు(11 స్వర్ణం, 3 వెండి, 1 కాంస్యం) సాధించి బెస్ట్ షూటర్‌గా నిలిచింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మెహులి గోష్ 11 పతకాలు(8 స్వర్ణం, 3 కాంస్యం) బెస్ట్ రైఫిల్ షూటర్‌గా నిలిచింది. అయితే హర్యానా పతకాల పట్టికలో జట్టు పరంగా, వ్యక్తిగత పతకాల పరంగా అగ్ర భాగాన నిలిచింది. ఓపెన్ కేటగిరీలో హర్యానా 10 స్వర్ణాలు, 3 వెండి, 4 కాంస్య పతకాలు గెలువగా టీం ఈవెంట్లో హర్యాన 24 స్వర్ణం, 21 వెండి, 6 కాంస్య పతకాలు గెలుచుకుంది. పంజాబ్ ఈ రెండు కేటగిరీల్లో రెండవ స్థానంలో నిలిచింది. ఓపెన్ కేటగిరీలో 4 స్వర్ణం, 3 వెండి, 4కాంస్య పతకాలు గెలిచింది. టీం ఈవెంట్లో 18 స్వర్ణం, 12 వెండి 15 కాంస్య పతకాలు సాధించింది. మొత్తం 4,999 మంది షూటర్లు పాల్గొన్నారు. వీరిలో 3388 మంది పురుష షూటర్లు, 1520 మహిళా షూటర్లు, 74 మంది వికలాంగ పురుష షూటర్లు, 16 మంది వికలాంగ మహిళా షూటర్లు పాల్గొన్నారు. ఉత్తర ప్రదేశ్ నుంచి అత్యధికంగా 735 మంది షూటర్లు పాల్గొన్నారు. మొత్తం 778 పతకాలు విజేతలకు ప్రదానం చేశారు.


మెహులి


మను

ముంబై రాకెట్స్‌పై బెంగళూరు బ్లాస్టర్స్ విజయం

లక్నో: ప్రీ మియర్ బ్యాడ్మింటన్ టోర్నీలో బెంగళూరు బ్లాస్టర్స్ ముంబై రాకెట్స్ పైన విజయం సాధించారు. 6-1 తేడాతో గెలిచారు. అన్ని గేమ్స్‌ల్లో బ్లాస్టర్స్ తేలికగా తమ ప్రత్యర్ధులను మట్టి కరిపించారు. మిక్సిడ్ డబుల్స్‌లో ఎన్‌ఎస్ రెడ్డి, కెఎస్ రంగ్ జంట రాకెట్స్ జంట ఎఎంఆర్, స్టియోవా జంటను 2-1తేడాతో ఓడించారు. మహిళల సింగిల్స్‌లో బ్లాస్టర్స్ క్రీడాకారిణి గిల్‌మర్ 2-0 తేడాతో రాకెట్స్ క్రీడాకారిణి జాంగ్‌ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో బ్లాస్టర్స్ క్రీడాకారుడు అలెక్సెన్ 2-0 తేడాతో రాకెట్స్ క్రీడాకారుడు హోపై గెలిచారు. మరో పురుషుల సింగిల్స్‌లో బ్లాస్టర్స్ క్రీడాకారుడు ఫెంగ్ 2-1 తేడాతో రాకెట్స్ క్రీడాకారుడు వర్మపై గెలిచారు. మెన్స్ డబుల్స్‌లో బ్లాస్టర్స్ క్రీడాకారుల జంట రాంగ్, బో 2-1 తేడాతో రాకెట్స్ క్రీడాకారులు డే, టన్‌లపై గెలిచారు

సం.	జట్టు	ఆడినమ్యాచ్‌లు	గెలుపు	ఓటమి	టై.గె	టై.ఓ.	పాయింట్లు
1	బెంగళూరు బ్లాస్టర్స్	10	7	1	2	0	11
2	అవధె వారియర్స్	4	4	4	2	0	8
3	అహ్మదాబాద్ మాస్టర్స్	10	4	4	2	0	8
4	హైదరాబాద్ హంటర్స్	15	5	7	2	1	8
5	ఢిల్లీ డాషర్స్	15	5	7	2	1	8
6	నార్త్‌ఈస్టర్న్ వారియర్స్	15	2	10	3	0	8
7	చెన్నై స్మాషర్స్	10	3	5	2	0	7
8	ముంబై రాకెట్స్	15	3	9	2	1	6

స్టార్‌స్పోర్ట్స్‌కు 'ఖేలో ఇండియా' ప్రసార హక్కులు

న్యూఢిల్లీ: 'ఖేలో ఇండియా' పాఠశాల క్రీడల(కెఐఎస్‌జి) ప్రసార హక్కులను స్టార్ స్పోర్ట్స్ చానెల్ దక్కించుకుంది. 2018 నుంచి 2022 వరకు ఐదేళ్ల కాలానికి ఈ ప్రసారహక్కులు వర్తిస్తాయి. క్రీడల పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విజన్ మేరకు దేశీయ సంస్కృతిలో క్రీడలను ఒక భాగంగా చేయడానికి అట్టడుగుస్థాయి నుంచి ప్రజల్లో క్రీడలపట్ల ఆసక్తిని పెంచేందుకు ఖేలో ఇండియా స్కూల్స్ గేమ్స్‌ను ప్రభుత్వం ప్రారంభిస్తున్నదని కేంద్ర క్రీడల శాఖ మంత్రి రాజ్యవర్ధన్‌సిం గ్ రాథోడ్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కెఐఎస్‌జి-18 క్రీడలు ఈ నెల 31న ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. 17 ఏళ్ల వయసు మించని బాలురు, బాలికలు మొత్తం 16 క్రీడాంశాల్లో పాల్గొంటారని తెలిపారు. 'పారదర్శకంగా జరిపిన బిడ్డింగ్‌లో స్పార్ట్స్ స్పోర్ట్స్ చానెల్ కెఐఎస్‌జి-2018 ప్రసార హక్కులను దక్కించుకొంది. పాఠశాల క్రీడలను తొలిసారిగా టివి, ఎలక్ట్రానిక్ మాధ్యమంలో ప్రత్యక్ష ప్రసారం చేయడం దేశంలో ఇది తొలిసారి' అని మంత్రి చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాల్లో నిర్వహిస్తున్న ఈ టోర్నీ ప్రజల్లో జాతీయ భావనను పెంచడమేకాక, దేశంలో క్రీడా విప్లవంను తీసుకొస్తుందన్నారు. ప్రతీ సంవత్సరం కొత్తనైపుణ్యమున్న క్రీడాకారులను వెలుగులోకి తెలుస్తుందని చెప్పారు.

శీతాకాల ఒలింపిక్స్‌లో ఉ.కొరియా పాల్గొంటుంది



సియోల్: శీతాకాల ఒలింపిక్ క్రీడల్లో ఉత్తర కొరియా పాల్గొంటుందని ఆదేశ అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ సూచన ప్రాయంగా వెల్లడించారు. సోమవారం కొత్త సంవత్సరం సందర్భంగా సందేశం మిస్తూ కిమ్ ' ప్యాంగ్‌చాంగ్ శీతాకాల ఒలింపిక్స్ విజయవంతమవుతాయని ఆశిస్తున్నాను. మా దేశ క్రీడాకారుల బృందం అక్కడికి బయలుదేరడానికి తగిన తగిన చర్యలను చేపట్టడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని కిమ్ అన్నారు. ఇందుకోసం త్వరలో మా అధికారులు దక్షిణ కొరియాలోని అధికారులతో భేటీ అవుతారన్నారు. కిమ్ ప్రతిపాదనలను స్వాగతిస్తూ సియోల్‌లో అధ్యక్ష భవనం బ్లూ హౌస్ నుంచి ఒక అధికారిక ప్రకటన వెలువడింది. ఉత్తర కొరియా ప్రకటన ద్వీపకల్పంలో శాంతిని నెలకొల్పడానికి సహకిస్తాయి. పిఒసిఒజి అధ్యక్షుడు (ప్యాంగ్‌చాంగ్ ఆర్గనైజింగ్ కమిటీ ఫర్ ద ఒలింపిక్స్ గేమ్స్) లీ హీ బియోమ్ మాట్లాడుతూ..' మేము సంతోషంతో ఉత్తరకొరియా ఒలింపిక్స్‌లో పాల్గొనడానికి చేసిన ప్రతిపాదనలను స్వాగతిస్తున్నాం మేము ఉత్తర కొరియా క్రీడల్లో పాల్గొంటుందనే భావించి ఏర్పాట్లు చేస్తున్నాం. పిఒసిఒజి వారి క్రీడాకారులకు రవాణా, వసతి తదితర సౌకర్యాల కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాము' అని అన్నారు. ఒలింపిక్ క్రీడలు కొరియన్ ప్రజలు దయను ప్రపంచానికి చాటడానికి మంచి వేదికగా ఉంటాయి. 2018 ఉత్తర, దక్షిణ కొరియా దేశాల ప్రజలకు కీలకం. ఇరుదేశాలు ఆవిర్భవించి 70 సంవత్సరాలు అవుతున్నాయి అని కిమ్ తన సందేశంలో చెప్పారు

శాంతికోసం ఒలింపిక్ క్రీడలు

ఫిబ్రవరి 9న ప్రారంభం కానున్న ఈ క్రీడలు సియోల్, పిఒసిఒజి ' శాంతి క్రీడలు' గా అభివర్ణించాయి. కాగా ఉత్తర కొరియా స్కేటర్లు ఇద్దరు ఈ క్రీడల్లో పాల్గొనడానికి అక్టోబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాల్సిఉంది. అయితే ఐఓసి వీరిని ఒలింపిక్స్‌లో పాల్గొనడానికి ఇప్పటికీ ఆహ్వానిస్తూనే ఉంది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.





మీకు ఫేస్ బుక్ అకౌంట్‌ఉందా? అయితే మీరు తప్పక కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిందే. లేదంటే చిక్కుల్లో పడే ప్రమాదం ఉంది. ఇంతకూ ఏమిటా జాగ్రత్తలు అనుకుంటున్నారా? తొందరెందుకు... అక్కడికే వస్తున్నామ్.... నింపాదిగా చదవండి... చదవమన్నాం కదా అని చదివి వదిలేయకండి..వాటిని పాటించండి! వివరాల్లోకి వెళ్తే...

టెక్ టైమ్

అజాగ్రత్తగా ఉంటే... ఫేస్ 'బుక్' అవుతారు!

సోషల్ మీడియాలో అత్యంత ప్రజాదరణ పొందింది ముఖ పుస్తకం(ఫేస్‌బుక్). ఇది వచ్చిన తర్వాత మన జీవన శైలిలో అనూహ్యమైన మార్పులు వచ్చాయనడం అతిశయోక్తి కాదు. బ్యాంక్ అకౌంట్‌కు ప్రాధాన్యత ఇస్తామో లేదో కాని..దీనిని మాత్రం ఓపెన్ చేయకుండా ఉండలేం. అంతగా ఆధునిక మనిషి జీవితంతో పెనవేసుకు పోయింది ఫేస్‌బుక్! ఇంట్లో భార్యాపిల్లలనైనా పలుకరించడం మర్చిపోతామేమోకాని, ఉదయం లేవగానే ముఖపుస్తకం తెరిచి మిత్రులకు హాయ్ చెప్పకుండా ఉండలేం. రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు ఆ రోజు మన అనుభవాలను అనుభూతులను ముఖపుస్తక మిత్రులతో షేర్ చేసుకోవడం మరిచిపోం. అయితే నాణేనికి బొమ్మాబొరుసు ఉన్నట్లే... ప్రతి చోటా మంచి చెడూ ఉంటాయి. ఫేస్‌బుక్ కూడా దీనికి మినహాయింపు కాదు. ఫేస్ బుక్ వల్ల విజ్ఞానం,వినోదం, లోకజ్ఞానం తదితర ప్రయోజనాలతో పాటు, భద్రతాపరమైన ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అందుకే ముఖపుస్తకం ఖాతా వినియోగ దారులు తప్పని సరిగా కొన్ని జాగ్రత్తలు పాటించాలి.

ఫేస్‌బుక్ యూజర్ల సంఖ్య 210 కోట్లు

ఫేస్ బుక్ అనేది ఒక దేశం అనుకుంటే ..దాని జనాభా రమారమి భారత్, చైనా దేశాల మొత్తం జనాభాతో సమానం. అంటే ఫేస్‌బుక్ క్రియాశీల ఖాతాదారుల సంఖ్య 210 కోట్లు. ప్రతి సెకనుకు ఐదుగురు ముఖపుస్తకంలో ఖాతా ఓపెన్ చేస్తున్నారంటే దానికున్న ప్రజాదరణ ఎంతో అర్థం చేసుకోవచ్చు. ఫేస్‌బుక్ యాజమాన్యం లెక్కల ప్రకారమే 6కోట్ల ఫేక్ అకౌంట్స్, 20 కోట్ల డుప్లికేట్ అకౌంట్స్ ఉన్నాయి. అమెరికా కన్స్యూమర్ రిపోర్టు ..2017 నవంబర్....ప్రకారం మొత్తం ఖాతాదారుల్లో సగం మంది అంటే దాదాపు100కోట్ల మంది తమకు తెలియని వాళ్లు, అపరిచితుల నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను ఆమోదిస్తున్నారు. ఇక అధికశాతం ఖాతాదారులు తమ అకౌంట్లలోని సెక్యూరిటీ ఫీచర్స్‌ను ఓపెన్ చేసి చూసిన పాపాన పోలేదట. ఈ కారణంగా సైబర్ బెదిరింపులు, వేధింపులు, వ్యక్తిగత వివరాల చోరీ, రహస్యంగా వెంబడించడం వంటివి జరుగుతున్నాయి. ఓ అంచనా ప్రకారం సైబర్ నేరాలు, కుంభకోణాల వల్ల ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 3లక్షల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోంది. ప్రపంచ వ్యాప్తంగా 35శాతం మంది మహిళలు సైబర్ నేరగాళ్ల వేధింపులకు గురవుతున్నారు. అయితే ఖాతాదారులు కొన్ని జాగ్రత్తులు పాటిస్తే , ప్రమాదాల భారినుంచి తప్పించుకోవచ్చు.

☆ ఫేస్‌బుక్ అకౌంట్ ఓపెన్ చేసే ముందు అధిక సంఖ్యాకులు వ్యక్తిగత సమచారం ..పుట్టినతేదీ,వయస్సు, ఫోన్ నెంబర్, మెయిల్ ఐడి నమోదు చేస్తున్నారు. కాని ఇవి లేకుండా కూడా ముఖపుస్తకం ఖాతాను ఆమోదిస్తారన్న విషయాన్ని



గుర్తుంచుకోండి. ఒకవేళ ఇచ్చినా.. ఆ వివరాలు మనకు, మన ఆప్తమిత్రులకు,లేదా మన ప్రత్యేకమైన మిత్రబృందానికి మాత్రమే కనిపించేలా సెట్టింగ్ చేసుకోవాలి.

☆ ఫేస్‌బుక్ పాస్‌వర్డ్ మర్చిపోతే..ఏదైనా సాంకేతిక కారణాల వల్ల అది ఓపెన్ కాకపోతే..వెంటనే మరో అకౌంట్ ఓపెన్ చేస్తుంటారు చాలామంది. అయితే ఇక్కడ ఒక్కవిషయం గుర్తుంచుకోవాలి. ఫేస్ బుక్ నిబంధనల ప్రకారం ఒక్కరు ఒక్క అకౌంట్ మాత్రమే కలిగి ఉండాలి. ఒకటి కన్నా ఎక్కువ అకౌంట్లు ఉంటే మొత్తం ఖాతాలను రద్దుచేయడం జరుగుతుంది.

☆ ఫేస్‌బుక్‌లో ఉన్న వారిలో మన బంధువులు, కుటుంబ సభ్యులు ఉంటే ,వారితో మనకున్న సంబంధాలు,ఇతర వ్యక్తిగత విషయాలను అందులో పోస్ట్ చేస్తుంటాము. ఇది చాలా ప్రమాదకరం. ఎందుకంటే అవి సంఘవిద్రోహ శక్తుల చేతిలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

☆ అపరిచితుల నుంచి ఫ్రెండ్ రెక్వెస్ట్ వస్తే ఆమోదించే ముందు వారి ప్రొఫైల్‌ను జాగ్రత్తగా గమనించాలి.అపరిచితుని ఫ్రెండ్స్ ఎవరనే విషయం సమీక్షించుకోవాలి. ఆతర్వాతే ఓకే చేయాలి. లేదంటే సెక్యూరిటీ సెట్టింగ్స్‌లో ..మనకు ఎవరు ఫ్రెండ్ రెక్వెస్ట్ పంపొచ్చనే ఆప్షన్ ఉంటుంది. అందులో స్నేహితుల యొక్క స్నేహితులు (Friends of Friends), ఎవరైనా (Everybody) అనే ఆప్షన్స్ ఉంటాయి. అందులో స్నేహి తుల యొక్క స్నేహితులు అనేది ఎంచుకుంటే మంచిది. అప్పుడు అపరిచితుల నుంచి మనకు రెక్వెస్ట్‌లు రావు.

☆ ఏదైనా ఫొటో లేక పోస్ట్ పెట్టినప్పుడు ఎవరిని పడితే వాళ్లను, ఆ మ్యాటర్‌తో సంబంధం లేని వాళ్లను అసలు ట్యాగ్ చేయవద్దు. ఉదాహరణకు.. ఒక రాజకీయ పక్షం మీదో, మతం మీదో, భాషమీదో పోస్ట్ పెట్టారు అనుకోండి. దానిని విదేశాల్లో ఉన్న మన చిన్ననాటి మిత్రుడికి ట్యాగ్ చేసామనుకోండి..విదేశీయుల ముందు మన మిత్రుడు ఇబ్బంది ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడవచ్చు.అలాగే మనల్ని ఎవరు పడితే వారు ట్యాగ్ చేయకుండా జాగ్రత్త పడాలి. మనకు ఎవరూ ట్యాగ్ చేయకుండా లేదా మనకు ట్యాగ్ చేసినవి మనం చూసి ఓకే చేసాకే మన టైం లైన్లో కనిపించే విధంగా ఆప్షన్‌ను సెట్ చేసుకోవాలి. ఫేస్‌బుక్‌లోని ప్రైవసీ సెట్టింగ్‌లో ఇలాంటి అవకాశం ఉంది.

☆ ప్రస్తుతం చాలా కంపెనీలు, సంస్థలు..తమ ఎంప్లాయ్ మెంట్ పాలసీలో ఫేస్‌బుక్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఉద్యోగ నియామకాల్లో అభ్యర్థిని ఎంపిక చేసేముందు..సోషల్ మీడియాలో వారు పెట్టిన పోస్టులు(రాతలు), పంచుకున్న అభిప్రాయాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. తద్వారా అభ్యర్థి వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తున్నాయి. ఆ తర్వాతే అతనికి ఉద్యోగం ఇవ్వాలా ? వద్దా అనే అంచనాకు వస్తున్నాయి. అందుకే ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టేముందు, ఇతరుల పోస్టులకు స్పందించి అభిప్రాయాలు రాసేముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కాబట్టి ఫేస్‌బుక్‌ను కేవలం విజ్ఞాన, వినోద, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య అంశాలకే పరిమితం చేస్తే బెటర్!

☆ ఫేస్‌బుక్‌కు సంబంధించి పాస్ వర్డ్ చాలా కీలకం. అందుకే మరిచిపోయే ప్రమాదం లేకుండా ఉండాలని...పుట్టిన తేదీనో, పిల్లల పేర్లనో, మొబైల్ లేదా మోటర్ వెహికల్ నెంబరునో పాస్ వర్డ్‌గా పెట్టుకుంటారు. కాని అది మంచిది కాదు. వీటిని కనిపెట్టడం సైబర్ కేటుగాళ్లకు ఈజీ. అందుకే ఎవరూ ఊహించని విధంగా పాస్‌వర్డ్ పెట్టుకోవాలి.

☆ చాలా మంది తమ పిల్లలు చదివే పాఠశాలలో జరిగిన కార్యక్రమాలకు సంబంధించిన పోటోలను..స్కూల్ పేరుతో సహా ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేస్తున్నారు. ఇది ఫేస్‌బుక్‌లో ఉండే కిడ్నాపర్లకు అవకాశం కల్పించినట్లే అవుతుందని మరిచి పోవద్దు. అలాంటి ఫొటోలు పోస్ట్ చేసేటప్పుడు పబ్లిక్‌గా అనే ఆప్షన్ ఎంచుకుంటే ముఖపుస్తకంలోని 210 కోట్ల మంది వినియోగదారులకు కనిపిస్తుంది. అందుకే ఫేస్ బుక్... మీ ఫ్రెండ్స్ జాబితాను వర్గీకరించుకునే అవకాశం కల్పించింది. కాబట్టి ఉప జాబితాలు ఏర్పాటు చేసుకొని, మన ఫ్రెండ్స్‌ను... సంబంధిత జాబితాలోకి చేర్చుకోవాలి. ఉదాహరణకు.. ..సహవిద్యార్థులు, సొంత ఊరి వాళ్లు, బంధువులు, సహోద్యోగులు ఇలా ఉపజాబితాలు ఏర్పాటు చేసుకోవాలి. మిత్రులను అందులో చేర్చుకోవాలి. ఒక మిత్రుడు ఎన్ని జాబితాల్లోనైనా ఉండవచ్చు. ఇలా చేస్తే మీరు చేసిన పోస్టుకు అనుగుణంగా జాబితాను ఎంపిక చేసుకుంటే..మీ పోస్ట్ పబ్లిక్‌గా పంచుకోవాల్సిన అగత్యం ఉండదు.ఎవరికి చేరాలో వారికే చేరుతుంది మీ పోస్ట్.

☆ కొత్తొక వింత అంటారు పెద్దలు. ఫేస్ బుక్ ఖాతా ఓపెన్ చేసిన కొత్తలో..ఉత్సాహంతోనో..తెలిసో తెలియకో.. ఎన్నో యాప్ లకు, క్యాండిక్రష్ లాంటి గేములకు సభ్యత్వం తీసుకుంటాము. అయితే కొన్ని యాప్‌ల వల్ల భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అందుకే మనం నిత్యం వాడనవి, మనకు ఉపయోగం లేనివి, అనుమానాస్పదమైన యాప్‌లను వెంటనే తొలగించడం మంచిది. ఇక టైం లైన్‌లో, ఇన్‌బాక్స్‌లో వచ్చిన లింకులలో అపరిచితులు పంపినవి, మనకు తెలియనివి వస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లోను ఓపెన్ చేయకండా, డిలీట్ చేయడం బెటర్. ఒక వేళ ఏమిటో చూద్దాం... అని లింక్‌ను క్లిక్ చేస్తే వైరస్ ఎటాక్ చేయడమో, మన ఖాతా హ్యాకింగ్‌కు గురికావడమో జరిగే ప్రమాదం ఉంది. అనుమానాస్పద వ్యక్తులు మన ఫోన్ నెంబర్, వ్యక్తిగత సమచారం అడిగినా..సున్నితంగా తిరస్కరించాలి. అలాంటి వారిని మిత్రుల జాబితాలోంచి తొలిగించాలి.



-సునీల్ ధవళ, మాజీ వైస్ ప్రెసిడెంట్, నేషనల్ జియోగ్రాఫిక్ అండ్ ఫ్యాక్స్

మూడురోజులు... స్మార్ట్ బొనంజా!

రేపటి నుంచి ఫ్లిప్‌కార్ట్ మొబైల్స్ తగ్గింపుధరల విక్రయాలు



ఫ్లిప్‌కార్ట్ తన 2018 మొబైల్స్ బొనంజా విక్రయాలను రేపటి (3వ తేదీ)నుంచి ప్రారంభించనుంది. ఈ మేరకు సంస్థ అధికారికంగా ప్రకటించింది. భారతీయ వినియోగదారులు నూతన సంవత్సరంలో కొత్త స్మార్ట్ ఫోన్‌తో ముందుకు సాగిపోవాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. దీనికోసం ఫ్లిప్‌కార్ట్ సంస్థ జియోమీ FsLiH G1(Xiaomi Mi A1), గూగుల్ పిక్సెల్ 2 (Google Pixel 2) మరియు పిక్సెల్ 2 ఎక్స్ ఎల్ (Pixel 2 XL), మోటో జీ5 ప్లస్(Moto G5 Plus),రెడ్మీ నోట్ 4 (Redmi Note 4), లెనోవా కే 5 నోట్ (Lenovo K5 Note) సాంసంగ్ గెలాక్సీ ఎస్ 7 (Samsung Galaxy S7)

స్మార్ట్ ఫోన్ యాజమాన్యాలతో ఆకర్షణీయమైన ఒప్పందాలు ఏర్పరచుకుంది. ఈనెల 3,4,5 తేదీలలో అంటే మూడు రోజులు మాత్రమే ఈ బొనంజా విక్రయాలు అందుబాటులో ఉంటాయి. ఈ సందర్భంగా వినియోగ దారులు కొనుగోలు చేసిన పోన్ నచ్చక పోతే .. 148 రూపాయల చార్జ్ తో బైబ్యాక్ గ్యారెంటీ సౌకర్యం కల్పిస్తోంది. వివిధ మార్పిడి ఆఫర్లను, నెలకు 833 రూపాయలతో ప్రారంభమయ్యే విధంగా... నో కాస్ట్ ఈఎంఐ సౌకర్యం కూడా ఫ్లిప్‌కార్ట్ కల్గిస్తోంది.

ఆకర్షణీయమైన తగ్గింపు ధరలు

2018 మొబైల్స్ బొనంజా విక్రయాల్లో భాగంగా ఆరకర్షణీయమైన తగ్గింపు ధరలకు వివిధ స్మార్ట్ ఫోన్లు లభించనున్నాయి. 13,999 రూపాయల జియోమీ ఎంఐ ఏ1 ఫోన్.. 12,999 రూపాయలకే లభిస్తుంది. 1000 రూపాయల తగ్గింపు ధరతో 14,999 రూపాయలకు ఆండ్రాయిడ్ వన్ ... 61,000 రూపాయల ఎంఆర్‌పీ ఉన్న గూగుల్ పిక్సెల్ 2 మరియు పిక్సెల్ 2 ఎక్స్ ఎల్ ..ఫోన్లు భారీ తగ్గింపు ధరతో 39,999 రూపాయలకే లభించనున్నాయి.. పిక్సెల్ 2 సేల్స్ 3వ తారీఖు మధ్య రాత్రి నుంచి ప్రారంభం అవుతాయి. ఇక 16,000 రూపాయల ఎంఆర్పీ కలిగిన మోటో జీ5 ప్లస్(4జీబీ వెరియంట్) 9,999 రూపాయలకు, 12,999 రూపాయల ఎంఆర్‌పీ ఉన్న రెడ్మీ నోట్ 4 రూ. 10,999 కు, 13,499 రూపాయల ఎంఆర్‌పీ ఉన్న లెనోవా కే 5 నోట్(4జీబీ) 11,481రూపాయలకు బొనంజా విక్రయాల్లో భాగంగా వినియోగ దారులకు లభించనున్నాయి. 46,000 రూపాయల ఎంఆర్‌పీ ఉన్న సాంసంగ్ గెలాక్సీ ఎస్ 7 స్మార్ట్ ఫోన్ 26,990 రూపాయలకే వినియోగదారులకు లభించనుంది. . అలాగే బొనంజా విక్రయాల్లో భాగంగా 4జీ సౌకర్యం ఉన్న కొన్ని హ్యాండ్ సెట్లను ఆకర్షణీయమైన తగ్గింపు ధరలకు అందించనుంది. 6,999 రూపాయల ఎంఆర్‌పీ ఉన్న మోటో సీ ప్లస్ (2జీబీ)..5,999 రూపాయలకు, 11,490 రూపాయల ఎంఆర్‌పీ ఉన్న పానాసోనిక్ ఎలుగా ఏ3(3జీబీ)..6,999 రూపాయలకు, 8,999 రూపాయల ఎంఆర్‌పీ ఉన్న పానాసోనిక్ రే ఎక్స్ (3జీబీ)...6,981రూపాయలకు బొనంజా విక్రయాల్లో భాగంగా వినియోగదారులకు అందిస్తారు.



ఎయిర్ టెల్ యూజర్లకు శుభవార్త!


ఇండియన్ టెలికాం దిగ్గజం ఎయిర్ టెల్ తన కస్టమర్లకు కొత్త సంవత్సర కానుక ప్రకటించింది. ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ యూజర్లకు ఈ ఏడాది జూన్ వరకు ఎయిర్ టెల్ టీవీ సేవలను ఉచితంగా అందిస్తోంది. దీనికోసం ఎయిర్ టెల్ లైవ్ టీవీ యాప్‌కు సంబంధించి కొత్త వెర్షన్‌ను ప్రారంభించింది. ఈ మేరకు ఎయిట్ టెల్ యాజమాన్యం ప్రకటించింది. ఈ యాప్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ వెర్షన్ ఫోన్లలో పనిచేస్తుంది. 15 భాషలకు సంబంధించిన కంటెంట్ ఎయిర్ టెల్ లైవ్ టీవీ యాప్‌లో లభిస్తుంది. యాప్ కొత్త వెర్షన్‌లో 300 లైవ్ టీవీ ఛానల్స్, దేశంలోని వివిధ భాషలకు చెందిన 6000 మూవీలు, అంతర్జాతీయ టీవీ షోలను అందుబాటులో ఉంచింది. అంతేకాదు ఎయిర్ టెల్ తన లైవ్ టీవీ యాప్ లుక్‌ను కూడా మార్చేసింది.

---

* రంగవల్లిక *



15చుక్కలు 15 వరుసలు



19 చుక్కల నుండి 1 వరకు (సరిచుక్క)



గోకవరపు సుహాసిని
రాబర్ట్ సన్ పేట
మచిలీపట్నం

మీరూ ముగ్గులు పంపొచ్చు

ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.


అడ్రసు: లైఫ్ c/o ఆంధ్రప్రభ, 8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75, రోడ్ నెం:9, జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com



19 చుక్కల నుండి 9 వరకు (సరిచుక్క)

ప్రతిజ్ఞా పాలనా పరమధర్మమే

కర్తవ్య, ప్రతిజ్ఞా పాలన ధర్మనిరతి మనిషికి ఎంత ముఖ్యమో మహాభారతం చెబుతుంది. అందులో ధర్మరాజు, భీష్ముడు, విదురుడు వంటివారు ధర్మాచరణ, ధర్మ ప్రబోధంపైనే దృష్టి పెట్టారు. భీష్ముని ధర్మబోధ ధర్మాల ఖజానా. మహాభారతమే కాదు సనాతన ధర్మం అడుగడుగునా ధర్మనిరతి గురించి చెబుతూనే ఉంది. రామావతారం పూర్తిగా ధర్మంపై ఆధారపడినదే. రామాయణంలో ప్రధాన పాత్ర అయిన రాముడు మూర్తీభవించిన ధర్మమే.



మహాభారతంలో ధర్మనిరతి గురించి చెప్పేదే ఈ కథ. ఒకప్పుడు దుర్యోధనుడు అనే రాజు ఉండేవాడు. (కౌరవులలోని దుర్యోధనుడు కాదు). అతను అమిత సౌందర్య వంతుడిగా, పరాక్రమవంతుడిగా పేరు తెచ్చుకున్నాడు. అతని వీరత్వం గురించి విని, అందచందాలను చూసిన నర్మదా నది ఒక కన్యగా తన రూపాన్ని మార్చుకుని తనను వివాహమాడవలసిందిగా రాజును కోరింది. దుర్యోధనుడు కూడా నర్మద అందానికి ముగ్ధుడయ్యాడు. వెంటనే ఆమెను శాస్త్రోక్తంగా వివాహమాడాడు. వారికి సౌందర్య రాశి అయిన ఒక కుమార్తె పుట్టింది. ఆమెకు సుదర్శన అని పేరు పెట్టి అల్లారు ముద్దుగా పెంచుకోసాగారు. దుర్యోధనుడు మంచి భక్తుడు. పైగా రాజుగా ఎన్నో ధర్మకార్యాలు

మహాభారతంలో చిన్న కథలు

చేస్తూ, తన ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుకునేవాడు. అందుకే తన మంత్రి, పురోహితులు చెప్పే హిత వచనాలను విని ఆచరించేవాడు. ఒకసారి వారు యజ్ఞం చేయమని దుర్యోధనుడికి సలహా ఇచ్చారు. ఆయన వారి సలహా మేరకు యజ్ఞం ప్రారంభించాడు. అగ్నికార్యాన్ని నిర్వర్తించడం కోసం తన కుమార్తె సుదర్శనను నియోగించాడు. ఆమె అగ్నిదేవుని సేవ చేస్తుండేది. ఈ సుదర్శనను చూసి అగ్నిదేవుడు ఎంతో ప్రీతి చెందాడు. ఆమె అందాన్ని చూసి ఆమెను పెళ్ళాడాలనుకున్నాడు. యజ్ఞంలో దానాలు చేస్తున్న దుర్యోధనుని దగ్గరకు ఆయన బ్రాహ్మణ వేషంలో వెళ్లి తనకు సుదర్శనను నిచ్చి వివాహం చేయాలని అడిగాడు. దానికి దుర్యోధనుడు 'మీరు ఏ ధనాన్ని అయినా కోరుకోండి ఇస్తాను. కాని నా కూతురునివ్వను' అని చెప్పి బ్రాహ్మణ వేషంలోని అగ్నికి అపరిమితమైన ధన కానుకలిచ్చి పంపించివేశాడు. అతడు అగ్నిని సాధారణ బ్రాహ్మణునిగానే భావించాడు. అగ్నిదేవుడు తన అసలు రూపాన్ని చూపదలచలేదు. అయితే అతనికి చాలా కోపం వచ్చింది. యజ్ఞంలో తన తేజస్సును తగ్గించుకున్నాడు. దానితో యజ్ఞం చేయిస్తున్న బ్రాహ్మణులు తాము తప్పు చేస్తున్నామేమో అని మంత్రాలను బిగ్గరగా చదవసాగారు. అప్పుడు అగ్ని దేవుడు ఆ బ్రాహ్మణులకు జరిగిన విషయం చెప్పాడు. వారు దుర్యోధనుడికి అంతకు ముందు బ్రాహ్మణ రూపంలో వచ్చింది అగ్ని దేవుడని తెలిపారు. దానితో దుర్యోధనుడు అగ్నికి తన కుమార్తెనిచ్చి వివాహం చేశాడు. వారిద్దరికీ ఒక కొడుకు పుట్టాడు. ఆ కొడుకు తల్లి పోలికతో అతి అందగాడిగా ఉండేవాడు. అందువల్ల అతనికి సుదర్శనుడు అని పేరు పెట్టారు. అతడు పెద్దవాడైన తర్వాత రాజ్యభారాన్ని అప్పగించారు. అతనికి వివాహం అయింది. ఓఘవంతుడు అనే కుమారుడు పుట్టాడు. ఓఘవంతునికి ఓఘవతి, ఓఘరథుడనే కూతురు, కొడుకు పుట్టారు.

ఇలా ఉండగా సుదర్శనుడికి తాను గృహస్థుడిగా ఉండే మోక్షం సాధించాలని పించింది. ఇదే విషయం భార్యకు చెప్పాడు. ఆమె అది ఎలా సాధ్యపడుతుందని, ఒక వేళ సాధ్యమే అయితే తానూ మోక్షాన్ని కోరుకుంటానని చెప్పింది. వారిద్దరూ ఒక నిశ్చయానికి వచ్చి కురుక్షేత్రమనే ప్రదేశానికి వెళ్ళి అక్కడ ఒక ఆశ్రమాన్ని కట్టుకున్నారు. మనం చేసే కర్తవ్యాల్లో అతి ముఖ్యమైనది అతిథి పూజ. దాన్ని మనిద్దరం చేద్దాం. ఎన్ని కష్టాలు వచ్చినా అతిథిని సేవించడమే పరమ కర్తవ్యం అని కూడా అనుకున్నారు. అంతేకాక అతిథి అడిగినది ఏదైనా, చివరకు ప్రాణమైనా ఇస్తానని ప్రతిజ్ఞ చేశాడు. ఇంటికి వచ్చిన ఏ అతిథినీ సేవించకుండా పంపేవారు కాదు.

అయితే వారి నిష్ఠ ఏ పాటిదో తెలుసుకుందామని ధర్మదేవత అనుకున్నాడు. ఒక రోజు ధర్మదేవత బ్రాహ్మణుని వేషంలో వారి ఇంటికి వచ్చాడు. అతనకి యథావిధిగా భార్యాభర్తలు పరిచర్యలు చేశారు. అయితే బ్రాహ్మణుని వేషంలోని ధర్మదేవత సుదర్శనుని భార్య తనను శారీరకంగా సంతోషపెట్టాలి అని అడిగాడు. ఇది అతిథులు అడగరాని కోరిక. అయితే ప్రతిజ్ఞపట్టినందున వెనుకడుగు వేయరాదు. ప్రతిజ్ఞను నెరవేర్చకపోవడం మహాపాపం. అందువల్ల పరమేశ్వరునిపై భారం వేసి అతిథి కోరికను తీరుస్తానన్నాడు.


దానితో ధర్మదేవత అతని ముందు అసలు రూపంతో ప్రత్యక్షమై అతని నిష్ఠను పరీక్షించడానికే వచ్చానని చెప్పాడు. వారి ధర్మనిరతికి ఎంతో సంతోషించాడు. 'నాకు మీ నిష్ఠ, ధర్మనిరతి నచ్చింది. కనుక మీరు ఈ ధర్మంలో ఉండే సాయుజ్యాన్ని పొందవచ్చన్నాడు. దానిని వారు పొందారు. భగవంతుని సన్నిధికి వెళ్ళాలంటే ధర్మాచరణ అనే సోపానాన్ని ఎక్కి తీరవలసి ఉంటుంది.

- అశ్విని

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

పుట్టుక



శ్రీ రమణాశ్రమం
24-2-47

నిన్ననొక భక్తురాలు ''ఏకాత్మ పంచకం'' తన పుస్తకంలో వ్రాసుకున్నానని తెచ్చి శ్రీవారికి చూపింది. ఆ పుస్తకంలో భగవాన్ జన్మదినోత్సవం చేయటానికి మొదట ప్రారంభించిన భక్తులకు తాము వ్రాసి చూపిన పద్యాలు రెండు ఉండటం చూచి, ఇట్లా సెలవిచ్చారు భగవాన్. ''విరూపాక్ష గుహలో ఉండగా 1912 సంవత్సరంలోననుకుంటాను- నా జన్మదినం వచ్చింది. దగ్గరున్నవారంతా 'భగవాన్ జయంతి గదా, ఇక్కడే వండి భోజనం చేస్తా'మని పట్టుబట్టారు. వద్దయ్యా ఈ ఉపద్రవమంటే వింటారా? 'మేం వండుకొని తింటే స్వామికేం బాధ?' అని ఎదురు తిరిగారు. సరే మీ యిష్టమన్నాను. అప్పుడే కొన్ని పాత్రలు కొని తెచ్చారు. ఆ సామానిప్పటికీ ఉన్నది. కొంచమని ప్రారంభించిందే ఇప్పుడింత ఉపద్రవంలోకి దిగింది. ఏదైనా దానంతటది పోవాలి గాని మనం చెపితే ఆగదు. ఎంతో దూరం చెప్పి చూచాను. వినలేదు. సరే, వంటా, భోజనాలూ అయినవి. ఈశ్వరస్వామి నాతో ఉండేవార ప్పుడు. వారు, 'స్వామీ, నేడు తమ పుట్టినదినం గదా? మీరు రెండు పద్యాలు వ్రాస్తే నేనూ రెండు వ్రాస్తా'నన్నారు. అప్పుడు వ్రాశా నీ వెణ్బాలు రెండూను. భావమేమంటే:

1. ''పుట్టినదినమని పండుగ చేయుటకు సంకల్పించు మీరు పుట్టుకకు స్థానమేది?''యని చూడండి. జననమరణములకతీతమైన ఆ నిత్యజీవనమందు ఎన్నడు పదము గొందుమో అదే సత్యముగ మన జన్మదినము.

2. ఏడాదికొకసారి వచ్చే జన్మదినమందైనా ఈ శరీరం వచ్చిందే, ఈ సంసారంలో పడితిమే అని తపింపనగునేగాని, ఉత్సాహంతో పండుగ చేసి సంతోషించటం శవమునకు అలంకరించినట్లుంటుంది. ఆత్మనెఱిగి అందులో లీనమగుటే వివేకం. ఆ పాటల భావం ఇదే.

''మళయాళంలో ఒక జాతికి ఒక ఆచారం ఉన్నదట. ఇంట్లో బిడ్డ పుడితే ఏడ్వటం. ఎవరైనా గతిస్తే, బాజాభజంత్రీలతో ఉత్సవం చేయటమున్నా. వాస్తవానికి తన స్వభావమైన సుఖాన్ని వదలి ఈ జన్మ వచ్చిందే అని దుఃఖించాలి గాని ఉత్సవమేమిటి?'' ''ఈశ్వరస్వామి ఏమని వ్రాశారో?'' అన్నాను. ''వారా? అవతారపురుషులు అదీ, ఇదీ, అని నన్ను పొగుడుతూ వ్రాశారు.అప్పుడదొక సరదా. వారొకటీ, నేనొకటిగా ఎన్నో వ్రాసేవాళ్లం. దాచాలన్న శ్రద్ధ ఎవరికీ లేదు. చాలాభాగం మేమిద్దరమే ఉండేవాళ్లం. భోజన వసతులు లేవాయె. ఎవరుంటారు? ఇప్పుడిక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నవి గనుక వచ్చి కూర్చుంటున్నారు. అక్కడేముందీ? ఎవరైనా వస్తే కాస్సేపుండి వెళ్లేవారు. అంతే'' అన్నారు భగవాన్.

ఆ పుట్టని దినపు పాటలు తెనుగులో వ్రాయండని ప్రార్థిస్తే ఈవిధంగా వ్రాసి ఇచ్చారు భగవాన్.

(వెణ్బా)

1. పుట్టునా డెద్దియో పూనుదురే యుత్సవము
పుట్ట మన కెద్దియను బుద్ధిగొని-పుట్టుక
గిట్టుకలే దై వెలుఁగు కేవల వస్తువులో
పుట్టినదే పుట్టుదినంబు.
2. పుట్టునా డైనను పుట్టుక కేడ్వక
పుట్టునా దుత్సవము బూనుట- గిట్టిన
పీనుగు నలంకరించి పెట్టుటని తన్నెఱింగి
యే నణంగుటే జ్ఞానమే.

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దానానికి శత్రువు వాగ్దానం



కొందరు తరచూ వాగ్దానాలు చేస్తుంటారు. రాజకీయ నాయకులు మరీ ఎక్కువగా చేస్తుంటారు. వాగ్దానం చేయడం సులభం కనుక దానిని తేలిగ్గా చేసేస్తుంటారు. దాన్ని నెరవేర్చటం చాలా కష్టం. పురాణ కథల్లో వాగ్దానం నెరవేర్చకపోవడం పెద్ద తప్పిదంగా భావించే వారు. అయితే ప్రస్తుత కాలంలో వాగ్దానం చేయడం దాని భంగం సామాన్య విషయమైపోయింది. వాగ్దానాలు చాలా రకాలుగా ఉంటాయి. ఇస్తానన్నది ఇవ్వక పోవడం, చేస్తానన్నది చేయకపోవడం, వస్తానన్న సమయానికి రాకపోవడం ఇలా ఎన్నో రకాల వాగ్దానాలు ఉంటాయి. వాటిని పాటించకపోతే వాగ్దాన భంగమూ ఉంటుంది. దానం విషయంలో వాగ్దానం చేయడం, భంగం వలన వచ్చే పరిణామాలు ఇలా ఉంటాయి.

దానం విషయంలో వాగ్దానం చేయడం వలన దాతకు దానం వల్ల కలగవలసిన ప్రశాంతి, ఆనందం సిద్ధించవు సరికదా చాలా ఇబ్బందిని అనుభవించవలసి ఉంటుంది. దానికి కారణం ఏమిటి? **క్షణం చిత్తం, క్షణం విత్తం క్షణం జీవితమావయోః** అంటారు. చిత్తం చంచలం కావడం వల్ల ఇవ్వాలని భావించినప్పుడున్న మనసు ఆ తర్వాత లేకపోవడం వలన అశాంతికి గురవుతాడు. వాస్తవానికి ప్రతిగ్రహీతకు ఆనందాన్ని కలిగిస్తేనే దానం సఫలమైనట్లు అవుతుంది. దాన స్వీకర్తకు తాను వాగ్దానం చేసినంత మాత్రాన వస్తువు ముట్టలేదు కాబట్టి ఆనందం సిద్ధించదు. తరువాత ఆ వస్తువును ఇచ్చినప్పుడు కూడా గతంలో ఇచ్చిన బాకీ తీర్చినట్టే భావన కలుగుతుంది. అందువల్ల దానం తీసుకున్నప్పుడు కలిగే ఆనందం సిద్ధిం చదు. ఆ సమయంలో కూడా చివరకు ఆ వస్తువు దక్కు తుందో దక్కదో అన్న ఆందోళనకు గురి కావడం వల్ల నెగి టివిటీ వస్తుంది. వాగ్దానం చేయకపోతే ఏ ఆందోళనా లేదు. వాగ్దానం చేసినందు వల్ల ప్రతిగ్రహీతల్లో కొత్త ఆందోళన పుట్టించినట్లయింది. ఒకవేళ ఇవ్వడం ఆలస్యమైతే మరీ ఆందోళన, దాతపై అంతకు ముందున్న గౌరవాన్ని కూడా కోల్పోయే స్థితి ఏర్పడుతుంది.

మొత్తం మీద ప్రతిగ్రహీతకు వాగ్దానం చేసినా ఆనందం లేదు. వస్తువు ముట్టినప్పుడూ ఆనందం లేదు. వస్తువు వచ్చే వరకూ అది వస్తుందో రాదోనని ఆందోళన. ఆలస్యం అయితే నెగిటివిటీ. ఒకవేళ కారణాంతరాల వల్ల దాత ఆ వస్తువును ఇవ్వలేకపోతే తన వస్తువును దోచుకున్నంతగా బాధపడిపోతాడు. దాతకు ప్రతిగ్రహీతకు ఆనందాన్ని దూరం చేసే వాగ్దానం చేయకపోవడమే శ్రేయస్కరంగా తోస్తుంది. సత్యహరిశ్చంద్రుని వాగ్దానమే కదా ఆయనను అన్ని కష్టాల పాలు చేసింది. దానం వ్యయం, వాగ్దానం ద్వితీయం కావడం వల్ల ప్రతి లగ్నానికి ద్వితీయ వ్యయాధిపతులకు మైత్రి ఉండదు. ఆ శత్రుత్వం వల్ల దానానికి వాగ్దానం శత్రువు అవుతుంది. అందువల్ల దాన ఫలితాన్ని వాగ్దానం దూరం చేస్తుంది.

- డాక్టర్ సివిబి సుబ్రహ్మణ్యం

కేతుమాల వర్షము-అధిదేవత



కేతుమాల వర్షములో శ్రీమన్నారాయణుడు కామదేవుని రూపంలో ఆవిర్భవించి లక్ష్మీ అమ్మవారితో నిత్యం పూజలందుకుంటాడు. రమాదేవి ఆప్యాయతతో మనసులో శ్రీహరికి అనురాగాన్ని పంచుతూ ఈ విధంగా స్తోత్రము చేస్తుంది.

''ఓం నమో భగవతే హృషీకేశాయ
సర్వగుణ విశేషైః విలక్షితాత్మనే
ఆకూతీనాం చిత్తీనాం చేతసాం
విశేషాణాంచ అధిపతయే షోడశ కలాయ
ఛందోమయాయ అన్నమయాయ
అమృతమయాయ సర్వమయాయ
సహసే ఓజసే బలాయ కాంతాయ
కామాయ నమస్తే ఉభయత్రభూయాత్ ॥''

ధర్మం-మర్మం

ఈ మంత్రాన్ని ప్రతిరోజు శ్రద్ధగా జపించిన యువతులకు అనుకూలమైన, ఉత్తముడైన భర్త, యువకులకు అనుకూలవతియైన భార్య, భార్యాభర్తలు జపిస్తే వంశాన్ని ప్రేమించే సంతానం కలుగుతుంది. ఇంతేకాక మంచి మనస్సు, ధనార్జన కంటే ధర్మాచరణ ముఖ్యమనే భావన కలుగుతుంది. అంతేకాక యోగ, యాగ, త్యాగ బుద్ధులు కలిగి భోగబుద్ధి తగ్గుతుంది. అదేవిధంగా సమాన, సామరస్య, సంక్షేమ, స్నేహ బుద్ధులు ఏర్పడతాయి. తాను పొందే సుఖము, సంతోషము ఇతరులకు ప్రాప్తించాలని అభిలాషిస్తారు.




మంత్ర జప విధానము :

ప్రాతఃకాలమునే లేచి స్నానాదులు ముగించుకుని పరిశుద్ధమైన వస్త్రములు ధరించి లలాటమున తిలకమును దిద్దుకుని పూజామందిరంలో దీపారాధన చేసి తమ నిత్యకృత్యములైన సంధ్యావందనాది కార్యక్రమములను ముగించుకుని నిశ్చలమైన పరిశుద్ధమైన మనస్సుతో తమ శక్తికి అనుగుణంగా మంత్రాన్ని జపించాలి.

- డా॥ కందాడై రామానుజాచార్య

భగవద్గీత

పూర్ణులలోనూ ఒక్కరే పరమాత్ముని తెలుసుకోగలరు



అధ్యాయం 7

శ్లోకం 3:

మనుష్యాణాం సహస్రేషు
కశ్చిద్యతతి సిద్ధయే।
యతతామపి సిద్ధానాం
కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥

తాత్పర్యం

వేలాది మంది మనుష్యులలో ఒక్కడు మాత్రమే పూర్ణత్వాన్ని సాధించేందుకు ప్రయత్నిస్తాడు. ఆ విధంగా పూర్ణత్వాన్ని సాధించిన వారిలో కూడా ఒకానొకడు మాత్రమే నన్ను యథార్థంగా తెలిసికొనగలుగుతున్నాడు.

భాష్యం

శ్రీ కృష్ణుడు ఈ శ్లోకములో తనను అర్థము చేసుకోవటం ఎంత అరుదో తెలియజేస్తున్నాడు. ఎక్కువ శాతం ప్రజలు తమ తక్షణ సమస్యలైన ఆహారం, నిద్రావసతులు, మైథున భోగము, రక్షణ ఏర్పాట్లను సమకూర్చుకోవటంలోనే తల మునకలై పోతూ ఉంటారు. ఎవరో కొద్ది మంది ఆత్మసాక్షాత్కారానికి ప్రయత్నిస్తారు. వారు జ్ఞానయోగము ద్వారా, ధ్యానయోగము ద్వారా నిరాకార బ్రహ్మాన్ని అర్థము చేసుకుంటారే గాని బ్రహ్మము, పరమాత్మకు అతీతమైన భగవంతుడి దరి చేరలేరు. ఎందువలనంటే భగవద్ తత్త్వము భక్తునికి మాత్రమే భగవంతుడు తెలియజేస్తాడు. దేవతలు సైతమూ భగవంతుడ్ని అర్థము చేసుకోలేరు. కాబట్టి అట్టి మహాత్ముడు చాలా అరుదు. '**స మహాత్మా సుదుర్లభః**' అందుచే అందరూ భగవంతుని సేవలో నిమగ్నమైతే ఆ భగవంతుడు మెచ్చి తన గురించి తాను తెలియజేస్తాడు. భగవంతుడ్ని సంపూర్ణముగా తెలుసుకోవాలంటే ఇంతకు మించి వేరే మార్గం లేదు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

దినఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు, దూరప్రయాణాలు అనుకూలం. విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచికార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు కలసి వస్తాయి.

కర్కాటక రాశి: శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: తెలివైన నిర్ణయాలు తద్వారా విజయాలు చేకూరుతాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


వృశ్చిక రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపార పరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఆకస్మికం. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి: నూతన ఉత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. శుభవ్యయం ఉంటుంది. ఆరోగ్య విషయంలో ప్రతికూలత తగ్గుతుంది. పోటీని తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: ఋణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

కిడ్నీ వ్యాధులు అపోహలు



బ్యాక్ పెయిన్ ఉన్నంత మాత్రాన కిడ్నీ వ్యాధి ఉన్నట్టు కాదు. చాలా అరుదుగా నొప్పి వస్తుంటుంది. కిడ్నీ వ్యాధి ఉంటే కూడా బ్యాక్ పెయిన్ వస్తుంది. ఇన్ఫెక్షన్ వల్ల కూడా నొప్పి వస్తుంది. కండరాలు లేదా వెన్నుపూసకు సంబంధించిన వ్యాధుల వల్ల కూడా బ్యాక్ పెయిన్ వస్తుంది. కిడ్నీల్లో వాపు ఉంటే నొప్పి ఉంటుంది. ఇన్ఫెక్షన్ లేదా మూత్రం నిలిచిపోవడం వల్ల ఇలాంటి సమస్య ఏర్పడుతుంది. సర్వసాధారణంగా కిడ్నీల్లో రాళ్లు ఉన్నట్లయితే మాత్రం మూత్రం నిలిచిపోతుంటుంది. రాళ్లు పెరిగే ప్రాంతంలో నొప్పి ఉంటుంది.

నేను మూత్రం వెళ్లినప్పుడు ఎలాంటి అవరోధం కలగడం లేదు. కాబట్టి కిడ్నీలు బాగున్నట్టు భావించవచ్చా?

డయాలసిస్ చేసుకునే రోగులు కూడా మూత్రం వెళ్లినప్పుడు ఎలాంటి అవరోధం ఉండదు. అంతమాత్రాన కిడ్నీల్లో సమస్య లేదని భావించలేం. దెబ్బతిన్న కిడ్నీ వరుసగా మూత్రాన్ని విడుదల చేస్తుంది. రక్తాన్ని ఎలాంటి శుద్ధి చేయకుండానే మూత్రం విడుదలవుతుంది. మీకు కిడ్నీ వ్యాధి ఉన్నట్టు ఎలాంటి లక్షణాలు కనిపించవు. చివరి దశల్లో మాత్రమే కిడ్నీ వ్యాధి ఉన్నట్టు వెల్లడవుతుంది. రక్తపరీక్ష, మూత్రపరీక్ష ద్వారా మాత్రమే కిడ్నీవ్యాధిని గుర్తించగలుగుతాం.

నా వయసు ప్రకారం నా రక్తపోటు పెరుగుతుందా?

ఒకరకంగా చెప్పాలంటే ఇది నిజం. రక్తపోటు



వయసును బట్టీ క్రమంగా పెరుగుతుంది. చాలామంది పెద్దలు మాత్రం సాధారణంగా రక్తపోటుతో బాధపడుతుంటారు. సాధారణంగా 120/80 ఉండాలి. మేజర్ అయిన తర్వాత ఏ వయసు వారైనా ఇదే విధంగా ఉండాలి. అలాకాకుండా కొంతమందికి పెరుగుతూ వస్తుంది. ఫిజిషియన్ ద్వారా మీరు తెలుసుకోవచ్చు. అధిక రక్తపోటుకు సరైన మందులువాడితే వ్యాధి తగ్గుముఖం పడుతుంది. కిడ్నీ వ్యాధులు రావడానికి రెండో అతి ప్రధానకారణాల్లో అధిక రక్తపోటు నిలిచింది.

నేను డయాబెటీస్ వ్యాధితో బాధపడుతున్నాను. కేవలం రక్తంలో చక్కెరశాతాన్ని మాత్రం పరీక్ష చేసుకుంటున్నాను. ఎందుకు కిడ్నీ పరీక్ష చేసుకోవాలి?

మధుమేహం అనేది కిడ్నీ వ్యాధి రావడానికి అతి సాధారణ కారణంగా నిలిచింది. మధుమేహం ఉన్నవారు కిడ్నీ వ్యాధికి గురికాక తప్పదు. ఎందుకంటే మధుమేహం ఉన్నరోగుల రక్తనాళాలు క్రమక్రమంగా దెబ్బతింటాయి. కిడ్నీల్లో ఉండే రక్తనాళాలు కూడా అదేవిధంగా దెబ్బతింటూ ఉంటాయి. రక్తంలో చక్కెర శాతం పెరిగితే మాత్రం రక్తనాళాలు దెబ్బతినడం ఖాయం. కాబట్టి రక్తంలో చక్కెర శాతం పెరగకుండా జాగ్రత్తపడాలి.

డయాబెటిక్ రోగులు మూత్రంలో ప్రోటీన్ విడుదల స్థాయిని తెలుసుకోవాలి. అలాగే క్రియాటిన్ విడుదల స్థాయిని తెలుసుకోవడానికి రక్తపరీక్ష చేసుకోవాలి. కిడ్నీ వ్యాధిని ఆరంభంలో గుర్తించడానికి ఈ పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి. 20ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ ఉన్న మధుమేహ రోగుల్లో 35శాతం మందికి కిడ్నీ వ్యాధి ఉన్నట్టు అధ్యయనంలో వెల్లడైంది. రెండోది శరీరంలో ఇన్సులిన్ని నిరోధించడంలో సహాయపడుతుంది. కిడ్నీ కార్యకలాపాలు మందగిస్తే మాత్రం రక్తంలో చెక్కెర నిల్వలు తగ్గిపోతాయి.


నా రక్తపోటు వ్యాధి చికిత్స వల్ల సాధారణంగా ఉంది. నేను రక్తపోటు టాబ్లెట్లను తీసుకోవడం ఆపేయవచ్చా?

అధిక రక్తపోటు అనేది కిడ్నీ వ్యాధి రావడానికి అతిప్రధాన కారణాల్లో ఒకటిగా నిలిచింది. రక్తపోటును అదుపులో పెట్టుకుంటే మాత్రం కిడ్నీ కార్యకలాపాలను తిరిగి మెరుగుపర్చుకోవచ్చు. అనేక అధ్యయనాలు కూడా ఇదే విషయాన్ని రుజువు చేశాయి. కిడ్నీ వ్యాధి రాకుండా అడ్డుకోవడానికి రక్తపోటును అదుపులో ఉంచుకోవాలి.

మీ రక్తపోటు సాధారణంగా ఉంటే మాత్రం రక్తపోటు టాబ్లెట్లను ఆపేయకూడదు. ఎందుకంటే ఈ టాబ్లెట్లను ఆపేయడంతో మళ్లీ మీ రక్తపోటు పెరుగుతుంది. ఒకసారి మళ్లీ రక్తపోటు పెరిగితే కిడ్నీ కార్యకలాపాలు దెబ్బతింటూ ఉంటాయి. 20 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసు ఉన్నవారికి అధిక రక్తపోటు ఉంటే మాత్రం 20శాతం వరకు కిడ్నీ వ్యాధి రావడానికి అవకాశం ఉంది. కిడ్నీ వ్యాధి ఉన్నవారు అధిక రక్తపోటు రాకుండా జాగ్రత్తపడాలి.

నేను కిడ్నీ వ్యాధికి గురయ్యానని అంటున్నారు కానీ చాలా బాగున్నాను. కిడ్నీ డాక్టరును సంప్రదించవచ్చా?

దురదృష్టవశాత్తు చాలామంది కిడ్నీ వ్యాధి వచ్చినప్పటికీ తెలుసుకోలేకపోతున్నారు. ఆరంభంలో కిడ్నీ వ్యాధిని ఎవరూ గుర్తించలేరు. చాలామందికి ఎటువంటి లక్షణాలు కనిపించవు. వ్యాధి ముదిరే దశకు వచ్చిన తర్వాత కానీ కిడ్నీ వ్యాధిని గుర్తించలేకపోతున్నారు. రక్తపరీక్ష, మూత్ర పరీక్ష చేసుకుంటే సరిపోతుంది.



కిడ్నీ వ్యాధి అనేది క్రమంగా పెరిగే వ్యాధి. కిడ్నీ వ్యాధిని అరికట్టడానికి అనేక చికిత్సా పద్ధతులున్నాయి. మీ డాక్టరును అడిగి తెలుసుకోవడం మంచిది. ఆరోగ్యకర ఆహారాన్ని తీసుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. రక్తపోటు, రక్తంలో చక్కెర శాతం, ఆరోగ్యకర బరువు, ధూమపానాన్ని వదిలివేయడం, నొప్పినివారణ మాత్రలైన ఐ బ్రూఫిన్ మాత్రలను వాడకూడదు. దీనివల్ల కిడ్నీ దెబ్బతింటుంది.

చాలామంది కిడ్నీ వ్యాధి వచ్చినప్పటికీ ఎలాంటి ఇబ్బందులకు గురికావడం లేదు. ఎందుకంటే వారి జీవనశైలి మార్పులతో కిడ్నీ వ్యాధిని ముదరనీయకుండా చర్యలు తీసుకుంటున్నారు. కిడ్నీ డాక్టరును ఆరంభంలో కలిస్తే మంచి ఫలితాలు సిద్ధిస్తాయి. కిడ్నీ వ్యాధి వచ్చినవారందరూ డయాలసిస్ తీసుకోవాలన్న నియమం లేదు.



- డాక్టర్ కవితా గోనె
సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్
కాంటినెంటల్ హాస్పిటల్స్

కులాసా

వ్యాధి లక్షణాలు

మన శరీరంలో ఎప్పటికప్పుడు పేరుకుపోయే వ్యర్థాలను బయటికి పంపడంలో కిడ్నీలు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఇవి రక్తాన్ని శుద్ధి చేస్తాయి. అయితే పలు కారణాల వల్ల కిడ్నీలు ఒత్తిడికి లోనై అనారోగ్యం బారిన పడతాయి. అలాంటి సందర్భాల్లో మన శరీరం కొన్ని లక్షణాలను మనకు తెలియజేస్తుంది. వాటిని గుర్తించడం ద్వారా కిడ్నీలు అనారోగ్యం బారిన పడ్డాయని తెలుసుకోవచ్చు. దీంతో సరైన సమయంలో స్పందించి చికిత్స చేయించుకునేందుకు వీలుంటుంది. మరి కిడ్నీలు అనారోగ్యం బారినపడ్డాయని ఎలా తెలుసుకోవచ్చంటే..

-కిడ్నీల్లో రాళ్లు ఏర్పడితే వెన్ను భాగం నుంచి గజ్జల ప్రాంతం వరకూ నొప్పి కలుగుతుంది.

-కిడ్నీ వ్యాధులు వెన్ను భాగంలో నొప్పిని కలిగిస్తాయి.

- రక్తంలో మలినాలు చేరినా చర్మం పొడిబారుతుంది. దీంతో కిడ్నీ వ్యాధికి గురయ్యారని తెలుసుకోవాలి.

-తరచుగా రాషెస్, దురద, మంటలు వంటివి వచ్చినా కిడ్నీ సమస్యలు ఉన్నట్లు అన్నమాట.

- ఏదైనా ఆహార పదార్థం తింటే వాటి రుచి లోహం రుచి అనిపిస్తే కిడ్నీలు దెబ్బతిన్నట్టు భావించవచ్చు.

-కిడ్నీలుండే చుట్టుప్రక్కల నొప్పిగా ఉంటే యూరిన్ ట్రాక్ ఇన్ఫెక్షన్ ఉన్నట్టు అనుమానించవచ్చు.

- మూత్ర విసర్జనలో నియంత్రణ కోల్పోవడం, తరచుగా మూత్ర విసర్జన జరగడం, లేదంటే తక్కువగా రావడం, మూత్ర విసర్జన సమయంలో మంట, నొప్పి, రంగుమారడం, నురగతో కూడిన మూత్రం ఇవన్నీ కిడ్నీలు వ్యాధికి గురయ్యాయి అనే లక్షణాలుగా గుర్తించవచ్చు.



-ఎనిమియా తీవ్రం అయితే మెదడుకు ఆక్సిజన్ సరఫరా తగ్గి మనిషికి ఏ పనిచేయబుద్ధికాక బద్ధంగా తయారవుతారు. దేని మీద దృష్టిపెట్టడం సాధ్యం కాదు. మతిమరుపు వస్తుంది. ఇలాంటి లక్షణాలు ఉన్న కిడ్నీలు అనారోగ్యానికి గురయ్యాయని చెప్పవచ్చు.

- కిడ్నీలు ఎర్రరక్త కణాల సంఖ్య పెరిగేలా చేసి ఎరిథ్రోప్రోయిటిన్ అనే హార్మోన్ ని విడుదల చేస్తాయి. ఈ హార్మోన్ సరిగ్గా విడుదల కాకపోతే ఎర్రరక్తకణాల సంఖ్య తగ్గిపోయి ఎనిమియా వ్యాధి వస్తుంది. అలా ఎనిమియా వచ్చిందంటే కిడ్నీల పనితీరు సక్రమంగా లేదు అని భావించవచ్చు. కిడ్నీ వ్యాధి లక్షణాలు కనిపించగానే ఆక్యుపంక్చర్ చికిత్స ద్వారా నయం చేయవచ్చు. ప్రెషర్ పాయింట్ల వద్ద సూదులతో పొడవడం వల్ల కిడ్నీ ఫిల్టర్లు మళ్లీ యథావిధిగా పనిచేస్తాయి. అరిపాదాల్లో మాలిష్ చేయడం వల్ల కిడ్నీలు చురుకుగా పనిచేస్తాయి.



- హీలర్ కె. దిలీప్‌కుమార్
క్యాతన్ ఆక్యుపంక్చర్ హెల్త్ రీసెర్చ్ అండ్ సొసైటీ
హైదరాబాద్, విజయవాడ
9848828808


ఇలా పదిలం

శరీరంలో కిడ్నీల ద్వారా జరిగే జీవక్రియ చాలా ముఖ్యమైంది. ఎప్పటికప్పుడు వ్యర్థాలను వడపోస్తూ లవణాలు ఖనిజాలను సమపాళ్లలో ఉంచి నిరంతరం ఆరోగ్యాన్ని కాపాడటంలో మూత్రపిండాలు కీలకంగా ఉంటాయి. మధుమేహం, హైబీపీ, స్థూలకాయం వంటివి కిడ్నీల పనితీరును దెబ్బతీసి వాటిని రకరకాల వ్యాధులకు గురిచేస్తున్నాయి. అయితే సకాలంలో గుర్తించి తగు చికిత్సతో పాటు ఆహార నియమాలు పాటిస్తే కిడ్నీల వ్యాధులకు కళ్లెంవేసి వాటిని పదిలంగా కాపాడుకోవచ్చు. ఎక్కువగా వస్తున్న కిడ్నీ వ్యాధులు, వాటి నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకుందాం.

శరీరంలో కిడ్నీలు రక్తాన్ని వడపోసి, వ్యర్థాలన్నింటినీ నీటితో కలిపి మూత్రం రూపంలో బయటకు పంపిస్తాయి. ఇవి ఎరిత్రోపైటిన్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తూ రక్తం పరిమాణాన్ని నియంత్రిస్తాయి. విటమిన్ డి ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. కాల్షియం, సోడియం, పొటాషియం, పాస్పరస్ మెగ్నిషియం, యూరిక్ ఆమ్లం వంటి వాటిని సమతులంగా ఉంచుతాయి. ఈ పనులన్నింటినీ మూత్రపిండాలు సరిగ్గా చేయకపోతే దాన్నే మూత్రపిండాల వ్యాధి అంటారు. కిడ్నీల పనితీరు మందగిస్తే హానికర పదార్థాలు శరీరంలో పేరుకుపోయి, రకరకాల అనారోగ్య లక్షణాలు కనిపిస్తాయి. వీటిని యూరిమిక్ లక్షణాలంటారు. మధుమేహం, అధిక రక్తపోటు రోగులకు సక్రమంగా మందులు వాడుతుంటే పెద్దగా ప్రత్యేక లక్షణాలు కనిపించవు.

లక్షణాలు

కిడ్నీ వ్యాధి ప్రారంభంలో ఎలాంటి లక్షణాలు కనబడవు. అందువల్ల దీని ముప్పు అధికంగా ఉండే మధుమేహం, హైబీపీ బాధితులు క్రమంతప్పకుండా మూత్రపిండాల పరీక్షలు చేయించుకోవాలి. కుటుంబంలో ఇంతకుముందు ఎవరికైనా కిడ్నీ వ్యాధి ఉండి ఉంటే వారి కుటుంబ సభ్యులు కూడా తప్పనిసరిగా మూత్రపిండాల పనితీరును పరీక్షించుకోవాలి. కిడ్నీ జబ్బున్నవారిలో మూత్రం గాఢత తగ్గిపోతుంది. అందువల్ల రాత్రిపూట కూడా మూత్రం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. కాబట్టి రాత్రిపూట ఎక్కువసార్లు మూత్రం కోసం నిద్ర లేవాల్సి వస్తుంటే కిడ్నీ వ్యాధి ఉందేమోనని



పరీక్షించుకోవడం ఉత్తమం. కిడ్నీ వ్యాధి ముదురుతున్న కొద్దీ అధిక రక్తపోటు, మూత్రంలో ప్రోటీన్ పోవటం, కాళ్లవాపు, ఆయాసం రావటం, ముఖం ఉబ్బడం, ఆకలి మందగించడం, మూత్రం తగ్గిపోవటం, రక్తహీనత, వికారం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలామందికి కాళ్లు చేతులకు తిమ్మిరి కూడా వస్తుంది. కిడ్నీ జబ్బు మరీ తీవ్రమైతే మూర్ఛవచ్చి స్పృహ తప్పిపోవచ్చు. ఇలాంటి సమయంలో డయాలసిస్ చేయాలి. జీఎఫ్ఆర్ 10 ఎంఎల్ కన్నా తగ్గితే డయాలసిస్‌గానీ, కిడ్నీ మార్పిడిగాని చేయాల్సి ఉంటుంది.

రకాలు

కిడ్నీ వ్యాధుల లక్షణాలను బట్టి రకరకాలుగా ఉంటాయి. మూత్రపిండాల పనితీరు హఠాత్తుగా కొద్దిరోజుల్లోనే తగ్గిపోతే అక్యూట్ రీనల్ ఫెయిల్యూర్ అంటారు. కొన్ని వారాల్లో తగ్గిపోతే ర్యాపిడ్ ప్రొగ్రెసివ్ కిడ్నీ డిసీజ్ అంటారు.

మూడు నెలల వ్యవధిలో మూత్రపిండాల పనితీరు క్రమంగా తగ్గుతూ వస్తుంటే క్రానిక్ కిడ్నీ డిసీజ్ అంటారు. వ్యాధి బాగా ముదిరిపోయి, ప్రాణానికి హాని కలిగే స్థాయికి చేరుకుంటే ఎండ్ స్టేజ్ కిడ్నీ డిసీజ్‌గా పిలుస్తారు. కిడ్నీ వ్యాధి తీవ్రతను గ్లోమెర్యూలర్ ఫిల్టరేషన్ రేటు ఆధారంగా నిర్ధారిస్తారు. ఎక్యూట్ రీనల్ ఫెయిల్యూర్ హఠాత్తుగా వస్తుంది కాబట్టి ఇది ప్రాణానికి దారితీసే అవకాశాలు అధికం. అయితే కిడ్నీలు తిరిగి పుంజుకునే అవకాశం కూడా ఇందులోనే ఎక్కువ. క్రానిక్ కిడ్నీ డిసీజ్‌లో క్రమంగా మూత్రపిండాల పనితీరు తగ్గుతుంటుంది. కాబట్టి దీన్ని మందులతో, ఆహార నియమాలతో నియంత్రణలో ఉంచుకోవాలి.

కారణాలు


కిడ్నీ వ్యాధులు రావడానికి రకరకాల కారణాలున్నాయి. క్రానిక్ కిడ్నీ డిసీజ్ రావడానికి మధుమేహం, హైబీపీలు ముఖ్య కారణాలు. మూత్రపిండాల వాపు, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్, రాళ్లు ఏర్పడటం వంటివి కూడా కిడ్నీ వ్యాధులకు దారితీస్తాయి. రాళ్ల వల్ల మూత్రం సరిగ్గా బయటకు వెళ్లకపోవడంతో ఇన్ఫెక్షన్ ఏర్పడి కిడ్నీ వ్యాధి వస్తుంది. మూత్రం ఎక్కువగా నిల్వ ఉండటం వల్ల కిడ్నీలపై ఒత్తిడి పెరిగి అవి దెబ్బతింటాయి. వృద్ధుల్లో ప్రోస్టేట్ గ్రంథి వాపుతో కూడా కిడ్నీ వ్యాధి వస్తుంది. కొందరికి పుట్టుకతోనే పాలీ సిస్టిక్ కిడ్నీ డిసీజ్ వంటి జబ్బులుండొచ్చు. మూత్రంలో ప్రోటీన్ పోవడం వలన కూడా కిడ్నీ వ్యాధి వస్తుంది. స్థూలకాయం కూడా కిడ్నీ జబ్బుల ముప్పునకు కారణమే. స్థూలకాయంతో ఉన్నవారికి మధుమేహం, అధిక రక్తపోటు వచ్చే అవకాశం ఎక్కువ. ఇవేవి లేకపోయినా కొలెస్ట్రాల్ వంటి కొవ్వుల వల్ల కూడా కిడ్నీ సమస్యలు వస్తుంటాయి.

నిర్ధారణ

కిడ్నీ వ్యాధులను నిర్ధారించడానికి రకరకాల పరీక్షలున్నాయి. మూత్రంలో ప్రోటీన్ పరీక్ష ద్వారా కిడ్నీ జబ్బు ఉందో లేదో తెలుసుకోవచ్చు. మూత్రంలో అల్బుమిన్ రోజుకి 30మి. గ్రా కన్నా తక్కువగా ఉండాలి. 30- 300 మి. గ్రా మధ్యలో ఉంటే మైక్రో అల్బుమినూరియా అనీ, 300 మి.గ్రా కన్నా ఎక్కువైతే ప్రొటీనూరియా అంటారు. సిరం క్రియాటినైన్ పరీక్ష ద్వారా కనుగొంటారు. ఇది ఎంత ఉండొచ్చన్నది వయసును బట్టీ ఆడ,మగ తేడాలను బట్టి శరీర నిర్మాణాన్ని బట్టీ మారుతుంటుంది. ఇది 1.2 నుంచి 1.4 లోపు ఉండాలి. దాటితే కిడ్నీ వ్యాధి ఉందని అనుమానించాలి. దీని ఆధారంగా జీఎఫ్ఆర్‌ను అంచనా వేసి, వడపోత ప్రక్రియ ఎలా ఉందో తెలుసుకుంటారు. సాధారణంగా మూత్రపిండాల్లో నిమిషానికి 100 ఎంఎల్ రక్తం శుద్ధి అవుతుంది. ఇది నిమిషానికి 80 ఎంఎల్ కన్నా తగ్గితే కిడ్నీ వ్యాధి ఆరంభమైనట్టే. ఇలా మూడు నెలల పాటు జీఎఫ్ఆర్ క్రమంగా తగ్గుతూ వస్తుంటే క్రానిక్ కిడ్నీ డిసీజ్‌గా భావిస్తారు.

అల్ట్రాసౌండ్ పరీక్షల్లో కిడ్నీల పరిమాణం ఎలా ఉంది. వాటిలో రాళ్లు, నీటితిత్తులు వంటివి ఉన్నాయేమో తెలుస్తుంది. గ్లోమెరూలర్ నెఫ్రైటిస్, అధిక రక్తపోటు గలవారిలో కిడ్నీ పరిమాణం తగ్గుతుంటుంది. పాలిసిస్టిక్ డిసీజ్‌లో, మూత్ర మార్గంలో రాళ్లవంటివి అడ్డుపడినప్పుడు కిడ్నీ సైజు పెరుగుతుంది.

మధుమేహుల్లో ముందు కిడ్నీ ఆకారం పెరిగి తిరిగి మామూలుగా అవుతుంది. వీటన్నింటినీ అల్ట్రాసౌండ్ పరీక్షద్వారా తెలుసుకోవచ్చు. క్రానిక్ కిడ్నీ డిసీజ్ గలవారిలో పారాథైరాయిడ్ హార్మోన్ ఎక్కువవుతుంది. కాబట్టి దీన్ని కూడా పరీక్షించుకోవాలి. కొన్నిసార్లు సీరం క్యాల్షియం, సీరంఫాస్పరస్, సీరం యూరిక్ యాసిడ్, అల్కలైన్ పాస్ఫేటైజ్ వంటి పరీక్షలు కూడా చేయించుకోవాలి.



చికిత్స

కిడ్నీ రోగులకు మధుమేహం ఉంటే గ్లూకోజ్‌ను కచ్చితంగా నియంత్రణలో ఉంచుకోవాలి. రక్తపోటు 120/80 ఉండేలా చూసుకోవాలి. కిడ్నీ వ్యాధి తీవ్రమైతే డయాలసిస్ అవసరం. ఇది రెండు రకాలు. హీమో డయాలసిస్, పెరిటోనియల్ డయాలసిస్. ఇవి రీనల్ రీప్లేస్‌మెంట్ థెరపీకి తాత్కాలిక చికిత్సలు. విషపదార్థాలు, ఇతర మలినాలు, అదనపు ద్రవాలు రక్తం నుంచి హీమో డయాలసిస్ ద్వారా ఫిల్టర్ అవుతాయి. దీన్ని జీవితాంతం వారంలో రెండుమూడుసార్లు ఇవ్వాలి. సిఏపిడిని పేషెంట్లు తమ ఇంట్లోనే రోజుకు 3-4 సార్లు చేసుకోవాలి. కొంతమందికి డయాలసిస్ వల్ల సమస్యలు రావు. డయాలసిస్ ఉన్న రోగుల్లో ఏటా 25శాతం మంది హార్ట్ ఫెయిల్యూర్, ఇన్ఫెక్షన్, డయాలసిస్ సమస్యల వల్ల చనిపోతున్నారు. శరీర జీవక్రియల అవసరాలకు అనుగుణంగా కేవలం మానవ కిడ్నీ మాత్రమే అన్ని విధులను నిర్వర్తించగలదు. కాబట్టి జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉండాలన్నా, దీర్ఘకాలం మెరుగ్గా ఉండాలన్నా కిడ్నీ మార్పిడే ఉత్తమ చికిత్స. అయితే ప్రాణాపాయం తప్పించడానికి డయాలసిస్ మేలు. సరైన దాత దొరక్కపోయినా, ఆపరేషన్‌కు ఫిట్ కాకపోయినా చాలాకాలం పాటు ఒక్కోసారి జీవితాంతం డయాలసిస్ మీద ఉండాల్సి వస్తుంది. కానీ కేవలం కిడ్నీ మార్పిడి వలనే జీవనప్రమాణాలు పెరుగుతాయి. కాబట్టి సరైన దాత దొరికితే వీలైనంత తొందరగా కిడ్నీ మార్పిడి చేయించుకోవాలి.

ఆహార నియమాలు

చక్కెర, బెల్లం స్వీట్ల వంటి తీపి పదార్థాలు తక్కువగా తినాలి. బియ్యం, గోధుమల వంటి తృణధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలి.

మాంసాహారాన్ని తగ్గించాలి. బాగానానబెట్టి లీచింగ్ చేసిన కూరగాయలు ఎక్కువగా తినాలి. వెన్న, నెయ్యి వంటి వాటికి బదులుగా ఆలివ్ నూనె, చేపనూనె, అవిసెనూనె ఎక్కువగా వాడాలి. మాంసం కన్నా చేపలు తినడం మేలు.

ఉప్పు చాలా తక్కువగా ఉన్న పదార్థాలనే తీసుకోవాలి. పొటాషియం అధికంగా ఉండే అరటి, పుచ్చ, నారింజ, కమలా, బత్తాయి వంటి పండ్లను పరిమితంగా తినాలి. ఉప్పు, పొటాషియం అధికంగా ఉండే బేకరి పదార్థాలు తినడం మానెయ్యాలి. పాలు, పెరుగు వంటి పాలపదార్థాలను పరిమితంగానే తీసుకోవాలి. పల్చటి మజ్జిగ మంచిది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే స్వభావం గలవారు మాత్రం పాలకూర, టమోటా, క్యాబేజి, కాలిఫ్లవర్ తినడం మానేయాలి. స్వీట్లు తగ్గించాలి. గుడ్డులో పచ్చసొన తినడం మంచిదికాదు. అవసరమైన మేరకే నీరుత్రాగాలి. కాఫీ, టీలు ఎక్కువగా తాగకూడదు. ఆహారం వండేటప్పుడు పులుపుకోసం చింతపండు బదులు పరిమితంగా నిమ్మరసం తీసుకోవాలి. వక్కపొడి తినకూడదు. అలాగే కూల్ డ్రింక్‌లు తీసుకోవడం మంచిదికాదు. కిడ్నీ వ్యాధి రావడానికి గల కారణాలను తెలుసుకుని ఆయుర్వేద చికిత్స చేసుకోవచ్చు.



- డాక్టర్ బి. సంగమేశ్వర్
శివ ఆయుర్వేద వైద్యశాల
హైదరాబాద్
9440065764

కేర్ హాస్పిటల్ రికార్డు

కార్డియాక్ సర్కోయిడాస్ నిర్ధారణలో నూతన సాంకేతికత

ఈపీ కార్డియాలజి టీంకు నాయకత్వం వహిస్తున్న డాక్టర్ పి. నర్సింహన్ ప్రస్తుతం కేర్ హాస్పిటల్స్ ఈపీకార్డియాలజీ టీం క్లినికల్ రీసెర్చి నిర్వహించారు. గుండెవైఫల్యంలో దారితీసే పరిస్థితుల గూర్చి ఈ రీసెర్చి జరిగింది. శాశ్వత పేస్ మేకర్ ఇంప్లాంటింగ్‌లో పీఈటీ స్కాన్ సాంకేతికతను వినియోగించడంలో ఈ టీం విజయవంతమైంది.

ప్రముఖ కార్డియాలజీ జర్నల్ అయిన హార్ట్ రిథమ్‌లో ఈ విషయం ప్రచురితమైంది.

ఈ సందర్భంగా డాక్టర్ పి. నర్సింహన్ మాట్లాడుతూ పీఈటీ స్కాన్ పురోగతిని వివరించారు. ఈ అధ్యయనంలో కేర్ గ్రూప్ హాస్పిటల్స్ నిర్వహించిన పరిశోధనా పత్రాలకు ఆయన కరస్పాండింగ్ ఆథర్‌గా ఉన్నారు. సర్కోయిడాన్ అనే వ్యాధి వల్ల పల్మోనరీ ఫైబ్రోసిస్ మరణాలు ఎక్కువగా ఉంటున్నాయి.


కాబట్టి కార్డియాక్ సర్కోయిడాన్‌ను గుర్తించడం సాధ్యం కాదు. దీనివల్ల గుండె వైఫల్యం చెందుతుంది. మరణాలు కూడా జరుగుతున్నాయి. ఆరంభంలో దీనిని గుర్తించడం వల్ల కార్డియక్ ముప్పు నుంచి బయటపడవచ్చు.

హార్ట్ రిథమ్ జర్నల్‌లో ఈ పరిశోధన ప్రచురితం కావడం దీని ప్రాముఖ్యత మరింత పెరిగింది.

కార్డియాక్ సర్కోయిడాన్‌ను ఆట్రియో వెంట్రిక్యులర్ కండబస్ బ్లాక్ చికిత్సలో మరిన్ని మార్పులు తీసుకువచ్చింది. ఈ పరిశోధనా పత్రాల తర్వాత ఈ ప్రాంతంలో ప్రస్తుత ప్రాక్టీసు మీద తీవ్ర ప్రభావం చూపింది.



ఊపిరితిత్తుల క్యాన్సర్ నివారణ



ఊపిరితిత్తుల క్యాన్సర్ రాకుండా ఉండాలంటే స్మోకింగ్‌ను పూర్తిగా త్యజించాలి. ఈ అలవాటుకు ఎంతదూరం ఉంటే అంతమంచిది. పిల్లలకు కూడా ఈ అంశం మీద అవగాహన కల్పించాలి. పిల్లలకు స్మోకింగ్ అలవాటు రాకుండా జాగ్రత్త పడవచ్చు. కొందరు ఏళ్ల తరబడి స్మోకింగ్ అలవాటుకు లోనవుతారు. అటువంటివారు వెంటనే స్మోకింగ్ అలవాటు నుంచి తప్పుకోవడం చాలా మంచిది. మీ డాక్టరును సంప్రదించి స్మోకింగ్‌కు దూరంగా ఉండాలి. స్మోకింగ్ అలవాటు ఉన్నవారితో పాటు పరోక్షంగా చేసేవారికి కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదముంది. ఎవరైనా సిగరెట్ త్రాగితే పక్కన నిల్చుని మాట్లాడటం లేదా నిలబడటం వంటివి చేయకూడదు. స్మోకింగ్ జోన్లకు దూరంగా ఉండాలి. బార్లు, రెస్టారెంట్లలో పొగరాయుళ్లు వాతావరణాన్ని కలుషితం చేస్తుంటారు. అటువంటి ప్రదేశాలకు వెళ్లకపోవడమే మంచిది.


ప్రభాస్

సాహో లుక్ బయటకు రాకుండా

యంగ్ రెబల్‌స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం సాహో. బాహుబలి సినిమా తర్వాత ఆ స్థాయి తగ్గకుండా ప్రభాస్ చేస్తున్న ప్రయత్నమిది. ఈ చిత్రం తాజా షెడ్యూల్ దుబాయ్‌లోని అబూ దాబిలో జరగబోతోంది. సాహో గురించి ప్రతి విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు చిత్రయూనిట్. బాహుబలి సమయంలో చిత్ర పతాక సన్నివేశాలు విడుదల ముందే బయటకు వచ్చిన నేపథ్యంలో...సాహో షూటింగ్ లొకేషన్‌లలో మరింత నిఘా పెంచారు. సెల్ ఫోన్‌ల దగ్గర నుంచి ఏ సాంకేతిక సామాగ్రినీ చిత్రీకరణ జరిగే ప్రాంతానికి అనుమతించడం లేదు. ముఖ్యంగా ప్రభాస్ సాహో లుక్ బయటకు రాకుండా జాగ్రత్తపడుతున్నారు. సాధారణంగా స్టార్ హీరోలు షూటింగ్‌లో వ్యానిటీ వ్యాన్‌లు వాడుతుంటారు. సాహో కోసం ప్రభాస్‌కు ఒకటికి రెండు ఇలాంటి వాహనాలు అందుబాటులో ఉంచారు. అంటే ప్రభాస్ బయట ఎవరికీ కనిపించకుండా...ఆయన ఫొటోలు ఎవరి చేతికి చిక్కకుండా ఈ వాహనాలు రక్షణ కల్పించనున్నాయి. ఇక ఈ చిత్రం కోసం ప్రభాస్ మరింత తగ్గిపోయాడు. స్లిమ్ లుక్‌లోకి మారిన ప్రభాస్ ఓ ప్రముఖ మేగజైన్ కవర్ పేజీపై ప్రత్యక్షమయ్యాడు. ప్రస్తుతం సెలవుల్లో అమెరికాలో ఉన్న ప్రభాస్ ఈనెల 5న సాహో చిత్రీకరణలో చేరుతారు.


అనుష్క

ఆశ్చర్యపరిచే అనుష్క...!

అందాల తార అనుష్క శెట్టి నటిస్తున్న తాజా చిత్రం భాగమతి. థ్రిల్లర్ కథతో దర్శకుడు అశోక్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు మిగతా మూడు దక్షిణాది భాషల్లో భాగమతి తెరపైకి రానుంది. జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈలోగా ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు. గతంలో అనుష్క పుట్టిన రోజు సందర్భంగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన చిత్ర యూనిట్ తాజాగా..మరో పోస్టర్‌ను బయటకు తీసుకొచ్చారు. దర్శకుడు అశోక్ భాగమతి గురించి మాట్లాడుతూ...ఈ చిత్రం కోసం అనుష్క 18 కిలోల బరువు తగ్గింది. సినిమా అంతా అనుష్క పాత్ర చుట్టూనే తిరుగుతుంది. అయితే అనేక కీలక పాత్రలు కథలో ఉంటాయి. టైటిల్‌ను బట్టి చారిత్రక చిత్రం అనుకుంటారు గానీ ఇదొక మోడరన్ డే థ్రిల్లర్. నిజ జీవిత పాత్రల నుంచి స్ఫూర్తి పొంది ఈ కథను రాశాను. ఇందులో రెండు విధాలుగా అనుష్క పాత్ర ఉంటుంది. ఆమెతో పాటు మిగతా క్యారెక్టర్‌లను ప్రేక్షకులు తమతో పోల్చుకునేలా ఉంటాయి. అన్నారు. భాగమతిలో అనుష్క స్నేహితుడు ప్రభాస్ ఓ అతిథి పాత్రలో నటిస్తారని ఊహాగానాలు వినిపించాయి. తాజాగా విడుదల తేదీ దగ్గరకు వస్తుండటంతో...ఇందులో నిజం లేదని తెలుస్తోంది.

గజరాజు తోడుగా బందేవ్


రానా

రానా మరో జాతీయ స్థాయి చిత్రంలో భాగమవుతున్నారు. హాతీ మేరా సాథీ పేరుతో ఈ చిత్రం తెరకెక్కబోతోంది. హిందీ, తెలుగు, తమిళ మూడు భాషల్లో హాతీ మేరా సాథీ సినిమాను రూపొందిస్తున్నారు దర్శకుడు సాల్మన్ రాజ్. కొత్త ఏడాది సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. చెదిరిన పొట్టి జుట్టులో..దుమ్ము కొట్టుకుపోయిన దుస్తుల్లో రానా పోస్టర్ విడుదల చేశారు. ఈ చిత్రంలో మావటి బందేవ్ పాత్రలో రానా నటించనున్నారు. 1971లో రాజేష్ ఖన్నా,తనూజ నటించిన సూపర్ హిట్ ఫిల్మ్ హాతీ మేరా సాథీకి ఈ సినిమా కొనసాగింపు చిత్రం కాదని...కేవలం ఆ చిత్రరాజం నుంచి స్ఫూర్తి పొందామని చిత్రయూనిట్ తెలిపింది. కొత్త ఏడాదిలో గొప్ప కథను చెప్పబోతున్నాం. అంటూ నటుడు రానా హాతీ మేరా సాథీ గురించి ట్వీట్ చేశారు. మనదేశంతో పాటు థాయ్‌లాండ్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరగనుంది. గ్రాఫిక్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఉండబోతోంది. ఈ ఏడాది దీపావళి పండక్కి హాతీ మేరా సాథీ విడుదల చేయాలని దర్శక నిర్మాతలు అనుకుంటున్నారు.

మరో పాట విందాం ఛలో


నాగశౌర్య, రశ్మిక మండన్న

యువ కథానాయకుడు నాగశౌర్య, కన్నడ బ్యూటీ రశ్మిక మండన్న జంటగా నటిస్తున్న చిత్రం ఛలో. వెంకీ కుడుముల ఈ చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. శంకర్ ప్రసాద్ మూల్పూరి సమర్పణలో ఐరా క్రియేషన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఉషా మూల్పూరి నిర్మాణ బాధ్యతలు వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ తమిళనాడు సరిహద్దుల్లో ఉండే ఓ కళాశాలలో జరిగే వినూత్న ప్రేమ కథగా ఛలో తెరకెక్కింది. ఫిబ్రవరి 2న ఛలో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రచార కార్యక్రమాలు ఊపందుకున్నాయి. సాగర్ మహతి సంగీతాన్ని అందించిన చిత్ర రెండో పాటను తాజాగా విడుదల చేశారు. ఈ సందర్భంగా కథానాయకుడు నాగశౌర్య మాట్లాడుతూ...సినిమా చాలా బాగా వచ్చింది. తప్పకుండా విజయం సాధిస్తుందని నమ్మకంతో ఉన్నాం. అమ్మానాన్న నిర్మాతలుగా నేను సినిమా చేయడం సంతోషంగా ఉంది. వాళ్లు చిత్ర నిర్మాణంలో ఎక్కడా రాజీపడలేదు. సాగర్ మహతి సంగీతం మా చిత్రానికి మరో ఆకర్షణ అవుతుంది. అన్నారు. దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ...తొలి పాటకు మేము ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన వచ్చింది. చూసీ చూడంగానే నచ్చేశావే అంటూ సాగే మొదటి పాట..ఇప్పుడు అందరూ పాడుకుంటున్నారు. ఛలో నాకు మంచి పేరు తీసుకొచ్చి...సూపర్ హిట్ అవుతుందని ఆశిస్తున్నాను. అన్నారు. సీనియర్ నటుడు నరేష్ మాట్లాడుతూ...టాలీవుడ్‌లో మరో గొప్ప శకం ప్రారంభమైంది. భారతీయ సినిమా ఇప్పుడు మనవైపు చూస్తోంది. ఛలో కథ విన్నప్పుడే తప్పకుండా విజయం సాధిస్తుందని అనుకున్నాను. సినిమా విడుదల ముందే మంచి వ్యాపారం జరగడం చిత్రంపై ఉన్న ఆసక్తికి నిదర్శనం. అన్నారు. నరేష్, పోసాని, రఘుబాబు, వెన్నెల కిషోర్, మైమ్ గోపీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటింగ్ - కోటగిరి వెంకటేశ్వరరావు, తమ్మిరాజు, సినిమాటోగ్రఫీ - సాయి శ్రీరామ్, ఆర్ట్ - రాము అరసవిల్లి.

గాయత్రి కొత్తలుక్

మోహన్‌బాబు ప్రధాన పాత్రలో విష్ణు మంచు, శ్రియ జంటగా నటిస్తున్న చిత్రం గాయత్రి. ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకువస్తున్న ఈ చిత్రం లుక్ నూతన సంవత్సరం తొలిరోజున విడుదల చేశారు. మదన్ ఈ సినిమాకు దర్శకుడు. తమన్ స్వర రచన చేస్తున్నారు. అనసూయ, నిఖిల విమల్, బ్రహ్మానందం ఇతర ముఖ్యపాత్రధారులు.

గాయత్రి చిత్రాన్ని శ్రీ లక్ష్మిప్రసన్న పిక్చర్స్ పతాకంపై నిర్మిస్తున్నారు.


విష్ణు మంచు, శ్రియ

ప్రేమ వారధి

రాహుల్ రవీంద్రన్, చాందినీ చౌదరి, మనాలి రాథోడ్ నటిస్తున్న చిత్రం హౌరా బ్రిడ్జ్. ఈఎమ్‌విఈ స్టూడియోస్ పతాకంపై ఈ చిత్రం రూపొందుతోంది. షూటింగ్ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇదే నెలలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. చిత్ర కథానాయకుడు రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ మా సినిమాకు హౌరా బ్రిడ్జ్ అని పేరు పెట్టడానికి ప్రత్యేక కారణం ఉంది. మానవ సంబంధాలకు ఈ చిత్ర కథ వారధిగా ఉంటుంది. ఇందులో మరో బ్రిడ్జ్ కూడా ఉంటుంది. దాని వివరాలు తర్వాత వెల్లడిస్తాం. చాందిని చౌదరి చాలా మంది పాత్రని చేసింది. మనాలి రాథోడ్‌కి మంచి పేరు తెచ్చే సినిమా ఇది. యూనిట్ అందరికీ మంచి పేరు తెచ్చిపెట్టే సినిమా అవుతుందనే నమ్మకం ఉంది అని అన్నారు.

చిత్ర దర్శకుడు రేవన్ మాట్లాడుతూ బూచమ్మ బూచోడు తర్వాత నేను దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఇది బ్రిడ్జ్ నేపథ్యంలో సాగే ఆసక్తికరమైన కథ. అందుకే ఆ పేరు పెట్టడం జరిగింది. కథలో అనేక మలుపులు ఉంటాయి. వైవిధ్యమైన స్క్రీన్‌ప్లేతో అద్భుతాలు చేయబోతున్నాం. ప్రతి పాత్రకి ప్రాధాన్యత ఉంటుంది. శేఖర్ చంద్ర సంగీతం అదనపు ఆకర్షణ అని చెప్పారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం విజయ్ మిశ్రా, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం రేవన్ యాదు.


చాందినీ చౌదరి, రాహుల్ రవీంద్రన్

బృందావనంలో వీరందరు



రచయిత శ్రీధర్ సీపాన దర్శకుడిగా మారుతున్నారు. బృందావనం అందరిది పేరుతో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో నటించే తారాగణం వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా శ్రీధర్ సీపాన మాట్లాడుతూ కొత్తవారితో సినిమా చేయాలనే ఆలోచనతో పలువురికి ఆడిషన్స్ నిర్వహించడం జరిగింది. ప్రధాన తారాగణం నలుగు ఆర్టిస్టులు మినహా మిగతా పాత్రలకు కొత్తవారిని తీసుకోవడం జరిగింది. హీరోగా గుంటూరు టాకీస్ ఫేమ్ సిద్ధుని, మరో ముఖ్యపాత్రకి చైల్డ్ క్యారెక్టర్‌కు విక్రమ్‌ను ఎంపికచేశాం. విక్రమ్ లగడపాటి శ్రీధర్ అబ్బాయి. హీరోయిన్‌గా సీరత్ కపూర్‌ను, నాలుగవ పాత్రకి పృథ్వీని తీసుకోవడం జరిగింది. మా సినిమాకు ఈ నలుగురు పిల్లర్స్ లాంటివారు. జనవరి 20 నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం మణిశర్మ, ఛాయాగ్రహణం సి.రాంప్రసాద్, పాటలు సిరివెన్నెల కిషోర్, నిర్మాతలు శ్రీనివాస్ వంగాల, ప్రభాకర్ రెడ్డి కూతురు, రచన, దర్శకత్వం శ్రీధర్ సీపాన.

సూర్య@36 షూటింగ్ ప్రారంభం



సూర్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం షూటింగ్ మొదలైంది. 7జి బృందావనం కాలని ఫేమ్ సెల్వ రాఘవన్ ఈ చిత్రానికి దర్శకుడు.త ఇటీవలే ఖాకీ వంటి చిత్రాన్ని అందించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్, ఎస్.ఆర్.ప్రభు, ఎస్.ఆర్. ప్రకాష్‌బాబు నిర్మాతలు. సోమవారం షూటింగ్ మొదలైంది. సీనియర్ హీరో శివకుమార్, కార్తీ హాజరయ్యారు. సూర్య మాట్లాడుతూ నాగత 35 చిత్రాలకు భిన్నమైన సినిమా ఇది. దర్శకుడు చెపి ్పన కథ ఉత్సాహం కలిగించింది. కమర్షియల్ వేల్యూస్ ఉంటూ అందరినీ ఆకట్టుకునే చిత్రమవుతుంది. సాయిపల్లవి పాత్రకి ప్రాధాన్యత ఉంటుంది అని చెప్పారు. సూర్యలాంటి హీరోతో సినిమా చేయడం ఆనందంగా ఉందని దర్శకుడు సెల్వ రాఘవన్ చెప్పారు. నిర్మాతలు మాట్లాడుతూ సూర్య కెరీర్‌లో ఓ పెద్ద హిట్ సినిమా అయ్యేలాగా దర్శకుడు రూపొందిస్తున్నారు. ఈ నెల 18 నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. దీపావళికి విడుదల చేస్తాం అన్నారు.